ఈనాడు

విజయవాడ 8-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 149

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పీపీపీతో నష్టం ఉండదు

పేదల వైద్యసేవలు, ప్రభుత్వ కోటా సీట్లపై ప్రభావం పడదు



యూజీ, పీజీ వైద్యుల కోసం నేషనల్ రిజిస్ట్రీ

ఎన్ఎంసీ ఛైర్మన్ డాక్టర్ అభిజాత్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నడిచే ఆసుపత్రులు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి కాబట్టి పేద రోగులకు వైద్యసేవలు, ప్రభుత్వ కోటా సీట్ల విషయంలో ఎలాంటి ప్రభావం ఉండదని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ సేఠ్ స్పష్టం చేశారు. రోగులకు ఉచిత చికిత్సలు లేదా రాయితీతో కూడిన సేవలు యథావిధిగా అందుతాయన్నారు. పీపీపీ విధానం గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో ఇప్పటికే విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. విజయవాడలోని (మిగతా 3లో)

2027 మార్చికల్లా పోలవరం

> 2020 నాటికే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలనుకున్నాం. 2019 జూన్‌లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. అందుకే ఏడు సంవత్సరాలు ఆలస్యమైంది. వ్యయమూ పెరిగింది. కనీసం డయాఫ్రం వాల్ ధ్వంసమైన విషయమూ వైకాపా ప్రభుత్వం సకాలంలో గుర్తించలేదు. - ముఖ్యమంత్రి చంద్రబాబు

తొలి దశలో 119 టీఎంసీల నీళ్లు నిలబెడతాం

ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

ప్రాజెక్టు నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం

ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పిలవాలని ఆదేశం



గ్యాప్-2 డయాఫ్రంవాల్ పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి రామానాయుడు తదితరులు

పోలవరం నుంచి ఈనాడు ప్రతినిధి: 2027 మార్చి నెలాఖరుకు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తొలి దశలో 119 టీఎంసీల నీటిని నిల్వ చేసి కుడి, ఎడమ కాలువలకు గ్రావిటీ ద్వారా అందిస్తామని వెల్లడించారు. పోలవరం కుడి కాలువ నిర్మాణం దాదాపు పూర్తయిందని, ఎడమ కాలువ పనులు ఈ ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. తొలిదశ పునరావాసం కింద 38,060 నిర్వాసిత కుటుంబాలకు ప్యాకేజీ ఇచ్చి, కాలనీలు నిర్మించి తరలించాల్సి ఉందని, ఈ ఏడాది చివరి నాటికి అది పూర్తి చేస్తామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును బుధవారం ముఖ్యమంత్రి సందర్శించారు. నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించారు. అనంతరం పోలవరం, జలవనరుల శాఖ, పునరావాస అధికారులతో పాటు జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, కొందరు మంత్రులతో సమావేశంలోనూ, తర్వాత విలేకర్లతోనూ సీఎం మాట్లాడారు.

‘అప్పట్లో రూ.400 కోట్లు పెట్టి నిర్మించిన డయాఫ్రం వాల్ ధ్వంసమవడంతో దాన్ని పక్కన పెట్టి మరో రూ.1,000 కోట్లతో (మిగతా 3లో)

సీమపై వైకాపా బురద రాజకీయం

- ఆ బురదలోనే వాళ్లు కూరుకుపోతారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు

8లో



అమెరికా సీజ్ చేసిన నౌక మ్యారినెరా



నౌకపై దిగుతున్న అమెరికా హెలికాప్టర్

ఉత్తర అట్లాంటిక్ ఉద్రిక్తం

‘రష్యా’ నౌకను సీజ్ చేసిన అమెరికా ● సహకరించిన బ్రిటన్

మరో నౌకా స్వాధీనం ● తీవ్రంగా మండిపడిన క్రెమ్లిన్

జలాంతర్గామి, రక్షణ నౌకలను పంపేందుకు సిద్ధం!

వాషింగ్టన్: ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రష్యా జెండాతో వెళ్తున్న వెనెజువెలా చమురు నౌకతో పాటు మరో నౌకను అమెరికా బుధవారం సీజ్ చేయడంతో కలకలం రేగింది. దీనికి బ్రిటన్ సహకరించడం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఈ నౌకలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. అమెరికా చర్యపై రష్యా ఘాటుగానే స్పందించినట్లు సమాచారం. ఈ నౌకకు రక్షణగా ఒక జలాంతర్గామితోపాటు మరికొన్ని రక్షణ నౌకలను పంపేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అమెరికా ఆధీనంలోకి తీసుకున్న రష్యా జెండాతో వెళ్తున్న నౌక పేరు మ్యారినెరా (పాత పేరు బెల్లా-1). గయానా జెండా ఉండే ఈ నౌకకు ఇటీవలే రష్యా జెండాను అమర్చారు. . . అయినా ఐస్‌లాండ్ దక్షిణ తీరానికి 190 మైళ్ల దూరంలో అమెరికా దక్షిణ కమాండ్, యూరోపియన్ కమాండ్ దీనిని స్వాధీనం చేసుకున్నాయి. దీంతోపాటు ఏ దేశపు జెండా లేని మరో నౌక సోఫియాను సీజ్ చేశాయి. మ్యారినెరాపై హెలికాప్టర్ దిగుతున్న దృశ్యాలు టీవీల్లో ప్రసారమయ్యాయి. ఈ ఆపరేషన్‌కు అమెరికా, బ్రిటన్‌లు భారీ ఎత్తున బలగాలు, యుద్ధవిమానాలు, (మిగతా 3లో)

రాజధానిలో తొలిసారి గణతంత్ర వేడుకలు

పరిపాలన నగరంలో పదెకరాల్లో పరేడ్ గ్రౌండ్

అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు 2లో

రెండోదశ భూసమీకరణ రైతులకు ₹1.50 లక్షల రుణమాఫీ

- అప్పటికప్పుడే సీఎంతో మాట్లాడి ప్రకటన
- కౌలు పెంపునకు సీఎం సూత్రప్రాయంగా అంగీకారం
- భూసమీకరణ సభల్లో మంత్రి నారాయణ



వడ్డమానులో అంగీకారపత్రాలను మంత్రి నారాయణకు అందజేస్తున్న రైతులు, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: అమరావతి విస్తరణకు రెండోదశలో భూసమీకరణకు భూములిస్తున్న రైతులకు రూ.1.5 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. కౌలు పెంపునకు సీఎం ప్రాథమికంగా ఆమోదం తెలిపారన్నారు. గ్రామసభ జరుగుతున్నప్పుడు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ (మిగతా 3లో)

వైకాపా ఎమ్మెల్యేలు సభకు రాకుండానే సంతకాలు చేశారా?

జీతాలు, టీఏ, డీఏ బిల్లులూ క్లెయిమ్ చేసుకున్నారా!

రికార్డులు పరిశీలించిన శాసనసభ నైతిక విలువల కమిటీ

ఇది అనైతికమన్న సభ్యులు

ఆ నేతలకు నోటీసులివ్వాలని చర్చ

నిపుణులతో చర్చించాక వచ్చే సమావేశంలో నిర్ణయం 12లో


గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సైనిక చర్యకూ వెనుకాడబోం

- అమెరికా స్పష్టీకరణ
- రుబియోతో చర్చలకు సిద్ధమైన డెన్మార్క్, గ్రీన్‌లాండ్

వాషింగ్టన్, కోపెన్‌హేగన్: గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఎన్నో అవకాశాలున్నాయని, సైనిక చర్య ఆప్షన్‌నూ పక్కన పెట్టలేదని అమెరికా స్పష్టం చేసింది. ‘గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అనేది జాతీయ భద్రత దృష్ట్యా అమెరికాకు అత్యంత ముఖ్యమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేస్తున్నారు. దీనిద్వారా ఆర్కిటిక్ ప్రాంతంలోని శత్రువులను అడ్డుకోవచ్చని ఆయన భావిస్తున్నారు. దీనికోసం ఉన్న అనేక అవకాశాలపై (మిగతా 3లో)

ఛాంపియన్

డబ్ల్యూపీఎల్-4 రేపటి నుంచే



తెగిడిన నోళ్లే.. పొగిడేలా!

కొన్నేళ్ల ముందు ఐపీఎల్ తరహాలోనే మహిళల కోసం బీసీసీఐ ఒక లీగ్ మొదలు పెట్టాలని చూస్తోందని వార్తలు వచ్చినపుడు.. అది ఏమాత్రం విజయవంతం అవుతుందో అని సందేహించిన వాళ్లే ఎక్కువమంది. బీసీసీఐకి డబ్బులు ఎక్కువై ఇలా చేస్తోందని.. అమ్మాయిల ఆట చూడడానికి ఎవరు వస్తారనే వ్యాఖ్యానాలు చేసిన వాళ్లూ లేకపోలేదు!

కానీ ఇప్పుడు అమ్మాయిలు ఆడుతుంటే స్టేడియాలు నిండుతున్నాయి. వాళ్ల కోసం పెట్టిన లీగ్ అద్భుత ఫలితాలను అందిస్తోంది. ఆ లీగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరోసారి స్టేడియాలు నిండిపోవడం ఖాయంగా కనిపిస్తోంది! ఒకప్పుడు తెగిడిన నోళ్లే ఇప్పుడు పొగిడేలా.. ఇంతింతై అన్నట్లు ఎదుగుతోంది మహిళల ప్రీమియర్ లీగ్!

మహిళల ప్రీమియర్ లీగ్

ఈనాడు క్రీడావిభాగం

భారత క్రికెట్లో ఐపీఎల్ ఎంత గొప్ప మార్పు తెచ్చిందో తెలిసిందే. దేశంలో వందల మంది యువ క్రికెటర్లు ప్రతిభ చాటుకోవడానికి ఈ లీగ్ వేదికగా నిలిచింది. అందులో పదుల సంఖ్యలో యువ ఆటగాళ్లు భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఎంతోమంది స్టార్లుగానూ ఎదిగారు. అంతర్జాతీయ క్రికెటర్లతో డ్రెస్సింగ్ రూంను పంచుకోవడం, వారితో పోటీ పడడం క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. ఇప్పుడు వైభవ్ సూర్య వంశీ లాంటి చిన్న కుర్రాడు కూడా అదురు బెదురు లేకుండా ఆడుతున్నాడంటే దీని వెనుక ఐపీఎల్ పాత్ర ఎంతో కీలకం. మహిళల క్రికెట్లో కూడా డబ్ల్యూపీఎల్ ఇలాంటి సానుకూల మార్పునే తీసుకొచ్చింది. రిచా ఘోష్ సహా పలువురు యువ క్రికెటర్లను ఈ లీగ్ వెలుగులోకి తెచ్చింది. ఒకప్పుడు కూడా భారత జట్టులో ప్రతిభావంతులు ఉన్నా.. ఆత్మవిశ్వాస లోపం వెంటాడేది. ఆటలో దూకుడు తక్కువగా ఉండేది. కాబట్టే అంతర్జాతీయ క్రికెట్లో నిలకడగా విజయాలు సాధించలేకపోయేది. ఐసీసీ ఈవెంట్లలో కీలక దశల్లో తడబడేది. కానీ గత ఏడాది చివర్లో వన్డే ప్రపంచకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఎంత గొప్పగా ఆడి ప్రపంచకప్ గెలిచిందో తెలిసిందే. గతంలో ఆస్ట్రేలియా అంటే చాలు.. ముందే జావగారిపోయేవాళ్లు మన అమ్మాయిలు. కానీ ప్రపంచకప్ ముంగిట ఓ మ్యాచ్‌లో ఆ జట్టును 100కు పైగా పరుగుల తేడాతో ఓడించి సంచలనం సృష్టించారు. మరో మ్యాచ్‌లో 400 పైచిలుకు లక్ష్యం ముందున్నా.. విజయం కోసం గట్టిగా ప్రయత్నించారు. ఈ ఆత్మవిశ్వాసం, దూకుడే.. ప్రపంచకప్ సెమీస్‌లో కంగారూలపై 339 పరుగుల రికార్డు లక్ష్య ఛేదనతో చరిత్ర సృష్టించడానికి, దక్షిణాఫ్రికాపై ఫైనల్లోనూ గెలిచి ప్రపంచకప్ గెలవడానికి దోహదపడింది. అమ్మాయిల దృక్పథం, ఆటతీరులో ఇంత గొప్ప మార్పునకు డబ్ల్యూపీఎల్ ఓ ముఖ్య కారణం అనడంలో సందేహం లేదు.

ఉందిలే మంచి కాలం..: డబ్ల్యూపీఎల్‌లో ఇప్పటిదాకా మూడు సీజన్లు జరిగాయి. శుక్రవారమే నాలుగో సీజన్ ఆరంభం కాబోతోంది. మూడేళ్ల ముందుతో పోలిస్తే ఇప్పుడు లీగ్‌లో మార్పు స్పష్టం. భారత అమ్మాయిల ఆటలో వేగం పెరిగింది. ఆత్మవిశ్వాసం సంగతి చెప్పాల్సిన పని లేదు. డబ్ల్యూపీఎల్‌లో సత్తా చాటుకుని.. బిగ్ బాష్ లీగ్, ది హండ్రెడ్ లాంటి లీగ్‌ల్లోనూ మన అమ్మాయిలు ఎక్కువమంది ఆడుతున్నారు. ప్రతి సీజన్లోనూ కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికే ఉన్న స్టార్ల ఆట కూడా మెరుగుపడుతోంది. హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలి వర్మ, దీప్తి శర్మ.. అంతర్జాతీయ స్థాయిలో మేటి క్రికెటర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారు. గత సీజన్ వరకు ఓ మోస్తరు స్థాయిలో ఉన్న జెమీమా రోడ్రిగ్స్ ఇప్పుడు పెద్ద స్టార్‌గా అవతరించింది. తెలుగమ్మాయి శ్రీ చరణి ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకరిగా పేరు తెచ్చుకుంది. ఇంకా రేణుక సింగ్, క్రాంతి గౌడ్, రాధ యాదవ్, స్నేహ్ రాణా లాంటి క్రికెటర్లకు మంచి గుర్తింపే ఉంది. రాబోయే కొన్నేళ్లలో మరెంతో మంది కొత్త అమ్మాయిలు వెలుగులోకి వస్తారని, భారత జట్టును బలోపేతం చేస్తారనే అంచనాలు ఉన్నాయి. విదేశీ క్రికెటర్లు కూడా డబ్ల్యూపీఎల్‌లో ఆడేందుకు అమితాసక్తి చూపిస్తున్నారు. వివిధ జట్లకు చెందిన అగ్రశ్రేణి క్రికెటర్లు లీగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. డబ్ల్యూపీఎల్ గురించి గొప్పగా మాట్లాడుతున్నారు. ప్రపంచకప్ విజయంతో సంతృప్తి చెందకుండా వివిధ ఫార్మాట్లలో నిలకడగా విజయాలు సాధించడం, అగ్ర జట్టుగా ఎదగడం, మరిన్ని ఐసీసీ టోర్నీల్లో గెలవడం భారత జట్టు తర్వాతి లక్ష్యాలు. ఆ లక్ష్యాలను అందుకోవడానికి డబ్ల్యూపీఎల్ ఉత్ప్రేరకంలా పని చేస్తుందన్నది విశ్లేషకుల మాట. డబ్ల్యూపీఎల్‌కు అంతకంతకూ ఆదరణ పెరుగుతుండడం.. భారీగా ఆదాయం వస్తుండడం.. వేలం ద్వారా అమ్మాయిలు కోటీశ్వరులవుతుండడంతో దేశంలో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే అమ్మాయిల సంఖ్యా గణనీయంగా పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కాబట్టి రాబోయే రోజుల్లో డబ్ల్యూపీఎల్‌ను ఇంకా పెద్ద స్థాయిలో చూడబోతున్నామన్నది స్పష్టం.



"వచ్చే అయిదు పదేళ్లలో భారత జట్టును ఓడించడం కష్టంగా మారుతుందనిపిస్తోంది. ఇది ఉత్సుకత రేకెత్తించే విషయం. ఒక ఆస్ట్రేలియా అమ్మాయిగా మాకిది ఇబ్బందికరమే. అయినా సరే.. భారత్‌లో అమ్మాయిల క్రికెట్ వేగంగా ఎదుగుతున్న తీరు గొప్పగా అనిపిస్తోంది"
– యాష్ గార్డనర్ (ఆస్ట్రేలియా), గుజరాత్ జెయింట్స్ సారథి


హర్మన్‌ప్రీత్

ఆ ఘనత డబ్ల్యూపీఎల్, ముంబయి ఇండియన్స్‌దే

ముంబయి: తనలో గెలుపు మనస్తత్వాన్ని పెంపొందించిన ఘనత మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), ముంబయి ఇండియన్స్‌దేనని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. మహిళల వన్డే ప్రపంచకప్ విజయానికి ఇదెంతో తోడ్పడిందని హర్మన్ చెప్పింది. డబ్ల్యూపీఎల్‌లో ముంబయికి హర్మన్ రెండు టైటిళ్లు అందించింది. "డబ్ల్యూపీఎల్ నాలో చాలా మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యంగా ఆలోచన విధానం ఎంతగానో మారింది. అంతకుముందు కొన్ని పరిమితులు ఉండేవి. ముంబయి ఇండియన్స్‌తో కలిసి పనిచేసిన తర్వాత నా దృక్పథం మారిపోయింది. ఐపీఎల్‌లో ముంబయి నిలకడగా టైటిళ్లు సాధిస్తోంది. ఆ గెలుపు మనస్తత్వం నాలోనూ వచ్చింది. కేవలం పోటీపడటం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. ఎక్కడికి వెళ్లినా.. విజయం గురించే ఆలోచించాలని నమ్ముతా. ఎలాగైనా విజయం సాధించాలన్న మనస్తత్వంతో ఆడితే ఎన్నో విజయాలు సొంతం చేసుకోవచ్చు" అని హర్మన్ వివరించింది.

ప్రపంచకప్ గురించి ఇప్పుడే ఆలోచించడం లేదు


మిచెల్

ముంబయి: టీ20 ప్రపంచకప్ గురించి ఆలోచించడం లేదని, ప్రస్తుతం భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లపైనే దృష్టి సారించామని న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డరైల్ మిచెల్ అన్నాడు. రెండు జట్ల మధ్య ఆదివారం మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. "టీ20 ప్రపంచకప్‌నకు ఇంకా నెల రోజుల సమయం ఉంది. ప్రస్తుతానికి భారత్‌తో వన్డే సిరీస్‌పైనే దృష్టి పెట్టాం. భారత బౌలింగ్ విభాగం బలంగా కనిపిస్తోంది. వన్డేల్లో మేటి జట్టు టీమ్‌ఇండియాను దాని సొంతగడ్డపై ఎదుర్కోవడం ఎంతో ఉత్తేజకర విషయం. అందుకే ప్రస్తుతం మా దృష్టంతా ఈ సిరీస్‌పైనే. గతంలో ఇక్కడ ఆడిన అనుభవం స్పిన్నర్లను ఎదుర్కోవడానికి ఉపయోగపడుతుంది" అన్నాడు. వన్డే సిరీస్ అనంతరం కివీస్.. భారత్‌తో అయిదు టీ20లు ఆడుతుంది. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7న ఆరంభమవుతుంది.

ప్రీక్వార్టర్స్‌లో సింధు

మలేసియా ఓపెన్

సాత్విక్ జోడీ ముందంజ



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు ప్రిక్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 21-13, 22-20తో సుంగ్ షువో యున్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ ముందంజ వేసింది. తొలి రౌండ్లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-13, 21-15తో లీ హుయ్, యాంగ్ సువాన్ (చైనీస్ తైపీ) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్స్ చేరుకుంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ 15-21, 21-18, 15-21తో ప్రెస్లీ స్మిత్- జెనీ గాయ్ (అమెరికా) జంట చేతిలో పరాజయం చవిచూసింది. హోరాహోరీగా సాగిన మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ జోడీ 9-21, 23-21, 19-21తో ఫెబ్రియాన, మెలిసా (ఇండోనేషియా) జంట చేతిలో ఓడింది.

శతక్కొట్టిన సూర్యవంశీ, ఆరోన్

యూత్ వన్డే సిరీస్‌లో 3-0తో భారత్ క్లీన్‌స్వీప్


వైభవ్


ఆరోన్

బెనోని: ఫార్మాట్ మారినా, టోర్నీ మారినా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆటతీరులో మాత్రం మార్పు లేదు. అతడి పరుగుల ప్రవాహం ఆగట్లేదు. వరుస సెంచరీలతో చెలరేగుతున్న అతడు.. దక్షిణాఫ్రికాతో అండర్-19 వన్డే సిరీస్‌లో మరో విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. బుధవారం మూడో యూత్ వన్డేలో కెప్టెన్ సూర్యవంశీ (127; 74 బంతుల్లో 9×4, 10×6)కి తోడు మరో ఓపెనర్ ఆరోన్ జార్జ్ (118; 106 బంతుల్లో 16×4) కూడా మెరుపు శతకం బాదడంతో భారత్ 233 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మొదట భారత్ 7 వికెట్లకు 393 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి ఫోర్లు సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన వైభవ్, జార్జ్ ద్వయం తొలి వికెట్‌కు 25.4 ఓవర్లలో 227 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎన్‌తండో సోని (3/61) జేసన్ రోల్స్ (2/59) మినహా బౌలర్లంతా పరుగులు ఇచ్చుకోవడంలో పోటీపడ్డారు. 63 బంతుల్లోనే సెంచరీ అందుకున్న వైభవ్.. మరింత వేగంగా ఆడే ప్రయత్నంలో ఔటయ్యాడు. అతడి ఔట్‌తో భారత్ పరుగుల వేగం కాస్త తగ్గింది. భారీ లక్ష్యఛేదనలో సఫారీ జట్టు చతికిలపడింది. 35 ఓవర్లలో 160 పరుగులకే కుప్పకూలింది. డానియల్ బోస్మన్ (40), పాల్ జేమ్స్ (41), కార్న్ బోథా (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. కిషన్ సింగ్ (3/18) మొహమ్మద్ ఎనాన్ (2/36) విజృంభించారు. వైభవ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను సొంతం చేసుకున్నాడు.

బంగ్లా మ్యాచ్‌ల తరలింపునకు ఐసీసీ నో!

ఢాకా: టీ20 ప్రపంచకప్‌లో తమ జట్టు భారత్‌లో ఆడాల్సిన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకకు తరలించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విజ్ఞప్తిని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తోసిపుచ్చినట్లు సమాచారం. బంగ్లాదేశ్ జట్టు భారత్‌లోనే మ్యాచ్‌లు ఆడాలని, లేదంటే ఆ మ్యాచ్‌ల పాయింట్లు ప్రత్యర్థులకు వెళ్తాయని ఐసీసీ.. బీసీబీకి స్పష్టం చేసినట్లుగా బుధవారం మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే దీనిపై ఐసీసీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఐసీసీ తమకు అల్టిమేటం విధించలేదని పేర్కొన్న బీసీబీ.. భారత్‌లో తమ ఆటగాళ్ల భద్రత విషయమై సమీక్ష జరుపుతామని హామీ లభించినట్లు తెలిపింది. "ఐసీసీ మాకు అల్టిమేటం విధించినట్లు మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవం. మాకు అక్కడి నుంచి అలాంటి సమాచారం ఏదీ రాలేదు. శ్రీలంకకు మ్యాచ్‌లను తరలించడం సాధ్యం కాదని కూడా ఐసీసీ మాకేమీ చెప్పలేదు. మా ఇబ్బందులేంటో అడిగారు. ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ జట్టు ఆడాలనే విషయాన్ని మాత్రం ఐసీసీ స్పష్టం చేసింది. ప్రస్తుతం భారత్‌లో వాతావరణం మా జట్టు మ్యాచ్‌లు ఆడేంత సౌకర్యంగా లేదని చెప్పాం. మా జట్టు భద్రత, మా గౌరవ మర్యాదల విషయమై ఐసీసీకి అర్థమయ్యేలా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాం. మా ఆటగాళ్ల భద్రతకు సంబంధించి ఇబ్బందులపై చర్చించేందుకు ఐసీసీ అంగీకారం తెలిపింది" అని బీసీబీ ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది బంగ్లాదేశ్‌లో అల్లర్ల నేపథ్యంలో ప్రధాని పదవి నుంచి షేక్ హసీనా దిగిపోయిన దగ్గర్నుంచి ఆ దేశంలో హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. ఇటీవల అవి మరింత ఉద్ధృతమయ్యాయి. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఫాస్ట్‌బౌలర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ వేలంలో కోల్‌కతా నైట్‌రైడర్స్ కొనుక్కోవడంపై భారత్‌లో తీవ్ర విమర్శలు వచ్చాయి. బీసీసీఐ ఆదేశాల మేరకు కేకేఆర్ అతడితో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మరోవైపు బంగ్లాదేశ్‌లో భారత జట్టు పర్యటనను బీసీసీఐ నిరవధికంగా వాయిదా వేసింది. ప్రతిగా తమ జట్టును టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపకూడదని బీసీబీ భావిస్తోంది.

ఆధిక్యంలో ఆనంద్

టాటా స్టీల్ చెస్


ఆనంద్

కోల్‌కతా: వయసు పెరిగినా వన్నె తగ్గని విశ్వనాథన్ ఆనంద్.. టాటా స్టీల్ చెస్ టోర్నీలో సత్తా చాటుతున్నాడు. ఆరేళ్ల తర్వాత ఈ టోర్నీలో బరిలోకి దిగిన 56 ఆనంద్.. ర్యాపిడ్ విభాగంలో మూడు రౌండ్లు ముగిసేసరికి హన్స్ నీమన్ (అమెరికా)తో కలిసి ఉమ్మడిగా ఆధిక్యంలో నిలిచాడు. వీళ్లిద్దరూ రెండు విజయాలు, ఓ డ్రాతో 2.5 పాయింట్ల చొప్పున సాధించారు. అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ ఆనంద్.. తొలి రౌండ్లో అమెరికా క్రీడాకారుడు వెస్లీ సోను ఓడించాడు. తర్వాత వీ యి (చైనా)తో గేమ్‌ను డ్రా చేసుకుని, మూడో రౌండ్లో భారత క్రీడాకారుడు అరవింద్ చిదంబరంపై విజయం సాధించాడు. తెలంగాణ క్రీడాకారుడు అర్జున్ ఇరిగేశి ఒక విజయం, ఒక ఓటమి, ఒక డ్రాతో 1.5 పాయింట్లు సాధించాడు.

క్వార్టర్స్‌లో నిఖత్, మీనాక్షి

నోయిడా: స్టార్ బాక్సర్లు నిఖత్ జరీన్, మీనాక్షి హుడా మహిళల జాతీయ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌కు చేరుకున్నారు. నిఖత్ (51 కేజీలు).. లద్దాఖ్ బాక్సర్ కుల్‌సూమా బానోపై పంచ్‌లతో విరుచుకుపడింది. ప్రత్యర్థి ఆమె పంచ్‌లకు తాళలేకపోవడంతో రిఫరీ ఆట మొదలైన రెండు నిమిషాల్లోనే నిఖత్‌ను విజేతగా ప్రకటించారు. మీనాక్షి (48 కేజీలు).. ఝార్ఖండ్ బాక్సర్ అన్నుపై విజయం సాధించింది.

ఒక్కడు నిలిచాడు..

బెతెల్ వీరోచిత శతకం




బెతెల్

● ఇంగ్లాండ్ 302/8.. ఆధిక్యం 119 పరుగులే


సిడ్నీ

యాషెస్ సిరీస్‌ను విజయంతో ముగించాలన్న ఇంగ్లాండ్ ఆశ తీరడం కష్టమే. చివరి టెస్టులో ఆ జట్టుకు ఓటమి తప్పేలా లేదు. తొలి ఇన్నింగ్స్‌లో 183 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన ఆస్ట్రేలియా.. నాలుగో రోజు ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను 302/8కు కట్టడి చేసింది. జాకబ్ బెతెల్ (142 బ్యాటింగ్; 232 బంతుల్లో 15×4) గొప్పగా పోరాడుతూ అజేయంగా నిలిచినా.. మిగతా బ్యాటర్లలో ఎవ్వరూ కనీసం అర్ధశతకం కూడా సాధించకపోవడంతో ఇంగ్లాండ్‌కు ఇబ్బందులు తప్పలేదు. బెన్ డకెట్ (42), హ్యారీ బ్రూక్ (42) పర్వాలేదనిపించారు. ఆ జట్టు ప్రస్తుత ఆధిక్యం 119 పరుగులే. బెతెల్‌కు తోడుగా మాథ్యూ పాట్స్ (0) క్రీజులో ఉనాడు. చివరి రోజు ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను బెతెల్ ఎక్కడిదాకా తీసుకెళ్తాడో చూడాలి. ఆసీస్ బౌలర్లలో బ్యూ వెబ్‌స్టర్ (3/51), స్కాట్ బోలాండ్ (2/34) ఆకట్టుకున్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 518/7తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కంగారూ జట్టు.. 567 పరుగులకు ఆలౌటైంది. వెబ్‌స్టర్ 71 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇంగ్లిష్ బౌలర్లలో జోష్ టంగ్, బ్రైడన్ కార్స్ తలో మూడు వికెట్లు తీశారు.

బెతెల్ అద్భుత పోరాటం: తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం కోల్పోయాక రెండో ఇన్నింగ్స్‌ను మొదలుపెట్టిన ఇంగ్లాండ్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఓపెనర్ జాక్ క్రాలీ (1)ని స్టార్క్ (1/61) తొలి ఓవర్లోనే వికెట్ల ముందు బలిగొన్నాడు. అయితే మరో ఓపెనర్ డకెట్‌తో కలిసి జాకబ్ బెతెల్ ఇంగ్లాండ్‌ను ఆదుకున్నాడు. ఈ జోడీ రెండో వికెట్‌కు 81 పరుగులు జోడించింది. అయితే డకెట్, రూట్ (6) తక్కువ వ్యవధిలో ఔటైపోవడంతో 117/3తో ఇంగ్లాండ్ మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో బ్రూక్‌తో కలిసి మరో కీలక భాగస్వామ్యం (102) నెలకొల్పాడు బెతెల్. 219/3తో ఇంగ్లాండ్ మెరుగైన స్థితికి చేరుకుంది. కానీ వెబ్‌స్టర్.. ఒకే స్కోరు వద్ద బ్రూక్, విల్ జాక్స్ (0)లను ఔట్ చేసి ఆసీస్‌ను పైచేయిలో నిలిపాడు. కానీ బెతెల్ మాత్రం పోరాటం ఆపలేదు. జేమీ స్మిత్ (26) సహకారంతో అతను శతకం పూర్తి చేశాడు. స్మిత్ నిలకడగా ఆడుతుండడం, ఇంకా స్టోక్స్ కూడా బ్యాటింగ్‌కు రావాల్సి ఉండడంతో ఇంగ్లాండ్.. ఆసీస్ ముందు మెరుగైన లక్ష్యమే నిలుపుతుందనిపించింది. కానీ జేమీ స్మిత్, స్టోక్స్ (1) 3 పరుగుల వ్యవధిలో ఔటైపోవడంతో ఇంగ్లాండ్ ఆశలకు గండి పడింది. తర్వాత కార్స్ (16) అండతో బెతెల్ పోరాటం కొనసాగించాడు. ఆట చివర్లో కార్స్ కూడా ఔటైపోయాడు. వరుసగా మూడు టెస్టులు ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్.. నాలుగో టెస్టులో విజయం సాధించిన సంగతి తెలిసిందే.

సంక్షిప్త స్కోర్లు... ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 384; **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 567 (ట్రావిస్ హెడ్ 163, స్టీవ్ స్మిత్ 138, బ్యూ వెబ్‌స్టర్ 71, మార్నస్ లబుషేన్ 48, కామెరూన్ గ్రీన్ 37; జోష్ టంగ్ 3/97, బ్రైడన్ కార్స్ 3/130, బెన్ స్టోక్స్ 2/95); **ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్:** 302/8 (జాకబ్ బెతెల్ 142 బ్యాటింగ్, బెన్ డకెట్ 42, హ్యారీ బ్రూక్ 42, జేమీ స్మిత్ 26; బ్యూ వెబ్‌స్టర్ 3/51, స్కాట్ బోలాండ్ 2/34)

ప్రణీత్ ఖాతాలో మరో అంతర్జాతీయ టైటిల్


ప్రణీత్

ఈనాడు, హైదరాబాద్ : గ్రాండ్ మాస్టర్ ప్రణీత్ ఉప్పాల మరో అంతర్జాతీయ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. స్పెయిన్‌లో జరిగిన రోక్విటాస్ చెస్ ఫెస్టివల్లో ఈ తెలంగాణ క్రీడాకారుడు.. ఏడు విజయాలు, ఒక డ్రాతో 7.5 పాయింట్లతో విజేతగా నిలిచాడు. స్పెయిన్ క్రీడాకారిణి మరీన్ పెరగాట్, పోలెండ్ ఆటగాడు కుకొరొస్కీ ఫిలిప్ తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు.

ఒలింపిక్ పతకమే లక్ష్యం: నీతు ఘంఘాస్

నోయిడా: లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించాలన్న లక్ష్యంతో ఉన్నానని భారత యువ బాక్సర్ నీతు ఘంఘాస్ చెప్పింది. ప్రస్తుతం జాతీయ బాక్సింగ్‌లో నీతు.. 51 కిలోల విభాగంలో పోటీపడుతోంది. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ నిఖత్ జరీన్ ఇదే విభాగంలో బరిలో ఉంది. వీరిద్దరు ఫైనల్లో ఎదురుకావచ్చని అంచనా. 2023లో 48 కిలోల విభాగంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన నీతు.. నిరుడు మహిళల జాతీయ బాక్సింగ్ క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి హుడా చేతిలో పరాజయంపాలైంది. ఆ తర్వాత బాక్సింగ్‌కు దూరమైన ఆమె 51 కిలోల విభాగానికి మారాలని నిర్ణయించుకుంది. 2028 ఒలింపిక్స్‌లో 48 కిలోల విభాగాన్ని తొలగించారు. "మీనాక్షి చేతిలో ఓటమి నా కెరీర్‌లో మలుపు. నేను గెలిచి ఉంటే 51 కేజీల విభాగానికి మారాలన్న ఆలోచన వచ్చేది కాదు. చాలా కాలం బాక్సింగ్‌కు దూరమైన తర్వాత తీసుకున్న నిర్ణయం అది. ప్రస్తుతం ఒలింపిక్ పతకం సాధించడంపైనే నా దృష్టంతా. 51 కేజీల విభాగం పోటీ సులువు కాదని తెలుసు. కానీ నా సాయశక్తులా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాను" అని చెప్పింది.

రెండో రౌండ్లో సార్థక్- హార్దీ జోడీ

వడోదర: డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో సార్థక్ ఆర్య, హార్దీ పటేల్ జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో సార్థక్, హార్దీ ద్వయం 5-11, 11-9, 11-9, 9-11, 12-10తో మూడో సీడ్ స్నేహిత్ సురవజ్జుల- సయాలి వాణి జంటపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో యశాంష్ మలిక్ 11-8, 9-11, 7-11, 14-12, 11-8తో ప్రేయేష్ సురేశ్‌పై, సంజయ్ కపిల 11-1, 11-6, 11-3తో హర్ష్ మెరోతాపై, జష్ మోదీ 11-1, 11-2, 11-6తో రుబిన్ మహార్జన్‌పై.. మహిళల విభాగంలో సెలెనా సెల్వకుమార్ 11-7, 11-6, 11-6తో ముక్త దాల్వీపై, నిత్య మణి 12-10, 11-9, 8-11, 11-9తో సమృద్ధి బానిక్‌పై, సంపద భివాండికర్ 11-8, 8-11, 11-13, 11-5, 12-10తో నైషా రేవాస్కర్‌పై గెలుపొందారు.

కివీస్ జట్టులో డఫీ


డఫీ

వెల్లింగ్టన్: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే న్యూజిలాండ్ జట్టులో పేసర్ జాకబ్ డఫీకి చోటు దక్కింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న పొట్టి కప్పు కోసం బుధవారం కివీస్ జట్టును ప్రకటించారు. 2025లో అంతర్జాతీయ క్రికెట్లో 81 వికెట్లు పడగొట్టిన డఫీ.. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానం సాధించాడు. ఒక ఏడాదిలో అత్యధిక వికెట్లు తీసిన కివీస్ బౌలర్‌గా 40 ఏళ్ల క్రితం రిచర్డ్ హ్యాడ్లీ (79 వికెట్లు) నమోదు చేసిన రికార్డును డఫీ తిరగరాశాడు. టీ20 ప్రపంచకప్‌లో ఆడనుండటం డఫీకి ఇదే తొలిసారి. ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ జట్టుకు సారథ్యం వహిస్తాడు. **న్యూజిలాండ్ జట్టు:** మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైకెల్ బ్రేస్‌వెల్, మార్క్ ఛాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మ్యాట్ హెన్రీ, డరైల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, టిమ్ సీఫర్ట్, ఇష్ సోధి.



ఈనాడు



విజయవాడ 8-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 149
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమరావతికి చట్టబద్ధత కల్పించండి



అమిత్ షాతో దిల్లీలోని ఆయన నివాసంలో భేటీ అయిన చంద్రబాబు

బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యమివ్వండి

- ఉపాధి హామీలో రాష్ట్ర వాటాకు వెసులుబాటు చూడండి
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు సీఎం చంద్రబాబు వినతి

ఈనాడు, దిల్లీ: ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ విభజన చట్టంలో చేర్చాలని సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కోరారు. అమరావతికి పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించడం వల్ల రాష్ట్రంలో మరింత వేగంగా అభివృద్ధి జరగడంతోపాటు రాష్ట్ర ప్రజల ఆశ నెరవేర్చినట్లవుతుందని విజ్ఞప్తి చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించాలని అడిగారు. బుధవారం దిల్లీకి వచ్చిన చంద్రబాబు రాత్రి ఇక్కడి కృష్ణమేనన్ మార్గ్‌లోని హోం మంత్రి నివాసంలో అమిత్‌షాతో భేటీ అయ్యారు. 'కొత్తగా తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద చేపట్టే పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో వాటా సమకూర్చాల్సి ఉంది. దీనిలో ఏపీకి ప్రత్యామ్నాయ వెసులుబాట్లు కల్పించాలి' అని కోరారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సభ్యుడిగా ఉన్న అమిత్‌షాకు చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను వివరించి, తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. పరిపాలన అవసరాల దృష్ట్యా రెండు కొత్త జిల్లాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్లలో చేసిన మార్పుచేర్పుల గురించి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు.

పూర్వోదయ ప్రతిపాదనలు ఆమోదించండి

'గత ప్రభుత్వ హయాంలో ధ్వంసమైన మౌలిక వసతులను పునరుద్ధరించడానికి మూలధన వ్యయం కోసం తగిన ఆర్థిక వనరులు కల్పించాలి. రాష్ట్రంలో భారీ ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్రం నుంచి ఆర్థిక సాయంతోపాటు వేగంగా అనుమతులివ్వాలి. పూర్వోదయ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలకు త్వరగా ఆమోదముద్ర వేసి నిధులు విడుదల చేయించాలి. గిరిజన ప్రాంతమైన రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేశాం. వామపక్ష ప్రభావితమైన ఆ ప్రాంత అభివృద్ధికి హోంశాఖ పరంగా తగిన నిధులు ఇవ్వాలి. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు చేయూతనివ్వాలి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలను అమిత్‌షాకు వివరించారు. ఈరోజే పోలవరం ప్రాజెక్టును సందర్శించి వచ్చానంటూ అక్కడి పనుల పురోగతి గురించీ వివరించారు.

ఎల్‌జీ ప్రతినిధులతో భేటీ

అమిత్‌షాను కలవడానికి ముందు చంద్రబాబు దిల్లీలోని తన అధికార నివాసం 1-జన్‌పథ్‌లో ఎల్‌జీ సంస్థ ప్రతినిధులతో భేటీ అయ్యారు. శ్రీసిటీలో ఆ సంస్థ కొత్తగా ఏర్పాటు చేసిన పరిశ్రమ పురోగతి గురించి వారు చర్చించారు. ఈ భేటీ అమరావతిలో జరగాల్సి ఉన్నప్పటికీ సీఎం షెడ్యూల్ దిల్లీకి మారడంతో ఆ సంస్థ ప్రతినిధులు ఇక్కడికొచ్చి సమావేశమైనట్లు తెలిసింది.

నియంత్రణలోకి వస్తున్న బ్లోఅవుట్

- 4 రోజుల్లో పూర్తిగా అదుపులోకి
- కోనసీమ జిల్లా కలెక్టర్ వెల్లడి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంభవించిన బ్లోఅవుట్ నియంత్రణలోకి వస్తోందని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఓఎన్జీసీ అధికారులతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 5న బ్లోఅవుట్ జరిగినప్పుడు భారీ మంటలు రాగా.. ప్రస్తుతం ఉద్ధృతి తగ్గడంతో ప్రమాద స్థలానికి 10 మీటర్ల దగ్గరకు వెళ్లి సిబ్బంది నియంత్రణ చర్యలు చేపడుతున్నారన్నారు. మరో నాలుగు రోజుల్లో పూర్తిగా మంటలను అదుపు చేసి క్యాపింగ్ వేస్తారని తెలిపారు. బ్లోఅవుట్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల సాధారణ జీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేవని అన్నారు. మంటల వల్ల నష్టపోయినవారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



మంటల అదుపునకు కొనసాగుతున్న 'నీటి గొడుగు' ఆపరేషన్

'బ్లోఅవుట్ సంభవించినప్పుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. ఇరుసుమండ, గుబ్బలవారిపాలెం, లక్కవరం, చింతలపల్లి గ్రామాల ప్రజలు బతుకు జీవుడా అంటూ పరుగులు పెట్టారు. మంటలు నియంత్రించేందుకు అక్కడ కనీసం నీటి వనరులు కూడా లేవు' అని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆరోపించారు. 'ఓఎన్జీసీ సంస్థ ఇంకా ఎన్ని బావులను వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందో ముందుగా స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి. లేకుంటే అక్కడి కార్యకలాపాలను అడ్డుకుంటాం. బాధిత గ్రామాల ప్రజలకు ఓఎన్జీసీ సంస్థ పరిహారం అందించి మౌలిక వసతులు కల్పించాలి. లక్కవరంలో రూ.25 కోట్ల వ్యయంతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య సదుపాయం కల్పించాలి' అని డిమాండ్ చేశారు.

రక్షణ బాధ్యత ఓఎన్జీసీ సంస్థదే

భూ ఉపరితలం, సముద్ర జలాల్లోని తమ చమురు బావుల్లో ఏ సంస్థ కార్యకలాపాలు నిర్వహించినా అక్కడ రక్షణ చర్యల బాధ్యత తమదేనని ఓఎన్జీసీ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా తెలిపారు. 'ప్రస్తుతం మంటల తీవ్రత చాలావరకు తగ్గింది. మరికొన్ని రోజుల్లో పూర్తిగా అదుపు చేసి క్యాపింగ్ చేస్తాం. బ్లోఅవుట్ జరిగిన బావి చుట్టూ శకలాల తొలగింపు జరుగుతోంది' అని ఆయన వివరించారు.

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి ఆస్తుల్లో...

10 ఏళ్లలో 550% పెరుగుదల

అవినాష్‌రెడ్డివి 474% వృద్ధి

- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ఆస్తుల్లో తగ్గుదల
- వరుసగా 3 ఎన్నికల్లో గెలిచిన వారి ఆస్తులను విశ్లేషించిన ఏడీఆర్

ఈనాడు, దిల్లీ

వైకాపాకు చెందిన ఇద్దరు ఎంపీల ఆస్తులు పదేళ్లలో సగటున 532% పెరిగినట్లు ఏడీఆర్ సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఇందులో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి ఆస్తులు 550%, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆస్తులు 474% మేర పెరిగినట్లు వెల్లడించింది. 2014, 2019 2024 ఎన్నికల్లో 103 మంది వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన 102 మంది అఫిడవిట్లను విశ్లేషించిన ఏడీఆర్ ఈ వివరాలను వెల్లడించింది. అందులో ఝార్ఖండ్ ముక్తి మోర్చా(804%) తర్వాత అత్యధికంగా ఆస్తుల విలువ పెరిగిన పార్టీల్లో వైకాపా రెండో స్థానం (532%)లో నిలిచింది. మిథున్‌రెడ్డి ఆస్తులు 2014లో రూ.22 కోట్ల మేర ఉండగా, 2019కి రూ.66 కోట్లకు, 2024కు రూ.146 కోట్లకు చేరినట్లు నివేదిక పేర్కొంది. అత్యధికంగా ఆస్తులు పెరిగిన సిటింగ్ ఎంపీల్లో మిథున్‌రెడ్డి దేశంలో మూడోస్థానంలో ఉన్నట్లు తెలిపింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆస్తులు 2014లో రూ.7 కోట్లమేర ఉండగా, 2019కి రూ.18 కోట్లకు, 2024కు రూ.40 కోట్లకు చేరాయి. ఆస్తుల విలువ వృద్ధిపరంగా ఈయన 15వ స్థానంలో నిలిచినట్లు తెలిపింది.



మిథున్‌రెడ్డి



అవినాష్‌రెడ్డి

- ఎంఐఎం పార్టీ తరఫున గత మూడు ఎన్నికల్లో గెలిచిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆస్తులు పదేళ్లలో 488% పెరిగాయి. పెరుగుదల పరంగా 24వ స్థానంలో నిలిచారు.
- తెదేపా తరఫున గత మూడు ఎన్నికల్లో గెలిచిన ఏకైక ఎంపీ.. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడి ఆస్తులు పదేళ్లలో 177% పెరిగాయి. పెరుగుదల పరంగా 28వ స్థానంలో ఉన్నారు.

ఆస్తి తగ్గిన ఏకైక ఎంపీ సీఆర్ పాటిల్

గత మూడు ఎన్నికల్లో వరుసగా గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల విలువ పదేళ్లలో సగటున 110% పెరగ్గా, కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఆస్తి మాత్రం తగ్గిపోయింది. గుజరాత్‌లోని నవ్‌సారీ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి దేశంలోనే అత్యధిక మెజారిటీతో గెలుపొందుతూ వచ్చిన ఆయన ఆస్తి 2014లో రూ.74.47 కోట్లు ఉండగా, 2019కి రూ.44.60 కోట్లకు, 2024కు రూ.39.49 కోట్లకు తగ్గింది. పదేళ్లలో ఆయన ఆస్తి రూ.34.98 కోట్ల (-47%)మేర తగ్గిపోయింది.

భాజపా 108%, కాంగ్రెస్ 135% పెరుగుదల

ఏడీఆర్ నివేదిక ప్రకారం గత మూడు ఎన్నికల్లో భాజపా నుంచి వరుసగా గెలిచిన 65 మంది ఎంపీల ఆస్తులు సగటున రూ.16.90 కోట్ల మేర (108%) పెరగ్గా, కాంగ్రెస్‌కు చెందిన 8 మంది ఎంపీల ఆస్తులు రూ.6.99 కోట్లమేర (135%) వృద్ధి చెందాయి. రాహుల్‌గాంధీ ఆస్తుల్లో రూ.10.99 కోట్ల పెరుగుదల నమోదైంది. 2014లో రూ.9.40 కోట్లమేర ఉన్న ఆస్తులు 2019కి రూ.15.88 కోట్లకు, 2024కు రూ.20.39 కోట్లకు చేరాయి. 117% పెరుగుదలతో ఆయన 38వ స్థానంలో నిలిచారు. ప్రధాని నరేంద్రమోదీ ఆస్తులు 82 శాతం పెరిగాయి. 2014లో రూ.1.65 కోట్ల మేర ఉన్న ఆస్తులు 2019కి రూ.2.51 కోట్లకు, 2024కు రూ.3.02 కోట్లకు పెరిగాయి. ఆయన 94వ స్థానంలో నిలిచారు. అత్యధిక ఆస్తి విలువ పెరిగిన టాప్-10 ఎంపీల్లో ఐదుగురు భాజపావారే.

2014, 2019, 2024 ఎన్నికల్లో గెలిచిన తెలుగు రాష్ట్రాల ఎంపీల ఆస్తులు(రూపాయల్లో) ఇలా...

ఎంపీ	2014	2019	2024	పెరుగుదల(రూ.)	సగటు వృద్ధి%
మిథున్‌రెడ్డి	22,59,84,036	66,50,85,701	146,85,01,685	124,25,17,649	550
అవినాష్‌రెడ్డి	7,04,80,623	18,69,69,794	40,43,01,973	33,38,21,350	474
అసదుద్దీన్ ఒవైసీ	4,06,11,099	17,90,44,376	23,87,66,044	19,81,54,945	488
రామ్మోహన్‌నాయుడు	8,41,73,423	12,27,91,042	23,30,73,561	14,89,00,138	177



ఏపీపీఎస్సీ అధికారుల వాంగ్మూలాలు నమోదు

గ్రూప్-1 అక్రమాల కేసులో కీలక పరిణామం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాల కేసులో ఏపీపీఎస్సీ అధికారుల వాంగ్మూలాలను పోలీసులు కోర్టులో నమోదు చేయిస్తున్నారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అప్పట్లో విశాల, ప్రసాద్, నరసింహమూర్తి, వెంకటసుబ్బయ్య, వెంకటలక్ష్మి పరీక్షల నిర్వహణలో కీలకంగా వ్యవహరించారు. నాటి కార్యదర్శి పీఎస్సార్ ఆంజనేయులు చెప్పిందే తడవుగా అన్నీ తామై వ్యవహరించారు. నిబంధనలకు విరుద్ధంగా హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం చేయించారు. న్యాయాధికారి ఎదుట వీరి వాంగ్మూలాల నమోదుకు హైకోర్టు నుంచి అనుమతి రావడంతో దీనిని చేపట్టారు. వీరిలో ఇప్పటికే వెంకటసుబ్బయ్య, నరసింహమూర్తి, ప్రసాద్ వాంగ్మూలాలను నమోదు చేయించారు. మిగిలిన ఇద్దరిని ఒకటి, రెండు రోజుల్లో పిలిపిస్తారు. విశాల స్వచ్ఛంద పదవీవిరమణ చేశారు.

మార్కులు నమోదు చేసినవారివీ..

హాయ్‌ల్యాండ్‌లో చేయించిన మాన్యువల్ మూల్యాంకనంలో క్యామ్‌సైన్ సంస్థ 66 మందిని వినియోగించుకుంది. డిజిటల్ మూల్యాంకనంలో వచ్చిన మార్కులనే మాన్యువల్ వ్యాల్యుయేషన్ శిబిరంలో ఓఎమ్మార్ షీట్లలో వీరితో నమోదు చేయించారు. దాదాపు 30 మందిని విచారించి వాంగ్మూలాలు తీసుకున్నారు. మిగిలిన వారి విచారణ పూర్తిచేసేందుకు కసరత్తు చేస్తున్నారు. క్యామ్‌సైన్ మధు (ఏ2) లేని సమయాల్లో నెల రోజుల పాటు జరిగిన మూల్యాంకనాన్ని ఆరుగురు వ్యక్తులు పర్యవేక్షించినట్లు దర్యాప్తులో తేలింది. హైకోర్టు నుంచి అనుమతి రాగానే వీరి వాంగ్మూలాలనూ రికార్డు చేయించనున్నారు.



పొట్టేలు బలిచ్చిన వైకాపా కార్యకర్తలతో జగన్ భేటీ

ఈనాడు, అమరావతి: గత నెలలో తన పుట్టినరోజు సందర్భంగా గోపాలపురం నియోజకవర్గం తూర్పు గోదావరిలో ఫ్లెక్సీ వద్ద పొట్టేలు బలి ఇచ్చిన వైకాపా కార్యకర్తలతో ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ బుధవారం భేటీ అయ్యారు. పోలీసులు ఎలాంటి కేసులు నమోదు చేశారు? అరెస్ట్ చేసి రోడ్డుపై నడిపించి తీసుకువెళ్లిన తీరును వారు జగన్‌కు వివరించారు. 'శ్రేణులు ఎవరూ భయపడవద్దు. కేసులపై పార్టీ న్యాయ విభాగం అవసరమైన సహాయం అందిస్తోంది. ప్రభుత్వ దన్నుతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, వ్యవస్థలు దిగజార్చేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు దారుణంగా ఉంది' అని జగన్ వారితో చెప్పారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ కార్యకర్తలను గోపాలపురం వైకాపా ఇన్‌ఛార్జి, మాజీ హోంమంత్రి తానేటి వనిత తీసుకొచ్చారు.

మొక్కల వెనుక లెక్కలు తేలుతున్నాయ్!

- రాష్ట్ర హరిత, సుందరీకరణ సంస్థలో గత ప్రభుత్వంలో రూ.కోట్ల దుర్వినియోగం
- ప్రభుత్వ ఆదేశాలతో విచారణ ప్రారంభించిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం

ఈనాడు – అమరావతి

★ పులివెందుల ప్రాంత అభివృద్ధి సంస్థ పరిధిలో పచ్చదనం, సుందరీకరణ, చెరువుల పునరుద్ధరణకు రూ.29.50 కోట్లు

★ విశాఖలో జీ-20 ఉత్సవాల్లో గ్రీనరీ, సుందరీకరణకు రూ.17.88 కోట్లు

★ రుషికొండ ప్యాలెస్ ప్రాంగణంలో గ్రీనరీ పనులకు రూ.8.58 కోట్లు

★ తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ప్యాలెస్ వద్ద గ్రీనరీకి రూ.5.79 కోట్లు

★ విజయవాడ అంబేడ్కర్ స్మారక్ మైదానంలో గ్రీనరీ పనులకు రూ.2.75 కోట్లు

రాష్ట్ర హరిత, సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో గత వైకాపా ప్రభుత్వంలో చేసిన చెల్లింపులివి. వీటిలో రూ.100 కోట్లకుపైగా బిల్లులు అడ్డగోలుగా చెల్లించారన్న ఆరోపణలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణ చేస్తోంది. గత మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)తోపాటు ఇతర అధికారుల పాత్రపై ఆరా తీస్తోంది. ఇప్పటికే కొన్ని కీలక దస్త్రాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

ఒకే గుత్తేదారు సంస్థకు అత్యధిక పనులు

గత ప్రభుత్వంలో అమృత్ పథకంలో కోట్ల రూపాయిల పట్టణ సుందరీకరణ, పచ్చదనం పనులను ఒకే గుత్తేదారు సంస్థకు కట్టబెట్టారు. అప్పటి ప్రభుత్వ పెద్దల సిఫార్సులపై ఆ సంస్థకు నిబంధనలకు విరుద్ధంగా పనులు కేటాయించారన్నది అభియోగం. ఆ సంస్థ చేసిన పనుల్లోనే భారీగా అక్రమాలు జరిగాయన్నది ఇంకో ఆరోపణ. తక్కువ ధరకు కొనే మొక్కలకు ఎక్కువ ధరలు అధికారులు చెల్లించారు. రుషికొండ, జీ-20 ఉత్సవాలు, పులివెందుల పట్టణ సుందరీకరణ, అప్పటి సీఎం జగన్ ప్యాలెస్ ముందు చేపట్టిన గ్రీనరీ పనుల్లో మొక్కల ధరలు భారీగా చూపించారు. రూ.300 ధర ఉండే మొక్కకు రూ.2 వేల వరకు చెల్లించారు. ఈ పనుల్లోనే కోట్ల రూపాయిలు పక్కదారి పట్టాయి.

కాగితాల్లోనే పార్కుల అభివృద్ధి

పట్టణాల్లో పాత పార్కుల నవీకరణ, కొత్తగా అభివృద్ధి చేసిన వాటికి సంబంధించి భారీగా అవకతవకలు జరిగాయి. తూతూమంత్రపు పనులతో కోట్ల రూపాయిల బిల్లులు డ్రా చేశారు. మైదుకూరు, బద్వేల్ పురపాలక సంఘాల్లోని పార్కుల అభివృద్ధిలో డొల్లతనం ఇటీవల వెలుగు చూసింది. మచిలీపట్నంలోని పార్కు అభివృద్ధిలోనూ అక్రమాలు జరిగాయన్నది ఆరోపణ. ఆముదాలవలసలోని గ్రీనరీ పనుల్లో జరిగిన అక్రమాలను ఎమ్మెల్యే కూన రవికుమార్ గత ఏడాది సెప్టెంబరులో అసెంబ్లీలో ఆధారాలతో చూపించారు. పార్కుల్లోని గ్రీనరీ పనుల్లో ప్రమాణాలకు పాతరేశారు. గుత్తేదారు సంస్థలతో అధికారులు కుమ్మక్కై, భారీగా నిధులు కట్టబెట్టారు. గత ప్రభుత్వంలో ఓ మంత్రి నియోజకవర్గంలో ప్రైవేట్ లేఅవుట్‌లోనూ పార్కు అభివృద్ధి చేసి నిబంధనలకు నీళ్లొదిలారు.

ప్రతి నెలా రూ.లక్షల్లో స్వాహా

★ ఎండీ స్థానానికి అనర్హుడైన ఒక అధికారిని ఆ హోదాలో నియమించారు. డిప్యుటేషన్ మీద ఆయన నియామకంపై పలు దఫాల్లో అధికారులు అప్పట్లో అభ్యంతరం చెప్పినా పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారి ఒకరు పట్టించుకోలేదు. ఎండీగా బాధ్యతలు చేపట్టిన నుంచి ఆయన కార్పొరేషన్‌లో చెలరేగిపోయారు. పురపాలక ఉన్నతాధికారి అండతో అనేక అక్రమాలకు పాల్పడ్డారన్నది ప్రధాన ఆరోపణ.

★ సంస్థ ప్రధాన కార్యాలయం నిర్వహణ పేరుతో తప్పుడు బిల్లులు సృష్టించి ప్రతి నెలా లక్షల రూపాయలు జేబులో వేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా విజిలెన్స్ అధికారులు సేకరిస్తున్నారు. అనుమాన అధికారులు, పొరుగుసేవల సిబ్బంది ద్వారా ఎండీ కథ నడిపించారు.

★ సంస్థకు చెందిన బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.20 కోట్ల వరకు బిల్లుల కింద చెల్లించేశారు. జీ-20 ఉత్సవంలో గ్రీనరీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో రూ.5 కోట్లు కేటాయించింది. దాన్ని రూ.20 కోట్లకు పెంచేశారు. ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేయకపోయినా... సంస్థ నిధులను గుత్తేదారులకు బిల్లుల కింద చెల్లించేశారు. ఈ విషయంలో సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో ఓ ఇంజినీర్ ఎండీకి తొత్తుగా వ్యవహరించారు.



జూపార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న పురందేశ్వరి. చిత్రంలో క్లైమెంట్ బెన్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, డీఎఫ్‌ఓ ప్రభాకరరావు తదితరులు

దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్‌లో జూపార్కు

ఏర్పాటుకు కేంద్రం సానుకూలం

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రకృతి పర్యాటకానికి తూర్పుగోదావరి జిల్లాలోని దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ అనుకూలమని, ఇక్కడ జూపార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ ప్రతిపాదనకు కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించిందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందంతో కలిసి అటవీ ప్రాంతాన్ని ఆమె పరిశీలించారు. దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్‌లో 311 హెక్టార్ల భూమి ఉందని, 250 హెక్టార్లను జూపార్కుకు వినియోగించుకోవచ్చన్నారు. జూపార్కు ఏర్పాటు అంశాన్ని కేంద్రమంత్రి భూపేందర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. సాధ్యాసాధ్యాల పరిశీలనకు సెంట్రల్ జూ అథారిటీ సభ్య కార్యదర్శి వి.క్లైమెంట్ బెన్ నేతృత్వంలోని బృందాన్ని పంపించారని వివరించారు. జూపార్కు ఏర్పాటుకు ఈ ప్రదేశం అనుకూలమని బృందం నిర్ధారించినట్లు ఎంపీ తెలిపారు.

రాజధానిలో తొలిసారి గణతంత్ర వేడుకలు

ఈనాడు, అమరావతి: గణతంత్ర వేడుకలకు తొలిసారి రాజధాని అమరావతి వేదిక కాబోతోంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర వేడుకల్ని ఏటా విజయవాడలో నిర్వహిస్తోంది. ఇకపై వీటిని అమరావతిలోనే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 26న 77వ గణతంత్ర వేడుకల్ని రాజధానిలో తొలిసారి అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. రాజధాని పరిపాలన నగరంలో మంత్రుల బంగ్లాలకు ఎదురుగా 10 ఎకరాల్లో పరేడ్‌గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారు. మరో పదెకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరేడ్ గ్రౌండ్ సిద్ధం చేసే బాధ్యతను సీఆర్డీఏకి అప్పగించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు సహా 500 మంది ప్రముఖులు కార్యక్రమానికి హాజరవుతారని భావిస్తున్నారు. తొలిసారి గణతంత్ర వేడుకల్ని అమరావతిలో నిర్వహిస్తుండటంతో వాటిని తిలకించేందుకు రాజధాని గ్రామాల నుంచి, అటు గుంటూరు, ఇటు విజయవాడ నుంచి 10వేల మంది వరకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నెల 24న పూర్తిస్థాయి డ్రెస్ రిహార్సల్స్ నిర్వహిస్తారు. వేడుకలకు హాజరయ్యే ప్రముఖులు, ప్రజలకు వేర్వేరుగా బ్లాక్‌లు ఏర్పాటుచేస్తున్నారు. వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు వేస్తున్నారు. వందేమాతరం, పది సూత్రాలతో పాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రతిబింబించేలా శకటాలు ఉంటాయి. మూడు ఉత్తమ శకటాలకు బహుమతులు అందజేస్తారు.

పక్కాగా ఏర్పాట్లు: సీఎస్ ఆదేశం

గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సీఎస్ కె.విజయానంద్ వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ రోజు లోక్‌భవన్, హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం, సీఎం క్యాంప్ కార్యాలయం సహా ఇతర ప్రభుత్వ భవనాల్ని విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆయన ఆదేశించారు. గణతంత్ర వేడుకలకు శాఖల వారీగా చేయాల్సిన ఏర్పాట్లపై సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు.

నేటి అర్ధరాత్రి మూసుకోనున్న శ్రీవారి వైకుంఠ ద్వారం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో గతేడాది డిసెంబరు 30వ తేదీన ప్రారంభమైన పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలు గురువారం అర్ధరాత్రి 12 గంటలకు ముగియనున్నాయి. పది రోజుల ద్వార దర్శనాల్లో మొదటి మూడు రోజులకు ఈ-డిప్ ద్వారా టోకెన్లు జారీ చేసిన తితిదే మిగిలిన ఏడు రోజులకు నేరుగా వచ్చే సర్వదర్శనం భక్తులకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇదే సమయంలో పరిమిత సంఖ్యలో శ్రీవాణి, రూ.300 టికెట్లు, వీవీఐపీల బ్రేక్, స్థానికులకు ఈ-డిప్‌లో రోజుకు ఐదు వేల చొప్పున టోకెన్లు జారీ చేసింది. రద్దీకి అనుగుణంగా తితిదే అధికారులు ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షించారు. క్యూలైన్‌లోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందించారు.

సర్వదర్శనానికి 15 గంటల సమయం

శ్రీవారిని ఎనిమిదోరోజు మంగళవారం వైకుంఠ ద్వారంలో 82,022 మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ కానుకలు రూ.3.48 కోట్లు వచ్చాయి. 20,230 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. తొమ్మిదో రోజు బుధవారం రద్దీ కొనసాగింది. రింగురోడ్డులోని శిలాతోరణం నుంచి భక్తులను క్యూలైన్‌లోకి అనుమతించారు. సాయంత్రానికి 51,000 మంది భక్తులు దర్శనం చేసుకోగా క్యూలైన్‌లో వేచి ఉన్న మిగిలిన భక్తులకు 15 గంటల్లో దర్శనం పూర్తికానుందని తితిదే ప్రకటించింది.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి చెక్కు అందజేత



ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సచివాలయంలో ఆర్థికశాఖలో ఏఎస్‌వోగా పనిచేస్తూ, గత ఏడాది మేలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కుసుమ కరుణకుమారి కుటుంబీకులకు వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద రూ.కోటి చెక్కును మంత్రి కేశవ్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఎస్‌బీఐ అధికారులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉద్యోగి మృతిచెందితే, వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అన్నిరకాల ప్రయోజనాలు అందిస్తున్నప్పటికీ, ఇతర రూపంలో ఎలా లబ్ధి చేకూర్చవచ్చని ప్రభుత్వం పరిశీలించిందన్నారు. ఇందులో భాగంగా ఉద్యోగుల శాలరీ ప్యాకేజీపై గత ఏడాది మార్చిలో ఎస్‌బీఐతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. దీంతో ఉద్యోగి ఎటువంటి ప్రీమియం చెల్లించకుండానే బీమా వర్తిస్తుందన్నారు. యాక్సిస్, యూబీఐ, ఇండియన్ బ్యాంకులతో కూడా ఒప్పందం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వివిధ కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులకు దీనిని దశల వారీగా అమలు చేయాలని భావిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

సంక్రాంతికి మరిన్ని ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: సంక్రాంతి పండగకు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో రైల్వేశాఖ మరికొన్ని ప్రత్యేక రైళ్లను బుధవారం ప్రకటించింది. చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈ నెల 14న ప్రత్యేక రైలు బయల్దేరుతుంది. 15న అనకాపల్లి నుంచి చర్లపల్లికి తిరుగు ప్రయాణం అవుతుంది. హైదరాబాద్-విజయవాడకు 9, 10 తేదీల్లో రెండు రైళ్లు బయల్దేరుతాయి. 9, 18 తేదీల్లో తిరుగు ప్రయాణం అవుతాయి. అవి చర్లపల్లి, వరంగల్, ఖమ్మం మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.

ఇమంది రవి బెయిల్ పిటిషన్ల కొట్టివేత

ఈనాడు, హైదరాబాద్: పైరసీ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు బుధవారం కొట్టేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఐదు కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ రవి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

గ్రహం అనుగ్రహం

8–1–2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం;
హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
పంచమి: ఉ. 10-21 తదుపరి షష్ఠి
పుబ్బ: సా. 4-25 తదుపరి ఉత్తర
వర్జ్యం: రా. 11-51 నుంచి 1-31 వరకు
అమృత ఘడియలు: ఉ.9-55 నుంచి 11-32 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-16 నుంచి 11-00 వరకు
తిరిగి మ. 2-40 నుంచి 3-24 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.37



సమస్యల పరిష్కారంతోనే సంపద సృష్టి

నేను ఫలానా పని చేస్తే నాకు డబ్బు వస్తుందా అని ఆలోచించినన్నాళ్లూ మీరు సంపన్నులు కాలేరు. నేను ఈ పని చేయడం ద్వారా ఎంత మంది సమస్యలకు పరిష్కారం చూపించగలను అనే కోణంలో ఆలోచించి, ఆ దిశగా కృషి చేసినప్పుడే సంపన్నులు అవుతారు.
–జాన్ బొర్సియొ, బిజినెస్ గ్రోత్ కన్సల్టెంట్

జి.మాడుగుల @ 2.7

ఈ సీజన్‌లో ఇదే అత్యల్ప ఉష్ణోగ్రత



చలిమంటలు కాగుతున్న పర్యాటకులు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా చలితో వణికిపోతోంది. బుధవారం రికార్డు స్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జి.మాడుగులలో 2.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ పరిశీలన కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదేనన్నారు. ముంచంగిపుట్టులో 3.5, అరకులోయ-3.6, పాడేరు-4.4, పెదబయలు-5.8, చింతపల్లి-6, హుకుంపేటలో 6.4 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయన్నారు. చలి తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో స్థానికులతోపాటు పర్యాటకులూ చలిమంటలు వేసుకోవడం కనిపించింది.

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.7	29.3
విజయనగరం	14.0	24.0
శ్రీకాకుళం	15.0	27.0
అనంతపురం	15.8	30.7
కర్నూలు	16.7	30.5
కడప	17.0	28.0
గుంటూరు	17.0	29.0
తాడేపల్లిగూడెం	17.0	29.0
రాజమహేంద్రవరం	17.5	33.5
విశాఖపట్నం	18.0	27.8
విజయవాడ	18.4	29.4
నరసాపురం	19.0	30.6
ఒంగోలు	20.0	29.9
తిరుపతి	20.4	29.2
నెల్లూరు	20.7	28.9


సంక్రాంతి ముంగిట తుపాను!

ఈనాడు, విశాఖపట్నం: సంక్రాంతి ముంగిట దక్షిణాది రాష్ట్రాలకు వాయు'గండం' పొంచి ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే ఇది తుపానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాస్త్రవేత్తల అంచనా. ఆగ్నేయ బంగాళాఖాతంలో భూమధ్యరేఖ సమీపంలో తీవ్ర అల్పపీడనం బుధవారం ఉదయానికి వాయుగుండంగా బలపడింది. సాయంత్రానికి ఇది పొట్టువిల్(శ్రీలంక)కు 570 కిలోమీటర్లు, బట్టికోలా(శ్రీలంక)కు 620 కి.మీ., కరైకల్ (తమిళనాడు)కు 990 కి.మీ., చెన్నైకి 1,140 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. గురువారానికి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. తర్వాత 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతుందని భావిస్తున్నారు. దీని ప్రభావంతో శుక్ర, శని, ఆదివారాల్లో శ్రీలంక, తమిళనాడులో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా. శని, ఆదివారాల్లో శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వాయుగుండం నేపథ్యంలో విశాఖపట్నం, మచిలీపట్నం, నిజాంపట్నం, కృష్ణపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులకు తుపాను హెచ్చరికల కేంద్రం ఒకటో నంబరు హెచ్చరికలు జారీ చేసింది.

రుతుపవనాల సీజన్ ముగిసినా...

సాధారణంగా డిసెంబరు 31 నాటికి ఈశాన్య రుతుపవనాల సీజన్ ముగుస్తుంది. వాతావరణ శాస్త్రం ప్రకారం బంగాళాఖాతంలో మిగిలిన నెలలతో పోలిస్తే జనవరి, ఫిబ్రవరిల్లో వాయుగుండాలు, తుపాన్లు చాలా తక్కువగా ఏర్పడతాయి. 1891-2024 మధ్యలో రెండు తీవ్ర తుపాన్లు, ఆరు తుపాన్లు, 12 వాయుగుండాలు ఏర్పడ్డాయి. వాటిలో అధిక శాతం శ్రీలంకలోనే తీరం దాటాయి. మూడు వాయుగుండాలు మినహా మిగిలినవన్నీ సంక్రాంతికి ముందే ఏర్పడటం గమనార్హం. వాటిలో ఒక తుపాను మాత్రమే ఏపీలో తీరం దాటింది.

ఇదీ సంగతి!



నేటి నుంచి 'ఆవకాయ్-అమరావతి' ఉత్సవాలు

ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు



పున్నమి ఘాట్ వద్ద స్వాగత ద్వారం

ఈనాడు, అమరావతి: తెలుగు సినిమా, సాంస్కృతిక, కళ, సాహిత్య మేళవింపుగా మూడు రోజులపాటు నిర్వహించే ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు విజయవాడలో గురువారం ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 గంటలకు పున్నమిఘాట్‌లో సీఎం చంద్రబాబు ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఇతర మంత్రులు హాజరు కానున్నారు. సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, కవితా పఠనం, సంగీతం, నృత్యం, నాటకాలు, సదస్సులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సీఎం కృష్ణా నదిలో హౌస్‌బోట్లను ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు.





హౌస్‌బోట్‌ను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ఏపీ టూరిజం కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ● విద్యుద్దీపాలతో ప్రధాన వేదిక

2027 మార్చికల్లా పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త డయాఫ్రం వాల్ కడుతున్నాం. 87% పని పూర్తయింది. ఈ ఏడాది ఫిబ్రవరికి పూర్తి చేస్తాం. కుడి, ఎడమ అనుసంధాన టన్నెళ్లు, నావిగేషన్ కాలువ పనులు ఈ ఏడాది జూన్‌కు పూర్తి చేస్తాం. గ్యాప్-1 ప్రధాన డ్యాం ఈ ఏడాది జూన్ నెలాఖరుకు, గ్యాప్-2 ప్రధాన డ్యాం పనులు 2027 మార్చికి పూర్తి చేస్తాం' అని వివరించారు. పోలవరం ఎడమ కాలువ అనకాపల్లి నుంచి విశాఖ వరకు ఇతరత్రా పనులు ఉంటే పూర్తి చేయాలన్నారు. ఎడమ, కుడి కాలువల ద్వారా అన్ని రిజర్వాయర్లు, చెరువులు, ఇతరత్రా జలాశయాలు ఏం ఉన్నా ఈ నీటితో నింపేలా చూడాలి. ఇందుకు అదనపు స్లూయిస్‌లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా సిద్ధం చేయాలి. పునరావాసం ఈ ఏడాది చివరికి పూర్తి చేసేలా నెలవారీ లక్ష్యాలతో ప్రణాళిక ఇవ్వాలి. అది ఎలా అమలు జరుగుతోందో పర్యవేక్షిస్తా' అని చంద్రబాబు చెప్పారు.



సొరంగం మార్గంలో సీఎం వాహనశ్రేణి

పండగ కన్నా ముందే ప్రజంటేషన్

ఐకానిక్ బ్రిడ్జి పనులకు టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. పోలవరం డ్యాం చుట్టూ పర్యాటక ప్రాజెక్టు 9,000 ఎకరాల్లో చేపట్టేలా జపాన్ కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చిన ప్రజంటేషన్‌ను పరిశీలించారు. స్పిల్‌వే సుందరీకరణ భారత సంస్కృతీ సంప్రదాయాలకు తగ్గట్టుగా రూపొందించిన ప్రణాళికలనూ చూశారు. సంక్రాంతి కన్నా ముందే అమరావతికి వచ్చి తనకు మళ్లీ సమగ్ర ప్రజంటేషన్ ఇవ్వాలని ఆదేశించారు. పోలవరంలో డెడ్‌స్టోరేజ్ నుంచి చేపట్టిన ఎత్తిపోతల పనుల్లో సివిల్ పనులు పూర్తి చేయాలని, పంపుల ఏర్పాటు అంశం తర్వాత పరిశీలిద్దామని చంద్రబాబు సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నావిగేషన్, ఇన్‌ల్యాండ్ వాటర్ వే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి కూడా జలరవాణా జరిగేలా కాకినాడ పోర్టు వరకు కాలువల ద్వారా ఈ రవాణా సాగేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ అంశాలు, జాతీయ రహదారుల అనుసంధానంపై సంబంధిత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

అంతర్గత నదుల అనుసంధానానికి మోదీ సమ్మతి

నదుల అనుసంధానం తన కల అని చంద్రబాబు పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అన్ని నదులూ సముద్రంలో కలుస్తున్నాయని.. వంశధార, గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంతో ఆంధ్రప్రదేశ్‌ను కరవు రహిత రాష్ట్రంగా మార్చడం తన స్వప్నమని చెప్పారు. రాష్ట్రంలో అంతర్గత నదుల అనుసంధానానికి ప్రధాని మోదీ అనుమతి ఇచ్చారన్నారు. గంగా- కావేరి అనుసంధానమూ జరుగుతుందని చంద్రబాబు అన్నారు. జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సమావేశంలో ప్రజంటేషన్ ఇచ్చారు. పునరావాసానికి సంబంధించి ఇళ్ల నిర్మాణం, ప్యాకేజీల విషయంలో నెలకొన్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్లు సీఎంకు వివరించారు. ముఖ్యమంత్రితో సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, పార్థసారథి, జలవనరులశాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, పునరావాస కమిషనర్ ప్రశాంతి, మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, పోలవరం ఎమ్మెల్యే బాలరాజు, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



బుధవారం పోలవరం ప్రాజెక్టు పర్యటన సందర్భంగా గ్యాప్-1లో డయాఫ్రంవాల్ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ మహేశ్‌కుమార్, జలవనరులశాఖ మంత్రి రామానాయుడు, ఉన్నతాధికారులు

ప్రతి పనీ గడువులోగా పూర్తవ్వాల్సిందే

- అధికారులకు సీఎం ఆదేశాలు
- పోలవరం ప్రాజెక్టు ఆమూలాగ్రం పరిశీలన.. పనుల తీరుపై ఆరా

ఈనాడు, ఏలూరు: నిర్దేశించుకున్న గడువులోగా పోలవరం ప్రాజెక్టులో ప్రతి పనీ పూర్తయ్యేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జలవనరుల శాఖ అధికారులు, గుత్తేదార్లను ఆదేశించారు. బుధవారం ఆయన మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రాజెక్టు నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించారు. గంటన్నరకు పైగా అన్నింటినీ చూశారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలిసారిగా టన్నెల్ నిర్మాణ పనుల్ని పరిశీలించారు. తొలుత బట్రస్ డ్యాం వద్దకు వెళ్లి అక్కడ నిర్మాణాలను చూశారు. తర్వాత గ్యాప్-1లో జరుగుతున్న ఎర్త్‌కమ్‌రాక్ ఫిల్ డ్యాం, గ్యాప్-2లో డయాఫ్రం వాల్ వద్దకు వెళ్లి ఆ నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రభుత్వం పక్కా కార్యాచరణతో ముందుకెళ్లటం వల్లే ఈ ఏడాది అధిక వర్షాలు, వరదలు వచ్చినా అంతరాయం కలగకుండా పనులు నిర్వహించగలిగామని అధికారులు చెప్పారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన పనులనూ నిర్దేశిత సమయానికి ముందే పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిన అవసరం ఉందని సీఎం గుర్తు చేశారు. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఆయన ప్రశ్నించారు. డయాఫ్రంవాల్ నిర్మాణ పనులను ఫిబ్రవరి రెండో వారంలోగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పారు. గోదావరి పుష్కరాల కన్నా ముందే పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారుల సమీక్షలోనూ సీఎం స్పష్టం చేశారు.



పోలవరం నిర్మాణ ప్రాంతాన్ని హెలికాప్టర్ నుంచి పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తొలుత వ్యూ పాయింట్ నుంచి..

ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో పోలవరం చేరుకున్న సీఎం చంద్రబాబు తొలుత హెలిప్యాడ్‌కు సమీపంలో ఉన్న వ్యూ పాయింట్ వద్ద నుంచి ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాలను చూశారు. అక్కడి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి బస్సులో నిర్మాణ ప్రదేశాల వద్దకు వెళ్లారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఏలూరు ఎంపీ మహేశ్‌కుమార్ పలువురు ఎమ్మెల్యేలు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఉత్తర అట్లాంటిక్ ఉద్రిక్తం

(మొదటి పేజీ తరువాయి)

హెలికాప్టర్లను వినియోగించాయి. హెలికాప్టర్ నుంచి అమెరికా మెరీన్లు (సైనిక సిబ్బంది) నౌకపైకి దిగి.. అందులోని సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. దానిని అమెరికా.. దక్షిణం వైపునకు మళ్లించారు. నిజానికి ఈ నౌకకు రక్షణగా రష్యా కొన్ని రోజుల కిందటే నౌకాదళాన్ని పంపినట్లు సమాచారం. అమెరికా బుధవారం దాడిచేసే సమయానికి రష్యా దళం అక్కడికి సమీపంలోనే ఉన్నట్లు సమాచారం. అయినా అమెరికా బలగాలు సమర్థంగా తమ ఆపరేషన్‌ను పూర్తి చేశాయి.

- ఈ నౌకపై 2024లోనే అమెరికా ఆంక్షలు విధించింది. ఇది లెబనాన్‌లోని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా మిలిటెంట్లకు ఆయుధాలను సరఫరా చేస్తోందని అప్పట్లో అమెరికా ఆరోపించింది.
- ఈ రెండు నౌకలు రష్యా, ఇరాన్, వెనెజువెలా నుంచి ఆసియాలోని వినియోగ దేశాలకు చమురును సరఫరా చేస్తున్నాయని అమెరికా అంతర్గత భద్రతా వ్యవహారాలశాఖ మంత్రి క్రిస్టీ నోయమ్ తెలిపారు.
- వాస్తవానికి మ్యారినెరా నౌక తొలుత బెల్లా-1 పేరుతో డిసెంబరు 15వ తేదీన కరీబియన్‌వైపు ప్రయాణించింది. ఆకస్మాత్తుగా అది ఉత్తరంవైపు తిరిగి ఐరోపా దిశగా ప్రయాణాన్ని ప్రారంభించింది. దీనిని స్వాధీనం చేసుకోవడానికి అమెరికా డిసెంబరులోనే సన్నాహాలు చేసింది. దీంతో ప్రమాదాన్ని గుర్తించి గుయానా జెండాను తీసేసి రష్యా జెండాను తగిలించింది. అది వెనెజువెలావైపు వెళ్తుండగా డిసెంబరులోనే స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నించింది.
- యూ-28ఏ అమెరికా ప్రత్యేక ఆపరేషన్స్ విమానాలు బుధవారం స్కాట్లాండ్‌లోని జాన్ ఓ గ్రోట్స్ విమానాశ్రయంలో దిగాయి. జలాంతర్గాములను వేటాడే విమానాలు, ఇంధనం నింపే కేసీ-135 విమానాలూ ఐస్‌లాండ్‌వైపు ప్రయాణించాయి. ఇవన్నీ నౌకను సీజ్ చేసే ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

ఏ దేశానికీ ఆ అధికారం లేదు: రష్యా

నౌక చుట్టూ ఉన్న పరిస్థితులపై ఆందోళన చెందుతున్నామని, పరిస్థితులను గమనిస్తున్నామని రష్యా విదేశాంగశాఖ ప్రకటించింది. 'ప్రస్తుతం మా నౌక అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తోంది. ఉత్తర అట్లాంటిక్‌లో అది ఉంది. దానికి రష్యా ఫెడరేషన్ జెండా ఉంది. అంతర్జాతీయ నౌకాయాన చట్ట నిబంధనలన్నీ పాటిస్తోంది' అని వివరించింది. సీజ్ చేసిన వెంటనే రష్యా రవాణా శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. '1982 నాటి ఐరాస కన్వెన్షన్‌లో చేసిన సముద్ర చట్టం ప్రకారం.. మరో దేశానికి చెందిన నౌకను సీజ్ చేసే అధికారం ఏ దేశానికీ లేదు' అని స్పష్టం చేసింది. నౌకలోని సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని డిమాండు చేసింది. వారి హక్కులను కాపాడాలని కోరింది. ● అమెరికాకు 4,000 కిలోమీటర్ల దూరంలో నౌక ప్రయాణిస్తోందని, గత కొన్ని రోజులుగా అమెరికా తీర ప్రాంత రక్షణ దళం దీనిని అనుసరిస్తోందని రష్యా పేర్కొంది.

సహకరించాం: బ్రిటన్

రష్యా జెండాతో వెళ్తున్న వెనెజువెలా నౌకను సీజ్ చేయడంలో అమెరికాకు సహకరించామని బ్రిటన్ వెల్లడించింది. 'యూకే సైనిక దళాలు ముందస్తు ప్రణాళికా సాయాన్ని అందించాయి. ఐస్‌లాండ్-గ్రీన్‌లాండ్ మధ్య మ్యారినెరా నౌకను అడ్డుకోవడంలో సహకరించాం' అని బ్రిటన్ తెలిపింది. 'అమెరికా విజయవంతంగా నౌకను సీజ్ చేయడానికి మద్దతు ఇవ్వడంలో మా పనితనాన్ని నిరూపించుకున్నాం. ఇది ఆంక్షలపై అంతర్జాతీయ ప్రయత్నాలకు మచ్చుతునక' అని రక్షణ మంత్రి జాన్ హీలే వివరించారు. ఈ నౌక ద్వారా రష్యా, ఇరాన్ సంయుక్తంగా ఆంక్షలను తోసిరాజని ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు.

గ్రీన్‌లాండ్ స్వాధీనానికి సైనిక చర్యకూ వెనుకాడబోం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు, ఆయన బృందం చర్చిస్తున్నారు. ఇది అత్యంత ముఖ్యమైన విదేశాంగ విధానానికి సంబంధించిన అంశం. అమెరికా సైన్యాన్ని వినియోగించడం అనేది ఎల్లప్పుడూ ఒక ఆప్షన్‌గా ఉంటుంది' అని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవీట్ మంగళవారం పేర్కొన్నారు. అమెరికా దూకుడు నేపథ్యంలో ఆ దేశంతో చర్చలకు డెన్మార్క్, గ్రీన్‌లాండ్ సిద్ధమయ్యాయి. అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియోతో సమావేశానికి సిద్ధంగా ఉన్నామని బుధవారం డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రకటించాయి. అతి త్వరలో రుబియోతో సమావేశానికి డెన్మార్క్, గ్రీన్‌లాండ్ విదేశాంగ మంత్రులు లార్స్ లోకే రస్‌మ్యూసెన్, వివియన్ మోట్జ్‌ఫెల్డ్ విజ్ఞప్తి చేసినట్లు మంగళవారం గ్రీన్‌లాండ్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఒక ప్రకటన దర్శనమిచ్చింది. గతంలో ఇలాంటి విజ్ఞప్తులు ఫలించలేదని అందులో ఉంది. మరోవైపు మంగళవారం తాను రుబియోతో మాట్లాడినట్లు ఫ్రాన్స్ విదేశాంగశాఖ మంత్రి జీన్ నోయల్ బ్యారట్ తెలిపారు. వెనెజువెలా తరహా ఆపరేషన్‌ను ఆయన కొట్టిపడేశారు.

- వెనెజువెలాపై దాడి తర్వాత గ్రీన్‌లాండ్ స్వాధీనంపై ట్రంప్ ప్రకటన చేయడం అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. ఈ విషయంలో ఐరోపా దేశాలూ తనకు మద్దతిస్తున్నాయని ఆయన పేర్కొనడం గమనార్హం.

పీపీపీతో నష్టం ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వీసీ, ఇతర అధికారులతో సమీక్షలోనూ, అనంతరం విలేకర్లతోనూ మాట్లాడారు. 'పీపీపీ విధానంలో ఇప్పటి వరకు కేవలం లాభాపేక్ష లేని సెక్షన్-8 కంపెనీలకే వైద్య కళాశాలల ఏర్పాటుకు అనుమతించగా.. ఇకపై అన్ని కార్పొరేట్ సంస్థలూ పాల్గొనే అవకాశం కల్పించాం. అనుమతులు ఇష్టారీతిన ఇవ్వం. కఠినమైన ఎస్‌వోపీలు రూపొందించి, అక్రెడిటేషన్ ప్రమాణాల ద్వారా మాత్రమే ఇస్తాం. వైద్య కళాశాలకు గుర్తింపులో అకడమిక్, లెర్నింగ్, శిక్షణ, మౌలిక సదుపాయాలు, వసతి గృహాలు, బ్యాంకు గ్యారంటీలు తదితరమైనవి కీలకం. బయోమెట్రిక్ హాజరు మాత్రమే ప్రాతిపదిక కాదు' అని స్పష్టం చేశారు.

వైద్య విద్యలో మార్పులు అవసరం

'ఆరోగ్య విశ్వవిద్యాలయాలు, వైద్య కళాశాలలతో నిర్వహించిన సమావేశాల్లో వైద్య విద్య వ్యవస్థలో మార్పులు అవసరమని స్పష్టంగా గుర్తించాం. కౌన్సెలింగ్‌లో జాప్యాన్ని నివారించడం, మానసిక ఆరోగ్యం, స్వీయ సంక్షేమం తదితర అంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. వైద్య విద్యలో ఏఐ, డిజిటల్ హెల్త్ కేర్, డిజిటల్ మెడికల్ ఎడ్యుకేషన్‌ను ప్రవేశపెట్టనున్నాం. క్లినికల్ రీసెర్చ్‌ను తప్పనిసరి చేయడంతో పాటు, కొత్తగా పీహెచ్‌డీ స్పెషాలిటీ, సబ్ స్పెషాలిటీ కోర్సులు ప్రవేశపెడతాం. నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) పరీక్ష తక్షణమే అమల్లోకి రాదు. యూజీ, పీజీ వైద్యుల కోసం జాతీయ స్థాయిలో అందుబాటులో ఉండేలా నేషనల్ రిజిస్ట్రీ ఏర్పాటు చేస్తాం' అని ఎన్‌ఎంసీ ఛైర్మన్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యున్నతస్థాయి నిపుణుల సలహా బృందం సిఫార్సుల్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్.. అభిజాత్ సేఠ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఆలోచన బాగుందని ఆయన అభినందించారు. రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధికి సలహాలు ఇస్తానన్నారు.

త్వరలో ఫ్యామిలీ మెడిసిన్

ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ చంద్రశేఖర్ మాట్లాడుతూ 'ప్రస్తుతం యూజీ సీట్లతో పోలిస్తే పీజీ సీట్లు 40 శాతమే ఉన్నాయి. రాబోయే రోజుల్లో వీటిని ఎంబీబీఎస్ సీట్లతో సమానంగా పెంచేలా చర్యలు తీసుకుంటాం. 50-100 పడకల ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తీర్చడానికి ఫ్యామిలీ మెడిసిన్ అనే కొత్త విధానం తీసుకొస్తున్నాం. దీని ద్వారా 500 సీట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ నెల 12న తొలిసారిగా యూనివర్సిటీ రీసెర్చ్‌డే నిర్వహిస్తున్నాం' అని తెలిపారు.



ఎన్‌ఎంసీ ఛైర్మన్ అభిజాత్ చంద్రకాంత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో డాక్టర్ ఈదర లోకేశ్, బుచ్చి రాంప్రసాద్, ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ వీసీ పి.చంద్రశేఖర్

ముఖ్యమంత్రితో ఎన్‌ఎంసీ ఛైర్మన్ భేటీ

ఎన్‌ఎంసీ ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ సేఠ్ ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైద్య విద్యకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. సీఎంను కలిసిన వారిలో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఈదర లోకేశ్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఉన్నారు.

భాజపా ఆధ్వర్యంలో 11న యూత్ మారథాన్

ఈనాడు, అమరావతి: స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని భాజపా ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఈ నెల 11న విజయవాడ, విశాఖ, తిరుపతి, రాజమహేంద్రవరం, నెల్లూరు నగరాల్లో 5 కి.మీ మేర యూత్ మారథాన్‌లు నిర్వహించనున్నట్టు వివరించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.

మిమ్మల్ని మీరు చదవలేకపోతే..



స్వీయ అవగాహన లేకుండా వ్యక్తిత్వ వికాసం సాధ్యం కాదు. మీరు ఎన్ని పుస్తకాలైనా చదవొచ్చు కానీ, మిమ్మల్ని మీరు చదవలేకపోతే మీరేమీ నేర్చుకోనట్లే. అందుకే ముందు మిమ్మల్ని బాగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీ ఆసక్తులు, బలాబలాలు, ప్రత్యేకతలు, లోపాలను తెలుసుకోండి. అప్పుడే మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవడం సాధ్యమవుతుంది.

– నిత్యశ్రీ, హెచ్‌ఆర్ ప్రొఫెషనల్

వీధి కుక్క దాడిలో 21 మందికి గాయాలు

కడియం, న్యూస్‌టుడే: వీధి కుక్క స్వైరవిహారం చేసి 21 మందిని గాయపర్చిన ఘటన తూర్పుగోదావరి జిల్లా కడియంలో బుధవారం చోటుచేసుకుంది. భాస్కర్‌నగర్‌లో ఓ శునకం వీధిలో ఎదురైన వారిపై ఇష్టానుసారంగా విరుచుకుపడింది. చేతులు, మోకాళ్లపై కరిచింది. దీని బారినపడిన వారంతా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి రాగా వైద్యసిబ్బంది టీకాలు వేశారు. శునకాన్ని పట్టుకునేందుకు కొందరు యువకులు ప్రయత్నించగా తప్పించుకుని పోయింది. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా వీధిశునకాల పట్టివేతపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆఫ్కాఫ్ ఛైర్మన్‌గా రాంప్రసాద్

ఈనాడు, అమరావతి: ఆప్కాఫ్ (ఆంధ్రప్రదేశ్ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య) ఛైర్మన్‌గా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వై.రాంప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. తెదేపా ఇప్పటికే రాంప్రసాద్ పేరు అధికారికంగా ప్రకటించింది. సభ్యులు ఆయనకే ఏకగ్రీవ మద్దతు తెలిపారు. ఉపాధ్యక్ష పదవికి కాకినాడకు చెందిన బి.రంగారావు, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వసంతరావు నామినేషన్లు దాఖలు చేశారు. ఓటింగ్ నిర్వహించగా.. రంగారావుకు పది ఓట్లు వచ్చాయి. దీంతో ఆయనను ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు.

రెండోదశ భూసమీకరణ రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

రైతు రుణమాఫీ, కౌలు పెంపు విషయం ప్రస్తావించగా మంత్రి నారాయణ అప్పటికప్పుడే సీఎంతో మాట్లాడి నిర్ణయాలను సభలో ప్రకటించారు. రెండోవిడత భూసమీకరణను గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వడ్డమానులో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో కలిసి రైతుల నుంచి అంగీకారపత్రాలను తీసుకుని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు భూసమీకరణ కాంపిటెంట్ అథారిటీ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామస్థుల సమావేశంలో నారాయణ మాట్లాడుతూ మొత్తం ఏడుగ్రామాల రైతుల నుంచి 16,666.57 ఎకరాలు సమీకరిస్తున్నామని తెలిపారు. రాజధాని గ్రామాల్లో ఇప్పటికే డీపీఆర్‌లు తయారుచేసి మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టామని, ఆరు నెలల్లోనే పనులు పూర్తవుతాయన్నారు. ఇప్పుడు భూసమీకరణ చేస్తున్న గ్రామాల్లోనూ డీపీఆర్‌లు తయారుచేసి ఎమ్మెల్యే, స్థానికులతో చర్చించి మార్పులు సూచిస్తే వాటికి అనుగుణంగా మార్పులు చేసి పనులు చేపడతామన్నారు. జనవరి 6 వరకు ఉన్న రైతులకు ఉన్న రుణాలను పరిగణనలోకి తీసుకుని కుటుంబానికి రూ.1.50 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కౌలు పెంపునకు సీఎం సూత్రప్రాయంగా అంగీకరించారని.. పెట్టుబడి, ఖర్చులు, దిగుబడులను పరిగణనలోకి తీసుకుని సీఎం నిర్ణయం మేరకు పెంపు ప్రకటిస్తామన్నారు. ఏ సమస్య ఉన్నా రైతులు నేరుగా వచ్చి చర్చించుకోవాలని, నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రైతుకూలీల పింఛను అమరావతిలో ఇస్తున్నట్లే ఇక్కడా అమలుచేస్తామని తెలిపారు. భూమి ఇచ్చేందుకు సమ్మతి తెలియజేస్తూ రైతులు పైనేని సత్యనారాయణ, సాయితరుణ్, వడ్లమూడి శ్రీలక్ష్మి మంత్రి నారాయణకు ఫారం-1 సమ్మతి పత్రాలు ఇచ్చారు. అడగ్గానే సానుకూలంగా నిర్ణయం తీసుకున్నందుకు రైతుల తరఫున మంత్రి నారాయణ సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సభలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. అసత్య ప్రచారాలను రైతులు నమ్మొద్దని ఆయన కోరారు. హరిశ్చంద్రపురంలో ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేశారు.

రాజధాని తరహాలోనే మౌలికవసతులు

రాజధాని నిర్మాణానికి భూసమీకరణ కింద నెలరోజుల్లోపు 80% రైతులు భూములు ఇస్తే మూడు నెలల్లో లేఔట్లు వేసి ప్లాట్లు ఇస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. రాజధాని గ్రామాల్లో కల్పించినట్లే ఇక్కడా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం పల్నాడు జిల్లా ఎండ్రాయిలో జరిగిన సమావేశంలో తొలిరోజే 290 ఎకరాలను రైతులు భూసమీకరణ కింద ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 'రైతులు భూములిస్తే ఆరు నెలల్లోనే క్రీడామైదానం పనులు ప్రారంభిస్తాం. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పనులకు ఆటంకం ఏర్పడింది. డిసెంబరు నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. కొన్ని ప్రభుత్వ భవనాలు, రహదారులు త్వరలోనే పూర్తికానున్నాయి' అని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గంలో వైకుంఠపురం పక్కనే ఉన్న అమరావతినీ రాజధాని ప్రాంతంలో కలిపేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. పంచారామమైన అమరావతిని రాజధాని అమరావతిలో కలిపిస్తే రాజధానికి పెట్టిన పేరు కూడా కలిసిపోతుందన్నారు. వారం రోజుల్లో 1000 ఎకరాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. అనంతరం ఎండ్రాయిలో యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. సమావేశంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అదనపు కమిషనర్ భార్గవతేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ క్రితికాశుక్లా తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

పరకామణిలో చోరీ... అసలు దొంగలెవరు?

'అదె చూడు తిరువేంకటాద్రి నాలుగు యుగములందు వెలుగొందీ ప్రభ మీరగాను' అంటూ ఆ ఏడుకొండలవాడికి సంకీర్తనాభిషేకం చేశాడు అన్నమయ్య. ఆ పదకవితా పితామహుడి భక్తిబాటను అనుసరిస్తూ- హరిని కొలిస్తే ఆపదలు అణిగిపోతాయనే తరగని విశ్వాసంతో, 'ఆపద్బంధుడు హరి మాకు గలడు' అనే కొండంత నమ్మకంతో అనునిత్యం అశేష సంఖ్యలో భక్తులు తిరుమలకు పోటెత్తుతుంటారు. 'శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ శరణాగతే దిక్కు సామజవరదా... చెలగి వరములిచ్చే శ్రీవేంకటేశుడా' అనుకుంటూ వచ్చి ఆ వేంకటనాథుణ్ని దర్శించుకుంటారు. 'ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు' అనే అన్నమయ్య గీతం గుండెల నిండా ప్రతిధ్వనిస్తుండగా మొక్కులు చెల్లించుకుంటారు. తమకు తోచినంత సొమ్ములను సభక్తికంగా సమర్పించుకుంటారు. ఆ విధంగా తిరుమల పరకామణిలో జమయ్యే సొత్తును కాజేయడమంటే- కలియుగ వైకుంఠంగా వాసికెక్కిన తిరుమల పవిత్రతను దెబ్బతీసే దుస్సాహసానికి పాల్పడినట్లే! ఆ మహాపరాధానికి ఒడిగట్టినవాళ్లను దండించకుండా చీకటి ఒప్పందాలు కుదుర్చుకోవడమంటే- శ్రీవేంకటేశ్వరుడి భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచినట్లే! వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జమానాలో పరకామణిలో చోరీ పాతకాన్ని కప్పెట్టి కాసులు దండుకోవడానికి కొందరు ప్రబుద్ధులు ఆడించిన దొంగ నాటకాలు కొన్నాళ్లుగా బయటపడుతూ భక్తకోటిలో ఆగ్రహావేదనలకు కారణమవుతున్నాయి!

ఎక్కడైనా ఎవరైనా దొంగతనం చేస్తూ పట్టుబడితే పోలీసులేం చేస్తారు? కేసు కట్టి కటకటాల్లోకి తోస్తారు. ఆ పనిమానేసి ఫిర్యాదుదారుకూ దొంగకూ మధ్య రాజీ కుదిర్చి గప్‌చుప్ అయ్యారంటే గూడుపుఠాణీ ఏదో ఉన్నట్లే కదా? 2023లో రవికుమార్ అనే వ్యక్తి తిరుమల పరకామణిలో చోరీచేస్తూ దొరికిపోయాడు. అతనిపై అప్పటి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) సతీష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దానిపై కేసు నమోదై ఛార్జిషీట్ దాఖలయ్యాక పరిణామాలు వేగంగా మారిపోయాయి. సరైన సెక్షన్ల ప్రకారం కేసు పెట్టకపోవడం ఒకటైతే- నిందితుడికీ ఏవీఎస్‌వోకీ ఆగమేఘాల మీద లోక్‌అదాలత్‌లో రాజీ కుదర్చడం మరో విస్మయకర అంశం! అలా చక్రం తిప్పిన ఆనాటి పెద్దమనుషులు రవికుమార్ ఆస్తుల్లో కొన్నింటిని తితిదే పేర రాయించి, అంతకు మించిన ఆస్తిపాస్తులను వారే కొట్టేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పరకామణిలో చోరీని సాధారణ దొంగతనంగా జమకట్టలేమని కిందటి నెలలో పేర్కొన్న ఏపీ హైకోర్టు- ఈ కేసులో నిందితుడు, ఇతరులతో కుమ్మక్కయిన కొంతమంది పోలీసులపై చర్యలకు తాజాగా ఆదేశాలిచ్చింది. ఆ కళంకిత ఖాకీలే కాదు- శ్రీవారి సొమ్ముల అపహరణ పాపంతో సంబంధం ఉన్నవారందరితో ఊచలు లెక్కబెట్టించాల్సిందే!

స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తిరుమల దివ్యధామం పవిత్రతను మంటగలిపిన పాపిష్టి చరిత్ర జగన్‌ది. అలాంటి మనిషి మొన్నామధ్య మాట్లాడుతూ పరకామణిలో చోరీ చిన్న విషయమంటూ నాలుక చప్పరించారు. కోట్లాది భక్తులకు ఆరాధ్యదైవమైన వెంకన్న సన్నిధిలో దొంగతనం జరగడం చిన్న సంగతా? గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్లు- క్షమార్హం కాని చేతివాటం వ్యవహారాన్ని అంత తేలిగ్గా కొట్టిపారేయాల్సిన అవసరం జగన్‌కేమొచ్చింది? రూ.40వేల జీతగాడైన నిందితుడు రూ.14కోట్లకు పైగా విలువైన ఆస్తులను తితిదేకు గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చాడంటే- వేంకటేశ్వరుడి డబ్బు మొత్తం ఎంత మాయమైంది? 'రాజీ' కుట్రలతో లాభపడిన ఆ దొంగ దొరలెవరు? దేవదేవుడి సొమ్మును ఎవరెవరు ఎంతెంత దిగమింగారు? పోలీసులు ప్రాథమికంగా హత్యగా గుర్తించిన ఫిర్యాదుదారు ఏవీఎస్‌వో మరణం వెనక లోగుట్టేమిటి? ఈ ప్రశ్నలన్నింటికీ పూర్తిస్థాయిలో జవాబులు రాబట్టి నిజమైన నేరగాళ్లను బోనెక్కించాల్సింది ఏపీ ప్రభుత్వమే!



స్త్రీలు కూడా మనుషులే. మానవహక్కులు స్త్రీ పురుషులిద్దరికీ సమానమే. మహిళలే తమంతట తాము పురుషాధిక్యతకు తలొగ్గితే, సమానత్వం కలగానే మిగులుతుంది. ఇద్దరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ సాగే కుటుంబ జీవితమే నేటి సమాజానికి అవసరం.

- ఆశాపూర్ణాదేవి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత

భక్తి... శరణాగతి

నారదభక్తి సూత్రం భక్తికి నిర్వచనం భజన అంటుంది. భజన అంటే చేతులు కలిపి, గొంతెత్తి, పక్క వాద్యాలతో, బృందగానం చేయడం కాదు; విభజన లేని మానసిక స్మరణ, మనన, నిధి ధ్యాసనలను త్రికరణ శుద్ధితో చేయడం. అన్యచింతన లేకుండా, శరణాగతి కోరి, ఎవరైతే సేవ చేస్తారో అలాంటివారే తన భక్తులని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. అలాంటి శ్రద్ధాసక్తులతో కొలిచే భక్తజనాల బాగోగులు తానే చూస్తానని కూడా అన్నాడు. 'పాహిమాం- త్వమేవ శరణంమమ' అంటే చాలు, చేసిన పాపాలన్నీ పటాపంచలు చేసి, ముక్తి ప్రసాదిస్తాను, నన్ను నమ్మమనీ భగవానుడు మాట ఇచ్చాడు. విన్నదెవరు? విని బాగుపడ్డవారు కోటికి ఒక్కరని ఆయనే అంచనా వేశాడు.



అంతర్యామి

పరమాత్మ భక్తసులభుడే అయినా, శుద్ధ భక్తి సిద్ధాన్నం కాదు. కష్టపడాలి, సాధించాలి. ఒక్కొక్క మెట్టు ఎక్కి కొండపైన కోవెల చేరిన చందాన చిత్తశుద్ధి, ఏకాగ్రబుద్ధి కలిగి, ప్రయత్నం చేసినప్పుడే ఫలితం దక్కుతుంది. శక్తి లేనిదే భక్తి లేదు; భక్తి లేనిదే ముక్తి లేదు. నమ్మకమే భక్తి, పైవాడొకడున్నాడని తెలుసుకోవడమే జ్ఞానం, పైవాడే అన్నీ చూసుకుంటాడన్న ధైర్యమే వైరాగ్యం. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు త్రివేణీ సంగమమైతే అందులో అంతర్లీనమై ప్రవహించే సరస్వతీ నదిలాంటిది భక్తి. అది లేనిదే జ్ఞాన, వైరాగ్యాలు పరిపూర్ణం కావు. ప్రహ్లాదుడు, నారదుడు, పరాశరుడు, పుండరీకుడు, వ్యాసుడు, అంబరీషుడు, శుకుడు, శౌనకుడు - అందరూ భగవద్భక్తి ద్వారా జ్ఞాన వైరాగ్యాలు పొంది, కర్తవ్య కర్మలను నిష్కామ బుద్ధితో చేసి, ముక్తజీవులై, చిరంజీవులుగా, సామాన్యులకు దారి దీపాలయ్యారు. మహాభారతం రాసినందువల్ల వ్యాస మహర్షికి నిజమైన తృప్తి కలిగింది. భాగవత కథను విన్నందువల్ల పరీక్షితుడికి మరణ భయం తొలగిపోయింది. బమ్మెర పోతన తన భాగవతాన్ని మనుషులకు అంకితం చేయనందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నా, చివరికి చరితార్థుడయ్యాడు.

భక్తి సులభం కాకపోయినా, భక్తుడి వేషం కట్టడం సులువే. ఆహార్యాలతో జనాన్ని మోసం చేయడం ఎంత పని! అలాంటి వ్యక్తులు సమాజంలో ఎందరో ఉన్నారు. కలికాలంలో అలాంటి వారి బలగం ద్విగుణం, బహుళం అయింది. అటువంటి వేషగాళ్లు, మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మనసా వాచా కర్మణా ఆ పరమాత్మనే నమ్మాలి. భక్తి ఒక అఖండజ్యోతి. ఒక దీపంతో ఎన్నో దీపాలు వెలుగుతాయి. ఆ వెలుగులో పయనించే మానవుడు ధన్యజీవి అవుతాడు. పరమాత్మ అవతార రహస్యం ప్రజలను భక్తిమార్గంలో నడిపించడం. సామాన్యుడికి సగుణభక్తి ద్వారా నిర్గుణానికి వెళ్లడం చాలా తేలిక. 'కాల ప్రభావం వల్ల ఆత్మజ్ఞానం నశించింది. తత్త్వం తెలియజేయడానికే అవతారం ధరిస్తున్నాను' అని ఆ భగవంతుడు స్వయంగా చెప్పాడు. పోతన అన్నట్టు 'శ్రీ కైవల్యపదంబు చేరుటకు' తప్పక మనం ఆ భగవంతుణ్ని ఆశ్రయించాలి; భజించాలి!

- ఉప్పు రాఘవేంద్రరావు

సంక్లిష్ట ప్రక్రియే అసలు సమస్య!

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) అనంతరం మొన్న విడుదలైన ముసాయిదాలో 12.55 కోట్ల మంది ఓటర్లే ఉన్నారు. ఆ జాబితాలో 2.89 కోట్ల ఓటర్ల పేర్లు పక్కకుపోయాయి. 'సర్' ప్రక్రియలోని సంక్లిష్టతల కారణంగా చాలామంది అర్హుల పేర్లు తొలగిపోయాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో చూడాలి.

వలస పాలనలో ఏ హక్కులూ లేక అణగారిపోయిన భారతీయులకు ప్రజాస్వామ్యం సార్వత్రిక ఓటు హక్కును ప్రసాదించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమం రాక మునుపు దేశవాసుల్లో అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రాధాన్యమిచ్చారు. ఫొటో గుర్తింపు కార్డులు లేకున్నా ఓటరు జాబితాలో పేరుంటే చాలు, వేరే ఏదైనా గుర్తింపు పత్రం సాయంతో ఓటు వేసే వెసులుబాటు కల్పించారు. దేశంలో దీర్ఘకాలం నివసించి భారతీయ పౌరసత్వం పొందినవారు తప్ప, విదేశీయులెవరూ ఓటు వేసేందుకు వీలుండేది కాదు. మొత్తమ్మీద



భారతీయ పౌరులందరికీ ఓటుహక్కు ఉండేది. సార్వత్రిక ఓటు హక్కు పరమార్థమిదే. కానీ, 'సర్' కార్యక్రమం ఇప్పుడు దానికి గండికొడుతోంది. 'సర్' పేరిట జరుగుతున్నది సవరణ కాదు- యావత్ ఓటరు జాబితాలను తిరగరాయడం. మరణించిన ఓటర్ల పేర్లను, వేరే ప్రాంతాలకు శాశ్వతంగా వలసపోయినవారిని, నకిలీ ఓటర్లను తొలగించడం 'సర్' ఉద్దేశమని ఎన్నికల కమిషన్ చెబుతున్నా, వాస్తవం దానికి భిన్నంగా ఉంటోంది.

అంతా గందరగోళం


ఉత్తర్‌ప్రదేశ్‌లో వయోజనుల సంఖ్య 16.1 కోట్లు. రాబోయే పంచాయతీ ఎన్నికల కోసం బూత్‌స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) రాష్ట్రంలోని పల్లెల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేసి ఓటరు జాబితాల సవరణ పూర్తి చేశారు. సవరించిన జాబితాలో మొత్తం గ్రామీణ ఓటర్ల సంఖ్య 12.7కోట్లుగా లెక్కతేలింది. ఇప్పుడు ఎన్నికల సంఘం చేపట్టిన 'సర్'లో భాగంగా యూపీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు ఇచ్చి పూర్తిచేయమని కోరారు. వారిలో 12.6 కోట్ల మందే ఫారాలు నింపి ఇచ్చారు. అధికారులు మొన్న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 12.55 కోట్ల మంది ఉన్నారు. అంటే, 'సర్' ప్రక్రియ పూర్తయ్యాక రాష్ట్రం మొత్తమ్మీద ఓటర్లుగా ఖరారైనవారి సంఖ్య పంచాయతీ ఎన్నికల కోసం గుర్తించిన 12.7కోట్ల గ్రామీణ ఓటర్లకన్నా తక్కువన్నమాట! కొన్ని వర్గాల ఓటర్లు ఎన్యూమరేషన్ పత్రాలను బీఎల్‌వోలకు సమర్పించకపోవడమే ఈ వ్యత్యాసానికి కారణం.

ఎన్యూమరేషన్ పత్రాలను కొందరు ఆన్‌లైన్‌లో సమర్పించారు. ఇది చాలా క్లిష్టమైన వ్యవహారం. ఈ పద్ధతిలో ఓటరు మొబైల్ ఫోన్‌నంబరును ఆధార్, ఓటర్ల ఫొటో గుర్తింపు కార్డు(ఎపిక్)లతో అనుసంధానించాలి. ఆ రెండింటిలో పేర్లు ఒకే విధంగా ఉండాలి. అసలు ఇక్కడ ఆధార్ నంబర్ ఎందుకివ్వాలనే ప్రశ్న తలెత్తుతుంది. ఎన్యూమరేషన్ పత్రాలను చేతిరాతతో నింపేటప్పుడు ఆధార్ నంబర్ లేకపోయినా ఫర్వాలేదు. ఆన్‌లైన్‌లో ఈ విధానం లేదు. ఓటరు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ స్థితిని తెలుసుకోవడానికి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌ను మళ్లీ తెరిచినప్పుడు మరోసారి కొత్త ఫారాన్ని నింపాలనే సందేశం కనిపిస్తోంది. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు సమర్పించి, అవి అప్‌లోడ్ అయిన సందర్భాల్లో మీ ఫారాలను ఇప్పటికే సమర్పించారనే సందేశం వస్తోంది. ఆన్‌లైన్‌లో ఫారాలను సమర్పించినవారికి మాత్రం అలాంటిది రావడంలేదు. దీని గురించి నిరుడు డిసెంబరులో ఫిర్యాదు అందినా ఎన్నికల సంఘం స్పందించలేదు. ఫొటో గుర్తింపు కార్డు ఉన్న ఓటర్లు తమ 'ఎపిక్' స్థితి గురించి ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో వెతికితే 'ఎలాంటి ఫలితం లభించలేద'న్న సమాధానం వస్తోంది. బహుశా వారి పేర్లను ఉద్దేశపూర్వకంగా లేదా అనుకోకుండా తొలగించి ఉండవచ్చు. నిజమైన ఎపిక్ కార్డు ఉన్నవారి పేర్లు ఓటరు జాబితాలో ఉండాలి కదా! వారికి ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వనందువల్ల తాజా ముసాయిదా జాబితాలో పేర్లు కనిపించని దుస్థితి నెలకొంది.

రెండు పద్ధతులెందుకు?

కొందరు ఓటర్లకు ఎపిక్ కార్డులు లేకపోయినా 2002-2003 నాటి 'సర్' జాబితాలలో వారి పేర్లు, లేదా వారి తల్లిదండ్రులూ తాతానామ్మల పేర్లు ఉన్నవారిది మరో బాధ! అలాంటి వారందరూ ఈసీ పౌరసత్వ పరీక్షలో నెగ్గాల్సి ఉంటుంది. కానీ, వారికి ఎన్యూమరేషన్ ఫారాలు అందలేదు కాబట్టి, వారి పేర్లూ సవరించిన ఓటరు జాబితాలలో కనిపించే అవకాశం లేదు. మరికొందరు ఓటర్ల పేర్లు ప్రస్తుత జాబితాలలో ఉన్నా, ఏదైనా అభివృద్ధి ప్రాజెక్టు వల్ల ప్రభుత్వం వారిని వేరే చోటికి తరలించి ఉంటే కొత్త చిక్కు వచ్చిపడుతుంది. ఉదాహరణకు లఖ్‌నవూలోని అక్బర్‌నగర్ ప్రాంతవాసులను వేరే చోటికి తరలించగా, వారు కొత్త నియోజకవర్గంలోకి వస్తారంటూ బీఎల్‌వో ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వలేదు. అందువల్ల వారి పేర్లూ అదృశ్యమయ్యాయి. వారికి ఎన్యూమరేషన్ ఫారాలతోపాటు చిరునామా మార్పును ప్రకటించడానికి ఫారం 8ని కూడా ఇచ్చి ఉంటే ఈ దుస్థితి తలెత్తేది కాదు.

పేర్లు గల్లంతైన ఓటర్లకు కొత్తగా నమోదు చేయించుకోవడానికి 6వ నంబరు ఫారాన్ని ఇవ్వబోతున్నారు. ఆ ఫారాన్ని నింపేటప్పుడు తాము గత జాబితాలలో లేమని చెప్పాల్సి వస్తుంది. 'సర్' వల్ల ఓటరు జాబితాల నుంచి అదృశ్యమైన అర్హులు అసలు ఎప్పటికైనా ఓటర్లుగా గుర్తింపు పొందగలుగుతారా అనే సందేహం వస్తోంది. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్లను నమోదు చేయాల్సింది పోయి, 'సర్' పేరుతో ఎన్యూమరేషన్ ఫారాలు నింపాలనడం వల్ల ఎంతో మంది ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి తలెత్తింది. అసలు ఉత్తర్‌ప్రదేశ్‌లో పంచాయతీలకు, విధాన సభ ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సవరించడానికి రెండు వేర్వేరు పద్ధతులను అనుసరించడమెందుకనే ప్రశ్న వస్తోంది. మొత్తమ్మీద 'సర్' ప్రక్రియ సార్వత్రిక ఓటు హక్కుకు భంగం కలిగిస్తోంది.



సందీప్ పాండే
సామాజిక ఉద్యమకారులు, విశ్లేషకులు



నైపుణ్యాభివృద్ధిరస్తు

ఆరంకెల జీతం, అయిదు రోజుల పని, పరిమిత పని గంటలు, హైబ్రిడ్ పని విధానం, వార్షిక ఇంక్రిమెంట్స్, సెలవులు, బీమా సౌకర్యాలు, లోన్లు... ఇవీ నేటి యువత ఎక్కువగా కోరుకుంటున్న ఉద్యోగ సౌలభ్యాలు.

విద్యార్హతలతో పాటు అదనపు నైపుణ్యాలు, కష్టపడే తత్వం, నేర్చుకునే గుణం, చురుకుదనం, సానుకూల దృక్పథం, కలివిడితనం, చొరవ, నాయకత్వ లక్షణం, ఒత్తిడిని తట్టుకునే మనోబలం, లక్ష్యాలను అందుకోగలరన్న ధీమా... ఇవీ అభ్యర్థుల నుంచి సంస్థలు ఆశించే అర్హతలు.

ఇటు సంస్థల అంచనాలను అందుకునే అభ్యర్థులు గానీ, అటు వారి ఆశలను నెరవేర్చే సంస్థలు గానీ దొరికితే ఏ సమస్యా లేదు. అలా కాని పక్షంలో ఇరువైపులా నష్టం తప్పదు. అయితే, ఇందులో ఎక్కువ భాగస్వామ్యం మాత్రం అభ్యర్థులదే. ఉద్యోగుల ఎంపికనేది ఏ సంస్థకైనా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీనికోసం ఎంతో విలువైన సమయాన్నీ, మానవవనరుల్నీ కేటాయిస్తుంది. నైపుణ్యం గల అభ్యర్థుల ఎంపికలో రాజీపడకుండా కసరత్తు నిర్వహిస్తుంది. 'రైట్ పర్సన్ ఫర్ ద రైట్ జాబ్' అన్న మేనేజ్‌మెంట్ సూత్రానికే ప్రాధాన్యం ఇస్తుంది. సరైన అభ్యర్థులు దొరికితేనే ఈ ప్రక్రియ ఫలవంతం అవుతుంది.

అటు అభ్యర్థులు కూడా కష్టపడి చదివి, మంచి ఉద్యోగం చేసి, తమ తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని ఆశపడతారు. తీరా ఇంటర్వ్యూలో విజయం సాధించి, అనుకున్న ఉద్యోగం పొందగానే, రిలాక్స్ అయిపోతారు. జీవితాన్ని, జీతాన్ని ఆస్వాదించే మూడ్‌లోకి వెళ్లిపోతారు చాలామంది. కోరుకున్న ఉద్యోగం వచ్చేసిందన్న సంతోషంలో పనిలో అలసత్వం చూపిస్తారు. తమను తాము నిరూపించుకోవాలన్న తపన తగ్గిపోయి కొత్త విషయాలను నేర్చుకోవడం, నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం మరిచిపోతారు.

ఏ సంస్థ అయినా తమ ఉద్యోగులను ఊరికే కూర్చోబెట్టి ఎక్కువ జీతాలు ఇవ్వదు. చేసే పనిని బట్టి జీతభత్యాలు నిర్ణయిస్తుంది. తమ నైపుణ్యాలను నిరంతరం పెంచుకుంటేనే ఏ ఉద్యోగికైనా మనుగడ సాధ్యం. ముఖ్యంగా ఏఐ దాగుడుమూతలాడుతున్న ఈ సమయంలో అనేక ఉద్యోగాలకు కోతలు పడుతున్నాయి. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో చేస్తున్న ఉద్యోగాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. అప్రమత్తంగా ఉండి జరుగుతున్న మార్పుల్ని గమనిస్తూ తగిన నైపుణ్యాల్ని పెంచుకుంటూ ఉండటం ఒక్కటే మార్గం. మన అర్హతకు ఏ మాత్రం తగదని తెలిసినా, చేస్తున్న పని మనసుకు నచ్చకపోయినా, కేవలం ప్యాకేజీ బాగుందని ఉద్యోగంతో రాజీపడితే మాత్రం నేర్చిన నైపుణ్యాలు వృథా అవుతాయి. వర్క్ శాటిస్‌ఫాక్షన్ ఉండదు. సరైన ఉద్యోగం రాక, చేస్తున్నది నచ్చక, సంస్థ అంచనాలను అందుకోలేక... ఇలా అసంతృప్తితో ఒత్తిడికి లోనవుతూ బండి లాగేవారి సరసన చేరకుండా జాగ్రత్తపడాలి.

మనిషి మేధస్సును మించింది ఈ ప్రపంచంలో ఇంకేదీ లేదు. ఏఐని కనిపెట్టింది కూడా మనిషే. కాబట్టి కష్టం అనుకోకుండా ఇష్టంగా కెరీర్‌ని మలచుకోవడం మన చేతుల్లోనే ఉంది.

- పోలిశెట్టి

సొంత గూడు కోసం

పట్టణ భారతంలో అల్ప, మధ్యాదాయ వర్గాల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో కేంద్రం ప్రధానమంత్రి ఆవాస యోజన-అర్బన్ (పీఎంఏవై-యు) తెచ్చింది. ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో 2.0 పేరిట దాన్ని పొడిగించింది. ఆ పథకాల్లో భాగంగా ఈ ఏడాది నవంబరు నాటికి దేశ వ్యాప్తంగా 1.22 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 96 లక్షలు నిర్మాణం పూర్తిచేసుకున్నాయి. పీఎంఏవై-యు, పీఎంఏవై-యు 2.0 కింద ఆయా రాష్ట్రాల్లో మంజూరైన ఇళ్లు, పూర్తయినవి (లక్షల్లో)...

రాష్ట్రం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
ఉత్తర్ ప్రదేశ్	21.01	17.14
ఆంధ్రప్రదేశ్	19.47	11.14
మహారాష్ట్ర	12.72	10.23
గుజరాత్	10.22	9.58
మధ్యప్రదేశ్	10.00	8.89
తమిళనాడు	6.78	6.16
పశ్చిమ్ బెంగాల్	6.17	4.97
కర్ణాటక	5.77	3.97
బిహార్	4.45	1.97
తెలంగాణ	3.62	2.24
ఛత్తీస్‌గఢ్	3.05	2.61
ఒడిశా	2.23	1.68
కేరళ	1.62	1.38

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

కునోలో చీతా కూనల సందడి!

భారత్ చేపట్టిన 'ప్రాజెక్ట్ చీతా' అనుకున్నట్లే ముందుకెళ్తోంది. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ వనంలో ముఖీ అనే చీతా అయిదు కూనలకు జన్మనిచ్చినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల వెల్లడించారు. ప్రాజెక్టులో భాగంగా దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన చీతాలకు పుట్టిన ముఖీ... భారత్‌లోనే పుట్టి, సంతానోత్పత్తి చేసిన మొదటి ఆడ చీతాగా నిలిచింది. ఇది గొప్ప మైలురాయి మాత్రమే కాదు, చీతాలు భారతీయ పర్యావరణానికి అలవాటు పడుతున్నాయనేందుకు బలమైన సంకేతం కూడా.

మన గడ్డపై అంతరించిపోయిన చీతాలను మళ్లీ పునరుజ్జీవింప చేసుకోవాలన్న భారతదేశ స్వప్నం సాకారమవుతోంది. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ వనంలో పుట్టిన కూనల మనుగడ రేటు 61శాతం పైనే ఉందని ప్రాజెక్ట్ చీతా పర్యవేక్షణ కమిటీ చెబుతోంది. ఇది ప్రపంచ సగటైన 40శాతం కంటే ఎక్కువ. దేశంలో చీతాల సంతతిని మళ్లీ పెంచుకోవడం; వాటి ఉనికిని ప్రశ్నార్థకం చేసిన వేట, ఆవాసాల నష్టం వంటి సవాళ్లను పరిష్కరించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలు. స్వాతంత్ర్యానంతరం దేశంలో కనుమరుగైన అతిపెద్ద క్షీరద జాతి చీతానే. ప్రపంచ వ్యాప్తంగానూ ఇవి అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయి. వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ అంచనాల ప్రకారం, ఇప్పుడు ప్రపంచంలో 7100 చీతాలే ఉన్నాయి. అందుకనే, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ వీటిని రెడ్ లిస్ట్‌లో పేర్కొంది. తూర్పు, దక్షిణ ఆఫ్రికా ప్రాంతాల్లోనూ, సహారా ఎడారి దక్షిణ ప్రాంతంలోనూ చీతాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఉత్తరాఫ్రికా, ఇరాన్‌లో ఇవి కొద్దిసంఖ్యలో ఉన్నాయి. నమీబియాలోనైతే 2015 నాటికే 3500 చీతాలున్నట్లు రికార్డులున్నాయి.



రేడియో కాలర్లతో పర్యవేక్షణ


చాలామంది చీతా, లెపర్డ్‌లను చిరుతపులిగానే భావిస్తారు. పిల్లి జాతికి చెందినవే అయినా, వీటి మధ్య కొన్ని తేడాలున్నాయి. చీతాలు చాలా వేగంగా పరిగెత్తగలవు. కేవలం మూడు సెకన్లలోనే అవి గంటకు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలవు. ఎదిగిన చీతా 36-56 కిలోల బరువుంటుంది. వీటి ఒంటి మీద పసుపు, నలుపు రంగు మచ్చలు కనిపిస్తాయి. వీటి కళ్ల నుంచి కిందికి కన్నీటిలా, నోటికి రెండు వైపులా నల్లటి చారలుంటాయి. ప్రాజెక్ట్ చీతా ద్వారా 2022లో నమీబియా నుంచి తొలి విడతగా ఎనిమిది చీతాలను ఇండియాకు తీసుకొచ్చారు. వీటిలో అయిదు ఆడవి. చీతాలను ఒక ఖండం నుంచి మరో ఖండానికి తరలించిన తొలి సందర్భమది.

చీతాలను ప్రవేశపెట్టడానికి అనువైన స్థలం కోసం ముందుగా అయిదు రాష్ట్రాల్లో సర్వే నిర్వహించారు. చివరికి మధ్యప్రదేశ్‌లో 261 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన కునో జాతీయ వనాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ జింకలు, దుప్పులు, మనుబోతులు, అడవి పందులు, చింకారాలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. శాకాహార జంతువులు భారీ సంఖ్యలో ఉన్నందున చీతాలకు ఆహార సమస్య ఉండదని భావించారు. 2023లో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చీతాలను తీసుకొచ్చి కొన్నింటిని కునో వనంలో, మరి కొన్నింటిని మధ్యప్రదేశ్‌లోనే... గాంధీసాగర్ అభయారణ్యంలో విడిచిపెట్టారు. పర్యవేక్షణ నిమిత్తం వాటికి రేడియో కాలర్లను అమర్చారు.

జీవవైవిధ్య పరిరక్షణకు...

మొత్తానికి మొన్న నవంబరు నాటికి దేశంలోని చీతాల సంఖ్య 32కు చేరింది. వీటిలో 16 భారతదేశ గడ్డపై జన్మించినవే! ఈ ప్రాజెక్టులో భాగంగా, రాబోయే అయిదేళ్లలో 50 చీతాలను వివిధ జాతీయ పార్కుల్లో ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు. ప్రాజెక్ట్ చీతా ఆరంభంలో కొన్ని పెద్ద చీతాలు, మరికొన్ని కూనలు చనిపోయాయి. వర్షాకాలంలో చర్మ వ్యాధులు, ఇతర సమస్యలు తలెత్తడంతో మరి కొన్ని మరణించాయి. ఇటువంటి సవాళ్లు ఉన్నప్పటికీ- చీతాల పునరుత్పత్తి, జీవన రేటులో సాధించిన పురోగతి కారణంగా ప్రాజెక్టు చీతా విజయవంతంగా ముందుకెళ్తోందని అధికారులు, నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. కునో వనంపై భారాన్ని తగ్గించడానికీ, చీతాల సంఖ్యను పెంచడానికీ అధికారులు కొన్ని చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నిరుడు ఏప్రిల్‌లో రెండు దక్షిణాఫ్రికా చీతాలు ప్రభాస్, పావక్‌లను కునో నుంచి గాంధీసాగర్ అభయారణ్యంలోకి తరలించారు. తరవాత ధీర అనే ఆడ చీతా సహా మరికొన్నింటికీ ఇలాగే ఆవాసం మార్చారు. గాంధీసాగర్‌లో చీతాల కోసం ప్రత్యేకంగా 64 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. దేశంలో అంతకంతకు తరిగిపోతున్న గడ్డిభూముల ఆవరణ వ్యవస్థను పునరుద్ధరించడానికి ప్రాజెక్ట్ చీతా ఎంతగానో ఉపకరిస్తుంది. వేటకు గురయ్యే వన్యప్రాణులతో పాటు జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికీ ఇది అక్కరకొస్తుంది. ప్రాజెక్ట్ చీతాతో పర్యావరణ పునరుజ్జీవానికి భారత్ తీసుకుంటున్న చర్యలు దేశ ప్రతిష్ఠను పెంచుతాయి. దీనివల్ల మన 'ఎకోటూరిజం' మరింతగా ఇనుమడిస్తుంది.


- వి.వి.హరిప్రసాద్, విశ్రాంత ఉప అటవీ సంరక్షణాధికారి



ఆవకాయ్.. పిలుస్తోంది రారండోయ్..

మూడు రోజుల పాటు ఉర్రూతలూగించనున్న కార్యక్రమం

విద్యుత్తు దీపాల వెలుగు జిలుగులు.. ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన వేదికలతో నదీతీరం



సీఎం ప్రారంభించనున్న బోట్ హౌస్



సిద్ధమైన స్టాళ్లు

కోలాహలంగా మారింది. ఆవకాయ్ కార్యక్రమం నిర్వహణతో నదీతీరంలో సందడి వాతావరణం నెలకొంది. కృష్ణానది ఒడ్డున పున్నమిఘాట్, నది మధ్యలో ఉన్న భవానీద్వీపం వేదికగా ఈనెల 8, 9, 10 తేదీల్లో కార్యక్రమాలు జరగనున్నాయి.



ప్రధాన వేదికపై నృత్య సాధన

ఈ సందర్భంగా ఆయా వేదికల వద్ద ఏర్పాట్లను పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం పూజారులు కృష్ణమ్మకు హారతులు ఇచ్చారు. ప్రధాన వేదికపై కళాకారులు నృత్య సాధన చేశారు.

- భవానీపురం, న్యూస్‌టుడే

ఫిబ్రవరి 7న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: 2026-27 విద్యా సంవత్సరంలో వేలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి వీలుగా వచ్చే నెల 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డి.ఎదుసంధర తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను cbseitms.rcil.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

వివాదం..

కొలిక్కి వచ్చినట్లే..!

ఈనాడు, అమరావతి

★ విద్యుత్తు సీఎండీ వద్ద కీలక భేటీ...
★ రెండు శాఖల ఉన్నతాధికారుల ఒప్పందం

విద్యుత్తు శాఖ, దుర్గగుడి మధ్య వివాదం కొలిక్కి వచ్చింది. విద్యుత్తు, దేవాదాయ ఉన్నతాధికారుల మధ్య కీలక సమావేశం బుధవారం జరిగింది. సమస్య పరిష్కారానికి ఏం చేయాలనే అంశాలపై లోతుగా చర్చించి.. శాశ్వత పరిష్కారానికి నిర్ణయాలు తీసుకున్నారు. విజయవాడలో విద్యుత్తు సీఎండీ పి.పుల్లారెడ్డి సమక్షంలో జరిగిన సమావేశంలో కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్.. రెండు శాఖల అధికారులు పాల్గొని.. చర్చించారు.

రెండు ప్రధాన నిర్ణయాలు...

★ దుర్గగుడికి చెందిన ఒక మెగావాట్ సౌర ప్లాంట్‌కు 500 కిలోవాట్స్ సామర్థ్యం ఉన్న రెండు నెట్ మీటరింగ్ వ్యవస్థల ఏర్పాటుకు పచ్చజెండా ఊపారు. ★ 2023 నుంచి దుర్గగుడికి చెందిన విద్యుత్తు పెండింగ్ బిల్లులను సౌర విద్యుత్తును మినహాయించి మిగతాది చెల్లించేలా.. ఒప్పందం జరిగినట్లు తెలిసింది.

నాలుగు రోజుల్లో టెండర్లు..

దుర్గగుడికి చెందిన ఒక మెగావాట్ సౌర విద్యుత్తు ప్లాంట్‌ను రెండుగా విభజించేందుకు మరో 3,4 రోజుల్లో టెండర్లు పిలవనున్నారు. 500 కిలోవాట్స్ చొప్పున రెండుగా విభజించి నెట్ మీటరింగ్ పెట్టేందుకు.. ఇప్పటికే టెక్నికల్ శాంక్షన్స్ అయిపోయాయి. దీనికి అవసరమైన నిర్మాణాలు, పరికరాలను అమర్చే సంస్థను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవనున్నారు. ప్రస్తుతం ప్లాంట్ వద్ద నెట్ మీటరింగ్‌ను 500 కిలోవాట్స్‌గా మార్చడంతోపాటు కొత్తగా మరొకటి అమర్చి.. విద్యుత్తును గ్రిడ్‌కు పంపనున్నారు.

మంత్రులతో భేటీ నేడు..

దేవాదాయ, విద్యుత్తు శాఖ మంత్రులు.. ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో గురువారం తుది సమావేశం ఏపీ సచివాలయంలో జరగనుంది. రెండు శాఖల ఉన్నతాధికారుల మధ్య బుధవారం సమావేశ నిర్ణయాలను.. మంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. వారి అనుమతితో.. సమస్యను శాశ్వతంగా పరిష్కరించుకోనున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం దీనిని తీవ్రంగా పరిగణించి వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇద్దరు మంత్రులతో రెండుసార్లు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాత సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది.

రూ.49 లక్షల చెల్లింపు...


దుర్గగుడికి 2023 నుంచి మొత్తం రూ.3.90 కోట్ల విద్యుత్తు బిల్లులను ఇవ్వగా.. రూ.49లక్షలు చెల్లించారు. మిగతా.. రూ.3.41 కోట్లలో ఎంత చెల్లించాలనేది మంత్రుల సమావేశంలో నేడు తేల్చనున్నారు. వీలైనంత వరకు బిల్లుల్లో హెచ్చుతగ్గులను సర్దుబాటు చేసి.. చివరకు ఎంత కట్టాలో నిర్ణయించనున్నారు.

తెలివినిచ్చే సంపద... తెచ్చుకుందాం పదపద!

పుస్తక పండగకు అపూర్వ స్పందన

36వ పుస్తక మహోత్సవం ఘనంగా కొనసాగుతోంది. ఈనెల 02 నుంచి ఆరంభమైన.. 11 రోజుల ప్రదర్శనలో ఇప్పటికే ఐదు రోజులు ముగిసింది. మరో ఐదు రోజులే పుస్తక మహోత్సవం కొనసాగుతుంది. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ప్రదర్శన జరుగుతోంది. సాయంత్రం ఐదు గంటల తర్వాత నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణానికి భారీగా సందర్శకులు తరలివస్తున్నారు. పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి పెంచాలనే భావన తల్లిదండ్రుల్లో పెరిగింది. పుస్తక మహోత్సవానికి తరలివస్తున్న వారిలో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ చిన్నారులను తేవడమే నిదర్శనం.





పుస్తకాలను పరిశీలిస్తున్న సందర్శకులు

పుస్తకాలు కొనమంటున్నారు: పుస్తక ప్రదర్శనలకు పిల్లలను తీసుకొస్తే.. వారి చేకూరే ప్రయోజనాలు చాలా ఉంటాయని.. పటమటవాసి లావణ్య తెలిపారు. తాను నాలుగేళ్లుగా ఇద్దరు పిల్లలతో పుస్తక మహోత్సవానికి వస్తున్నట్లు వెల్లడించారు. సెలవులు, సాయంత్రం వేళల్లో మొబైల్‌తోనే గడిపే వాళ్లు.. ఇక్కడికి రాగానే సరికొత్త అనుభూతికి లోనవుతూ.. వారికి నచ్చిన పుస్తకాలను కొనాలని అడగడం ఆనందంగా ఉందన్నారు.

మహోత్సవంలో ఈనాడు..

సాయంత్రం

5 గంటలు: మునిపల్లె రాజు శత జయంతి సభ, అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, వక్తలు వాడ్రేవు వీరలక్ష్మీదేవి, కాట్రగడ్డ దయానంద్.

★ **సాయంత్రం 5.45:** పాతికేళ్ల విమర్శ అండ్ బుకర్ నోబెల్ బహుమతి పొందిన పుస్తకాల పరిచయ సభ. అధ్యక్షులు.. నండూరి రాజగోపాల్, వక్తలు డాక్టర్ రాచపాళం చంద్రశేఖరరెడ్డి, తెలకపల్లి రవి, డాక్టర్ మేడిపల్లి రవికుమార్, గుంటూరు లక్ష్మీనరసయ్య.

★ **రాత్రి 7గంటలు:** విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ పుస్తకాల ఆవిష్కరణ సభ. (శత వసంతాల అరుణ పథం, మానవ చరిత్ర ఎక్కడ ప్రారంభమైంది.?, కార్ల్‌మార్క్స్ జీవిత సంగ్రహం, సైన్స్‌కు దేశంలో గడ్డుకాలం పుస్తకాల ఆవిష్కరణ.) అధ్యక్షులు గడ్డం కోటేశ్వరరావు.

★ **రాత్రి 8 గంటలు:** యండమూరి వీరేంద్రనాథ్, కోదండరామిరెడ్డి.. సినీ అనుభవాల జుగల్బందీ.

- ఈనాడు, అమరావతి

గోధుమ పిండి... అరకొరే..!

గ్రామాలకు సరఫరా కాని వైనం..

కూటమి సర్కారు పౌర సరఫరాల్లో సంస్కరణల దిశగా అడుగేస్తోంది. కొత్త ఏడాది కానుకగా గోధుమ పిండి, రాగులు, జొన్నలు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే.. పంపిణీ విధానంతో లబ్ధిదారుల్లో నిరాశ నెలకొంది. కార్డుదారులు అందరికీ ఇస్తారనుకుంటే.. పట్టణాల్లో వారికే పంపిణీ చేస్తామనడంతో గ్రామీణ లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు.

ఇదేం విధానం..

★ ఉమ్మడి జిల్లాలో 11.07 లక్షల రేషన్ కార్డులు.. 2,016 చౌక దుకాణాలు ఉన్నాయి. ఒక్కో కార్డుకు కిలో చొప్పున ఇవ్వాల్సి ఉన్నా.. పట్టణాల్లో మాత్రమే ఇస్తామంటున్నారు. ఉమ్మడి జిల్లాలో 500 టన్నుల మేరకే గోధుమ పిండి సరఫరా అయింది. తాడిగడప పట్టణమైనా ఆ పరిధిలో ఏ దుకాణానికి సరఫరా కాలేదు. విజయవాడ నగర పరిధిలోనూ చాలా దుకాణాల్లో సరఫరా కావడం లేదు.



★ **వీరులపాడు మండలంలో** ఓ రేషన్ దుకాణంలో వచ్చిన వారంతా గోధుమ పిండి అడగడంతో డీలర్లు లేదన్నారు. ప్రభుత్వం జనవరి నుంచి ఇస్తామంటే.. మీరు రాలేదంటారేమని నిలదీశారు. డీలర్లే అమ్మేసుకుని లేవని చెబుతున్నారని ఏకంగా అధికారులకు ఫిర్యాదు చేయగా.. సరఫరానే లేదనడంతో లబ్ధిదారులు శాంతించారు.

★ ఉమ్మడి జిల్లాలో అనారోగ్య సమస్యలు వివిధ కారణాలతో అన్నానికి ప్రత్యామ్నాయంగా గోధుమ పిండితో చేసిన పుల్కాలు, రోటీలు తింటున్నారు. గతంతో పోలిస్తే వినియోగం బాగా పెరిగింది. ★ సంక్రాంతి పిండి వంటలకు వాడేందుకు డిమాండ్ ఎక్కువ ఉంటోంది. నగరాలు, పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లోనే గోధుమ పిండి వినియోగం ఎక్కువ. ప్రభుత్వం సవ్యంగా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ★ కృష్ణా జిల్లా జేసీ నవీన్, ఎన్టీఆర్ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ సతీశ్‌లు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సరఫరా చేస్తున్నాం. పల్లెల్లో అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.. అన్నిచోట్ల సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు - ఈనాడు, అమరావతి

మాతా.. శిశు మరణాల నియంత్రణకు చర్యలు

పాయకాపురం, న్యూస్‌టుడే : మాతా శిశు మరణాలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.లక్ష్మీశ సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాతా శిశు మరణాల పర్యవేక్షణ, ప్రతి స్పందన కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో క్రమశిక్షణతో సేవలు అందించాలని సూచించారు. చిన్న చిన్న జాగ్రత్తలే మాతా శిశు ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని చెప్పారు. ఇప్పటికే నమోదైన మరణాలకు కారణాలు విశ్లేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా సమగ్ర కార్యాచరణ రూపొందించి, అమలు చేయాలని ఆదేశించారు. గర్భిణులు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకునేలా ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. రక్తహీనత సమస్య రాకుండా, పౌష్టికాహారం, అవసరమైన మందులు ఇవ్వాలని పేర్కొన్నారు. హైరిస్క్ గర్భిణుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారి షేక్ రుక్సానా సుల్తానాబేగం, వైద్య నిపుణులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాటాకు మాల... తళుకులీనేల...

ఎంతో అందంగా కనిపిస్తున్న పూలు, పూలమాలలు తాటాకుతో చేశారంటే నమ్ముతారా? విజయవాడ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో ఎమ్ఎస్ఎమ్ఈ ఆధ్వర్యంలో ఖాదీ మహోత్సవ్ పేరుతో నిర్వహిస్తున్న హస్తకళలు, చేనేత ఎగ్జిబిషన్‌లో ఈ తాటాకు పూలు, పూల దండలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జయమణి నిర్వహిస్తున్న స్టాల్‌లో వాటిని అమ్మకానికి ఉంచారు. ఈ మాలలు తయారు చేసేందుకు లేత తాటాకులు వినియోగిస్తామని తెలిపారు. వాటిని జాగ్రత్తగా ఈనెలుగా చేసి మాలలు రూపొందిస్తామని, వాటికి అద్దే రంగులు సైతం సహజ సిద్ధమైనవని ఆమె వివరించారు. ఒక్కో మాల తయారీకి దాదాపు 10 రోజుల సమయం పడుతుందని, వాటిని ఎంతో కాలం ఉపయోగించవచ్చని, నీళ్లతో శుభ్రం చేసుకున్నా.. పాడయ్యే అవకాశం లేదని ఆమె తెలిపారు. - ఈనాడు, అమరావతి

కొండపల్లి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.10 కోట్లతో అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, కొండపల్లి

కొండపల్లి రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ 2.0 పథకం కింద రూ.10 కోట్ల నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈమేరకు ఎంపీ కేశినేని శివనాథ్.. రైల్వే అధికారులతో కలిసి కొండపల్లి, విజయవాడ శివార్లలోని రైల్వేప్రాజెక్టులను బుధవారం పరిశీలించారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, విజయవాడ సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కోఆర్డినేషన్) నెల్లి భానుసూర్యప్రకాష్, రైల్వే డివిజినల్ ఇంజినీర్ మయాంక్‌తో కలిసి రైల్వేట్రాక్ వెంట ఎంపీ పర్యటించారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయ్..

కొండపల్లిలో ప్లాట్‌ఫామ్ ఎత్తు పెంచడం, మౌలిక సౌకర్యాల కల్పనకు ఏం చేయాలో అధికారులతో చర్చించారు. అమరావతి రాజధానికి తగ్గట్టుగా స్టేషన్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు ఎంపీ తెలిపారు. ఇక్కడ త్వరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతాయన్నారు. ★ తర్వాత ట్రాక్‌పై నడిచి... కొండపల్లి నుంచి విజయవాడ వరకూ రైల్వేట్రాక్ వెంట డ్రెయిన్ల సమస్య పరిశీలించారు. కొండపల్లి ఎస్టీకాలనీ వద్ద రైల్వేట్రాక్ కింద డ్రెయినేజీలో ఏటా వర్షాకాలంలో నీళ్లు సరిగా పారక.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ, ఎమ్మెల్యేలు.. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

విజయవాడ శివార్లలో 150 ఎకరాల్లో..

విజయవాడ రైల్వేస్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా శివార్లలోని బల్బుక్యాబిన్ వద్ద మరో స్టేషన్ ఏర్పాటుకు అనువుగా ఉన్న 150 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ★ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఇప్పటికే బల్బు క్యాబిన్ వద్ద కొత్త స్టేషన్ ఏర్పాటు గురించి చర్చించామనీ.. అందుకే స్థలం పరిశీలిస్తున్నామని ఎంపీ చెప్పారు.

రైల్వేశాఖకు సమగ్ర నివేదిక..

కొండపల్లి రైల్వేస్టేషన్ పరిధిలోని సమస్యలు, ట్రాక్ వెంట ప్రాంతాల్లో మున్సిపాలిటీ పరిధిలో ప్రజల ఇబ్బందులపై రైల్వే అధికారులకు సమగ్ర నివేదికను ఇవ్వనున్నట్లు ఎంపీ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులకు స్వయంగా.. అక్కడి సమస్యలను చూపించారు.



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కల నెరవేరబోతోంది.. కొండపల్లివాసుల కల త్వరలో నెరవేరబోతోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఎంపీ చిన్ని సహకారంతో రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.10 కోట్లను మంజూరు చేయించినట్టు పేర్కొన్నారు.

గొల్లపూడి జంక్షన్‌లో క్లోవర్ లీఫ్!

✦ ఒక్కోవైపు 15 మీటర్ల వెడల్పుతో సర్వీస్ రోడ్లు నిర్మించాలి
✦ పశ్చిమ బైపాస్ పరిశీలనలో అధికారులకు ఎంపీ సూచనలు

ఈనాడు, అమరావతి: పశ్చిమ బైపాస్‌పై క్లోవర్ లీఫ్‌తోపాటు సర్వీసు రోడ్లు కావాలని ఓ వైపు ప్రజాప్రతినిధులు, స్థానికులు పట్టుబడుతున్నారు. ఇటీవల ఎంపీ చిన్ని ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో తాజాగా బుధవారం ఎన్‌హెచ్ విజయవాడ డిప్యూటీ మేనేజర్ ఎషప్త్ శ్రీవాత్సవ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు కలిసి పరిశీలించారు. బైపాస్‌లో క్లోవర్ లీఫ్ సర్వీస్ రోడ్ల ప్రాధాన్యం.. అవి లేక ఎదురవుతున్న సమస్యలపై ఎన్‌హెచ్ అధికారులతో చర్చించారు. సాధ్యాసాధ్యాలు, ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి తదుపరి కార్యచరణ రూపొందిస్తారు.

సర్వీస్ రోడ్డే కీలకం...

★ విజయవాడ పశ్చిమ బైపాస్, ఎన్‌హెచ్-65 కలిసే గొల్లపూడి జంక్షన్ దగ్గర క్లోవర్ లీఫ్ ఇంటర్ ఛేంజ్ నిర్మాణం తప్పనిసరిగా ఉండాలని ప్రతిపాదించారు. ఇది లేకపోతే రెండు రహదారుల్లో ప్రయాణికులు గందరగోళానికి గురై.. ప్రమాదాలు జరిగే వీలుందన్నారు. ★ చినఆవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3లో 30 కిమీ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయాలనీ, ఒక్కోవైపు 15 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలు నిర్మించాలని అడిగారు. ★ నిబంధనల మేరకు.. ఒక్కోవైపు 7.5 మీటర్లతో రెండు వరుసల దారే నిర్మిస్తారని అధికారులు చెప్పారు.

★ ఈ మార్గాన్ని బైపాస్‌లా చూడొద్దనీ.. అమరావతికి మార్గం కావడంతో భావిఅవసరాలు, నగరీకరణ పెరుగుతుందనీ.. ఆ మేరకు సర్వీస్ దారులు వేయాలని ఎంపీ వివరించారు. ★ ప్రతి గ్రామానికి స్లిప్ రోడ్లు ఉన్నా అప్రోచ్‌లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని.. ప్రయాణికుల అసౌకర్యం పరిష్కరించాలని సూచించారు. ★ కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి హైవే కలిసే చోట రోడ్డు వెడల్పు చేయాలని కోరారు.



భద్రత.. మన బాధ్యత

37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం విజయవాడలో వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ లక్ష్మీశ.. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రహదారిపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. - సూర్యారావుపేట

వడోదరలో సతీష్ అరెస్టు

★ పిల్లల విక్రయాల కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు
★ అక్రమ రవాణాలో కవితకు కొరియర్‌గా మెలిగిన నిందితుడు

ఈనాడు, అమరావతి

పిల్లల విక్రయాల కేసులో తప్పించుకు తిరుగుతున్న సతీష్‌ను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడలో నమోదైన కేసులో సతీష్‌ను నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో నిందితుడి అరెస్టుకు విజయవాడ నుంచి ప్రత్యేక బృందం అహ్మదాబాద్ వెళ్లింది. గుజరాత్‌లోని వడోదరలో మంగళవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకుని అక్కడ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానంలో ట్రాన్సిట్ వారెంట్ తీసుకుని విజయవాడకు తీసుకొస్తున్నారు. దీంతో ఇప్పటివరకు కవితతోపాటు సతీష్ అరెస్టయ్యారు. మరో నిందితుడు అనిల్.. కిడ్నాప్ కేసులో మహారాష్ట్రలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. అతన్ని పీటీ వారెంటుపై విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు మరో బృందం బయలుదేరి వెళ్లింది.

క్యాటరింగ్ పనులు చేస్తూ...

గుజరాత్‌లోని సబర్‌కాంత జిల్లా జోతాసన్‌కు చెందిన సుదర్శన్.. స్వగ్రామం నుంచి ఉపాధి నిమిత్తం వడోదర వెళ్లి అక్కడ క్యాటరింగ్ పనులు చేసుకుంటున్నాడు. ప్రత్యేక బృందం .. నిందితుడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా, స్థానిక పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. అనిల్ బంధువైన సతీష్.. కవితకు పిల్లల చేరవేతకు కొరియర్‌గా పనిచేశాడు. ముంబయిలో కవిత.. పిల్లలను సతీష్‌కు ఇస్తుంది. అతను పిల్లలను విజయవాడ, హైదరాబాద్ తీసుకొచ్చి స్థానిక ముఠాలకు అప్పగించేవాడు. ఈ కేసులో కవిత తరఫున పిల్లల చేరవేతలో తోడ్పడిన నూరి కోసం ముంబయి సమీపంలోని థానేలో గాలిస్తున్నారు. మరో నిందితురాలు ప్రియాంక కోసం విజయవాడ నుంచి మరో బృందం దిల్లీ వెళ్లింది.

నున్న కేసులో సరోజినికి రిమాండ్..

ప్రధాన నిందితురాలు సరోజినిని పీటీ వారెంట్‌పై నున్న పోలీసులు బుధవారం కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం సరోజిని భవానీపురం స్టేషన్‌లో నమోదైన శిశు విక్రయాల కేసులో విజయవాడ జిల్లా కారాగారంలో రిమాండ్‌లో ఉంది. ఆమెపై నున్న, కొత్తపేట స్టేషన్లలోనూ కేసులు నమోదయ్యాయి. దీంతో సంబంధిత పోలీసులు పీటీ వారెంట్లను దాఖలు చేశారు. నున్న పోలీసులను పీటీ వారెంట్ అనుమతించటంతో నిందితురాలు సరోజిని కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు ఈనెల 12 వరకు కోర్టు రిమాండ్ విధించడంతో తిరిగి జైలుకు తరలించారు.



తెగువ తగునా.. ఆపినా ఆగునా..!

ఏదైనా వాహనం మార్గ మధ్యంలో ఆగి పోతే.. మరో వాహనం సాయంతో లాక్కుని వెళ్లడం సహజమే. కానీ ఈ చిత్రంలో మాదిరిగా.. ఒక వాహనంలో ఉన్న వ్యక్తి మరో ఆటోను ప్రమాదకరంగా తరలిస్తున్నారు. ముందు ఆటో ఒక్కసారిగా బ్రేకు వేస్తే.. వెనుకది ఢీకొట్టనుంది. అలా జరగకుండా ఉండేందుకని రెండు వాహనాల మధ్య ఒక వ్యక్తి చెయ్యి అడ్డుగా పెట్టారు. ముందు ఆటో అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే చేయి విరగడమే కాదు.. మనిషికి మరింత ప్రమాదమే. ఎంతో రద్దీగా ఉండే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ఇలా ప్రయాణిస్తున్నారు. రమేష్ ఆసుపత్రి- మహానాడు కూడలి మధ్య కనిపించిన చిత్రమిది. - ఈనాడు, అమరావతి



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, విజేతలతో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, ఏవో నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు

మురిపించే ముగ్గులు.. ఆకట్టుకునే రంగులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: సంక్రాంతి సంబరాల్లో భాగంగా విజయవాడ కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో 'ఈనాడు' ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు బుధవారం నిర్వహించారు. విద్యార్థినులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని పండుగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై సందేశాత్మక ముగ్గులు వేసి ఔరా అనిపించారు. తోటి విద్యార్థినులను ప్రోత్సహిస్తూ విద్యార్థులు సందడి చేశారు. పోటీల్లో బీఎస్సీ మూడో సంవత్సరం విద్యార్థిని కె.దివ్య ప్రథమ బహుమతి, బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థి టి.జ్యోతి, ద్వితీయ, ఎస్. హర్షిత తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు. విజేతలకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, ఏస్టాబ్లిష్‌మెంట్ బీఈడీ కళాశాల కార్యదర్శి సతీష్, ఏవో వి.నారాయణరావు, ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి, ప్రధాన స్పాన్సర్ డైమండ్ నెక్ట్స్ బ్రాంచి మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్, స్పాన్సర్ పద్మజా సుజుకీ వర్క్‌షాప్ ఇన్‌ఛార్జ్ ఎ.కృష్ణవేణి బహుమతులను అందించారు. కార్యక్రమానికి ప్రధాన స్పాన్సర్‌గా డైమండ్ నెక్ట్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజా సుజుకీ, అసోసియేటెడ్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.

సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం 'ఈనాడు' ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు సందేశాత్మక.. అందమైన ముగ్గులను వేశారు. సంక్రాంతి పండగ విశిష్టత, పర్యావరణ రక్షణ వంటి అంశాలపై చూడముచ్చటగా రంగవల్లులను తీర్చిదిద్దారు. కళాశాల ప్రాంగణంలో పండగ వాతావరణం ఏర్పడింది. తోటి విద్యార్థులంతా ముగ్గులు వేసిన సహచరులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎ.సునీత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. బి.రమ్య ప్రథమ, డి.భవానీ ద్వితీయ, డి.కీర్తి తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపల్ సునీత, పద్మజా సుజుకీ అడ్మిన్ ఆఫీసర్ కె.మీనాకేతన్, డైమండ్ నెక్ట్స్ అడ్మిన్ ఆఫీసర్ షేక్ హర్షద్ బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్ట్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజా సుజుకీ, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.





ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, విజేతలతో కళాశాల ప్రిన్సిపల్ సునీత, పద్మజా సుజుకీ అడ్మిన్ ఆఫీసర్ మీనాకేతన్, డైమండ్ నెక్ట్స్ అడ్మిన్ ఆఫీసర్ షేక్ హర్షద్ తదితరులు

చిన్న జాగ్రత్తలతో.. కుటుంబాలు సురక్షితం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ప్రయాణ సమయంలో తీసుకునే చిన్న చిన్న జాగ్రత్తలే కుటుంబాలను సురక్షితంగా ఉంచుతాయని కలెక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. సమిష్టి కృషితో రహదారి భద్రతలో జిల్లాను నంబర్ వన్‌గా నిలుపుదామని పిలుపునిచ్చారు. బుధవారం మహాత్మా గాంధీ రోడ్డులోని ఈట్ స్ట్రీట్ నుంచి 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా వాకథాన్ నిర్వహించారు. కలెక్టర్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిరస్త్రాణం, సీటు బెల్టు వినియోగం, మద్యం తాగి వాహనాలు నడపకపోవడం, అధిక వేగాన్ని నివారించటం వంటి జాగ్రత్తలు కుటుంబానికి భద్రత కల్పిస్తాయన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం మాట్లాడారు. పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ప్రమాదాలు, మరణాలు తగ్గాయని తెలిపారు. మన భద్రత కోసం పెట్టుకున్న నిబంధనలను మనం పాటించకుంటే ఎలా అని ప్రశ్నించారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ మాట్లాడుతూ.. రహదారి భద్రత సమావేశాల్లో తీసుకుంటున్న నిర్ణయాలను ఆయా శాఖలతో కలిసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛంద సంస్థలనూ భాగస్వాములు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ మాట్లాడుతూ.. రవాణాశాఖ చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. ప్రమాదాల నివారణలో జిల్లా యంత్రాంగం చేపట్టే కార్యక్రమాల్లో ఉద్యోగులు కీలకపాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అధికారులు ఆర్.ప్రవీణ్, ఎ.వెంకటేశ్వరరావు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్త కొల్లేటి రమేష్, ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, గవర్నర్‌పేట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.బసవయ్య, సుదీక్షణ్ ఫౌండేషన్ సి. హెచ్.విమల తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో విద్యార్థినుల అవగాహన ప్రదర్శన

సోగ్గాడే.. దొంగనాయనా..!

కల్యాణ మండపాల్లోనే చోరీలు ● 'న్యాట్‌గ్రిడ్'లో ఫొటో అప్‌లోడ్ చేయడంతో వెలుగులోకి..

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - విజయవాడ నేరవార్తలు

సంప్రదాయ వస్త్రాలు ధరిస్తాడు. టిపటాప్‌గా.. సోగ్గాడిలా తయారవుతాడు. పెళ్లి వారి దగ్గరి బంధువులా కనిపిస్తాడు. చేతికి తళతళలాడే బంగారు ఉంగరాలు పెట్టుకుని ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తాడు. పెళ్లి వాళ్లు ఆదమరచి ఉండగా బంగారం, వెండి వస్తువులు తీసుకుని ఉడాయిస్తాడు. అనుమానితుడి ఫొటోను 'న్యాట్‌గ్రిడ్'లో అప్‌లోడ్ చేయడంతో అతని నేర చరిత్ర ఒక్కసారిగా బట్టబయలైంది. పోలీసులు సైతం విస్మయపోయేలా చేసిన ఆతడి వివరాలు ఇలా ఉన్నాయి..



చేతికి బంగారు ఉంగరాలతో ధర్మేంద్ర

ముంబయి దాడుల తర్వాత అనుమానితుల కదలికలను ముందుగానే గుర్తించి భవిష్యత్తులో ప్రమాదాలను నివారించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో బ్యాంకింగ్, టెలికం, వీసా, పన్నుల విభాగం తదితర 21 సంస్థల డేటా బేస్‌ను న్యాట్‌గ్రిడ్‌తో అనుసంధానం చేశారు. నిందితుడి ఫొటోను దీనిలో అప్‌లోడ్ చేయగానే.. అతని పేరు తెనాలికి చెందిన నార్ల ధర్మేంద్ర (46)గా తేలింది.

వెండి బిందెల చోరీపై దృష్టి పెడితే..

గత ఏడాది నవంబరు 7న విజయవాడ మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్యాణ మండపంలో పెళ్లివారికి చెందిన రెండు వెండి బిందెలు చోరీకి గురయ్యాయి. సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టి ఒక వ్యక్తిని అనుమానించారు. పెళ్లి వీడియో నుంచి అతడి ఫొటో సేకరించారు. అది మినహా ఏ ఇతర ఆధారాలు లేకపోవడంతో సీసీఎస్ పోలీసులు నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ 'న్యాట్‌గ్రిడ్' ఆశ్రయించారు. భారత ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సమగ్ర నిఘా సమాచార వ్యవస్థే... న్యాట్‌గ్రిడ్.

బంగారం వ్యాపారం చేసి...

ధర్మేంద్ర గతంలో తెనాలిలో బంగారు నగల దుకాణం నిర్వహించేవాడు. దానిలో నష్టాలు వచ్చాయి. ఈ క్రమంలో వ్యాపారానికి సంబంధించి పన్ను ఎగ్గొట్టడంతో ఆతడిపై 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ)' కేసు నమోదు చేసి.. ఆ వివరాలు న్యాట్‌గ్రిడ్‌లో ఉంచారు. పోలీసులు నిందితుడి ఫొటో పెట్టగానే ఆ వివరాలు బయటకు వచ్చాయి. బంగారం వ్యాపారంలో నష్టం రావడంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. కల్యాణ మండపాలకు దర్జాగా వెళ్లి ఆదమరిచి ఉన్నప్పుడు చోరీ చేసి ఉడాయించేవాడు.



స్వాధీనం చేసుకున్న నగలు

పాత కేసుల చిట్టా..

ధర్మేంద్ర 2022లో కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కల్యాణ మండపంలో 91 గ్రాముల బంగారాన్ని చోరీ చేశాడు. ఆ కేసు వివరాలను సరిపోల్చారు. దానిలోనూ ఇతడి పాత్ర ఉందని తేలింది. చోరీ సొత్తు నుంచి 61 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. ఇవి కాక గుంటూరులో ఇదే తరహాలో కల్యాణ మండపాల్లో రెండు నేరాలు చేయగా అక్కడి పోలీసులు అరెస్టు చేశారు.

పోలీసులకు సీపీ అభినందనలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ పోలీసులను సీపీ రాజశేఖరబాబు ప్రత్యేకంగా అభినందించారు. సీసీఎస్ ఏడీసీపీ ఎం.రాజారావు నేతృత్వంలో బృందం సాంకేతికతను ఆధారంగా చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. ఇతని వద్ద 2022 కేసుకు సంబంధించి రూ.9లక్షల విలువైన 61 గ్రాముల బంగారం, గత ఏడాది కేసులో రూ.3లక్షల విలువైన రెండు వెండి బిందెలు స్వాధీనం చేసుకున్నారు.

చర్లపల్లి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ రద్దీ దృష్ట్యా చర్లపల్లి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07097 ప్రత్యేక రైలు ఈ నెల 14వ తేదీ రాత్రి 7.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి 15వ తేదీ ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07098 15న అనకాపల్లిలో సాయంత్రం 5.35కి బయలుదేరి 16వ తేదీ ఉదయం 8.15 గంటలకు చర్లపల్లి చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, ఎలమంచిలి స్టేషన్లలో ఆగుతుందని అధికారులు చెప్పారు.

'తెదేపా కార్యకర్తల్లో అసంతృప్తి సమంజసం కాదు'

నందిగామ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ అరాచక పాలన చూసిన తెదేపా కార్యకర్తలు.. నేటి గాంధేయపాలనలో కొంత అసంతృప్తిగా ఉన్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు నాయుడు గాంధేయవాది కావడం వల్ల దానికి తగ్గట్టుగానే ప్రశాంతమైన పాలన సాగిస్తున్నారని చెప్పారు. నందిగామలో కాకతీయ అపోలో స్కూలు వార్షికోత్సవానికి హాజరైన ఆయన.. బుధవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్, విప్ సౌమ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సహజంగా వైకాపా ప్రభుత్వంలో ఇబ్బంది పడిన తెదేపా కార్యకర్తలు.. దానిలో కొంతైనా చేయలేకపోతే ఎలా అనే అసంతృప్తితో ఉన్నా..



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, పక్కన ప్రభుత్వ విప్ సౌమ్య

అది సమంజసం కాదని తెలిపారు. దీనికి అర్థం ఉన్నా క్షణికావేశాలను పక్కన పెడితే దీర్ఘ కాలంలో సీఎం చంద్రబాబునాయుడు శైలీ కరెక్ట్ అని, దీని వల్లే ప్రయోజనం ఉంటుందన్నారు. స్త్రీశక్తి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంపట్ల మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. పురుషులకు సీట్లు దొరకట్లేదని కొంత ఇబ్బందిగా ఉంటున్నారని తెలిపారు. ఈ పథకం ఉద్దేశం పూర్తి స్థాయిలో విజయవంతమైందని రఘురామకృష్ణరాజు చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ సీఎం చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమైందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో విశాఖపట్నంలో ఎయిర్‌పోర్టు ఉండగా భోగాపురంలో ఎందుకు దండగని జగన్‌మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారని విమర్శించారు. ఈ విషయం అప్పట్లోనే టీవీల్లో వచ్చిందని తెలిపారు.

పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం : మంత్రి దుర్గేష్

భవానీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక రంగానికి గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, కళలు, సాహిత్యం, సినిమా వైభవాన్ని ప్రపంచానికి చాటడమే లక్ష్యంగా విజయవాడలోని కృష్ణా నది ఒడ్డున పున్నమిఘాట్, భవానీద్వీపంలో ఆవకాయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవకాయ్ కార్యక్రమంలో సినిమా ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, సంగీతం, నృత్యం, నాటకాలు, వర్క్ షాపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు జరగనున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం పున్నమిఘాట్ వద్ద హౌస్‌బోట్లను ప్రారంభించనున్నారని వెల్లడించారు. కృష్ణా, గోదావరి నదీతీరాల్లోని ఇతర ప్రాంతాల్లోను హౌస్‌బోట్లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సందర్శకులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న కార్యక్రమానికి కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నది ఒడ్డున ఏర్పాటు చేసిన హౌస్‌బోట్లను పరిశీలించారు. పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదం పరిష్కారం

భవానీపురం, న్యూస్‌టుడే: పున్నమిఘాట్ వద్ద ఆవకాయ్ కార్యక్రమానికి ఏర్పడిన అడ్డంకులు తొలిగాయి. పున్నమిఘాట్ వద్ద ఆవకాయ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండడంతో ప్రైవేటు స్థలాల యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమను సంప్రదించకుండా ఏవిధంగా ఏర్పాట్లు చేస్తారంటూ ప్రశ్నించారు. దీంతో కలెక్టర్ లక్ష్మీశ ప్రైవేటు స్థలాల యజమానులతో బుధవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. స్థల యజమానులకు నష్టపరిహారం ఇస్తామని కలెక్టర్ ప్రకటించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేయాలి

కృష్ణలంక (విజయవాడ), న్యూస్‌టుడే: మహిళలు నేడు అన్ని రంగాల్లో ఉన్నత స్థితికి ఎదుగుతున్నారని, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి కూడా చేరాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో మహిళా ఫెస్ట్- 2026ని విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో బుధవారం ప్రారంభించారు. జాతీయ పతాకాన్ని మంత్రి, తరుణీ తరంగాలు పతాకాన్ని కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.ఉషారాణి ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో అనిత మాట్లాడుతూ.. నేను ఆడపిల్లను.. ఏమీ చేయలేను అనే భావన వదిలేసి ధైర్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. మహిళలు తలచుకుంటే ఏదైనా సాధించగలరనేది వాస్తవమని అన్నారు. విద్యార్థినులు, యువతులు చిన్న వయసులోనే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రేమ ఉచ్చులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఘటనలు చూస్తుంటే.. మనసు తరుక్కుపోతోందంటూ కొన్ని ఉదాహరణలు చెప్పారు. దేనినైనా ఎదుర్కొనే శక్తి మహిళలకు ఉందని, ధైర్యంగా 'నో' చెప్పడం అలవాటు చేసుకోవాలని సూచించారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ.. మహిళాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ఇటీవల క్రికెట్‌లో రాణించిన రాష్ట్ర క్రీడాకారిణికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించిందని తెలిపారు.



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత, వేదికపై రమాదేవి, రావి శారద, మల్లాది స్వాతి, సుంకర శోభారాణి, ఉషారాణి, రాయపాటి శైలజ, స్వరూపారాణి తదితరులు

పలువురికి సత్కారం

వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలకు సత్కరించారు. అమరావతి రేర్ డిసీజెస్ సంస్థకు చెందిన సుంకర శోభారాణి, ప్రముఖ గాయని మల్లాది స్వాతి, ఎడ్ట్రానిక్స్ సంస్థ ప్రతినిధి దాసరి స్ఫూర్తిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి తరుణీ తరంగాలు అధ్యక్షురాలు డాక్టర్ రావి శారద అధ్యక్షత వహించారు. సభ్యులు డి. రమాదేవి, శ్రీదేవి, స్వరూపారాణి, డాక్టర్ విద్యాకన్నా, డాక్టర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295. **అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్:** బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులకు కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నలుగురు నిందితులను కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులు తలారి రంగయ్య (ఏ14), ధారబోయిన ప్రసాద్ (ఏ23), బాలాజీ (ఏ3), సుదర్శన్ (ఏ21)లను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు పిటిషన్లు వేశారు. వీటిపై ఈనెల 9 నుంచి 12 వరకు విచారించేందుకు ఎక్సైజ్ పోలీసులకు కోర్టు అనుమతించింది. వీరిని గురునానక్ కాలనీలోని ఎక్సైజ్ కార్యాలయంలో విచారించనున్నారు. ● ఇదే కేసులో వైకాపా నేత జోగి రమేష్, రాము, అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహన్‌రావు, తలారి రంగయ్య, బాలాజీ, సుదర్శన్‌లు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లు బుధవారం విచారణకు వచ్చాయి. ప్రాసిక్యూషన్ కౌంటర్లు ఫైల్ చేసేందుకు గురువారానికి కోర్టు వాయిదా వేసింది. ● ధారబోయిన ప్రసాద్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. నిందితుడు తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. తదుపరి వాదనల నిమిత్తం 8కి వాయిదా వేశారు. ● జినేష్ (ఏ24), శిబు (ఏ25) కస్టడీ కోరుతూ పోలీసులు బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై నోటీసుల నిమిత్తం 8కి వాయిదా పడింది.

గాఢనిద్రలో మట్టుబెట్టారు

మరో మహిళతో కలిసి అత్త ఘాతుకం

మైలవరం, న్యూస్‌టుడే: బాధ్యతారాహిత్యంగా తిరుగుతూ, మాట వినని కోడలి హత్యకు అత్త పన్నాగం పన్నింది. కిరాయికి మరో మహిళను మాట్లాడుకుంది. అనారోగ్యంగా ఉన్న తండ్రిని తీసుకుని కొడుకు ఆస్పత్రిలో ఉండగా, అదే సరైన సమయమని భావించింది. చిన్న పిల్లలైన మనవడు, మనవరాలిని తనవద్దే పడుకోబెట్టుకొని.. ఒంటరిగా గదిలో నిద్రిస్తున్న కోడలిని అర్ధరాత్రి సమయంలో కిరాయికి మాట్లాడుకున్న మహిళతో కలిసి అత్త రాడ్‌తో కొట్టి చంపారు. తెల్లారగానే, విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించినట్లు నటించి, మృతురాలి తల్లిదండ్రులకు ఆమె పిల్లల చేతే ఫోన్ చేయించింది. దర్యాప్తు సమయంలో అత్తను అదుపులోకి తీసుకుని విచారించడంతో పన్నాగమంతా పూసగుచ్చినట్లు ఆమె వివరించింది. దాంతో ఆమెతోపాటు సహకరించిన మహిళను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.




నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై శ్రీను

పది రోజుల ముందే హత్యకు ప్రణాళిక రచించి..

రెడ్డిగూడెం మండలం రాఘవాపురంలో కలకలం రేపిన వివాహిత మృతి కేసు వివరాలను బుధవారం రెడ్డిగూడెం ఎస్సై శ్రీనుతో కలిసి సీఐ దాడి చంద్రశేఖర్ వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. .రాఘవాపురానికి చెందిన సంగెపు నాగరాజుతో నాగులూరుకు చెందిన శ్రావణ సంధ్య(30)కు వివాహమవగా, వారికి ఒక పాప, బాబు ఉన్నారు. చాలాకాలంగా శ్రావణసంధ్య ప్రవర్తన పట్ల అత్త పద్మావతి, కుటుంబ సభ్యులు గొడవపడుతున్నారు. పెద్దలు పంచాయితీ చేశారు. ఈ నేపథ్యంలో నాగరాజు రెండు వారాల కిందట తండ్రికి వైద్యం నిమిత్తం గుంటూరు తీసుకెళ్లి అక్కడే ఆస్పత్రిలో ఉన్నారు. గత ఆదివారం శ్రావణ సంధ్య ఒక గదిలో ఒంటరిగా నిద్రిస్తుండగా, రెడ్డిగూడెంలో నివసిస్తున్న పొగర్త కోటమ్మతో కలిసి అత్త పద్మావతి అర్ధరాత్రి ఒంటి గంట దాటాక బెండింగ్ రాడ్‌తో దవడపై పలుమార్లు బాదారు. అప్పటికీ ఊపిరి పోలేదని నిర్ధారించుకుని, మెడ నులమడంతో శ్రావణ సంధ్య చనిపోయింది. హత్యకు ఉపయోగించిన రాడ్‌ను సమీపంలోని కోతులవాగులో పడేసి, ఇళ్లకు వెళ్లిపోయారు. మృతురాలి తండ్రి వీర వెంకయ్య ఫిర్యాదుతో సీపీ రాజశేఖరబాబు సూచనలతో ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆరు బృందాలు ఏర్పాటు చేసి, దర్యాప్తు చేయగా, అత్త హత్య చేసినట్లు ఒప్పుకుందని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పది రోజుల ముందు నుంచే హత్యకు ప్రణాళిక సిద్ధం చేసుకుని, అందుకు సహకరించినందుకు రూ.50 వేలు ఇచ్చేందుకు ఒప్పుకుని, తొలి విడతగా రూ.10 వేలు ఇచ్చినట్లు కోటమ్మ తెలిపినట్లు వెల్లడించారు. వారిద్దరినీ అరెస్ట్ చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని సీఐ వివరించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బేగ్

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ ఛైర్మన్‌గా విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తెదేపా రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్‌ను ప్రభుత్వం నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. బేగ్.. గత ఆరేళ్లుగా తెదేపా అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని పలువురు అభినందించారు.



తిరువూరు

• తిరువూరు • మైలవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

కొండపల్లి, న్యూస్‌టుడే: లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు సహాయ ఇంజినీర్ పవిత్రాకాశ్ తెలిపారు. శ్రీనివాస, శాలివాహననగర్, సాయి చంద్రనగర్, శివపుర్ల ఏరియా, చైతన్య, వడ్డెనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కరెంటు ఉండదన్నారు.

విస్సన్నపేటలో స్వచ్ఛ సంక్రాంతి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట సచివాలయం-2 పరిధిలో ఈవో కేశవకృష్ణ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమం బుధవారం జరిగింది. పొక్లెయిన్‌తో వీధుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలు, అల్లుకుపోయిన పొదలు, పోగుపడిన చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ట్రాక్టర్ల ద్వారా ఎత్తి డంపింగ్ యార్డుకు తరలించారు.

11న పూర్వ విద్యార్థుల సమావేశం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను కోట మార్కండేయ జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఈనెల 11న బడి ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 1961 నుంచి 2025 వరకు (65ఏళ్లు) బడిలో చదివిన పూర్వ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాలలో చదివిన 65 బ్యాచ్‌ల విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమం పూర్వ విద్యార్థులు విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ఎస్‌డీఈ దృష్టికి ఫోన్ల సమస్యలు

మైలవరం: బీఎస్ఎన్ఎల్ ఫోన్లకు సంబంధించి నియోజకవర్గంలో ఎదురవుతున్న సమస్యలను బుధవారం ఎస్‌డీఈ నందకిషోర్‌ను కలిసి వివరించినట్లు నియోజకవర్గ టెలికం సలహాసంఘం సభ్యుడు మేశపాం బాబూరావు తెలిపారు. సెల్‌టవర్లలో బ్యాటరీల ఆవశ్యకత, ఫెన్సింగ్ తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లానన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో బుధవారం గోదారంగనాథులకు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయాల్లో దేవతా మూర్తుల మూల విరాట్లను పుష్పాలతో అలంకరించారు.



గంపలగూడెం: పూజలు అందుకున్న దేవతామూర్తులు

పంట నమోదు తప్పనిసరి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు అందరూ తాము సాగు చేసిన పంటల వివరాలను ఈపంట నమోదు చేయించుకోవాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం రెడ్డిగూడెం, అన్నేరావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్లు వేసే రైతులు పైపైన నాటాలని సూచించారు. అలా నాటడం వల్ల వరి పిలకలు ఎక్కువగా వచ్చి ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. రుద్రవరం పీఏసీఎస్‌లో యూరియా 24.975 మెట్రిక్ టన్నులు, శ్రీరంపురం 7.965, కుదప గ్రామంలో కసుకుర్రు ఎరువుల దుకాణంలో 20.025, కూనపరాజుపర్వ పీఏసీఎస్‌లో 24.825, రెడ్డిగూడెం పీఏసీఎస్‌లో 24.975 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



రెడ్డిగూడెం: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

విస్సన్నపేట: కొండపర్వ గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శేఖర్ మాట్లాడుతూ రైతులు ఆ గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు చేయించుకోవాలని అన్నారు. ఉద్యానశాఖ అధికారి నరేంద్ర మామిడిలో సస్యరక్షణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్ టిప్పుసుల్తాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం పంపిణీ

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం లయన్స్‌క్లబ్, లెజెండ్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పోషకాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి.రావు మాట్లాడుతూ క్లబ్ వ్యవస్థాపకులు మెల్విన్ జోన్స్ జన్మదినం సందర్భంగా ఈనెల 1 నుంచి 13 వరకు విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దానిలో భాగంగా బాలికోన్నత పాఠశాల పిల్లలకు శనగలు, పెసలు, అలసందలు పంపిణీ చేశామని తెలిపారు.

ఔటర్‌పై ఆశలు..

భూసేకరణ ప్రకటనతో చర్చలు



ఔటర్ రింగు రోడ్డుతో అనుసంధానం కానున్న జాతీయ రహదారి

మైలవరం, న్యూస్‌టుడే

మైలవరం మీదుగా వెళ్లనున్న అమరావతి ఔటర్ రింగురోడ్డు కార్యరూపానికి దగ్గరవుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది కాలంగా ఈ ప్రాంతంలో స్థిరాస్తి లావాదేవీలు జరగక, స్తబ్దతగా ఉంటే.. తాజాగా ఔటర్‌కు భూసేకరణ ప్రకటన వెలువడటంతో చలనం వస్తోంది. దీనిపై జోరుగా చర్చలు సాగుతున్నాయి.

నాలుగు మండలాలతో పాటు విజయవాడ రూరల్ మండల పరిధిలోని 5 ప్రధాన గ్రామపంచాయతీలు మైలవరం నియోజకవర్గంలో ఉన్నాయి. గ్రామీణ, నగర వాతావరణం మిళితమవడంతోపాటు ఎన్నారైలకు కొదవ లేదు. మైలవరంలో స్థిరమైన వాణిజ్య కార్యకలాపాలు లేకున్నా..విజయవాడ నగరానికి అతి సమీపంలో ఉండడంతో పాటు రాజకీయంగానూ చైతన్యవంతంగా ఉండడంతో గుర్తింపు పొందింది.

నియోజకవర్గంలో ఔటర్ ఇలా..
మండలాలు: 2 గ్రామాలు: 7
సేకరించనున్న భూమి: 3093.54 ఎకరాలు
మొత్తం సర్వే నెంబర్లు: 595

7 గ్రామాల్లో సేకరణ

ప్రస్తుతం జిల్లాలో భూసేకరణకు ప్రకటన ఇవ్వగా, అందులో నియోజకవర్గంలోని జి.కొండూరు మండలంలో 5 గ్రామాలు, మైలవరం మండలంలో రెండు గ్రామాల్లో సేకరణ చేయనున్నారు. మిగతా అన్ని గ్రామాలు ఒకవైపే. జాతీయ రహదారి 30, మైలవరం మీదుగా వెళ్తుండడం పూర్తిగా కలిసి వస్తోంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఓఆర్ఆర్, జాతీయ రహదారిని కలుస్తుందని ప్రకటన వెలువడగా, ఆ ప్రాంతంలోనే అనుసంధానం కోసం భారీ సర్కిల్ ఏర్పాటు కానుంది. ఇరువైపుల ఇక్కడే సర్వీస్ రోడ్లకు ప్రతిపాదనలు ఉన్నట్లు చెబుతున్నారు. దాంతో పట్టణానికి ఆనుకుని ఔటర్ వెళ్తుండడంతో రవాణా వేగవంతంతో పాటు భూములు, స్థలాలకు డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. గత తెదేపా హయాంలోనూ మైలవరం నుంచి జి.కొండూరు మధ్య జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న భూములకు గరిష్ఠ ధర పలకగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే మరింత పెరిగిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భూసేకరణ ప్రకటన మరింత కలిసి వస్తుందని ఆశ పడుతున్నారు.

రవాణా రయ్..

విజయవాడ నగరానికి మైలవరం 42 కిలో మీటర్ల దూరంలో ఉన్నా.. రెండు జాతీయ రహదారులపై ప్రయాణం నగరానికి చేరుకోవడానికి చాలా తేలికగా ఉంది. దాంతో పాటు జి.కొండూరు మీదుగా ఖమ్మం నుంచి విజయవాడకు గ్రీన్‌ఫీల్డ్ హైవే రానుండటంతో రవాణా సౌకర్యం పెరిగింది. వీటన్నింటితో పాటు ఔటర్ రింగు రోడ్డు కూడా రానుండటంతో రవాణా మరింత వేగవంతం కానుంది.

పల్లె పండగ 2.0తో గ్రామాలకు మేలు



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే: పల్లె పండగ 2.0 తో నియోజకవర్గంలోని గ్రామాల ముఖ చిత్రం మారుతోందని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండలంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత వైకాపా పాలనలో సంక్షేమంపై మాత్రమే దృష్టి సారించడంతో అభివృద్ధి కుంటుపడిందని, ప్రస్తుతం కూటమి పాలనలో చంద్రబాబు హయాంలో సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాల్లా పరుగెత్తుతున్నాయన్నారు. 15 ఆర్థిక సంఘం నిధులు రూ.36 లక్షల చొప్పున రూ.1.08 కోట్లతో గంగినేనిపాలెం, జి.కొండూరు, కవులూరు గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధిహామీ నిధులు రూ.25 లక్షలతో గంగినేనిలో, జి.కొండూరులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తయిన మినీ గోకులం షెడ్డు ప్రారంభించారు. కందులపాడు గంగినేనిపాలెం ఎర్రపాలెం(కేజీవై) ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు నెలాఖరులోగా పూర్తి చేస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ బీటీ రోడ్ల అభివృద్ధికి రూ.12.20 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల తగ్గింపు ఘనత కూటమి ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న శావల దేవదత్, వేదికపై రాయల సుబ్బారావు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : దేశంలో విద్యుత్తు ఛార్జీల తగ్గించిన ఘనత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ శావల దేవదత్ అన్నారు. బుధవారం విస్సన్నపేట మండల తెదేపా కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయల సుబ్బారావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తన అయిదేళ్ల పాలనలో జగన్ తొమ్మిది సార్లు విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలపై రూ32,000 కోట్ల భారం మోపారన్నారు. టూడౌన్ ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గించిన ఘనత చంద్రబాబు, పవన్ కల్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, అనుమోలు శివబాజీ, తుమ్మలపల్లి అనిల్, కొంగల శ్రీనివాసరావు, కంభంపాటి బద్రీనాథ్, రాంబాబు, వడ్లమూడి శివరామకృష్ణ, నారాయణ, నందిగం నాగేశ్వరరావు, బాణావత్ అశోక్, మాధవరావు పాల్గొన్నారు.

వర్క్‌షాపు కార్మిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



నూతన కార్యవర్గ ప్రతినిధులను సత్కరించిన సిబ్బంది

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం) న్యూస్‌టుడే: గుంటుపల్లి వ్యాగన్ వర్క్‌షాపు కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, కార్మికుల పక్షాన ఎంప్లాయిస్ సంఘ్ రాజీలేని పోరాటాలు చేస్తుందని సంఘ్ గుంటుపల్లిశాఖ అధ్యక్షులు గూడవల్లి సుధాకర్ పేర్కొన్నారు. సంఘ్ వర్కుషాపు శాఖకు జరిగిన ఎన్నికల్లో ఆయన అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా కోంద్రు కిశోర్, పీబీ సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా పామర్తి శివ నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ సంఘ్ గుంటుపల్లి వ్యాగన్ వర్కుషాపు శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన అభినందన సభలో సుధాకర్ మాట్లాడుతూ తనకు బాధ్యతలు అప్పగించిన సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఆశయాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తానన్నారు. కార్యక్రమానికి ఎంప్లాయిస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ కార్యదర్శి సురేష్ అధ్యక్షత వహించారు. నూతనంగా ఎన్నికైన నాయకులను కార్మికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు దాసరి డేవిడ్‌రాజు, నాయకులు విమల్ సాయి, బోయాజ్, మద్దయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

రెడ్డిగూడెం: మద్దులపర్వ ఆదర్శపాఠశాలను బుధవారం ఎంఈవో పి.రమేష్‌బాబు తనిఖీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షలు పురస్కరించుకొని ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రణాళిక అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శైలజ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండో రోజు పోటీల్లో విశాఖపట్నం, కాకినాడ, ఇబ్రహీంపట్నం, విజయనగరం, తూర్పుగోదావరి జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి మ్యాచ్‌ల్లో విజేతలైన జట్లకు రెండో దశలో పోటీలు ఉంటాయని వెల్లడించారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

నందిగామ గ్రామీణం: చందాపురం గ్రామ సచివాలయంలో బుధవారం పట్టాదారు పాసుపుస్తకాలను తహసీల్దార్ ఎన్.సురేష్‌బాబు పంపిణీ చేశారు. గ్రామంలో 273 మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు.

రైతులకు యూరియా అందజేత

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు మండలం వావిలాల సొసైటీలో బుధవారం రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి పద్మ మాట్లాడుతూ వావిలాల సొసైటీ పరిధిలోని గ్రామాలైన వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, రాజుగూడెం గ్రామాలకు రోజుకొక్క గ్రామంలోని రైతులకు యూరియా అందజేస్తామని తెలిపారు. సొసైటీ వద్దకు ఉదయం నుంచి రైతులు పెద్ద సంఖ్యలో వచ్చారని, ప్రత్యేక కౌంటర్ల ద్వారా మహిళలు, పురుషులకు విడివిడిగా లైన్లు ఏర్పాట్లు చేసి యూరియా అందించామని పద్మ వెల్లడించారు.

10 నుంచి గ్రామీణ సంప్రదాయ క్రీడా సంబరాలు

విజయవాడ క్రీడలు: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో గ్రామీణ సంప్రదాయ క్రీడా సంబరాలు నిర్వహిస్తామని ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. మరుగున పడుతున్న సంప్రదాయ క్రీడలను పునరుద్ధరించాలనే లక్ష్యంతోనే పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తామని చెప్పారు. కర్ర సాము, గాలి పటాలు ఎగరవేయడం, టగ్ ఆఫ్ వార్, తొక్కుడు బిళ్ల, ఏడు పెంకులాట, స్కిప్పింగ్ వంటి సంప్రదాయ క్రీడలను రాష్ట్రంలోని అన్ని జిల్లా క్రీడాప్రాధికార సంస్థల పరిధిలో జిల్లా స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. అందుకు సుమారు రూ.5 లక్షలు డీఎస్ఏలకు పంపించామని చెప్పారు. పోటీలు పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

గురుకులంలో మెరుగైన వసతులు కల్పిస్తాం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కుంటముక్కలలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. ఏపీ గురుకులాల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్‌తో కలిసి ఆయన బుధవారం గురుకులంలోని సమస్యపై చర్చించారు. గురుకులంలో డార్మిటరీ, మరుగుదొడ్లు, అంతర్గత రహదారులు, ప్రహరీ నిర్మాణం రూ.4 కోట్లతో చేపట్టేందుకు సిద్ధమయ్యామని ఆయన తెలిపారు. ఇటీవల గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించిన సమయంలో పలు లోటుపాట్లు ఉన్నట్లు గమనించామని కార్యదర్శి ప్రసన్నవెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బ్యూలా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు పర్యావరణ హిత కార్యాచరణ



మొక్క నాటి ఎరువు వేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే: మొక్కను నాటి దానిని పూర్తిగా సంరక్షించడంతో ప్రతి విద్యార్థి ఒక జీవానికి ప్రాణం పోసినట్లేనని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ అన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన నెట్ జీరో రెసిడెన్షియల్ స్కూల్ పైలెట్ ప్రాజెక్టును ఆయన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌తో కలిసి బుధవారం కుంటముక్కల డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులంలో ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వనరుల వినియోగం, నీటివాడకం, మురుగునీటి ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో ఏర్పడిన కాలుష్యాన్ని నియంత్రించేందుకు, పర్యావరణ హితమైన సుస్థిర పరిష్కారం అందించేందుకు మొక్కలు నాటి వాటి పూర్తి సంరక్షణ విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు ఏడేళ్లు కొనసాగుతుందని, కర్బన ఉద్గారాలు తగ్గించడం, నేల ఆరోగ్యం, జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా మొదట కుంటముక్కల గురుకులాన్ని ఎంచుకోవడం శుభపరిణామమన్నారు. అనంతరం గురుకులం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రమకాంత, సంస్థ డైరెక్టర్ శరవణన్ సుబ్రమణియన్, ప్రిన్సిపల్ బ్యూలా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

న్యూస్‌టుడే బృందం: రాష్ట్ర వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ కేడీసీసీ బ్యాంకు బ్రాంచిల వద్ద ఉద్యోగులు చేపట్టిన దీక్షలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు.



విస్సన్నపేట: ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



ఇబ్రహీంపట్నంలో..



గంపలగూడెం సహకార బ్యాంక్ వద్ద..

11 నుంచి కబడ్డీ పోటీలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెంలో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11, 12, 13 తేదీల్లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చాట్ల అచ్చియ్య, పి.రమేష్, మల్లాది జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం ఈపోటీలకు సంబంధించిన పోస్టర్లను రెడ్డిగూడెం మండల తెదేపా అధ్యక్షుడు జె.వేణుగోపాల రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.సుబ్బారెడ్డిలు విడుదల చేశారు. ఈ టోర్నమెంట్ నాకౌట్ కం లీగ్ పద్ధతిలో జరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ.25,116 దాత ముప్పిడి నాగేశ్వరరెడ్డి, రెండో బహుమతి రూ.20,116 దాత బొమ్మిన కోటేశ్వరరావు, మూడో బహుమతి రూ.15,116 దాత పాలంకి మోహనమురళీరెడ్డి, నాలుగో బహుమతి రూ.10,116 దాత నూనె అప్పిరెడ్డి, అయిదో బహుమతి రూ.5,116 దాత జానలపాటి వేణుగోపాలరెడ్డిలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 10 తేదీలోగా ఎంట్రీలు పంపాలన్నారు. 9704267077, 9553669713, 9703562100 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎం.పోతురాజు, ఎ.కోటయ్య, పి.చంటి, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న వేణుగోపాలరెడ్డి తదితరులు

ప్రణాళికాబద్ధంగా.. ఫలితాల మెరుగుకు..

వంద రోజుల కార్యాచరణ అమలుతో విద్యార్థుల్లో ప్రగతి

గంపలగూడెం, న్యూస్‌టుడే



ప్రత్యేక తరగతుల్లో సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



వందరోజుల ప్రణాళికకు సరఫరా చేసిన పుస్తకాలు

ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత మెరుగు పరిచేందుకు అమలు చేస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా సాగుతోంది. నియోజకవర్గంలోని జడ్పీ ఉన్నత, ఆదర్శ, కేజీబీవీ, ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో గతేడాది డిసెంబరు 7న ప్రణాళికను ప్రారంభించగా మార్చి 14వ వరకు కొనసాగనుంది. పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు పుస్తకాలు సరఫరా చేశారు. విద్యాశాఖ అమలు చేసిన వంద రోజుల ప్రణాళికలో విద్యార్థులను రెండు విభాగాలుగా విభజించి రోజూ సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోజు వారీగా నిర్వహించే పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని గుర్తిస్తున్నారు. నెల రోజులుగా సబ్జెక్టుల వారీగా జరిగిన రోజు వారి పరీక్షల ద్వారా ఆయా పాఠశాలల్లో ఉత్తీర్ణతను అంచనా వేస్తున్నారు. 100 రోజుల ప్రణాళికలో మొదటి నెలలోనే ఫలితం అనూహ్యంగా ఉందని, ఉత్తీర్ణత అంచనా 90 నుంచి 100 శాతం వరకు పెరిగిందని ఉపాధ్యాయులు వెల్లడించారు.

అభ్యసన సామర్థ్యాలు అంచనా వేస్తూ..

గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లో 36 ఉన్నత పాఠశాలల్లో 1598 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. సదరు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకుని ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్, సీ, డీ గ్రేడ్ విద్యార్థులను రైజింగ్ స్టార్‌గా విభజించారు. రైజింగ్ స్టార్ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్పెషల్ స్టడీ అవర్, సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య స్లిప్ టెస్ట్ రోజూ నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పురోగతిని ఉపాధ్యాయులు గుర్తించి ఏమైనా లోపాలు ఉంటే సవరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. నెలలోనే సీ, డీ గ్రేడ్ విద్యార్థులు 40 శాతం మంది వరకు ఏ, బీ గ్రేడ్‌లో చేరారన్నారు. ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి సంవత్సరాంత పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళిక ఉపయుక్తంగా ఉందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

సత్ఫలితాలు వస్తున్నాయి - ఎ.శ్యామ్‌సుందరరావు, గంపలగూడెం, తిరువూరు ఎంఈవో

పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక సత్ఫలితాలను అందిస్తోంది. తొలి నెలలోనే రైజింగ్ స్టార్‌లో ఉన్న విద్యార్థులు ప్రత్యేక తరగతులు, సబ్జెక్టుల వారీగా రోజూ పరీక్షతో అభ్యసనలో పురోగతి సాధించి షైనింగ్ స్టార్‌లో చేరారు.

అనుసంధాన రహదారి వెడల్పు పెంచండి

కొండపల్లి: జాతీయ రహదారి(30)పై ఎర్ర వంతెన నుంచి కొండపల్లికి అనుసంధానంగా వేస్తున్న రహదారి వెడల్పు పెంచాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. కొండపల్లి ఎర్ర వంతెన వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్న అధికారులు, గుత్తేదారు సిబ్బందితో ఆయన మాట్లాడారు. వంతెనకు అనుసంధానంగా వేస్తున్న రహదారి చిన్నదిగా ఉందన్నారు. దీన్ని వెడల్పు పెంచి నిర్మించాలన్నారు. అలా చేయకపోతే జాతీయ రహదారి మీదుగా వచ్చిన వాహనాలు కొండపల్లిలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతాయన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘం ఛైర్మన్ చిట్టిబాబు, జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు, సురేష్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

తిరువూరు, న్యూస్‌టుడే: కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో కె.మాధురి పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఆమె అధికారుల సమావేశంలో మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహించినా, నిర్వహణకు సహకరించినా, వాటిల్లో పాల్గొనే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎంపీని కలిసిన తిరువూరు నేతలు

పటమట, న్యూస్‌టుడే: తిరువూరు నియోజకవర్గ తెదేపా నేతలు, శ్రీవెంకటేశ్వర స్వామి, శ్రీరామ లింగేశ్వరస్వామి దేవస్థానాల కమిటీ సభ్యులు, తిరువూరు బ్రాహ్మణ పరిషత్ సభ్యులు బుధవారం ఎంపీ శివనాథ్‌ను విజయవాడ గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ నాయకుడు కందిమళ్ల శేషగిరిరావు రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి గ్రామం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. పోలీసుల తెలిపిన సమాచారం మేరకు విజయవాడ ఇస్లాంపేటకు చెందిన మన్సూర్ బేగ్(45) ద్విచక్రవాహనంపై విజయవాడ వస్తుండగా లారీ వెనుక నుంచి ఢీకొంది. దీంతో అదుపు తప్పి కిందపడడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలి వద్ద రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. రెడ్డిగూడెం మండలం రుద్రవరానికి చెందిన శేషారత్నం, బంధువులతో కలిసి మైలవరం వచ్చారు. పంచాయతీ కార్యాలయం వద్ద వెల్వడానికి చెందిన ఒక యువకుడు బైకును వేగంగా నడిపి ఢీకొట్టడంతో ఆమె కాలు విరిగి తీవ్ర గాయమైంది. క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో తొలుత స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి విజయవాడకు తరలించారు.

సీమపై వైకాపా బురద రాజకీయం

- ఇప్పుడు సీమలో జలాశయాలు, చెరువులు కళకళలాడుతున్నాయి
- తెలుగు ప్రజలు ఇచ్చిపుచ్చుకోవాలి
- గోదావరి వరద జలాలు మీరూ వాడుకోండి, మేమూ వాడుకుంటాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

పోలవరం నుంచి ఈనాడు ప్రతినిధి


ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు రామానాయుడు, మనోహర్, ఎంపీ మహేశ్‌కుమార్, మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే బాలరాజు, జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు

రాష్ట్రంలో వైకాపా బురద రాజకీయాలు చేస్తోందని, ఆ బురదలో వాళ్లే కూరుకుపోవడం తప్ప తనకు జరిగే నష్టం ఏమీ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాయలసీమ ఎత్తిపోతలపై వందసార్లు అబద్ధాలు చెబితే నిజమైపోతాయా? ఏమిటీ బురద రాజకీయం అని నిలదీశారు. రాయలసీమ జలాశయాలు, చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయని, అదీ తాము చేసిందని చెప్పారు. చిల్లర రాజకీయాలు చేయొద్దని వైకాపా నాయకులకు హెచ్చరించారు. మరోవైపు తెలుగు జాతి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవాలని, వివాదాలు సృష్టించి ఆనందపడకూడదన్నారు. గోదావరి నీళ్లు తెలంగాణ ఎన్ని వాడుకున్నా అభ్యంతరం లేదని, సముద్రంలో కలిసే వరద జలాలను రాయలసీమకు తరలిస్తే తప్పు ఏమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు వద్ద సమీక్ష అనంతరం ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోకూడదు..

'తెలుగుజాతి ఒకటే.. ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకోవాలి. ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోకూడదు. తెలుగు జాతి కోసం నేను పని చేశాను. నిన్న, మొన్న ఈ రాజకీయాలు నాకే అర్థం కాలేదు. ఏమిటీ రాజకీయం? దేవాదుల ప్రాజెక్టు దాటితే పోలవరానికి నీళ్లు వస్తాయి. గోదావరి నుంచి తెలంగాణ నీళ్లు తీసుకుంటుంటే నేను అభ్యంతరం చెప్పడం లేదు. అలాంటిది కింద సముద్రంలోకి వెళ్లిపోయే నీటిని నేను పొదుపు చేస్తూ రాయలసీమకు ఇస్తానంటే ఏమిటి మీకు అభ్యంతరం? పైన గోదావరి నీళ్లు మీరు మంజీరాకు తీసుకువెళ్లారు. తప్పులేదు. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. తీసుకోండి. సముద్రంలోకి వెళ్లే నీటిని పొదుపు చేస్తూ కరవు ప్రాంతానికి వాడుకుంటే రాయలసీమ కూడా బాగుపడుతుంది. అవసరమైతే, అన్నీ కలిసొస్తే తెలంగాణకూ నీళ్లు ఇవ్వవచ్చు. నాగార్జునసాగర్, శ్రీశైలంలో నీళ్లు నిలబెడితే తెలంగాణకు కూడా ఇవ్వవచ్చు. అలాంటిది ఏమిటీ రాజకీయం? తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి.

పదేపదే అబద్ధాలు చెబితే నిజమవుతాయా?

'రాయలసీమ ఎత్తిపోతల గురించి ఏమిటీ వైకాపా రాజకీయం? ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమైపోతుందని మాట్లాడుతున్నారా? 2020 మేలో రూ.3,825 కోట్లతో రాయలసీమ ఎత్తిపోతలకు పరిపాలనా అనుమతి ఇచ్చారు. పర్యావరణ అనుమతి లేకుండానే ఈ పథకం చేపడుతున్నారని తెలంగాణకు చెందిన వ్యక్తి హరిత ట్రైబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ట్రైబ్యునల్ నిపుణుల కమిటీని నియమించి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పనులు ఆపేసింది. 2020 జులై 13న హరిత ట్రైబ్యునల్ అంతిమ ఆదేశాలతో ప్రాజెక్టు సర్వేలు ఇచ్చింది. డీపీఆర్ తయారు చేసేందుకు అవసరమైన పనులకు మాత్రమే అనుమతి ఇచ్చింది. భూమిపై ఎలాంటి పనులూ చేయకూడదని ఆదేశాలు ఇచ్చింది. తిరిగి అక్టోబరులో పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని తేల్చి చెప్పింది. ఎలాంటి పనులు చేయవద్దని ఆదేశించింది. 2023లో డీపీఆర్ లేకుండా పనులు చేశారంటూ రూ.2.50 కోట్లు జరిమానా విధించింది. నిజాలు ఇలా ఉంటే చిల్లర రాజకీయాలు చేయడం ఏమిటి? గుత్తేదారుకు రూ.900 కోట్లు ఇచ్చేశారు. అనుమతుల్లేని మరో రెండు ప్రాజెక్టులకు రూ.2,000 కోట్లపైనా ఖర్చుచేశారు. వాటికి ఎన్‌జీటీ రూ.100 కోట్లు జరిమానా విధించింది. అందులో రూ.25 కోట్లు ప్రభుత్వ సొమ్ము చెల్లించారు. వీళ్ల విధ్వంసకతనం ఏమిటి? రాయలసీమ ఎత్తిపోతలతో 34 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసుకునేందుకు ఉంది. అందులో మనకు వచ్చే వాటా 22 టీఎంసీలే. ఇప్పటికే ముచ్చుమర్రి ఉందిక్కడ. దాంతో నీళ్లు తీసుకోవచ్చు. రాయలసీమ ఎత్తిపోతలతో ఏదో చేసేయ్యొచ్చు అని వీళ్లు (వైకాపా) చెబుతారు.

బురద రాజకీయం చేస్తే మీరే కూరుకుపోతారు

వైకాపా నాయకులు చేసిన పనులపై విచారణ తప్పదు. వారు కుప్పకూల్చిన వ్యవస్థలను ట్రాక్‌లో పెడుతోంటే బురద చల్లుతున్నారు. ఏమిటీ వైకాపా రాజకీయం? బురద చల్లే రాజకీయం తప్ప మరేమిటి? 20 టీఎంసీలతో ఏమైపోతుంది? రాయలసీమలో ఒక్క రిజర్వాయర్‌లో ఉన్నాయి 20 టీఎంసీల నీళ్లు. ఇప్పుడూ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు. హంద్రీనీవా కాలువలు వెడల్పు చేసి అటు కుప్పం, ఇటు మడకశిరకు నీళ్లు తీసుకువెళ్లాం. అన్ని చెరువులకూ నీళ్లు ఇచ్చాం. ఇలా చేయాలి కానీ, బురద చల్లుతున్నారు. చాలామంది నాపై బురద చల్లేందుకు ప్రయత్నించారు. ఆ బురదలో వాళ్లే కూరుకుపోయారు తప్ప ఏం జరగలేదు' అని అన్నారు.


ఏపీ జలాశయాలన్నీ ఇప్పుడు కళకళ

'రాయలసీమలో ప్రతి రిజర్వాయర్ పూర్తి చేశాం. అన్ని జలాశయాల్లో నీళ్లు నిలబెట్టాం. ఎప్పుడూ నీళ్లు రాని బ్రహ్మసాగర్‌లో 17, 18 టీఎంసీల నీళ్లు నిలబెట్టాం. ఇప్పుడు రాయలసీమ జలాశయాలు, చెరువుల్లో 366 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. రాష్ట్రంలోని జలాశయాలన్నీ 94% నీళ్లతో కళకళలాడుతున్నాయి. నా జన్మ సార్థకమైంది. ఖరీఫ్ తర్వాత కూడా రాష్ట్రంలో 780 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. పట్టిసీమ ఎత్తిపోతల నిర్మిస్తే ఎన్నో అడ్డంకులు సృష్టించారు. ఆ పట్టిసీమ వల్లే ఈ రోజు రాయలసీమ హార్టికల్చర్ హబ్ అయింది. పట్టిసీమ, గొల్లపల్లి రిజర్వాయర్ల వల్ల రాయలసీమలో పెనుమార్పులు వచ్చాయి. 2014-19లో నీటిపారుదల ప్రాజెక్టులకు రూ.65,000 కోట్లు ఖర్చు చేశాం.వైకాపా సర్కార్ రూ.12,000 కోట్లే ఖర్చు చేసింది. రాయలసీమకే మేం రూ.12,000 కోట్ల వరకు ఖర్చు చేశాం. అలాంటిది వైకాపా ప్రభుత్వంలో సీమకు రూ.2,000 కోట్లే ఖర్చు చేశారు' అని సీఎం తెలిపారు.

జాగ్రఫీ తెలియదు రాజకీయం చేస్తారా?

'నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం నేనే ప్రారంభించా. నేనే పూర్తి చేశా. జీవితంలో నాకు ఇదో సంతృప్తి. కాటన్ కట్టిన ప్రాజెక్టులు వదిలిపెడితే చాగల్నాడు, పుష్కర, పురుషోత్తపట్నం, తాడిపూడి, మద్దువలస, తోటపల్లి, తారకరామ, సూరంపాలెం ఇలా అన్ని ప్రాజెక్టులు నేను నిర్మించినవే. ... ఇలా అన్నీ నేను కట్టినవే. గండికోట ఎన్టీఆర్ కట్టారు. అక్కడ భూసేకరణ నేను పూర్తి చేశా. 90% ప్రాజెక్టులు తెలుగుదేశం కట్టినవే. బచావత్ అవార్డు ప్రకారం మిగులు జలాలు వాడుకునే హక్కు ఆంధ్రప్రదేశ్‌కు ఉందని తొలిసారి చెప్పింది ఎన్టీఆర్. ఆయనే తెలుగు గంగ ప్రారంభించారు. ఎస్ఆర్‌బీసీ, ఎస్ఎల్‌బీసీ, గాలేరు నగరి, హంద్రీనీవా.. ఇలా అన్నీ ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైనవే. ఇప్పుడు ఈ నాయకులకు ఈ ప్రాజెక్టుల అర్థం కావు. జాగ్రఫీ తెలియని రాజకీయం చేయాలనుకుంటున్నారా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు.

మండప శోభతో పోలవరం నమూనా


పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేను సుందరీకరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న నమూనాలు పరిశీలిస్తున్నారు. బుధవారం ఇక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో జరిగిన సమీక్ష సమావేశంలో పరిశీలనకు వచ్చిన వాటిల్లో ఈ నమూనా ఒకటి. ఈ ఆలోచన కార్యరూపం దాలిస్తే రాత్రి వేళ విద్యుత్ వెలుగుల్లో స్పిల్ వే ఇలా కాంతులీననుంది. – ఈనాడు, పోలవరం

ఏపీ స్ఫూర్తితో మారిషస్ దేశాభివృద్ధి

ఆ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్


శ్రీవారి ఆలయం ఎదుట మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ దంపతులతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూనే ఆధునిక సాంకేతిక హబ్‌గా మారుతున్న ఆంధ్రప్రదేశ్‌ను స్ఫూర్తిగా తీసుకొని మారిషస్ దేశాన్ని అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ తెలిపారు. బుధవారం ఉదయం తిరుమల ధర్మగిరిలోని వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించి, మాట్లాడారు. అధ్యాపక వృత్తి నుంచి వచ్చి అధ్యక్షుడిగా ఎన్నికయ్యానని, ఆధునిక సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. మారిషస్‌లో నిర్మిస్తున్న హరిహర దేవస్థానంలో తితిదే సలహాలు, సూచనలతో వేద పాఠశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అంతకుముందు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముందుగా శ్రీభూవరాహ స్వామిని దర్శించుకొన్న ఆయనకు శ్రీవారి ఆలయం వద్ద దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తదితరులు స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించిన ధరమ్ బీర్ గోకుల్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే ఈవో శేషవస్త్రంతో సత్కరించారు. తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, సీవీఎస్‌వో మురళీకృష్ణ ఇతర అధికారులు ఆయన వెంట ఉన్నారు.

ప్రభుత్వ ప్రకటనల్లో మంత్రుల ఫొటోలను అడ్డుకోవాలని పిల్

- జోక్యానికి నిరాకరించిన హైకోర్టు
- 'సుప్రీం' ఆదేశాలను ఉల్లంఘిస్తే అక్కడికే వెళ్లాలని స్పష్టీకరణ



ఈనాడు, అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా అధికారపార్టీ నేతలు, మంత్రుల ఫొటోలతో ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడాన్ని అడ్డుకోవాలనే అభ్యర్థనతో దాఖలైన పిల్‌లో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వారిని శిక్షించే పరిధి హైకోర్టుకు ఉండదని స్పష్టం చేసింది. దీనిపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాలని పిటిషనర్‌కు చెబుతూ పిల్‌ను కొట్టేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ అధికారపార్టీ నేతలు, మంత్రుల ఫొటోలతో ప్రభుత్వం ప్రకటనలిస్తోందని విజయవాడకు చెందిన రైల్వే విశ్రాంత ఉద్యోగి కొండలరావు హైకోర్టులో పిల్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. 'సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్రపతి, ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రులు, సంబంధితశాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి ఫొటోలనే ప్రభుత్వ ప్రకటనల్లో వినియోగించాలి. ఏపీలో వివిధ మంత్రుల ఫొటోలను వినియోగిస్తున్నారు. రెండు రోజులకోసారి పత్రికల్లో భారీ ప్రకటనలు వస్తున్నాయి. ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించడమే. బాధ్యులను శిక్షించే అధికారం హైకోర్టుకు ఉంది' అన్నారు. ఈ వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సూచించింది.

పీపీపీ విధానంపై ఎన్ని పిల్స్ వేస్తారు?

- గతంలో పిల్ వేసిందీ వైకాపా కార్యకర్తే
- ఈ విషయాన్ని కచ్చితంగా చెప్పగలమన్న హైకోర్టు

ఈనాడు, అమరావతి: పది వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నిర్వహణను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపట్టడాన్ని సవాలు చేస్తూ ఎన్ని పిటిషన్లు వేస్తారని వైకాపా ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై గతంలో పిల్ దాఖలుచేసింది వైకాపా కార్యకర్తేనని, ఈ విషయాన్ని తాము కచ్చితంగా చెప్పగలమని వ్యాఖ్యానించింది. పీపీపీపై ఇప్పటికే హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉండగా కొత్తగా మరో పిల్ ఎందుకని ప్రశ్నించింది. రెండు నెలలకోసారి కొత్త పిల్ వేస్తూ పోతే కౌంటర్ దాఖలుకు తాము ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని, దీంతో విచారణలో మరింత జాప్యం జరుగుతుందని పేర్కొంది. కేసు త్వరగా పరిష్కారం కాకుండా మీరే నాశనం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించింది. ఇప్పటికే దాఖలైన పిల్‌లో ప్రతివాదిగా చేరి వాదనలు వినిపించాలని సూచించింది. అప్పిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ.. పాత, కొత్త పిల్స్‌లో లేవనెత్తిన అంశాలు వేరని తెలిపారు. ప్రస్తుత పిల్‌ను గతంలో దాఖలైనదాంతో జతచేయాలని ప్రాధేయపడ్డారు. దీంతో ఈ రెండింటినీ జతచేయాలని ధర్మాసనం రిజిస్ట్రీని ఆదేశించింది. పిల్‌లో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

మదనపల్లెకు మార్చడంపై స్టే ఇవ్వలేం

అన్నమయ్య జిల్లా కేంద్రం వ్యవహారంలో హైకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చే ప్రక్రియపై స్టే ఇవ్వలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోవద్దని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిందని గుర్తుచేసింది. జిల్లా కేంద్రాన్ని మదనపల్లెకు మార్చే విషయంలో చట్ట నిబంధనలను పాటించామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి విన్నవించడంతో.. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. అన్నమయ్య జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది బి. వెంకట నారాయణరెడ్డి హైకోర్టులో పిల్ వేశారు.

పరువు నష్టం కేసులో పూర్తయిన విచారణ

మంత్రి లోకేశ్‌ను ప్రశ్నించిన న్యాయవాదులు

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: సాక్షి పత్రికపై పరువు నష్టం కేసులో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ విచారణ పూర్తయింది. అసత్య కథనాలు రాసి తన పరువుకు భంగం కలిగించారని 2020లో ఆయన సాక్షిపై కేసు వేసిన విషయం తెలిసిందే. విచారణ నిమిత్తం లోకేశ్ బుధవారం విశాఖలోని 12వ అదనపు జిల్లా న్యాయస్థానానికి హాజరయ్యారు. సాక్షి పత్రిక, జగతి పబ్లికేషన్స్, రిపోర్టర్ తరఫున న్యాయవాదులు మహ్మద్ హబీబుల్లా, ఎన్.ఎస్.వి.రెడ్డి, ఉషారాణి వేర్వేరుగా సుమారు 3 గంటల పాటు లోకేశ్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. దీంతో ఆయన విచారణ పూర్తయింది. కేసు ఈనెల 21కి వాయిదా పడింది. లోకేశ్ తరఫున న్యాయవాదులు ఎస్.వి.రమణ, కె.పార్థసారథి, శోభన్‌బాబు, వి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకున్నా వైకాపా వాళ్లకు కడుపు మంటే

విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: పేద విద్యార్థులు ఉన్నత విద్య చదువుకొని.. విదేశాల్లో స్థిరపడ్డా వైకాపా వాళ్లకు కడుపు మంటేనని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ మండిపడ్డారు. గత తెదేపా ప్రభుత్వంలో 2014-19 మధ్య అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ఎందరో పేద విద్యార్థులు లబ్ధి పొందారని, వారిలో కొరివి రత్నలత కూడా ఒకరని చెప్పారు. తాను అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా ఆస్ట్రేలియాలో చదువుకొన్నట్టు.. ప్రస్తుతం అక్కడే ఉన్నట్టు రత్నలత వివరించిన వీడియోను లోకేశ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆమెపై సామాజిక మాధ్యమాల్లో వైకాపా వాళ్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లలో ఏపీ విద్యార్థుల ప్రతిభ

ఈనాడు, అమరావతి: రిలయన్స్ ఫౌండేషన్ 2025-26 విద్యాసంవత్సరానికి ప్రకటించిన అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్‌లలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటారు. దేశవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఏపీ నుంచి మొత్తం 1,345 మంది ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌లకు ఎంపికయ్యారు. అత్యంత పోటీతో కూడిన జాతీయస్థాయి ఎంపిక ప్రక్రియలో ఈ ఫలితాలు తెలుగు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 5,100 మందిలో 5 వేల మంది యూజీ, 100 మంది పీజీ విద్యార్థులున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత విద్యను అందించడమే ఈ స్కాలర్‌షిప్‌ల ముఖ్యోద్దేశం. ప్రతిభ, ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఎంపిక చేసిన వారిలో 83% మంది కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షల లోపే ఉంది. ఇందులో బాలికలు, దివ్యాంగ విద్యార్థులకు సైతం తగిన ప్రాధాన్యం లభించింది. ఎంపిక చేసిన యూజీ విద్యార్థులకు రూ.2 లక్షలు, పీజీ విద్యార్థులకు రూ.6 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. దీంతోపాటు విద్యార్థులను భవిష్యత్తు నాయకులుగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగదు

- రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ స్పష్టీకరణ

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే: విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఎట్టి పరిస్థితిలోనూ జరగదని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. సాక్షి పత్రికపై వేసిన పరువు నష్టం కేసుకు సంబంధించి బుధవారం ఆయన విశాఖ జిల్లా కోర్టుకు హాజరయ్యారు. విచారణ ముగిసిన తర్వాత కోర్టు బయట మీడియాతో మాట్లాడారు. "విశాఖ ఉక్కు భూముల విషయంలో జరుగుతున్న అసత్యప్రచారాన్ని నమ్మొద్దు. విశాఖ ఎకనమిక్ రీజియన్ కోసం ఉక్కు భూములు తీసుకుంటున్నారన్నది ఆరోపణ మాత్రమే. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. సీపీఎం నాయకులకు స్క్రిప్ట్ ఎక్కడి నుంచి వచ్చిందో వారే చెప్పాలి. ఉక్కు పరిరక్షణకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు.


విశాఖ జిల్లా కోర్టు వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, చిత్రంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గణబాబు, ఇతర నాయకులు

2019లో తెదేపా ఓడిపోయినప్పుడు సాక్షి పత్రిక ఓ అసత్య కథనం ప్రచురించింది. దానిపై న్యాయపోరాటం చేస్తున్నా. ఈ రోజుతో క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఈ కేసులో తప్పక విజయం సాధిస్తా. ఎర్రబస్సు రాని ప్రాంతానికి ఎయిర్‌పోర్ట్ ఎందుకంటూ గతంలో జగన్ ఎద్దేవా చేశారు. జీఎంఆర్‌కు కేటాయించిన భూముల్లో కొన్నింటిని వైకాపా పాలనలో వెనక్కి తీసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా భూముల్ని తిరిగి ఇవ్వడంతో పనులు పూర్తయ్యాయి. రాజకీయ లబ్ధి కోసమే కొంతమంది జలవివాదం చేస్తున్నారు. విశాఖపట్నానికి రూ.వేల కోట్ల పెట్టుబడులు వస్తుండడంతో ఆర్థిక రాజధానిగా ఎదుగుతోంది. అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధానిని తరలించలేకపోయింది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధిపై కూటమి దృష్టిసారించింది" అని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రి భీమిలి వెళ్లి ఇటీవల మృతిచెందిన తెదేపా నేత గాడు అప్పలనాయుడు కుటుంబసభ్యులను పరామర్శించారు.

★ మంత్రి వెంట తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, గణబాబు, రామకృష్ణబాబు, కార్పొరేషన్ ఛైర్మన్లు సీతంరాజు సుధాకర్, గండి బాబ్జీ, పీవీజీ కుమార్, విశాఖ లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పట్టాభిరామ్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు ఉన్నారు.

ప్రఖ్యాత ప్లాస్టిక్ సర్జన్.. డీఎల్ఎన్ ప్రసాద్ కన్నుమూత

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్యరంగానికి విశేష సేవలు
- బోన్సాయ్ మొక్కల పెంపకంలోనూ ప్రత్యేక గుర్తింపు

ఈనాడు, అమరావతి, హైదరాబాద్ – న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట), ఫిలింనగర్: దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాత ప్లాస్టిక్ శస్త్రచికిత్స నిపుణులుగా పేరొందిన డాక్టర్ దొడ్డపనేని లక్ష్మీ నారాయణ ప్రసాద్(96) బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. డీఎల్ఎన్ ప్రసాద్‌గా సుపరిచితులైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో విశేష వైద్యసేవలు అందించారు. శుక్రవారం ఉదయం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. డీఎల్ఎన్ ప్రసాద్ 1930 డిసెంబరు 8న గుంటూరు జిల్లా తెనాలిలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. చెన్నైలోని అడ్యార్ బెసంట్ థియోసాఫికల్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తిచేశారు. జీవశాస్త్రంపై ఆసక్తి ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితుల దృష్ట్యా 1952లో చెన్నైలోని పాచయ్యప్పాస్ కాలేజీలో బీఏ(గణితశాస్త్రం)లో చేరారు. కుటుంబసభ్యులను ఒప్పించి రామకృష్ణ మిషన్ వివేకానంద కళాశాలలో 1955లో బీఎస్సీ బయాలజీ పూర్తిచేశారు. అదే ఏడాది మాజీమంత్రి ఆలపాటి వెంకట్రామయ్య కుమార్తె ఇందిరను వివాహమాడారు. అనంతరం విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎం.ఎస్.జనరల్ సర్జరీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో చేరి, 1969 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. తర్వాత దిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఎంసీహెచ్ ప్లాస్టిక్ సర్జరీలో చేరి డాక్టర్ జె.ఎల్.గుప్తా పర్యవేక్షణలో పనిచేశారు.


డీఎల్ఎన్ ప్రసాద్

ఉమ్మడి రాష్ట్రంలో తొలి ప్లాస్టిక్ సర్జరీ విభాగం

తర్వాత కొంతకాలానికి హైదరాబాద్‌కు వచ్చిన ప్రసాద్... ఉస్మానియా మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఎన్నో సంక్లిష్టతలను అధిగమించి 1972కల్లా ఆ విభాగానికి ఒకరూపు తీసుకొచ్చారు. గుంటూరు, కర్నూలు మెడికల్ కళాశాలలు, ఆసుపత్రుల్లో ప్లాస్టిక్ సర్జరీ విభాగాలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. గ్రహణం మొర్రి, చీలిన అంగిలి, కాలిన గాయాలకు అరుదైన ప్లాస్టిక్ సర్జరీలు నిర్వహించారు. పేద రోగులకు కొత్త జీవితాలను ప్రసాదించారు. మరో వైద్యుడు రాఘవరెడ్డితో కలిసి ఉస్మానియాలో ప్లాస్టిక్ సర్జరీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు ప్రారంభించడానికి కృషిచేశారు. ఫలితంగా 1986లో ఎంసీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చింది. 1993లో ఉస్మానియాలో ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు.

★ డీఎల్ఎన్ ప్రసాద్ సతీమణి ఇందిర తెనాలి ఎమ్మెల్యేగా, గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గానూ పనిచేశారు. ఆమె ఇప్పటికే కాలం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. గైనకాలజిస్ట్ అయిన పెద్ద కుమార్తె గోగినేని ఉమ.. గతంలో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. చిన్న కుమార్తె ఆలపాటి ఉష హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

బోన్సాయ్‌లంటే ఇష్టం



వైద్యసేవతో పాటు ఆరోగ్యకర హాబీలు ఉండాలనేది ప్రసాద్ సిద్ధాంతం. అందుకే బోన్సాయ్ మొక్కల పెంపకంపై ఆసక్తి పెంచుకున్నారు. హైదరాబాద్‌లో బోన్సాయ్ పెంపకాన్ని ప్రారంభించిన మొదటి వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆయన వద్ద సుమారు 200లకు పైగా బోన్సాయ్ మొక్కలున్నాయి. రామోజీ ఫిల్మ్‌సిటీలో బోన్సాయ్ గార్డెన్ అభివృద్ధికి కృషిచేశారు. రామోజీ గ్రూపు సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావుతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది.

ఎన్టీఆర్‌కు శస్త్రచికిత్స చేసి..

ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆయనపై ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేశాడు. దీంతో ఆయన చేతివేలు చీరుకుపోయి గాయమైంది. ఆ వేలుకు ప్రసాద్ ప్లాస్టిక్ సర్జరీ చేశారు. సతీమణి ఇందిర చనిపోయాక ప్రత్యక్ష రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఉద్యోగానికి రాజీనామా చేయగా.. మీ వైద్య సేవలు ప్రజలకు ఎంతో అవసరమని ఎన్టీఆర్, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆయనను వారించారు.

చిరుద్యోగిని ఫోర్జరీ దందా రూ.3 కోట్లు!

- ప్రజాప్రతినిధి అండతో ఇష్టారాజ్యం
- ఫోర్జరీ సంతకాలతో యథేచ్ఛగా భవన నిర్మాణ అనుమతులు
- రైల్వేకోడూరు నియోజకవర్గంలో వెలుగుచూసిన ఘటన

ఈనాడు, డిజిటల్, తిరుపతి; రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఓ ప్రజాప్రతినిధితో సన్నిహిత సంబంధమే పెట్టుబడిగా ఓ పంచాయతీ ఉద్యోగిని అవినీతికి తెరలేపారు. పంచాయతీ కార్యాలయంలో అన్నీతానై.. ఫోర్జరీ సంతకాలతో భవన నిర్మాణాల అనుమతులు జారీ చేసి ఏకంగా రూ.3 కోట్ల ప్రజాధనాన్ని వెనకేసుకున్నారు. ఈ ఘటన తిరుపతి జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలో కలకలం రేపుతోంది. నియోజకవర్గంలోని కీలక పంచాయతీలో చిరుద్యోగిని ఆమె. గతంలో అక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి పేరుతో స్టాంపులు తయారు చేయించి, ఆయన సంతకాలు ఫోర్జరీ చేయడం మొదలుపెట్టారు. నిబంధనల ప్రకారం పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారుల పరిశీలన తర్వాతే భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలి. కానీ, ఆమె ఆ దస్త్రాలేవీ అధికారుల దాకా వెళ్లనివ్వలేదు. తన వద్ద ఉన్న నకిలీ స్టాంపులతో అప్రూవల్స్ ఇచ్చేశారు. ఇలా సుమారు రూ.3 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఫోర్జరీ సంతకాలతో అనధికారిక లేఔట్లకు పచ్చజెండా ఊపి, అదనపు అంతస్తులకూ యథేచ్ఛగా అనుమతులు ఇచ్చి భారీగా వసూళ్లు చేసినట్లు తెలిసింది. ఇందులో పలువురికి వాటాలున్నట్లు సమాచారం.

ఇటు ఖజానాకు చిల్లులు

ఈ భారీ అవినీతి వెనుక ఓ ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. సదరు ఉద్యోగినిని ఓ చోటా నేత ప్రజాప్రతినిధికి పరిచయం చేశారు. ఆ తర్వాత వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఆ ప్రజాప్రతినిధి 'నన్ను పెళ్లి చేసుకుంటారు' అంటూ ఆమె ప్రచారం చేసుకుంటూ, ఆ అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరించే వారని తెలిసింది. ఓ దశలో వీరిద్దరు సన్నిహితంగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీంతో నాలుగు నెలల కిందట సదరు ప్రజాప్రతినిధిని సొంత పార్టీ నాయకులు మందలించినట్లు తెలిసింది. ఇంత జరిగినా ప్రజాప్రతినిధిపైగానీ, సదరు ఉద్యోగినిపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ప్రియురాలితో పెళ్లికి యాక్సిడెంట్ ప్లాన్..

పథనంతిట్ట: ప్రియురాలిని పెళ్లి చేసుకునేందుకు ఓ యువకుడు వేసిన పథకం బెడిసికొట్టి పోలీసులకు చిక్కిన ఘటన కేరళలో చోటుచేసుకుంది. పథనంతిట్టకు చెందిన రంజిత్ రాజన్ ఓ యువతిని ప్రేమించాడు. ఆమె కుటుంబానికి తనపై మంచి అభిప్రాయం ఏర్పడేందుకు ఓ ప్రణాళిక వేశాడు. ప్రియురాలిని కారుతో ఢీకొట్టించి.. తనే కాపాడినట్లుగా చేసి, ఆమె కుటుంబ సభ్యులతో హీరో అనిపించుకోవాలనుకున్నాడు. స్నేహితుడు ఎజెన్‌తో కలిసి ప్రణాళికను అమలు చేశాడు. గతేడాది డిసెంబరు 23న రంజిత్ ప్రియురాలు కోచింగ్ సెంటర్ నుంచి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా.. వాయిముట్టం ఈస్ట్ ప్రాంతంలో ఎజెన్ ఆమెను కారుతో ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె మోచేయి, వేలి వేలు విరిగింది. మరో కారులో వచ్చిన రంజిత్ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లాడు. దీంతో ఆమె తల్లిదండ్రుల మెప్పుకోని వివాహం చేస్తారని రంజిత్ భావించాడు. ఈ పథకం గురించి తెలియని ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులు ఎజెన్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో పథకం సంగతి తేలింది. రంజిత్‌తో పాటు ఎజెన్‌పైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు.



ప్రమాద దృశ్యాలు.. రంజిత్, ఎజెన్

ఝార్ఖండ్‌లో ఏనుగు బీభత్సం..

- రెండు రోజుల్లో 13 మంది మృత్యువాత

చాయిబాసా: ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో అడవి ఏనుగు బీభత్సం సృష్టించింది. చాయిబాసా అటవీ డివిజన్ పరిధిలో రెండు రోజుల్లో అది చేసిన దాడిలో 13 మంది మృత్యువాతపడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు. సోమవారం కోల్హాన్ ప్రాంతంలో గజరాజు దాడిలో ఏడుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నట్లు చెప్పారు. తాజాగా మంగళవారం రాత్రి నోవాముండి, హటగమారియా థానా పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో గజరాజు దాడులు జరిపింది. ఈ ఘటనల్లో మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. బబారియా గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ఇంటి బయట నిద్రపోతున్నారు. ఈ సమయంలో అక్కడికి వచ్చిన ఏనుగు వారిపై దాడి చేసింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఓ చిన్నారి ప్రాణాలతో బయటపడింది. ఇదే ఏనుగు పక్కింటి వ్యక్తినీ పొట్టనపెట్టుకుంది. మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. హటగమారియా ప్రాంతంలో జరిగిన మరో ఘటనలో ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. పశ్చిమబెంగాల్ బాంకురా జిల్లా నుంచి ప్రత్యేక బృందాన్ని రప్పించి దాన్ని అడవిలోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.



జనాభా లెక్కల సేకరణలో స్వీయ గణన నమోదుకు అవకాశం

- ఏప్రిల్ 1 నుంచి గృహాల జాబితా తయారీ
- కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ వెల్లడి

దిల్లీ: దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ-2027కు చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గృహాలు, నిర్మాణాల జాబితాల తయారీ, వాటి నమోదు ప్రక్రియను చేపడతారని కేంద్ర హోంశాఖ బుధవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. తొలుత 30 రోజుల పాటు అన్ని గృహాలు, నిర్మాణాల జాబితాను తయారు చేస్తారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ఏ తరహా నిర్మాణం, వంట గది, స్నానాల గది తదితర సదుపాయాల వివరాలను నమోదు చేస్తారు. ఈ దఫా కొత్తగా స్వీయ గణన నమోదు అవకాశాన్నీ కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఏప్రిల్ 1న తొలి దశ ప్రారంభానికి 15 రోజులు ముందుగా దీనిని చేపడతారని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ దఫా జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో, ఫోన్ యాప్‌ల ద్వారా జరగనున్న విషయం తెలిసిందే.

నౌక రాజేసిన అగ్గి!

వాషింగ్టన్: రష్యా జెండాతో వెళ్తున్న చమురు నౌకను బ్రిటన్ సహకారంతో అమెరికా స్వాధీనం చేసుకోవడం భౌగోళిక రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. వెనెజువెలా చమురు ఎగుమతులపై అమెరికా ఆంక్షలు కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం అమెరికా-రష్యాల మధ్య ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఈ నౌకపై వివాదం దేనికి.. అందులో ఏం తరలిస్తున్నారు.. అనేవి ఆసక్తికర అంశాలు. ఈ నౌక పేరు మ్యారినెరా (అసలు పేరు బెల్లా-1).

ఈ నౌక ఏళ్లుగా వెనెజువెలాకు చెందిన చమురు ఎగుమతుల్లో పాల్గొంటోంది. వెనెజువెలా నుంచి చమురును తరలించడానికి షాడో నౌకలు పని చేస్తున్నాయని ఆరోపిస్తున్న అమెరికా చాన్నాళ్లుగా వాటి కదలికలపై నిఘా వేసింది. అందులో భాగంగా దీనిని పట్టుకునేందుకు అమెరికా సేనలు పలుమార్లు ప్రయత్నించాయి. వారి కళ్లు గప్పి నౌకలోని సిబ్బంది తప్పించుకుంటూ సాగిపోతున్నారు. నౌక గుర్తింపునే మార్చేశారు. దానికి తుప్పు పట్టిన రంగు వేయడంతోపాటు రష్యా పతాకాన్ని తగిలించారు. రష్యా రిజిస్ట్రేషన్ జతచేశారు. కొత్త రూపురేఖలు సంతరించుకున్నప్పటికీ రష్యా జెండాతో నడుస్తున్న ఈ ట్యాంకర్ నౌక అమెరికా బలగాల నుంచి తప్పించుకోలేకపోయింది. నిజానికి అందులో చమురు లేదని రష్యా వాదిస్తోంది. పశ్చిమాసియాలోని హెజ్‌బొల్లా తదితర మిలిటెంట్ గ్రూపులకు ఆయుధాల్ని చేరవేయడానికి ఈ నౌకను వాడుతున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అందుకే రష్యా నౌక ఎస్కార్టుగా ఉన్న నౌకను అమెరికా బలగాలు ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇది తీవ్ర అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన కిందికి వస్తుందని నిపుణులు అంటున్నారు. అతి పెద్ద న్యాయ పోరాటానికి దారి తీయొచ్చని చెబుతున్నారు.



ప్రాణాలు కాపాడుకోబోయి.. కాలువలోకి దూకి..

బంగ్లాదేశ్‌లో మరో హిందువు మృతి

ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దొంగతనం చేశాడని ఆరోపిస్తూ ఓ అల్లరి మూక వెంట పడటంతో ప్రాణాలు కాపాడుకునేందుకు కాలువలోకి దూకిన ఓ హిందూ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నౌగావ్ జిల్లాలో మంగళవారం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు.. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడిని 25 ఏళ్ల మిథున్ సర్కార్‌గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఇటీవల ఇలాంటి హింసాత్మక ఘటనలు 51 నమోదవడం గమనార్హం.

మరిన్ని వివరాలు ఇవ్వండి..

గ్రోక్ ఏఐపై 'ఎక్స్'కు కేంద్రం ఆదేశం

దిల్లీ: అశ్లీల, అసభ్యకర దృశ్యాల రూపకల్పనకు 'గ్రోక్' కృత్రిమ మేధ చాట్‌బాట్ దుర్వినియోగం అవుతుండటంపై మరిన్ని వివరాలు సమర్పించాలని కేంద్ర ప్రభుత్వం 'ఎక్స్'ను ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకున్న చర్యలేమిటో స్పష్టంగా చెప్పాలంది. సంస్థ సమర్పించిన వివరాలు సరిపోవని తెలిపింది. భారతీయ చట్టాలను, మార్గదర్శకాలను తాము గౌరవిస్తామని, ఇండియా తమకు పెద్ద మార్కెట్ అని ఎక్స్ బుధవారం తన సమాధానంలో పేర్కొంది. తప్పుడు సమాచారం, పరస్పర అంగీకారం లేని అశ్లీల దృశ్యాల గురించి తెలిసిన వెంటనే వాటిని తొలగించేందుకు కఠిన విధానాలు పాటిస్తున్నామని తెలిపింది. ఈ సమాధానం సవివరంగా ఉన్నా, గ్రోక్ ఏఐ అశ్లీల దృశ్యాల వంటి నిర్దిష్ట అంశాలపై తీసుకున్న చర్యల గురించి కీలకమైన సమాచారం మాత్రం లేదని కేంద్రం పెదవి విరిచింది. అభ్యంతరకర సమాచారాన్ని 72 గంటల్లోగా తొలగించాలని 'ఎక్స్'కు కేంద్రం ఇటీవల ఇచ్చిన అదనపు గడువు బుధవారం సాయంత్రంతో ముగిసింది.

దిల్లీలో ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం

- రాళ్లదాడిలో పోలీసులకు గాయాలు
- వదంతులతో మొదలైన కలకలం

దిల్లీ: రామ్‌లీలా మైదాన్ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించేందుకు మంగళవారం అర్ధరాత్రి తర్వాత చేపట్టిన ప్రయత్నం దిల్లీలో ఉద్రిక్తతకు దారితీసింది. ఘర్షణలో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి. మసీదు, మూతపడిన శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న భూమిలో కూల్చివేతలు చేపట్టడాన్ని అక్కడివారు వ్యతిరేకించారు. దిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అధికారులు ఈ కూల్చివేతలు చేపట్టారు. బుల్డోజర్లతో మసీదును కూల్చివేస్తున్నారని, అడ్డుకునేందుకు అందరూ ఇళ్లనుంచి బయటకు రావాలని సామాజిక మాధ్యమంలో ఒకరు పోస్టు చేయడంతో కలకలం మొదలైంది. 100-150 మంది అక్కడకు చేరుకుని రాళ్లు, గాజుసీసాలు విసరడం ప్రారంభించారు. అధికారులు నచ్చజెప్పడంతో వారిలో చాలామంది వెనుదిరిగారు. సుమారు 30-35 మంది మాత్రం నినాదాలిస్తూ బ్యారికేడ్లను ధ్వంసంచేసి చొచ్చుకువచ్చారు. వారిని చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. "సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆందోళనకారుల్లో 10-15 మందిని అదుపులోకి తీసుకున్నాం. మసీదుకు ఎలాంటి నష్టం కలగలేదు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ మొహిబ్బుల్లా నద్వీ (యూపీ) ఘటనాస్థలిలో ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో బయటపడింది. అయితే కూల్చివేతలకు ముందే ఆయన అక్కణ్నుంచి వెళ్లిపోయారు' అని పోలీసు అధికారులు చెప్పారు.



రామ్‌లీలా మైదాన్ ప్రాంతంలో వివాదాస్పద స్థలంలో ఆక్రమణల తొలగింపు

రెండో దశ 'సర్'లో 6.5 కోట్ల ఓట్లు తొలగింపు

దిల్లీ: రెండో దశ ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కసరత్తు ఫలితంగా ఎన్నికల సంఘం మొత్తం 6.5 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించింది. ఈ మేరకు ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురించింది. సర్ రెండో దశ కసరత్తు నిర్వహించడానికి ముందు 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 50.90 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. తాజా ముసాయిదా ఓటరు జాబితాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 44.40 కోట్లకు తగ్గింది. తొలగించిన ఓటర్ల పేర్లను అందుబాటులో లేని, మరో చోటుకు మారిన, మరణించిన లేదా డూప్లికేట్ అయిన జాబితాలోకి చేర్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం 15.44 కోట్ల ఓటర్లకు గాను 2.89 కోట్ల మందిని ముసాయిదా జాబితా నుంచి మినహాయించారు. మరణాలు, శాశ్వత వలసలు, బహుళ రిజిస్ట్రేషన్లే ఈ పరిస్థితికి కారణమని ఈసీ అధికారి తెలిపారు. అండమాన్ నికోబార్ దీవులు, లక్షదీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో నవంబరు 4న రెండో దశ సర్ ప్రారంభమైన సంగతి తెలిసిందే.

అమర్త్య సేన్‌కు నోటీసులు

బెంగాల్‌లో సర్‌లో భాగంగా నోబెల్ బహుమతి గ్రహీత, ప్రసిద్ధ ఆర్థికవేత్త అమర్త్య సేన్‌కు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఆయన ఇంటివద్ద ఈ నెల 16న విచారణ జరపనున్నట్లు పేర్కొంది. ఈ పరిణామాన్ని తృణమూల్ కాంగ్రెస్ సిగ్గు చేటుగా అభివర్ణించింది. "ప్రొఫెసర్ అమర్త్య సేన్‌కు నోటీసు మాత్రమే జారీ చేశాం. ఆయన ఓటరు నమోదు పత్రంలో కొన్ని తప్పిదాలు ఉన్నాయి" అని బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి వివరించారు.



చియా గింజల్లో 9 అమినో యాసిడ్లు

చియాగింజల్లో ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. శరీరం స్వయంగా ఉత్పత్తి చేసుకోలేని తొమ్మిది అత్యావశ్యక అమినో యాసిడ్లు వాటి ద్వారా అందుతాయి. దీనివల్ల చియా గింజలు శాకాహారులకు, వేగన్లకు ఉత్తమమైన మొక్కల ఆధారిత ప్రొటీన్ వనరుగా ఉపయోగపడతాయి.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్

నెతన్యాహు-మోదీ సంభాషణ

- ఉగ్రవాదంపై ఐక్య పోరాటానికి నిర్ణయం



దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహులు బుధవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ క్రమంలో నెతన్యాహు, ఇజ్రాయెల్ దేశ ప్రజలకు మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇద్దరు నాయకులు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "నా స్నేహితుడు, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడాను. ఆయనకు, ఇజ్రాయెల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడం సంతోషంగా ఉంది. రాబోయే కాలంలో భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం గురించి మేము చర్చించాం. ఉగ్రవాదాన్ని మరింత దృఢ సంకల్పంతో ఎదుర్కోవాలనే మా ఉమ్మడి సంకల్పాన్ని పునరుద్ఘాటించాం" అని మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ప్లీజ్ డొనాల్డ్ అంటూ.. మెక్రాన్ ప్రాధేయపడ్డారు

- ఫ్రాన్స్ అధ్యక్షుడిపై ట్రంప్ అవమానకర వ్యాఖ్యలు



వాషింగ్టన్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హేళనగా మాట్లాడారు. ప్లీజ్ డొనాల్డ్ అంటూ మెక్రాన్ ప్రాధేయపడ్డారని రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో జరిగిన సమావేశం గురించి ప్రస్తావించారు. "ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని మెక్రాన్‌ను అడిగాను. ఆయన అందుకు తొలుత అంగీకరించలేదు. దాంతో ఆ దేశం నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించాను. దాంతో మన డిమాండ్లను అంగీకరించాల్సి వచ్చింది. అప్పుడు మెక్రాన్ మాట్లాడుతూ.. 'డొనాల్డ్ మన మధ్య ఒప్పందం ఉంది. ఔషధాల ధరలను మీకు కావాల్సినంత పెంచుతాను. కానీ మా ప్రజలకు చెప్పకండి అంటూ ప్రాధేయపడ్డారు" అని ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై మెక్రాన్ నుంచి కానీ, ఫ్రాన్స్ ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి స్పందన రాలేదు.

సొంత పాటలు అయ్యప్పకు సమర్పణ

- భక్తులకు అవకాశం కల్పించనున్న టీడీబీ



ఈటీవీ భారత్: తమ స్వరాన్ని, సాహిత్యాన్ని అయ్యప్ప స్వామికి అర్పించాలనుకునే భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు(టీడీబీ) సువర్ణ అవకాశాన్ని అందిస్తోంది. తాము సొంతంగా రాసిన, రూపొందించిన పాటలను శబరిమల సన్నిధానంలోని లౌడ్‌స్పీకర్లలో ప్లే చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. భక్తుల సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, ప్రఖ్యాత గాయకులు పాడిన పాత పాటలతో పాటు, కొత్తగా స్వరపరిచి, రికార్డ్ చేసిన పాటలు ప్లే లిస్ట్‌లో చేర్చాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ గతేడాది నుంచి అమలు చేశామని, దీనికి విశేష స్పందన లభించిందని దేవస్థానం ప్రజా సంబంధాల అధికారి (పీఆర్‌వో) జి.ఎస్. అరుణ్ తెలిపారు. సొంత పాటలను ట్యూన్ చేయాలని కోరిక ఉన్నవారు ఏడాదిలో ఎప్పుడైనా అప్లై చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ ప్లే లిస్ట్‌లో చేర్చుకునేందుకు కొన్ని నియమాలు పాటించాలి. పాటను సొంతంగా రాసి, ట్యూన్ చేయాలి. ఎవరూ కాపీరైట్ చేయలేదని పేర్కొంటూ అఫిడవిట్‌తో పాటు సంతకం చేసిన పత్రాలను సమర్పించాలి. ఈ పాటకు సంబంధించిన (రచయిత, సంగీత దర్శకుడు, గాయకుడు) వారి సంతకాలు, వారు అనుమతించినట్లు ధ్రువీకరించే పత్రాలను కూడా అప్లికేషన్‌లో చేర్చాల్సి ఉంటుంది. పాటలను శబరిమల సన్నిధానంలోని పీఆర్‌వోకు పెన్ డ్రైవ్ ద్వారా అందించాలి. తర్వాత పాట నాణ్యతను నిపుణుల కమిటీని పరిశీలిస్తుంది. అనంతరం రిజిస్టర్ చేసుకున్న కొత్త పాటలను ప్రకటనల మధ్య విరామ సమయాల్లో ప్రసారం చేస్తారు.

ఎస్టీసీ కీలక నేత అల్-జుబైదీపై వేటు

- యెమెన్‌లో కీలక పరిణామం

ఏడెన్: వేర్పాటువాద నాయకుడు, సదరన్ ట్రాన్సిషన్ కౌన్సిల్(ఎస్టీసీ) అధినేత అల్-జుబైదీపై యెమెన్ ప్రభుత్వం వేటు వేసింది. ఆయనపై దేశద్రోహం నేరాన్ని మోపినట్లు ప్రెసిడెన్షియల్ లీడర్‌షిప్ కౌన్సిల్ (పీఎల్‌సీ) అధిపతి రషద్ అల్-అలిమి తెలిపారు. అంతర్జాతీయంగా గుర్తించిన యెమెన్ ప్రభుత్వంలో జుబైదీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇటీవల ఆయన నేతృత్వంలోని ఎస్టీసీ.. దక్షిణ యెమెన్‌లో కీలక ప్రాంతాలను ఆక్రమించింది. ఈ సంస్థకు యూఏఈ మద్దతు ఉంది. ఈ దాడులపై సౌదీ అరేబియా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్టీసీ ఆక్రమించిన ప్రాంతాలపై వైమానిక దాడులు కూడా నిర్వహించింది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలు తగ్గించటానికి సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ చర్చలకు చివరి క్షణంలో జుబైదీ గైర్హాజరయ్యారు. దీంతో ఆయన్ను ప్రభుత్వం బహిష్కరించింది.

వెనెజువెలా ప్రజల శ్రేయస్సును భారత్ కోరుకుంటోంది

జైశంకర్ స్పష్టీకరణ

ఈటీవీ భారత్: వెనెజువెలాలో జరుగుతున్న పరిణామాలపట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. అమెరికా, వెనెజువెలా ప్రభుత్వాలు చర్చించి ప్రజల శ్రేయస్సు, భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కోరుకుంటున్నట్లు స్పష్టం చేశారు. లగ్జెంబర్గ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన జేవియర్ బెట్టెల్‌తో జైశంకర్ సమావేశమయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు, భవిష్యత్ సహకారంపై ఇద్దరు నేతలు మాట్లాడారు. భారత్, లగ్జెంబర్గ్.. 78 సంవత్సరాల దౌత్య సంబంధాలను పూర్తి చేసుకున్నట్లు జైశంకర్ తెలిపారు. ఐరోపా కూటమిలో లగ్జెంబర్గ్‌ను కీలక భాగస్వామిగా భారత్ చూస్తోందని పేర్కొన్నారు.

అమెరికా తర్వాతి లక్ష్యం వెనెజువెలా సెక్యూరిటీ చీఫ్!

ఇంటర్నెట్ డెస్క్: వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించిన అనంతరం అమెరికాకు వ్యతిరేకంగా ఉన్న ఆ దేశంలోని ఇతర ముఖ్య అధికారులపై ట్రంప్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దేశ హోం మంత్రి కాబెల్లోకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తోంది. వెనెజువెలా భద్రతా దళాలు ఆయన నియంత్రణలోనే ఉండటంతో తమకు పూర్తిగా సహకరించాలని.. లేదంటే మదురోకు పట్టిన గతే పడుతుందని ట్రంప్ ఆయనను హెచ్చరించినట్లు సమాచారం.

చట్టాలను ఉల్లంఘిస్తే సాగనంపుతాం

భారతీయ విద్యార్థులకు అమెరికా మరోసారి హెచ్చరిక

ఇంటర్నెట్ డెస్క్: పలు కారణాలతో విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ.. వారిని దేశం నుంచి బహిష్కరిస్తోన్న అమెరికా తాజాగా మరో హెచ్చరిక చేసింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అరెస్టు అయినా వెంటనే స్వదేశానికి తిప్పి పంపిస్తామని, తీవ్ర పర్యవసానాలనూ ఎదుర్కోవాల్సి వస్తుందనీ పేర్కొంది. అలాంటి విద్యార్థుల వీసాలను రద్దు చేస్తామని వెల్లడించింది. చట్టాల ఉల్లంఘన స్వభావం ఉన్న విద్యార్థులకు భవిష్యత్తులోనూ అమెరికా వీసాలు లభించవని స్పష్టం చేసింది. వీసా అనేది ఒక ప్రయోజనమే తప్ప, హక్కు కాదని తేల్చి చెప్పింది. భారతీయ విద్యార్థులను ఉద్దేశించి దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈ సందేశాన్ని పోస్ట్ చేసింది. వారం క్రితం కూడా ఇలాంటి హెచ్చరికే చేసింది.

బిష్ణోయి ముఠా సభ్యుడు బైన్స్‌వాల్ అప్పగింత

దిల్లీ: లారెన్స్ బిష్ణోయి ముఠాకు చెందిన అమన్ బైన్స్‌వాల్ అనే నేరగాణ్ని అమెరికా బుధవారం భారత్‌కు అప్పగించింది. సీబీఐ విస్తృత సమన్వయంతో చేసిన ప్రయత్నాల ఫలితంగా ఇది సాధ్యమైందని, నిందితుణ్ని హరియాణా పోలీసులు దిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేశారని అధికారులు వెల్లడించారు. అమన్ కుమార్ అలియాస్ అమన్ బైన్స్‌వాల్ హరియాణా, దిల్లీ రాజధాని ప్రాంతాల్లో కాల్పులు, హత్య, హత్యాయత్నం, బలవంతపు వసూళ్లు, అక్రమ ఆయుధాలు వంటి అనేక నేరాలకు పాల్పడినట్టు అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. చట్టం కళ్లుగప్పి తప్పుడు పత్రాలతో విదేశాలకు పారిపోయిన నిందితుడు ఎట్టకేలకు పట్టుబడ్డాడు. సీబీఐ హరియాణా పోలీసుల అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ రెడ్ నోటీసు ప్రకటింపజేసి నిందితుణ్ని పట్టుకోగలిగిందని అధికార ప్రకటన తెలియజేసింది. "నిందితుడు పేరుమోసిన నేరగాడు. లారెన్స్ బిష్ణోయి ముఠాలో కీలక సభ్యుడు. అతణ్ని గతంలో అరెస్టు చేశారు. తదనంతరం బెయిలు కూడా మంజూరైంది. విచారణను ఎదుర్కోకుండా నిందితుడు దేశం విడిచి పారిపోయాడు' అని సీబీఐ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌పోల్ నోటీసు ఆధారంగా బైన్స్‌వాల్ అమెరికాలో ఉన్నట్లు గుర్తించారు.



హరియాణా పోలీసుల అదుపులో అమన్ బైన్స్‌వాల్

పశ్చిమబెంగాల్‌లో బీఎల్‌వో మృతి...

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) విధుల్లో పని చేస్తున్న సంప్రీత చౌదరీ సన్యాల్ అనే బూత్ స్థాయి అధికారి(బీఎల్‌వో) బుధవారం మరణించారు. అధిక పని ఒత్తిడి కారణంగానే సంప్రీత మరణించారని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. గత కొన్ని రోజులుగా ఆమె ఆరోగ్యం సరిగా లేనందున డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారని, అయినప్పటికీ సంప్రీత ఎన్నికల జాబితాల సవరణ విధుల్లో పని చేస్తూ వచ్చారని ఆమె భర్త తెలిపారు. తమ నివాసంలో ఉదయం సమయంలో ఆమె మరణించినట్లు పేర్కొన్నారు. ఫుల్బరీ పాకుర్తాలా ప్రాంతంలో నివాసం ఉంటోన్న సంప్రీత, అంగన్వాడీ వర్కర్‌గా పని చేసేవారని పోలీసులు తెలిపారు.

ప్రతిపక్ష నాయకుడికీ కొత్త చట్టం వర్తిస్తుందా?

జేపీసీ సభ్యుల ప్రశ్న

దిల్లీ: తీవ్రమైన నేరారోపణలపై అరెస్టయి, నెల రోజుల్లోగా బెయిలు పొందలేకపోతే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులనైనా పదవుల నుంచి తొలగించాలంటున్న ప్రతిపాదిత చట్టం పరిధిలోకి ప్రతిపక్ష నాయకులూ వస్తారా అని సంయుక్త పార్లమెంటరీ సంఘ సభ్యులు ప్రశ్నించారు. భాజపా ఎంపీ అపరాజితా సారంగి అధ్యక్షతన ఏర్పాటైన ఈ సంఘం.. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వాల సవరణ బిల్లులపై లా కమిషన్ అధ్యక్షుడు దినేశ్ మహేశ్వరి ప్రభృతుల అభిప్రాయాలను ఆలకించింది. నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాజ్‌పాయ్, హైదరాబాద్ నల్సార్ వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణ దేవరావు సంఘం ముందు అభిప్రాయాలు తెలిపారు.

పాక్‌లో లష్కరే-హమాస్ కమాండర్ల సమావేశం!

- సామాజిక మాధ్యమంలో వీడియో చక్కర్లు



రషీద్ అలీ సంధు.. నాజీ జహీర్

ఇంటర్నెట్ డెస్క్: ఉగ్ర ముఠా లష్కరే తయ్యిబా (ఎల్ఈటీ), హమాస్ నేతల సమావేశానికి పాకిస్థాన్ వేదికగా మారింది. తాజాగా పాకిస్థాన్‌లోని గుజ్రాన్‌వాలాలో పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) నిర్వహించిన కార్యక్రమంలో హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ పాల్గొన్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అతడు లష్కరే తయ్యిబా కమాండర్ రషీద్ అలీ సంధుతో భేటీ అయినట్లు తెలుస్తోంది. రెండు ఉగ్రవాద ముఠాల మధ్య సంబంధాన్ని మరింత పెంచుకోవడంపై సమావేశంలో చర్చలు జరిగినట్లు సమాచారం. వీరి సమావేశానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌లో హమాస్ జరిపిన ఉగ్ర దాడికి ముందు కూడా హమాస్ సీనియర్ కమాండర్ నాజీ జహీర్ పాకిస్థాన్ వెళ్లాడు. అక్కడ ఆయన జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం అధిపతి మౌలానా ఫజల్-ఉర్-రెహ్మాన్‌ను కలిశారు. పహల్గాంలో ఉగ్ర దాడికి కొన్ని వారాల ముందు కూడా జహీర్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను సందర్శించాడు. తాజాగా అతడు మరోసారి పాక్‌లోని ఉగ్ర సంస్థలతో సమావేశమవడంతో వారు ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడతారోనని అంతర్జాతీయ మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఈ కార్యక్రమంలో పాక్ ఆర్మీ అధికారులు కూడా పాల్గొనడం గమనార్హం.

ఉస్మాన్ హాదీ హత్యకు సింగపూర్‌లో ప్రణాళిక

ఛార్జిషీట్‌ను తిరస్కరించిన ఇంకిలాబ్ మోనోచ్ పార్టీ

ఢాకా: రాజకీయ ప్రతీకారంతో విద్యార్థి నేత షరీఫ్ ఉస్మాన్ బిన్ హాదీని హత్య చేశారని, దానికి సింగపూర్‌లో ప్రణాళిక చేశారని బంగ్లాదేశ్ పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ కేసులో 17 మందిని నిందితులుగా చేరుస్తూ ఢాకా మెట్రో పాలిటన్ పోలీసులు న్యాయస్థానంలో ఛార్జిషీట్ దాఖలు చేశారు. "అవామీలీగ్‌తో పాటు దాని విద్యార్థి విభాగం ఛత్రా లీగ్‌పై ఉస్మాన్ హాదీ సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. ఛత్రా లీగ్‌తో పాటు దానితో సంబంధం ఉన్న ఇతర గ్రూప్‌ల సభ్యులకు ఆ వ్యాఖ్యలు ఆగ్రహాన్ని తెప్పించాయి. రాజకీయ ప్రతీకారం వల్లే ఈ హత్య జరిగిందని దర్యాప్తులో వెల్లడైంది'' అని పోలీసులు పేర్కొన్నారు. మిర్‌పుర్ మాజీ కౌన్సిలర్ తైజుల్ ఇస్లాం చౌధరీ అలియాస్ బప్పి ఆదేశాల మేరకే హాదీని హత్య చేసినట్లు చెప్పారు. హత్య ప్రణాళిక కోసం జరిగిన సమావేశంలో తైజుల్‌తో పాటు మాజీ ఎంపీ ఎలియాస్ మొల్లా, జహంగీర్ కబీర్ నాయక్, షూటర్ ఫైజల్ కరీం మసూద్ పాల్గొన్నారని తెలిపారు. మరోవైపు పోలీసుల ఛార్జిషీట్‌ను ఉస్మాన్ హాదీ పార్టీ ఇంకిలాబ్ మోనోచ్ తిరస్కరించింది. హాదీ హత్యలో దేశ యంత్రాంగ హస్తం ఉందని ఆరోపించింది.

పెళ్లి పేరుతో మోసం.. రూ.3 లక్షలకు గిరిజన యువతి అమ్మకం

పాల్ఘర్: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో 20 ఏళ్ల గిరిజన యువతిని రూ.3 లక్షలకు అమ్మినట్లు వచ్చిన ఆరోపణలతో నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. నాసిక్‌కు చెందిన ఓ వ్యక్తి, అతడి తల్లి కలిసి మధ్యవర్తులకు ఈ సొమ్ము చెల్లించారు. కట్కరీ తెగకు చెందిన ఈ యువతిని 2024 మే నెలలో సదరు వ్యక్తి బలవంతంగా పెళ్లిచేసుకున్నాడు. పెళ్లి తర్వాత భర్త కుటుంబం ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిందని, అనేకసార్లు కుల దూషణలు చేశారని బాధితురాలు ఆరోపించింది. గర్భవతిగా ఉన్నా.. భర్త దాడులు చేశాడని, సరిగ్గా భోజనం పెట్టలేదని వాపోయింది. బిడ్డ పుట్టిన తర్వాత గతేడాది జూన్‌లో ఆమె పుట్టింటికి చేరింది. ఈనెల 6న నిందితులు బిడ్డను తీసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఈ ఘటనపై వాడా పోలీస్ స్టేషన్‌లో భర్త, అతని తల్లి, ఇద్దరు మధ్యవర్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొక్కలు చలించకుండా..!



శీతాకాలంలో ఆరోగ్యం, శరీర సౌందర్యానికి మనం ఏవిధంగా జాగ్రత్తలు తీసుకుంటామో మొక్కలకూ అదే విధంగా సంరక్షణ చేపట్టాలంటున్నారు వృక్షశాస్త్ర నిపుణులు!

తులసి తమ గార్డెన్‌లోని మొక్కలకు రోజూ క్రమం తప్పకుండా నీరు పోస్తుంది. అక్కడే కాసేపు గడుపుతుంది. కొంతకాలంగా అవి తాజాదనం కోల్పోయి నిద్రాణస్థితిలోకి వెళ్లిపోతున్నాయి. రోజూ నీరు పోస్తున్నా ఎందుకు చనిపోయాయో అర్థం కాలేదు. స్నేహితులను అడిగినా సమాధానం దొరకలేదు. విషయమేంటంటే... వేసవిలో మొక్కలకు నీరు పోయకుంటే నష్టం జరుగుతుంది. అలాగే చలికాలంలో నీరెక్కువైతే వాటి ఎదుగుదలకు ఆటంకం కలుగుతుంది.

మనసు ప్రశాంతంగా ఉండటానికి, ఇంటి అవసరాల నిమిత్తం, ఇతరత్రా కారణాలేవైనా ఇటీవల మొక్కల పెంపకం అభిరుచిగా మారింది. దాని కోసం ప్రత్యేకంగా సమయమూ కేటాయిస్తున్నారు. ఇంట్లో పడక గది మొదలు ఆవరణలో చిన్నపాటి ఖాళీ ఉన్నా మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే కాలానికి తగినట్లుగా చలికాలంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే అవి చక్కగా ఎదుగుతాయి.

ఇదీ సమస్య: శీతాకాలం ఉష్ణోగ్రతల్లోని మార్పులతో మొక్కల పెరుగుదల నెమ్మదిస్తుంది. మట్టిలో బూజు పెరగడం, ఆకులు వాడిపోవడం, పసుపు రంగులోకి మారడం లేదా మొక్కల చుట్టూ కీటకాలు ఎగరడం గమనిస్తే, మొక్కలకు ఎక్కువ నీరు పోస్తున్నట్లు లెక్క. మొక్కలు నిద్రాణ స్థితిలో ఉండే సమయంలో నీరు ఎక్కువ అవసరం లేదు.

● (అవుట్ డోర్) బయట మొక్కల సంరక్షణకు: మొక్కల మొదళ్ల చుట్టూ ఎండుటాకులు, గడ్డి వేయడం ద్వారా ఉష్ణం పెరిగి వేర్లు చలిగాలులను తట్టుకుంటాయి. మంచు ఎక్కువగా ఉన్నప్పుడు జూట్ సంచులు లేదా పలుచటి పాత వస్త్రాలతో కప్పాలి. మొక్కకు ఎండిన ఆకులుంటే తీసివేయాలి. ఉదయం 10 దాటాక నీరు వేసినట్లయితే రాత్రిపూట చల్లని ఉష్ణోగ్రతలు ప్రారంభమయ్యేలోపు ఆరిపోతుంది. సాయంత్రం వేళల్లో నీరు పోస్తే వేర్లలో నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. దానివల్ల మొక్కలలో కుళ్లు, కీటకాలు లేదా శిలీంద్రాలు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి.

● (ఇండోర్) ఇంట్లో మొక్కల సంరక్షణకు: పగటి పూట సూర్యకాంతి పడే కిటికీల దగ్గర లేదా బాల్కనీలో ఎక్కువ వెలుతురు వచ్చేచోట ఉంచాలి. రాత్రివేళ చల్లటి గాలులకు దూరంగా ఉంచాలి. నీరు తక్కువగా పోయాలి. మట్టిలో వేలుపెట్టి చూసి, పైభాగం ఆరిన తర్వాతే నీరు వేయాలి. చల్లగాలి వల్ల ఆకులు నల్లబడతాయి. కాబట్టి బయట తలుపులు, వెంటిలేటర్ల దగ్గర ఉంచకూడదు. ఎప్పటికప్పుడు దుమ్ము లేకుండా చూడడం వల్ల కిరణజన్య సంయోగక్రియ బాగుంటుంది.

కుండీలు మార్చొద్దు: నీరు పోసే ముందు నేలలో తేమను తనిఖీచేయాలి. నవంబరు నుంచి ఫిబ్రవరి మధ్య చల్లని వాతావరణంలో వేర్ల పెరుగుదల నెమ్మదిగా ఉంటుంది. ఈ సమయంలో కుండీలను మార్చడం అంత శ్రేయస్కరం కాదు.

కూరగాయల మొక్కలు: ఆకుకూరలు, టమాటా, తీగ జాతి కూరగాయలు, బెండ, దుంపజాతి కూరగాయ, క్యాబేజీ, కాలిఫ్లవర్ శీతాకాలంలో వేసే పంటలు. వీటికి అవసరాన్ని బట్టి మాత్రమే అంటే ఎరువులు వేసినప్పుడు పైపైన నీటిని పోయాలి.

పూలమొక్కలు: గులాబీ, మందారం, మల్లి, ఇతరత్రా అలంకరణ మొక్కల పెరుగుదలకు కొద్దిగా తడి సరిపోతుంది. ఉదయం సూర్యకాంతి తప్పనిసరిగా తగలాలి. రాత్రి చల్లగాలికి దూరంగా ఉంచాలి. ఎక్కువగా నీరు పెట్టడం, దానికి మంచు తోడవడంతో మొక్క ఎదుగదు. తెగుళ్లు సోకడంతో పాటు ఆకులు రంగుమారే అవకాశం ఉంది. నివారణకు ఒక లీటరు నీటికి అయిదు గ్రాముల సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలి.

- ఈనాడు డిజిటల్, భీమవరం

మట్టిలోనే వేయాలి: పూలు, కూరగాయలు, ఇండోర్, ఫల జాతులకు వేర్వేరుగా జాగ్రత్తలు తీసుకోవాలి. మొక్కలు బాగా పెరగాలని నీరు పోయడం, తరచూ ఎరువులు వేయడం, రాత్రి బయట ఉంచడం, ఆకులపై నీరు వేయడం వంటివి చేయకూడదు. శీతాకాలంలో నీటిని నేరుగా మట్టిలో మాత్రమే పోయాలి. మట్టిపై మల్చింగ్ (పొడి ఆకులు, కొబ్బరి పొట్టు) వేయాలి. వాతావరణంలో తేమను బట్టి రెండ్రోజులకోసారి నీటిని పోయాలని ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి.విజయలక్ష్మి సూచిస్తున్నారు.

గంగా జలంలో గారెలు వండి..



పలు ఆచారాలకు, విశేషాలకు పెట్టింది పేరు నాగోబా జాతర. తరచి చూస్తే అందులో ఎన్నో ఆరోగ్య రహస్యాలు దాగి ఉంటాయి. శీతాకాలంలో 150 కి.మీ. కాలినడక (రాను పోను 300 కి.మీ.), గంగా జలంలో గారెలను కాల్చి.. వాటినే నదికి నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం.. ఇలా ఎన్నో అంశాలు ఆసక్తి గొలుపుతాయి. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని ప్రఖ్యాత నాగోబా ఆలయంలో జాతర ప్రారంభం సందర్భంగా ఈ నెల 18న మహాపూజ నిర్వహించనున్నారు. నాగోబాకు అభిషేకం చేయడానికి గోదావరి నీటి (గంగా జలం) కోసం మెస్రం వంశీయులు 150 మంది.. డిసెంబర్ 30న కాలినడకన బయల్దేరిన విషయం తెలిసిందే. వీరు 150 కి.మీ. నడిచి గోదావరికి చేరుకున్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలం హస్తినమడుగులో గోదావరికి సంప్రదాయ పూజలు నిర్వహించి కలశంలో పవిత్ర జలాన్ని సేకరించారు. దాన్ని చేతపట్టుకొని కాలినడకన తిరుగు ప్రయాణం ప్రారంభించారు. ఈ క్రమంలో ఆనవాయితీగా గోధుమ పిండి, బెల్లం కలిపి గారెలు చేసి గంగా జలంలో వేయించి నదికి నైవేద్యంగా సమర్పించారు. వీరు కాలినడకన ఈ నెల 14న తిరిగి కేస్లాపూర్ చేరుకుంటారు.

–ఈనాడు, ఆదిలాబాద్

ఇసుక గులాబీ.. మేడిన్ సహారా

విశాఖ నగరం సీతమ్మధారకు చెందిన కన్నెగంటి యశోదర రావు(78) విజయలక్ష్మి(73) వృత్తి రీత్యా వైద్యులు. కొన్నేళ్లు విదేశాల్లో పనిచేశారు. ఆ సమయంలో పురాతన, వింతైన వస్తువులను సేకరించడం అలవాటుగా చేసుకున్నారు. అలా సేకరించిన వస్తువుల్లో ఇసుక గులాబీ ఒకటి. డెస్ట్ ఎడారి గులాబీ అని కూడా పిలుస్తుంటారు. ఎడారుల్లో వివిధ తేమైన ఇసుక తుపాన్లు వచ్చినప్పుడు గాలి ఒత్తిడి వల్ల ఇసుక రేణువులు లోతట్టు ప్రాంతాల్లోకి చేరి వివిధ ఆకృతులుగా ఏర్పడతాయని, కొన్ని వందల ఏళ్ల తర్వాత గట్టిపడి ఈ విధంగా మారతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఇంత పెద్ద ఇసుక గులాబీ అరుదుగా లభిస్తుందని, ఆఫ్రికాలోని విధులు నిర్వర్తిస్తున్నప్పుడు అక్కడి వారి సహకారంతో సహారా ఎడారి నుంచి సేకరించామని యశోదరావు వెల్లడించారు.

–ఈనాడు, విశాఖపట్నం



చెరువుల్లో అడ్డు.. చేతుల్లో అదిరేట్టు!





గుర్రపుడెక్క.. కాలువల్లో ఉంటే ప్రవాహాన్ని ఆపేసి రైతులకు ఎంతో నష్టం చేస్తుంది. అదే హస్తకళాకారుల చేతులకు చేరితే అద్భుతమైన ఉత్పత్తిగా మారుతుంది. మచిలీపట్నం సమీపంలోని చిన్నాపురం హస్త కళాకారులు ఇందులో ఆరితేరారు. తొలుత వారు సమీప చెరువులు, కాలువలను గుర్రపుడెక్కను సేకరించి బాగా ఎండబెడతారు. తర్వాత మిషన్ సాయంతో తాళ్లుగా మార్చుకుని పర్సులు, బుట్టలు, మ్యాట్‌లు, దిండ్లు, ల్యాంప్ షేడ్‌లు, అందమైన సంచులను తయారుచేస్తారు. గుంటూరులో జరుగుతున్న సరస్ మేళాలో ఈ ఉత్పత్తులతో స్టాల్ ఏర్పాటు చేయనున్నారు. తమ గ్రామంలో ప్రస్తుతం 40 మందికి పైగా హస్త కళాకారులు ఈ కళతో ఉపాధి పొందుతున్నారని నిర్వాహకులు కుష్‌కుమార్ తెలిపారు.

–ఈనాడు, అమరావతి

అక్షర బంధం

'అక్షర' అంటే నాశనం లేనిది అని అర్థం. తాను అక్షరాలు బోధించిన ఆ ఊరితో ఆయన బంధం కూడా అక్షరమైంది. ఇటికాల విశ్వనాథాచారి గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు (గతేడాది కాలం చేశారు). ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో 18 సంవత్సరాలు పనిచేశారు. ప్రధానోపాధ్యాయుడిగా అక్కడే పదవీవిరమణ పొందారు. గ్రామస్థులు ఆయనను తమ ఊరి మనిషిగానే భావించేవారు. అంతగా ఆయన వారితో కలిసిపోయారు. వారి పిల్లలు అక్కడే పుట్టి, పెరిగారు. ఉద్యోగ విరమణ తర్వాత ఖమ్మంలో స్థిరపడినా.. వారి మనసు చిమ్మపూడిని వీడలేదు. వారి కుమారులు రామకృష్ణాచార్యులు (ప్రధానోపాధ్యాయుడు), భాస్కర్ (టౌన్ ప్లానింగ్ ఆఫీసర్), సురేశ్‌కుమార్ (ఉపాధ్యాయుడు), రాంప్రసాద్ (అధ్యాపకుడు) ప్రయోజకులయ్యారు. ఆ గ్రామంతో అనుబంధం దృష్ట్యా.. ఊరికి మేలు చేయాలని తలచారు. ఈ క్రమంలో ఆయన కుమారులు 2019లో ఆ గ్రామంలో స్థలం కొనుగోలు చేసి తమ తల్లిదండ్రుల పేరుతో రూ.7 లక్షలతో ఆదర్శ గ్రంథాలయాన్ని నిర్మించి, నిర్వహిస్తున్నారు. పలువురు గ్రామస్థులు, దాతలు సైతం సహకారం అందించారు. గ్రంథాలయంలో దినపత్రికలు, వందల పుస్తకాలు, 80 కుర్చీలు అందుబాటులో ఉంచారు. నిర్వాహకులు ఓ దివ్యాంగుడిని నియమించారు. గ్రంథాలయ వార్షికోత్సవ సందర్భంగా ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహించి ప్రభుత్వానికి రక్తం అందజేస్తున్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నారు. గ్రామస్థులు ఈ గ్రంథాలయాన్ని గుడిగా భావిస్తుంటారు. కొత్తగా వివాహమైన వారు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునే వారు గ్రంథాలయ అభివృద్ధికి తోచినంత సాయం చేస్తుండటం విశేషం.



- ఈనాడు, ఖమ్మం; న్యూస్‌టుడే, రఘునాథపాలెం



దగ్ధమవుతున్న బస్సు

కొవ్వూరు గామన్ వంతెనపై ప్రైవేటు బస్సు దగ్ధం

● పదిమందికి తప్పిన ప్రాణాపాయం

కొవ్వూరు పట్టణం, చాగల్లు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్ వంతెనపై బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ప్రైవేటు బస్సు విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమైంది. అందులో ఉన్న పదిమంది సురక్షితంగా బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్‌ఆర్‌ఆర్ ట్రావెల్స్ బస్సు మంగళవారం అర్ధరాత్రి దాటాక ఈ వంతెన పైకి చేరుకుంది. అప్పటికే ట్రాఫిక్ నిలిచిపోయి ఉండడంతో బస్సును నిలిపారు. కిందకు దిగిన డ్రైవర్ మరిపల్లి భిక్షం బస్సు ఇంజిన్ నుంచి పొగ, వాసన రావడం గమనించి లోపల ఉన్న ఆరుగురు ప్రయాణికులు, మరో డ్రైవరు, ఇద్దరు క్లీనర్లను హెచ్చరించి దింపేశారు. సెకన్ల వ్యవధిలో మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది.

ఈ ఏడాది నుంచే పిడుగురాళ్ల వైద్యకళాశాలలో ప్రవేశాలు

ఈనాడు, అమరావతి: పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026-27 విద్యాసంవత్సరంలో ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పించనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకం(సీఎస్ఎస్) కింద రాష్ట్ర ప్రభుత్వమే పిడుగురాళ్ల కళాశాలను నిర్మించి, నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ పథకం కింద కేంద్రం పిడుగురాళ్ల వైద్య కళాశాలకు రూ.195 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. మొదటి దశలో 100 ప్రవేశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది నియామకాల ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

ది రాజాసాబ్ ప్రీమియర్ షో టికెట్ రూ.1,000

ఈనాడు, అమరావతి: ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'ది రాజాసాబ్' చిత్రానికి గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 12 గంటల మధ్య ప్రీమియర్ షోకు ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనికి టికెట్ ధర జీఎస్టీతో కలిపి రూ.1,000గా నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి 10 రోజుల పాటు ప్రస్తుతమున్న టికెట్ ధరకు అదనంగా సింగిల్ స్క్రీన్లలో రూ.150, మల్టీప్లెక్స్‌ల్లో రూ.200 చొప్పున పెంచుకునేందుకు అనుమతిచ్చింది. రోజుకు 5 షోల ప్రదర్శనకు వీలు కల్పించింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుపతి నుంచి మద్యం సీసాలు తెచ్చి.. పొదల్లో పడేసి..

● తిరుమల పవిత్రతను దెబ్బతీసి, రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లేలా కుట్ర

● వైకాపా నాయకులు, సాక్షి ప్రతినిధులే కుట్రదారులు

● వైకాపా నాయకుడు, సాక్షి ఫొటోగ్రాఫర్ అరెస్టు.. బెయిల్ మంజూరు

ఈనాడు డిజిటల్-తిరుపతి; న్యూస్‌టుడే-తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను దెబ్బతీసి, రాష్ట్ర ప్రభుత్వం, తితిదేపైనా బురదచల్లాలనే దురుద్దేశంతో వైకాపా నాయకులు సాక్షి ప్రతినిధులతో కలిసి చేసిన కుట్ర పోలీసుల దర్యాప్తులో బట్టబయలైంది. 'తిరుమలలో మద్యం బాటిళ్లు, పోలీసు అతిథిగృహం సమీపంలోనే పదుల సంఖ్యలో మద్యం సీసాలు. నిద్రపోతున్న నిఘా. అలిపిరి టోల్‌గేట్ ద్వారా నిత్యం తిరుమలకు మద్యం' అంటూ ఈ నెల 4న సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసిన కేసులో నిందితులైన తిరుపతికి చెందిన వైకాపా కార్యకర్త ఆళ్లపాక కోటి, సాక్షి ఫొటోగ్రాఫర్ మోహన్‌కృష్ణను పోలీసులు బుధవారం అరెస్టుచేశారు. నిందితులను రెండో అదనపు మున్సిఫ్ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్‌ను తిరస్కరించి రూ.10వేల సొంత పూచీకత్తుపై బెయిల్ మంజూరుచేశారు. మరో నిందితుడు వైకాపా సామాజికమాధ్యమ కార్యకర్త నవీన్ పరారవ్వడంతో అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేకబృందాలు ఏర్పాటుచేశారు. వీరంతా తిరుపతి నుంచి ఖాళీ మద్యం సీసాలు తీసుకొచ్చి, వాటిని తిరుమలకు తరలించి.. అక్కడ పొదల్లో పారేసి, ఆ ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసినట్లు దర్యాప్తులో తేల్చారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు, భద్రతా వైఫల్యం ఉందంటూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించారు. తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు బుధవారం విలేకర్లకు ఈ వివరాలు తెలిపారు.

మద్యం సీసాలు పడేసింది, వాటిని ఫొటోలు తీసి దుష్ప్రచారం చేసింది వారే

"వైకాపా కార్యకర్త ఆళ్లపాక కోటి... ముందస్తు కుట్రలో భాగంగా తిరుపతి నుంచి ఖాళీ మద్యం సీసాలు తీసుకెళ్లి తిరుమల బాలాజీ కాలనీ ప్రాంతంలోని కౌస్తుభం అతిథిగృహం కాంపౌండ్‌వాల్ బయట చెట్లపొదల వద్ద పడేశారు. ఈ నెల 4న తిరుమలకు వెళ్లి మద్యం సీసాల సమాచారాన్ని వైకాపా సోషల్‌మీడియా కార్యకర్త నవీన్‌కు చెప్పారు. నవీన్ ఆ విషయాన్ని 'సాక్షి' ఫొటోగ్రాఫర్ మోహన్‌కృష్ణకు తెలియజేయగా. అతను సాక్షి ఫొటోగ్రాఫర్లైన గిరి, ప్రసాద్, ముకేశ్‌లను అక్కడకు పంపి, వారిద్వారా వీడియోలు తీయించారు. ఆ దృశ్యాల్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసి తితిదేపై దుష్ప్రచారం మొదలుపెట్టారు.

● ప్రధాన నిందితుడైన వైకాపా కార్యకర్త ఆళ్లపాక కోటి, రెండో నిందితుడైన సాక్షి ఫొటోగ్రాఫర్ మోహన్‌కృష్ణను అరెస్టుచేసి వారినుంచి రెండుఫోన్లు, స్విఫ్ట్ డిజైర్ కారు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నాం. మొబైల్ ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించాం. మూడో నిందితుడు నవీన్ పరారీలో ఉన్నారు. మోహన్‌కృష్ణ ఉద్దేశపూర్వకంగా తన మొబైల్ దాచిపెట్టి.. ఫోన్ పోయిందని చెబుతూ పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. ఈ ప్రవర్తన అతని నేరస్వభావాన్ని స్పష్టం చేస్తోంది.

● సీసీ కెమెరాల ఫుటేజీ, వాహనాల రాకపోకలు, ఫాస్టాగ్ డేటాను విశ్లేషించి ఈ కుట్రను బయటపెట్టాం. తితిదే పవిత్రతకు భంగం కలిగించేలా, అధికారిక నిర్ధారణ లేకుండా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు. ఈ కుట్ర వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశాం" అని తెలిపారు.

సుత్తి మాటలంటారా?

● ఎంపీ అవినాష్‌రెడ్డిపై మండిపడ్డ మంత్రి సవిత

● కడప డీఆర్సీ సమావేశంలో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వాగ్వాదం



ఈనాడు, కడప: రాయలసీమ ఎత్తిపోతలపై ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలనే వైకాపా ప్రజాప్రతినిధుల ప్రయత్నం బెడిసికొట్టింది. తెదేపా ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక చివరకు వాకౌట్ చేశారు. కడపలో జిల్లా సమీక్షా కమిటీ (డీఆర్సీ) సమావేశం ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన బుధవారం జరిగింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా ఎంపీ అవినాష్‌రెడ్డి, వైకాపా ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, సుధ హాజరయ్యారు. జిల్లా ప్రగతి నివేదికను కలెక్టర్ శ్రీధర్ వివరిస్తుండగా ఎంపీ జోక్యం చేసుకుని వ్యవసాయంలో వృద్ధిరేటు సాధించాలంటే రాయలసీమ ఎత్తిపోతలను ముందుకు తీసుకెళ్లాలని, ఈ మేరకు తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసే విషయంలో సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని, ఈ విషయంలో అనుమానం లేదని మంత్రి సవిత వివరిస్తుండగా.. మైకు తీసుకుని 'సుత్తి మాటలెందుకు' అని ఎంపీ అన్నారు. ఎప్పుడూ సమావేశానికి రాకుండా ఈ వేళ వచ్చి బెదిరిస్తారా అంటూ ఎంపీపై మంత్రి మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతలను 2020లోనే ఎందుకు ఆపేశారని నిలదీశారు. దీనిపై సమాధానం చెప్పడానికి పులివెందుల ఎమ్మెల్యే అసెంబ్లీకి రావాలంటూ మంత్రి డిమాండ్ చేశారు. ఇంతలో వైకాపా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు లేచి వాదనలకు దిగారు. వైకాపా ప్రభుత్వం అనుమతులు లేకుండా పథకాన్ని చేపట్టిందని ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, కృష్ణచైతన్యరెడ్డి నిలదీశారు. కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సైతం ప్రశ్నల వర్షం కురిపించారు. సమాధానం ఇవ్వలేని వైకాపా ప్రజాప్రతినిధులు ఇది తెదేపా సమీక్షా సమావేశంలా ఉందంటూ వాకౌట్ పేరిట నిష్క్రమించారు. వాళ్లు వెళ్లేటప్పుడూ తెదేపా, వైకాపా ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీకి కట్టబెట్టడానికే ప్రాజెక్టుల పనులు చేపట్టారని ఇన్‌ఛార్జి మంత్రి విమర్శించారు. వైకాపా ప్రజాప్రతినిధులు 30 నిమిషాలకే సమావేశం నుంచి వెళ్లిపోగా ఆ తర్వాత సమీక్ష కొనసాగింది.



కడప డీఆర్సీ సమావేశానికి హాజరైన ఎంపీ అవినాష్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, చైతన్యరెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రామసుబ్బారెడ్డి, డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ తదితరులు

తిరుమల కుట్ర వెనుక భూమన హస్తం?

● తితిదే ఛైర్మన్ బీఆర్‌నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఖాళీ మద్యం సీసాలు వేసి శ్రీవారి ఆలయ పవిత్రను దెబ్బతీసేందుకు వైకాపా, సాక్షి మీడియా ప్రయత్నించడం వెనుక వైకాపా నాయకుడు భూమన కరుణాకరరెడ్డి హస్తం ఉండొచ్చని, పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తు చేసి వెంటనే ఆయనను అరెస్టుచేయాలని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. భూమన లాంటి వారు తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కొంతకాలంగా తితిదేపై బురదజల్లేందుకు ప్రయత్నించి చివరకు విఫలం కావడంతో తిరుమలను తమ రాజకీయ లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు ఉపయోగించుకున్నారని విమర్శించారు.

50% గ్రీన్‌కవర్ సాధనలో ఉద్యానశాఖ భాగస్వామి కావాలి

ఈనాడు, అమరావతి: భూమాతను రక్షించుకుంటూ రైతుల ఆదాయం పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పండ్ల తోటల్లో విభిన్న జాతుల మొక్కలు సాగు చేయటం ద్వారా భూసారాన్ని పెంచటంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. సచివాలయంలో బుధవారం అటవీ, ఉద్యాన శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం మేర గ్రీన్‌కవర్ సాధించాలనే లక్ష్య సాధనలో ఉద్యానశాఖ కూడా కీలక పాత్ర పోషించాలని నిర్దేశించారు. 'ఒకే పంటలో వివిధ రకాల జాతుల మొక్కలను అంతరపంటలుగా సాగు చేసేలా ప్రోత్సహించాలి' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

నేడు సరస్‌ను ప్రారంభించనున్న సీఎం

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: గుంటూరులో నిర్వహిస్తున్న సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) మేళాను సీఎం చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నల్లపాడు రోడ్డులోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 3.30 గంటలకు సరస్ ప్రదర్శన ప్రాంతానికి చేరుకుని మేళాను ప్రారంభిస్తారు. ప్రదర్శనను తిలకించిన అనంతరం 5 గంటలకు ఉండవల్లిలోని నివాసానికి బయలుదేరనున్నారు.

9న బ్లోఅవుట్ పరిశీలనకు..

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జిల్లాలో బ్లోఅవుట్ సంభవించిన ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు ఈ నెల 9న ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించనున్నట్లు అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ తెలిపారు.

స్థానికేతరులను పనులు చేయకుండా అడ్డుకుంటే చర్యలు

● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరిక

● మధ్యప్రదేశ్ వారిని అడ్డుకున్నారంటూ ఆయన దృష్టికి ఫిర్యాదు



ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్థేను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: స్థానికేతరులంటూ పనులు చేయనివ్వకుండా అడ్డుపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఏ రాష్ట్రం వారైనా ఎక్కడైనా జీవించవచ్చని, ఎక్కడైనా పనులు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, మధ్యప్రదేశ్‌లోని మాండ్లా ఎంపీ ఫగ్గన్ సింగ్ కులస్థే.. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుంలో మధ్యప్రదేశ్‌కు చెందిన పలువురు ప్రభుత్వ అనుమతితో చేపడుతున్న గ్రానైట్ మైనింగ్ పనులను స్థానికులు అడ్డుకుంటున్నారని పవన్‌తో చెప్పారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ మైనింగ్ ఎలా చేస్తారని బెదిరిస్తున్నారన్నారు. స్పందించిన పవన్ కల్యాణ్.. కూటమి ప్రభుత్వం ఇలాంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అనుమతులున్నవారు నిబంధనల ప్రకారం మైనింగ్ చేసుకోవచ్చని, ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు.

3 రోజులు కాకినాడ జిల్లాలోనే పవన్

● పిఠాపురంలో సంక్రాంతి సంబరాలకు హాజరు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కాకినాడ జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 9 నుంచి పిఠాపురంలో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొంటారు. తొలుత ఒక్కరోజే ఆయన జిల్లాలో పర్యటిస్తారని ప్రకటించినా తాజాగా మూడు రోజులకు పెంచారు. ఈ నెల 8 (గురువారం) సాయంత్రం పవన్ విమానంలో రాజమహేంద్రవరం వచ్చి పిఠాపురం వెళతారు. శుక్రవారం అక్కడి ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగే సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తారు. సాయంత్రం పట్టణంలోని వివిధ కార్యక్రమాలకు హాజరవుతారు. శనివారం గొల్లప్రోలులోని హౌసింగ్ లే-ఔట్‌ను సందర్శించి, కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం రంగరాయ వైద్యకళాశాలలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. తర్వాత రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుని, హైదరాబాద్ వెళతారు. పవన్ పాల్గొనే కార్యక్రమాలకు పలువురు మంత్రులూ హాజరవుతారు.

ఆగకుండా
8,700 కిలోమీటర్లు
ఇండిగో చేతికి ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్ విమానం



దేశీయ నగరాల నుంచి విదేశాల్లోని సుదూర నగరాలకు నాన్‌స్టాప్ సర్వీసులు నిర్వహించాలన్న ఇండిగో ప్రణాళిక సాకారమవుతోంది. ఒకసారి ఇంధనం నింపితే ఆగకుండా 11 గంటల్లో, 8,700 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సరికొత్త ఎయిర్‌బస్ ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్ విమానం, ఈ సంస్థకు చేరింది. దేశీయ విమానయాన సంస్థల్లో ఈ రకం తొలి విమానం ఇండిగోకే డెలివరీ అయ్యింది. సుదూర గమ్యాలకు నాన్‌స్టాప్‌గా దూసుకెళ్లగలిగిన ఈ విమానంలో 12 బిజినెస్ క్లాస్, 183 ఎకానమీ సీట్లు ఉంటాయి. ఈ రకం 40 విమానాలకు ఇండిగో ఆర్డరు పెట్టగా, డిసెంబరులోపు మొత్తం 9 డెలివరీ అయ్యే వీలుంది.

23 నుంచి ప్రారంభం: ఈనెల 23న ముంబయి నుంచి గ్రీస్ రాజధాని ఏథెన్స్‌కు ఈ విమానంతో నాన్‌స్టాప్ సర్వీసును ఇండిగో ప్రారంభించనుంది. దీంతో లాంగ్ రేంజ్ -నారో బాడీ విమాన కార్యకలాపాలను మొదలుపెట్టినట్లు అవుతుంది. తదుపరి అందుకునే ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్ విమానాలను ఇస్తాంబుల్, తుర్కియే, డెన్‌పాసార్, బాలి తదితర మార్గాల్లో సంస్థ నిర్వహించనుంది. ఐరోపా, తూర్పు ఆసియా నగరాలకు విమాన సర్వీసుల కోసం వీటిని ఉపయోగించాలన్నది సంస్థ ఆలోచన. ఈ విమానాల ఇంధన సామర్థ్యం అధికమని, నిర్వహణ వ్యయాలు అదుపులో ఉంటాయని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇండిగో వద్ద 400కు పైగా విమానాలున్నాయి.

ఎయిర్‌బస్ వెబ్‌సైట్ ప్రకారం.. ఏ321 ఎక్స్‌ఎల్‌ఆర్ విమానాలను పారిస్, కౌలాలంపూర్, డాలస్ మార్గాల్లో మాత్రమే వినియోగిస్తున్నారు.

2025లో 22.70 లక్షల
విద్యుత్ వాహనాల విక్రయం



విద్యుత్ వాహన (ఈవీ) రిటెయిల్ అమ్మకాలు, గతేడాది 22,70,107కు చేరాయి. 2024లో అమ్ముడైన 19.5 లక్షల ఈవీలతో పోలిస్తే, ఈ సంఖ్య 16.37% అధికమని వాహన డీలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) పేర్కొంది. ముఖ్యంగా విద్యుత్ కార్ల విక్రయాల్లో 77% వృద్ధి నమోదు కావడం ఇందుకు సహకరించింది. '2025లో ప్రతి వాహన విభాగంలోనూ వృద్ధి కనిపించింది. క్షేత్ర స్థాయిలో విద్యుత్ వాహనాల వినియోగం అధికమైంద'ని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ఉత్పత్తుల ఎంపికలో ఎక్కువ అవకాశాలు, ధర తగ్గడం వంటివి ఇందుకు సహకరించాయన్నారు. పర్యావరణ హితమైన ఈవీల వినియోగం ఇంకా పెరిగేందుకు, ప్రభుత్వ విధానాల కొనసాగింపుతో పాటు ఛార్జింగ్ వసతులు, రిటెయిల్ రుణాలు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

విద్యుత్ వాహన విక్రయాల తీరు

విభాగం	2024	2025	వృద్ధి(%)
ప్యాసింజర్ కార్లు	99,975	1,76,817	77
వాణిజ్య	10,123	15,606	54.2
ద్విచక్ర	11,49,416	12,79,951	11.36
త్రిచక్ర	6,91,313	7,97,733	15.39

ఈసీఐఎల్‌కు రూ.1,600 కోట్ల ఆర్డర్

హైదరాబాద్(కాప్రా), న్యూస్‌టుడే: ఈసీఐఎల్‌కు న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) నుంచి రూ.1,600 కోట్ల విలువైన కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఆర్డర్ లభించినట్లు కంపెనీ సీఎండీ అనురాగ్ కుమార్ బుధవారం తెలిపారు. అణుశక్తి విభాగం ఆధీనంలోని మినీరత్న సంస్థ అయిన ఈసీఐఎల్, స్వదేశీ కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ రంగంలో అపార అనుభవం, నైపుణ్యాలు ఉన్న సంస్థగా ఈ కాంట్రాక్టు ద్వారా నిరూపితమైందని పేర్కొన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ లక్ష్యాన్ని సాకారం చేసేందుకు ఈసీఐఎల్ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు.

ఈనాడు బిజినెస్

హైదరాబాద్‌లో 4% పెరిగిన ఇళ్ల అమ్మకాలు
కార్యాలయాల అద్దెలో 10% వృద్ధి: నైట్ ఫ్రాంక్



ఈనాడు, హైదరాబాద్: దేశీయ స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. 2025 ద్వితీయార్థంలో కార్యాలయాల అద్దె లావాదేవీలు, నివాస గృహాల విక్రయంలో దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే హైదరాబాద్ మెరుగ్గా ఉందని స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన 'ఇండియా రియల్ ఎస్టేట్- హెచ్2 2025' నివేదిక తెలిపింది. దేశంలోని 8 నగరాల్లో కలిపి ఇళ్ల అమ్మకాలు 1% తగ్గినా, హైదరాబాద్‌లో పెరిగినట్లు వివరించింది. 2025 జులై-డిసెంబరు మధ్య హైదరాబాద్‌లో మొత్తం 38,403 ఇళ్లు/ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. 2024 ఇదే కాలంతో పోలిస్తే ఇవి 4% ఎక్కువ.

జీసీసీల అండ: హైదరాబాద్‌లో మొత్తం 1.14 కోట్ల చ.అడుగుల కార్యాలయ స్థలం లీజుకు వెళ్లింది. ఈ లావాదేవీల్లో సగానికి పైగా వాటా గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)దే. కార్యాలయాల అద్దె ధరల్లోనూ సగటున 10% వృద్ధి ఉంది.

వెండికీ తప్పనిసరి హాల్‌మార్కింగ్!

● మౌలిక వసతులు ఏర్పాటయ్యాక అమలు



దేశీయంగా కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరిన నేపథ్యంలో.. వెండి ఆభరణాల్లోని స్వచ్ఛతపై కొనుగోలుదార్లకు భరోసా కల్పించేందుకు, వారు నష్టపోకుండా చూసేందుకు.. హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అయితే ఆభరణాల్లోని వెండి శాతాన్ని ధ్రువీకరించి, హాల్‌మార్క్ వేసేందుకు తగినన్ని స్వచ్ఛత నిర్ధారణ - హాల్‌మార్కింగ్ కేంద్రాల వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాకే, దీన్ని అమలు చేస్తామని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) డైరెక్టర్ జనరల్ సంజయ్ గార్గ్ తెలిపారు. బీఐఎస్ 79వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్పత్తుల నాణ్యత, దేశ అభివృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తుచేశారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య నాణ్యత అనేది అత్యంత నిర్ణయాత్మక అంశమని అన్నారు. మౌలిక సదుపాయాలు, పరిపాలన, పౌరులకు సౌకర్యాలు, ఆరోగ్య సేవలు, ఆతిథ్యంలో అభివృద్ధి చెందిన దేశాలు ప్రత్యేకంగా నిలుస్తాయని స్పష్టం చేశారు.

● **హాల్‌మార్కింగ్ అంటే:** బంగారం, వెండి వంటి విలువైన లోహాల స్వచ్ఛతకు ఇచ్చే ధ్రువీకరణను హాల్‌మార్కింగ్‌గా పిలుస్తారు. లోహం స్వచ్ఛత, బీఐఎస్ లోగో, ఆభరణాల విక్రేత గుర్తు, ప్రతి ఆభరణానికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (హెచ్‌యూఐడీ) వంటివి బీఐఎస్ గుర్తింపు పొందిన కేంద్రాల్లో ఆభరణాలపై ముద్రిస్తారు. కొనుగోలుదార్ల చెల్లింపులకు అనుగుణంగా, ఆభరణాల్లో లోహం స్వచ్ఛత ఉందనేందుకు హాల్‌మార్కింగ్ ధ్రువీకరణగా నిలుస్తుంది. తక్కువ నాణ్యత ఉత్పత్తులను, మోసాలను అరికట్టేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది.

373 జిల్లాల్లో పసిడి ఆభరణాలకు

ప్రస్తుతం దేశంలో 373 జిల్లాల్లో పసిడి ఆభరణాలకు తప్పనిసరి హాల్‌మార్కింగ్ అమలవుతోంది. ఇప్పటివరకు 58 కోట్లకు పైగా బంగారు ఆభరణాలు హాల్‌మార్క్‌తో వచ్చినట్లు గార్గ్ వెల్లడించారు. ప్రస్తుతం నెలకు కోటికి పైగా పసిడి ఆభరణాలను హాల్‌మార్కింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్వచ్ఛంద ప్రాతిపదికన వెండి హాల్‌మార్కింగ్ ప్రారంభం కాగా, మంచి స్పందన వస్తోంది.

● 2025 సెప్టెంబరు 1 నుంచి వెండి ఆభరణాలు, వస్తువులను హెచ్‌యూఐడీ ఆధారిత వ్యవస్థ కింద హాల్‌మార్కింగ్ చేసేందుకు అనుమతించారు. అయితే ఇది ఐచ్ఛికమే. ఇప్పటివరకు 23 లక్షలకు పైగా వెండి వస్తువులకు ధ్రువీకరణ ఇచ్చారు. హాల్‌మార్కింగ్ పొందిన వెండి ఆభరణాల ద్వారా, తక్కువ స్వచ్ఛత కలిగిన ఉత్పత్తులను వినియోగదారులు దూరం పెట్టొచ్చు. వెండి హాల్‌మార్కింగ్ తప్పనిసరి అయితే సర్టిఫైడ్ వెండిని సులభంగా గుర్తించొచ్చు.

వెండి ప్రాసెసింగ్‌ను పెంచాలి: జీటీఆర్ఐ

వెండి కేవలం ఒక విలువైన లోహం మాత్రమే కాదని, కీలకమైన పారిశ్రామిక, ఇంధన ముడివస్తువు అని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) పేర్కొంది. దీర్ఘకాలంగా విదేశాల నుంచి శుద్ధి చేసిన వెండిని పొందుతున్న మన దేశం.. ఇకపై వెండి ప్రాసెసింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించింది. దేశీయంగా శుద్ధి, రీసైక్లింగ్ జరిగితే, వెండి కోసం దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని వివరించింది. ప్రస్తుతం ప్రపంచంలో వెండిని ఎక్కువ ప్రాసెసింగ్ చేస్తున్న దేశంగా చైనా ఉంది. ఏటా 5.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.50,400 కోట్ల) విలువైన వెండి ఖనిజాన్ని చైనా దిగుమతి చేసుకుంటోంది. ప్రపంచం మొత్తంగా ఏటా వెండి ఖనిజం దిగుమతులు 6.3 బి.డాలర్లు (సుమారు రూ.56,700 కోట్లు)గా ఉన్నాయి. చైనా ఈ ముడిపదార్థాన్ని శుద్ధి చేసి, అధిక విలువ కలిగిన వెండిని ఎగుమతి చేస్తోంది.

శుద్ధి చేసిన వెండినే దిగుమతి చేసుకుంటున్నాం

మనదేశం 2024లో 6.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.57,600 కోట్ల) విలువైన శుద్ధి చేసిన వెండిని దిగుమతి చేసుకుంది. ప్రపంచ వెండి వాణిజ్యంలో ఇది 21.4 శాతానికి సమానం. దీంతో ప్రపంచంలోనే శుద్ధి చేసిన వెండిని అత్యధికంగా దిగుమతి చేసుకున్నదిగా మన దేశం నిలిచింది.

● 2024-25లో భారత్ 478.4 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4300 కోట్ల) వెండి ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 4.83 బి.డాలర్ల (సుమారు రూ.43,500 కోట్ల) ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. దిగుమతులపై మన దేశం ఆధారపడటాన్ని ఇది సూచిస్తోంది. 2025 అక్టోబరులో 2.7 బి.డాలర్లు (సుమారు రూ.24,300 కోట్లు), నవంబరులో 1.1 బి.డాలర్ల (రూ.9,900 కోట్ల) వెండిని దిగుమతి చేసుకున్నాం. 2024 ఇదే సమయం దిగుమతులతో పోలిస్తే ఇవి వరుసగా 529%, 126% అధికం కావడం గమనార్హం.

● 2025 జనవరి- నవంబరులో వెండి దిగుమతులు 8.5 బి.డాలర్ల (సుమారు రూ.76,500 కోట్ల)కు చేరాయి. డిసెంబరు చివరికి ఇవి 9.2 బి.డాలర్ల (సుమారు రూ.82,800 కోట్ల)కు చేరి ఉంటాయని అంచనా. 2025 ఏప్రిల్-అక్టోబరు మధ్య భారత్ 5.94 బి.డాలర్ల (సుమారు రూ.53,500 కోట్ల) విలువైన వెండిని దిగుమతి చేసుకుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

దేశ వృద్ధి రేటు 7.4%!

● 2025-26పై ప్రభుత్వ తొలి ముందస్తు అంచనా
● ప్రపంచంలోనే అత్యంత వేగవంత ఆర్థిక వ్యవస్థ మనదే



అమెరికా అధిక టారిఫ్‌లు ఇబ్బంది పెడుతున్నా.. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితులున్నా.. ప్రపంచంలోనే అత్యంత వేగవంత ఆర్థిక వ్యవస్థగా మనదేశం కొనసాగనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4% వృద్ధి రేటు నమోదవుతుందన్న తాజా అంచనాలు ఇందుకు నేపథ్యం. గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ (మోస్పి) విడుదల చేసిన తొలి ముందస్తు అంచనాల ప్రకారం.. 2025-26లో వృద్ధిరేటు, ఆర్‌బీఐ అంచనా వేసిన 7.3% కంటే, ప్రభుత్వ ప్రాథమిక అంచనా అయిన 6.3-6.8% కంటే మెరుగ్గా 7.4 శాతంగా నమోదు కానుంది. గత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు 6.5 శాతమే.

✦ మోస్పి తాజా అంచనాల ప్రకారం.. 2024-25తో పోలిస్తే తయారీ రంగ వృద్ధి రేటు 4.5% నుంచి 7 శాతానికి మెరుగుపడొచ్చు. సేవల రంగ వృద్ధి 7.2% నుంచి 9.1 శాతానికి చేరొచ్చు.

✦ వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధి 3.1 శాతానికి పరిమితం కావొచ్చు.

రూపాయల్లో ఇలా

2025-26లో వాస్తవ లేదా స్థిర ధరల వద్ద జీడీపీ రూ.201.90 లక్షల కోట్లకు చేరొచ్చు. 2024-25 లోని రూ.187.97 లక్షల కోట్ల (ప్రొవిజనల్ అంచనాల)తో పోలిస్తే 7.4% వృద్ధి నమోదవ్వొచ్చు. సాధారణ జీడీపీ విషయానికొస్తే రూ.330.68 లక్షల కోట్ల (2024-25) నుంచి 9% వృద్ధితో రూ.357.14 లక్షల కోట్ల (2025-26)కు చేరొచ్చు.

2026-27లో 6.8%.. గోల్డ్‌మన్ శాక్స్: భారత వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.8 శాతంగా నమోదు కావొచ్చని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. వచ్చే 3/6/12 నెలల్లో డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 89.5/ 91/ 91+ స్థాయికి చేరొచ్చని పేర్కొంది.

అనిల్ అగర్వాల్ కుమారుడు హఠాన్మృతి



గనుల రంగ దిగ్గజ సంస్థ వేదాంతా అధిపతి అనిల్ అగర్వాల్ కుమారుడు అగ్నివేశ్ అగర్వాల్ (49) హఠాత్తుగా మృతిచెందారు. అమెరికాలో జరిగిన స్కైయింగ్ ప్రమాదంలో గాయపడిన అగ్నివేశ్, ఆసుపత్రిలో కోలుకుంటున్న సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మరణించారు. వేదాంతా గ్రూప్ సంస్థ తల్వాండీ సాబో పవర్ లిమిటెడ్ బోర్డులో అగ్నివేశ్ ఉన్నారు. అనిల్ అగర్వాల్‌కు అగ్నివేశ్‌తో పాటు కుమార్తె ప్రియ ఉన్నారు.

కోడి గుడ్డు

8న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	580
వరంగల్	582
విజయవాడ	610
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	585
చిత్తూరు	623

కొత్త తరం ఏఐ టీవీలకు 2026 కీలకం
శామ్‌సంగ్ అంచనా



లాస్‌వెగాస్ (అమెరికా): కృత్రిమ మేధ (ఏఐ) టీవీలకు 2026 'కీలక సంవత్సరం'గా ఉండొచ్చని ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ అంచనా వేస్తోంది. ఇటీవల విడుదల చేసిన కొత్త తరం ఏఐ ఆధారిత ఇంటరాక్టివ్ ఇంటర్‌ఫేస్, వీక్షకులకు సరికొత్త అనుభవం ఇస్తోందని శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ అధ్యక్షుడు (వీడీ విభాగం) ఎస్‌డబ్ల్యూ యాంగ్ పేర్కొన్నారు. టీవీ అనుభూతిని వీక్షించడం నుంచి నేరుగా వీక్షకులతో మమేకం అవ్వడానికి మారుతోందన్నారు. అంతర్జాతీయంగా జరుగుతున్న సీఈఎస్ (కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ ప్రదర్శన) 2026లో ఆయన మాట్లాడారు. స్మార్ట్, మరింత మెరుగైన సేవలను అందించడానికి వినియోగదారుల విశ్వాసం, నాణ్యత పెంపొందించడంపై దృష్టి పెట్టామని యాంగ్ అన్నారు. టీవీ వీక్షణను మరింత కొత్తగా మలిచేందుకు రూపొందించిన ఇంటెలిజెంట్ ప్లాట్‌ఫామ్ విజన్ ఏఐ కంపానియన్ (వీఏసీ)పై శామ్‌సంగ్ దృష్టి పెడుతోంది. వీక్షకులు ఏం చూస్తున్నారు, ఏం కోరుకుంటున్నారో అర్థం చేసుకుని సందర్భానికి అనుగుణంగా వారికి వీఏసీ తోడ్పడుతుంది. 'ఈరోజు టీవీ వీక్షణ ఏఐ ఆధారితంగా మారుతోంది. వీక్షకులు కోరుకునే దాన్ని ఏఐ ఇవ్వడం భారీ మార్పులను తీసుకురానుంది' అని యాంగ్ వివరించారు. కొత్తగా తీసుకొచ్చిన మైక్రో ఆర్‌జీబీ టీవీ, ఓఎల్‌ఈడీ టీవీలతో ప్రీమియం టీవీ విభాగంలో రాణించనున్నట్లు తెలిపారు.

పారామౌంట్ బిడ్‌ను తిరస్కరించిన వార్నర్ బ్రదర్స్
నెట్‌ఫ్లిక్స్‌తో విలీనానికే సానుకూలం

పారామౌంట్ స్కైడాన్స్ ఆఫర్ చేసిన 108.4 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.9.75 లక్షల కోట్ల) బిడ్‌ను వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (డబ్ల్యూబీడీ) తిరస్కరించింది. ఆ మొత్తం 'సరిపోదని', నష్టభయాన్ని కలిగించే కొనుగోలుగా అది మారొచ్చని అంచనా వేసింది. నెట్‌ఫ్లిక్స్‌తో చేసుకున్న ఒప్పందంతో పోలిస్తే, పారామౌంట్ సవరించిన తాజా ఆఫర్ అంత ఆకర్షణీయంగా లేదని వాటాదార్లకు వార్నర్ బ్రదర్స్ తెలిపింది. కంపెనీ, వాటాదార్ల ప్రయోజనాలకు అనుగుణంగా పారామౌంట్ స్కైడాన్స్ టెండర్ ఆఫర్ లేదని, బోర్డు ఏకగ్రీవంగా ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వెల్లడించింది. నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిన 82.7 బిలియన్ డాలర్ల(సుమారు రూ.7.44 లక్షల కోట్ల) ఒప్పందానికే కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించింది.

ఎందుకు తిరస్కరించిందంటే: పారామౌంట్ మార్కెట్ విలువ 14 బి. డాలర్లు మాత్రమే. ఒరాకిల్ సహ వ్యవస్థాపకుడు లారీ ఎలిసన్ వ్యక్తిగతంగా హామీనిచ్చిన 40 బిలియన్ డాలర్ల ఈక్విటీతో పాటు, 54 బి. డాలర్లను రుణంగా తెచ్చి వార్నర్ బ్రదర్స్‌ను కొనుగోలు చేస్తామని ఆ సంస్థ ప్రతిపాదించింది. దీని వల్ల ఇప్పటికే ఆ సంస్థకున్న తక్కువ క్రెడిట్ రేటింగ్ కాస్తా, మరింత పడిపోవచ్చని వార్నర్ బ్రదర్స్ అభిప్రాయపడింది. అదే సమయంలో నెట్‌ఫ్లిక్స్ మార్కెట్ విలువ 400 బి. డాలర్లుగా ఉండడం, మంచి రేటింగ్ కలిగి ఉండడంతో ఇటువైపే మొగ్గుచూపుతోంది.

డిసెంబరు కల్లా ఐజీఎక్స్ రూ.600- 700 కోట్ల ఐపీఓ

ఇండియన్ గ్యాస్ ఎక్స్ఛేంజీ (ఐజీఎక్స్) ఈ ఏడాది చివరికి పబ్లిక్ ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ఎండీ, సీఈఓ రాజేశ్ కుమార్ తెలిపారు. ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.600- 700 కోట్లను సమీకరించే అవకాశం ఉంది. ఐజీఎక్స్‌లో ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజీకి 47% వాటా ఉంది. దీనిని 25 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంది. 'ఐజీఎక్స్ 2025లోనే ఐపీఓకి రావాల్సి ఉంది. ఒక సంవత్సరం సమయం కావాలని అడిగాం. అందువల్ల 2026 డిసెంబరులోపు ఇష్యూ జరగొచ్చ'ని రాజేశ్ కుమార్ వెల్లడించారు. ఐపీఓలో ఆఫర్ ఫర్ సేల్ కింద 22% వాటాకు సమానమైన షేర్లను విక్రయించే అవకాశం ఉందని తెలిపారు. ఐజీఎక్స్ విలువను రూ.2,200- 3,000 కోట్లుగా బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రకారం చూస్తే.. ఐపీఓ ద్వారా విక్రయించే 22% వాటా విలువ రూ.600-700 కోట్లుగా ఉండొచ్చు.

ఎస్‌బీఐ ఫండ్స్ ఇష్యూకు జేపీ మోర్గాన్ దూరం?

ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ పబ్లిక్ ఇష్యూకు మర్చంట్ బ్యాంకర్ల జాబితా నుంచి జేపీ మోర్గాన్, సిటీ గ్రూపు లాంటి విదేశీ దిగ్గజ బ్యాంకర్లు వైదొలిగినట్లు తెలుస్తోంది. తక్కువ రుసుమే ఇందుకు కారణమని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి. సిటీ గ్రూపు స్థానంలో జెఫ్రీస్ ఫైనాన్షియల్ గ్రూపును ఎస్‌బీఐ ఫండ్స్ ఎంపిక చేసింది.

అవే అనిశ్చితులు.. అవే ఆందోళనలు


సెన్సెక్స్ ▼102 84961 | నిఫ్టీ ▼38 26141

మూడో రోజూ సూచీలకు నష్టాలు

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.1,527.71 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు రూ.2,889.32 కోట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ వరసగా మూడో రోజూ నష్టపోయింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రంగానే ఉండటం, భారత ఉత్పత్తులపై మరింత సుంకం విధిస్తామన్న అమెరికా హెచ్చరికలతో మదుపర్ల సెంటిమెంటు బలహీనంగా ఉండటం ఇందుకు నేపథ్యం. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) అమ్మకాలు కొనసాగడమూ సూచీల నష్టాలకు తోడైంది. అయితే బ్లూచిప్ కంపెనీల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కొంత అండగా నిలిచింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 31 పైసలు పెరిగి 89.87 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.05% నష్టంతో 60.68 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో జపాన్, హాంకాంగ్, తైవాన్ నష్టాలతో ముగియగా.. చైనా, దక్షిణ కొరియా, సింగపూర్ సూచీలు రాణించాయి. ఐరోపా మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.479.94 లక్షల కోట్ల (5.34 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.



నష్టారంభం..: బీఎస్ఈ సెన్సెక్స్ 84,620.40 పాయింట్ల వద్ద నష్టాల్లోనే (క్రితం ముగింపు 85,063.34) ఆరంభమైంది. మరికాస్త తగ్గి 84,617.49 పాయింట్లకు చేరాక, సూచీ తేరుకుంది. చివరకు 102.20 పాయింట్లు కోల్పోయి 84,961.14 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 37.95 పాయింట్లు కోల్పోయి 26,140.75 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,067.90 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 26,187.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

12 మినహా మిగతావి నష్టాల్లో..: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 12 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. మారుతీ సుజుకీ 2.84%, పవర్‌గ్రిడ్ 1.64%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.38%, టాటా స్టీల్ 1.32%, ఏషియన్ పెయింట్స్ 1.27%, హిందుస్థాన్ యునిలీవర్ 1.19% చొప్పున తగ్గాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 1.99%, ఇన్ఫోసిస్ 1.72%, టెక్ మహీంద్రా 1.53%, సన్‌ఫార్మా 1.27%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.25% లాభపడ్డాయి.

✦ ఐఐఎఫ్ఎల్ కేపిటల్‌లో 20% వాటా కొనుగోలు చేసేందుకు అమెరికాకు చెందిన ప్రైవేటు ఈక్విటీ సంస్థ టీపీజీ మళ్లీ చర్చలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ వాటా కొనుగోలు కోసం 2025 మధ్య నుంచి టీపీజీ చర్చలు సాగిస్తున్నప్పటికీ.. వాటిని మధ్యలో ఆపేసింది.

✦ 2019 ఏప్రిల్ నుంచి 2020 మార్చి కాలానికి వడ్డీ, జరిమానాతో కలిపి రూ.3.69 కోట్లు చెల్లించాల్సిందిగా ఆహార తయారీ డెలివరీ ప్లాట్‌ఫామ్ **జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్**‌కు జీఎస్‌టీ నోటీసులు వచ్చాయి. విక్రయాలపై పన్ను చెల్లింపులను నిర్దేశిత మొత్తం కంటే తక్కువగా కట్టినందుకు.. ఈ నోటీసులు పంపారు.

టైటన్ షేరు దూకుడు

2025 అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి ఆదాయంలో 40% వృద్ధిని ప్రకటించడంతో టైటన్ షేరు బీఎస్ఈలో 3.94% లాభపడి రూ.4,272.90 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 4.88% పెరిగి రూ.4,312 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది.

ఈ ఏడాది చివరికల్లా 93,918కు సెన్సెక్స్
క్లయింట్ అసోసియేట్స్ అంచనా

2026 డిసెంబరు కల్లా బీఎస్ఈ ప్రామాణిక సూచీ సెన్సెక్స్ 93,918 పాయింట్లను చేరే అవకాశం ఉందని వెల్త్ మేనేజ్‌మెంట్ సంస్థ క్లయింట్ అసోసియేట్స్ (సీఏ)అంచనా వేసింది. షేర్ల ధరలు అధిక స్థాయిల్లో ఉండటానికి తోడు, అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగడం లాంటి సవాళ్లు ఉన్నప్పటికీ సెన్సెక్స్ ప్రస్తుతం కంటే మరింతగా ముందుకెళ్తుందనే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది. ప్రస్తుతం సెన్సెక్స్ 84,961 పాయింట్ల వద్ద ఉంది. ఇక్కడి నుంచి డిసెంబరు నాటికి ఈ సూచీ 11% పెరిగే అవకాశం ఉందన్నమాట. స్టాక్‌మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య కదలాడుతున్న నేపథ్యంలో.. వెండి, బంగారం లోహాలు ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలుగా మారాయని తెలిపింది. 1,100 మందికి పైగా అధిక సంపన్నులు (హెచ్‌ఎన్ఐలు), అల్ట్రా హెచ్‌ఎన్ఐలకు చెందిన 7 బిలియన్ డాలర్ల (సుమారు రూ.63,000 కోట్ల) ఆస్తులను సీఏ నిర్వహిస్తోంది.

సంపద సృష్టికి బంగారం మేలు
దేశీయుల ధోరణిపై డెలాయిట్ ఇండియా



దిల్లీ: మేలిమి బంగారం (బిస్కెట్లు, నాణేలు), పసిడి ఆభరణాలు.. రూపం ఏదైనా సంపద సృష్టికి పుత్తడి మంచి సాధనంగా ఉపయోగపడుతుందని దేశీయ కొనుగోలుదారులు పరిగణిస్తున్నట్లు డెలాయిట్ ఇండియా నివేదిక తెలిపింది. బంగారం రూపంలో సంపదను కాపాడుకోవచ్చని గతంలో భావించేవారు. ఇప్పుడు సంపదను మరింత పెంచుకునేందుకు మ్యూచువల్ ఫండ్, స్టాక్స్ (87%)కు ప్రత్యామ్నాయంగా పసిడిని చూస్తున్న వారి సంఖ్య 86 శాతానికి చేరిందని వెల్లడించింది.

✦ 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న వినియోగదారులు, పెట్టుబడి రీత్యా బంగారాన్ని కొనుగోలు చేయడానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నట్లు పేర్కొంది.

✦ 'భారత్ ఆభరణాల విపణి కొత్త తరుణంలోకి అడుగుపెట్టింది. సంప్రదాయబద్ధంగా ధరించేందుకే పసిడిని కొనడం ఆగింది. సంపద సృష్టికి, హోదా-సామాజిక స్థితిని ప్రదర్శించుకునేందుకు, రోజూ కొత్తగా కనిపించేందుకు పసిడిని వినియోగిస్తున్నారని' డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ప్రవీణ్ గోవింద్ వివరించారు.

వైకాపా ఎమ్మెల్యేలు సభకు రాకుండానే సంతకాలు చేశారా?



అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ ◆ సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు.

ఈనాడు, అమరావతి: వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకున్నా.. బయట రిజిస్టర్‌లో సంతకాలు చేసి వెళ్లిపోయినట్లుగా శాసనసభ నైతిక విలువల కమిటీ గుర్తించింది. అటెండెన్స్ రిజిస్టర్, ఎమ్మెల్యేల వేతనాలు, భత్యాల చెల్లింపు రికార్డులను తెప్పించుకుని పరిశీలించిన కమిటీ.. వాటిలో గుర్తించిన అంశాలపై సమీక్షించింది. కమిటీ ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశంలో సభ్యులు జ్యోతుల నెహ్రూ, ముప్పిడి వెంకటేశ్వరరావు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

మూడు సెషన్లకూ హాజరైనట్లుగానే..

గతేడాది సెప్టెంబరులో జరిగిన శాసనసభ నాలుగో సెషన్ మినహా అంతకుముందు జరిగిన మూడు సెషన్లకూ హాజరైనట్లుగా వైకాపా ఎమ్మెల్యేలు సంతకాలు చేసినట్లు కమిటీ గుర్తించింది. 'ఇది అనైతికం.. వారికి నోటీసులిచ్చి వివరణ కోరాలి' అని జ్యోతుల నెహ్రూ సూచించారు. నిపుణులతో చర్చించి దీనిపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపైనా, ఎమ్మెల్యేలకు నోటీసులివ్వడం గురించి వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుందామని ఛైర్మన్ బుద్ధప్రసాద్ చెప్పినట్లు సమాచారం. బయట రిజిస్టర్‌లో సంతకాలు చేసి, సభలోకి రాకుండా వెళ్లిపోతున్నారని, ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ మినహా మిగిలిన ఎమ్మెల్యేల్లో కొందరు జీతాలు, మరికొందరు టీఏ, డీఏలు కూడా క్లెయిమ్ చేసుకున్నారని కమిటీ గుర్తించినట్లు తెలిసింది.

జగన్ మూడురోజులు..

గతేడాది శాసనసభ తొలి సెషన్ ప్రథమ భాగంలో ఒకరోజు (ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు), సెషన్ కొనసాగింపుగా జరిగిన రెండో భేటీలో గవర్నర్ ప్రసంగం రోజు, ఈ ఏడాది బడ్జెట్ సందర్భంగా జరిగిన మూడో సెషన్‌లో గవర్నర్ ప్రసంగం రోజు మొత్తంగా రెండు సెషన్లలో మూడు రోజులపాటు సభకు వచ్చినట్లుగా జగన్ రిజిస్టర్‌లో సంతకాలు చేసినట్లు కమిటీ గుర్తించింది. గతేడాది జరిగిన రెండో, ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన నాలుగో సెషన్‌లలో మాత్రం ఆయన సంతకాల్లేవని తేల్చింది.

విశ్వసనీయ సమాచారం మేరకు.. కమిటీకి అందిన రికార్డుల ప్రకారం ఎమ్మెల్యేలు సెషన్లవారీగా ఎన్నిరోజులు సంతకాలు చేశారనే వివరాలు..

ఎమ్మెల్యే పేరు	సంతకాలు చేసిన రోజులు..
పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 2లో 2రోజులు
	సెషన్ 3లో 1రోజు
పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 2లో 1రోజు
	సెషన్ 3లో 1రోజు
బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 3లో 1రోజు
తాటిపర్తి చంద్రశేఖర్	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 3లో 3రోజు
వై.బాలనాగిరెడ్డి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 3లో 3రోజులు
దాసరి సుధ	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 3లో 3రోజులు
బి.విరూపాక్షి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 2లో 1రోజులు
	సెషన్ 3లో 3రోజులు
మత్స్యరాస విశ్వేశ్వరరాజు	సెషన్ 1లో 3 రోజులు
	సెషన్ 3లో 2 రోజులు
రేగం మత్స్యలింగం	సెషన్ 1లో 3 రోజులు
	సెషన్ 3లో 3 రోజులు
ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి	సెషన్ 1లో 3రోజులు
	సెషన్ 3లో 2 రోజులు

ఐఐటీల్లో మాతృభాషలో బీటెక్

- తొలి సెమిస్టర్ చదువుకునేందుకు వెసులుబాటు
- ఎంటెక్ సిలబస్ ప్రక్షాళన.. ఇంటర్న్‌షిప్ తప్పనిసరి
- క్రీడలు, ఒలింపియాడ్ కోటా సీట్లూ జోసా ద్వారా భర్తీ
- 56వ ఐఐటీ కౌన్సిల్ నిర్ణయాలివీ..

ఈనాడు, హైదరాబాద్: విద్యార్థులకు ఆంగ్ల భాష సమస్యగా మారకుండా... ఇంజినీరింగ్ విద్యనూ మాతృభాషల్లో అందించాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఐఐటీల్లో బీటెక్ ప్రథమ సెమిస్టర్‌ను వారు కోరుకున్న భాషల్లో చదువుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. వివిధ రాష్ట్రాలు, వివిధ భాషల్లో ఇంటర్, తత్సమాన చదువు పూర్తిచేసి ఐఐటీల్లో సీట్లు సాధించిన వారు తొలి ఆరు నెలలు ఆంగ్లానికి అలవాటు పడే వరకూ మాతృభాషలో చదువుకునేందుకు వీలుకల్పిస్తారు. ఆయా భాషల్లో పాఠ్యాంశాల వీడియోలను ఉంచుతారు. పుస్తకాలను కూడా ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంచుతారు. ఎవరైనా మాట్లాడుతుంటే అప్పటికప్పుడు ఆంగ్ల ఉపన్యాసాలను ప్రాంతీయ భాషల్లోకి తర్జుమా చేసేలా కృత్రిమమేధ(ఏఐ)ను సమర్థంగా ఉపయోగించుకోవాలని, అందుకు ఐఐటీలు ఇతర సాంకేతిక విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర విద్యాశాఖ సూచించింది. గత ఆగస్టు 25వ తేదీన దిల్లీలో 56వ ఐఐటీ కౌన్సిల్ సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఛైర్మన్‌గా ఉన్న కౌన్సిల్ సమావేశంలో 23 ఐఐటీల డైరెక్టర్లు, వాటి ఛైర్మన్లు, యూజీసీ, ఏఐసీటీఈ తదితర అధికారులు పాల్గొంటారు. ఐఐటీలకు సంబంధించి ఏ కీలక నిర్ణయమైనా ఇందులోనే తీసుకుంటారు. నాటి సమావేశ తీర్మానాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ప్రథమ సెమిస్టర్ తర్వాత విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. గత రెండేళ్ల నుంచి ఐఐటీ జోధ్‌పుర్‌లో బీటెక్ ఫస్టియర్‌ను హిందీలో చదువుకునే వెసులుబాటు కల్పించారు.

పరిశ్రమల అవసరాల మేరకు ఎంటెక్...

ఎంటెక్ సిలబస్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. భారత్‌లో బీటెక్ పూర్తయిన తర్వాత ఎందుకు ఎంటెక్‌లో చేరటం లేదన్న దానిపై చర్చించిన ఐఐటీలు.. అందుకు పరిమితంగా స్పెషలైజేషన్లు ఉండటం, ఇంటర్న్‌షిప్ అవకాశాలు లేకపోవడం కారణంగా భావించారు. అందుకే ఎంటెక్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. పరిశ్రమల నిపుణులతో కూడిన కమిటీలను నియమించి.. ఇండస్ట్రీ అవసరాల మేరకు కోర్సులను రూపొందించాలని నిర్ణయించారు.

మరికొన్ని నిర్ణయాలు...

◆ ఒక్కో ఐఐటీలో 3 వేల నుంచి 18 వేల మంది విద్యార్థులున్నారు. వారి మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన కౌన్సెలర్, సైకాలజిస్ట్, సైకియాట్రిస్ట్ లాంటి పోస్టులు సృష్టించనున్నారు. వాటిని రెగ్యులర్ లేదా కాంట్రాక్ట్ విధానంలో నియమించుకుంటారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నందున వాటిని నివారించేందుకు గత కొన్నేళ్లుగా దీనిపై చర్చ సాగుతోంది.

◆ ఐఐటీల్లో సీట్లను జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) ద్వారా భర్తీ చేస్తున్న విషయం తెలిసిందే. క్రీడలు, సైన్స్ ఒలింపియాడ్‌ల ద్వారా కొన్ని సూపర్ న్యూమరరీ సీట్లను ఆయా ఐఐటీలు విడిగా భర్తీ చేసుకుంటున్నాయి. పారదర్శకత కోసం వాటిని కూడా జోసా ద్వారానే భర్తీ చేస్తారు.

◆ ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ ఆచార్యులను గుర్తించి వారిని నియమించాలని.. అందుకు అవసరమైతే నిబంధనలను మార్చుకోవాలని కేంద్ర విద్యాశాఖ ఆదేశించింది.

◆ ఐఐటీలకు భవిష్యత్తులో కూడా సమర్థులైన డైరెక్టర్లను నియమించేందుకు 300-350 మంది చురుకైన ఆచార్యులను గుర్తించి నాయకత్వ లక్షణాలపై రెండేళ్లపాటు శిక్షణ ఇస్తారు. దీనికి ఐఐఎంల సహకారం తీసుకుంటారు. ఐఐటీలను ఎలా తీర్చిదిద్దాలో ప్రణాళిక రూపకల్పనకు ఐఐటీ 2047 పేరిట విజన్ కమిటీని కేంద్ర విద్యాశాఖ నియమించనుంది.

◆ ఈ నిర్ణయాలన్నీ వచ్చే విద్యా సంవత్సరంలో అమలయ్యే అవకాశం లేదని, జోసా ద్వారా క్రీడలు, ఒలింపియాడ్ కోటా సీట్లు, మాతృభాషలో చదువుకునే అవకాశం లాంటివి కొన్ని అమలు కావొచ్చని ఐఐటీ వర్గాలు చెబుతున్నాయి.

11 నుంచి గండికోట ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సవిత. చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు

ఈనాడు, కడప: వైఎస్సార్ కడప జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబింపజేసే గండికోట ఉత్సవాలను ఈ నెల 11వ తేదీ నుంచి మూడు రోజులపాటు ప్రభుత్వం వైభవంగా నిర్వహించనుంది. రాష్ట్ర కార్యక్రమంగా జరగనున్న ఈ ఉత్సవాలకు రూ.3 కోట్లు విడుదల చేసింది. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, వీడియోను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కలిసి కడప కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు.

12 నుంచి బస్సులు నిలిపేస్తాం

- ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘం నిర్ణయం
- 'స్త్రీశక్తి'తో అదనపు భారం.. ఆ మేరకు చెల్లింపులు చేయాలని కొన్నాళ్లుగా అభ్యర్థన

ఈనాడు, అమరావతి: ఆర్టీసీలోని అద్దె బస్సుల యజమానులు సమ్మె చేపట్టబోతున్నారు. ఈనెల 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సులను ఆపేయాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ ఎండీకి సమ్మె నోటీసు ఇవ్వనున్నారు. గతేడాది ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చాక బస్సుల నిర్వహణ వ్యయం పెరిగిందని అద్దె బస్సుల యజమానులు చెబుతున్నారు. ఆ మేరకు ఒక్కో బస్సుకు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు అదనంగా చెల్లించాలని కొన్నాళ్లుగా ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ యాజమాన్యం మంగళవారం రాత్రి సంబంధిత ప్రతినిధులతో చర్చించింది. ఒక్కో బస్సుకు నెలకు రూ.5,200 చొప్పున ఇచ్చేలా బుధవారం సర్క్యులర్ జారీ చేసింది. దీనిపై అద్దె బస్సుల యజమానుల సంఘం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఎంత పెంచుతున్నారనే విషయాన్ని చెప్పకుండా, సర్క్యులర్ జారీచేశారని సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. సమ్మెకు వెళ్లాలనే నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

నిలిచిపోనున్న 2,419 బస్సులు: ఆర్టీసీలో 2,700 అద్దె బస్సులు ఉన్నాయి. వీటిలో స్త్రీశక్తి పథకం అమలవుతున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు 2,419 ఉన్నాయి. సమ్మెకు వెళ్తే ఇవన్నీ ఈ నెల 12 నుంచి నిలిచిపోనున్నాయి. సంక్రాంతి సీజన్‌లో ఇన్ని బస్సులు నిలిచిపోతే తీవ్ర ప్రభావం పడనుంది.

EENADU Vol: 52, Issue: 149 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

వసుంధర

vasundhara@eenadu.in

పోషకాహారంతో క్యాన్సర్‌కు చెక్ పెట్టొచ్చా..!

మా కుటుంబంలో ఈ మధ్యే ముగ్గురికి క్యాన్సర్ వచ్చింది. వాళ్లంతా మా దగ్గరి బంధువులు. రక్త సంబంధం ఉన్నవారే. అందుకే మాకు కూడా వస్తుందేమో అని భయంగా ఉంది. జన్యుపరంగా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందా? మా ఆహారం, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే దీన్ని రాకుండా ఆపగలమా తెలుపగలరు?

- పద్మజ

క్యాన్సర్ రెండు రకాలుగా ఉంటుంది. జన్యుపరంగా వచ్చేదీ, జన్యువులతో సంబంధంలేనిది. అయితే రాకుండా ఉండేందుకు ఈ రెండింటి విషయంలోనూ మనం ఒకే రకమైన జాగ్రత్తలు తీసుకోవాలి. మనం తినే ఆహారం శుభ్రంగా, ఎక్కువ పోషకాలతో ఉంటే మంచిది. అంతేకాదు, ఆహార వేళలు, తీసుకునే పరిమాణం వల్ల కొంత వరకూ దీన్ని రాకుండా అడ్డుకోవచ్చు. అయితే ఇది మీ బరువుపై ఆధారపడి ఉంటుంది. డయాబెటీస్ ఉన్నవారు హెచ్చుతగ్గులు కాకుండా చూసుకోవాలి.


డియర్ వసుంధర
డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

బరువు తగ్గాలనుకుంటే ఆహార నియమాలు పాటిస్తూనే బరువు తగ్గేందుకు ప్రయత్నించాలి. శరీరంలో అదనపు కొవ్వులు తగ్గించి కండరాల పటుత్వాన్ని పెంచుకోవాలి. అప్పుడే కొంతవరకూ ఈ ప్రమాదాన్ని తగ్గించుకోగలం. ఒకవేళ వచ్చినా త్వరగా కోలుకునేందుకు ఆస్కారం ఉంటుంది. పేగు, రొమ్ము క్యాన్సర్లు రాకుండా పీచు పదార్థం ఎక్కువగా ఉండే ఆహారాలు తినాలి. రోజువారీ ఆహారంలో తగినంత ప్రొటీన్ ఉండాలి. ఎందుకంటే బరువు తగ్గే సమయంలో ఇది కండరాలు క్షీణించకుండా ఉండేందుకు సహాయపడుతుంది. ఇంకా పండ్లు, కాయగూరలు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలు, విత్తనాలు డైలీ రొటీన్‌లో భాగం చేసుకుంటే వీటిలోని పోషకాలు క్యాన్సర్‌ను కొంతవరకూ అడ్డుకుంటాయి. చక్కెర, మైదా, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉంటే మంచిది.



మూడు నెలలు కొనసాగించాలి!

తీరిక లేనంత పని, కష్టపడుతున్నా కనపడని ఫలితం, వీటన్నింటికీ తోడు ఇంటాబయటా ఎదురయ్యే హేళనలు... ఇవన్నీ తెచ్చే ఒత్తిడితో సతమతం అవ్వని ఉద్యోగినులు లేరంటే అతిశయోక్తి కాదేమో. దీన్నుంచి బయటపడటానికి మైక్రో వాకింగ్స్, బ్లూమ్ స్క్రోలింగ్ అంటూ ఎన్నో పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. వైద్యం, మందుల మీద ఆధారపడుతున్న వాళ్లూ లేకపోలేదు. కానీ ఈ విధమైన సర్దుబాటు దీర్ఘకాలంలో శారీరక అనారోగ్యాలకీ కారణమవుతుంది. కాబట్టి, సమస్య నుంచి పూర్తిస్థాయిలో బయటపడాలంటే... నృత్యం, తోటపని, చిత్రలేఖనం, సంగీతం, పుస్తకాలు చదవడం... వంటి హాబీలను మూడునెలల పాటు కొనసాగించమంటున్నారు నిపుణులు.

మూడు నెలలే ఎందుకు?

ఒత్తిడికి ప్రధాన కారణం కార్టిసాల్ అధిక విడుదల. ఈ పరిస్థితి అదుపులోకి రావడానికి కనీసం 90 రోజులు పడుతుందట. అలానే ఒత్తిడీ, ఆందోళనలతో మెదడులోని నిర్ణయాలు తీసుకునే విభాగం, జ్ఞాపకశక్తికి కారణం అయ్యే హిప్పోక్యాంపస్‌లు తిరిగి బలపడటానికి 8-12 వారాల సమయం అవసరమని న్యూరోసైన్స్ చెబుతోంది. అంతేకాదు, గుండె లయలు, రక్తపోటు లాంటివి అధికం అయితే అవి సర్దుకోవడానికీ నెలల సమయం పడుతుంది. ఒత్తిడి వల్ల ఎదురయ్యే హార్మోన్ల అసమతుల్యత, నెలసరి ఆలస్యం, అలసట... వంటి వాటి నుంచి బయటపడటానికి మూడు మెనుస్ట్రువల్ సైకిళ్ల సమయం అవసరమట. అందుకే ఈ మూడు నెలల సమయాన్ని సూచిస్తున్నారు నిపుణులు. కాబట్టి నెలల తరబడి ఉండే ఒత్తిడి, రోజుల్లో పోవాలని విశ్వప్రయత్నాలు చేయకుండా నచ్చిన హాబీతో మీ శరీరానికి మూడు నెలల హీలింగ్ టైమ్ ఇవ్వండి.



బంగారం - వెండి

7న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,40,340	1,27,150	2,46,834
విజయవాడ	1,36,865	1,27,850	2,55,000
ప్రొద్దుటూరు	1,41,100	1,29,810	2,52,000
రాజమహేంద్రవరం	1,39,480	1,27,850	2,83,000
విశాఖపట్నం	1,38,270	1,26,750	2,56,000
తమిళనాడు	-----	1,28,000	2,77,000


ఫ్రెడెరిక్సన్

అది మాదే...

మీ బెదిరింపులు ఆపండి..!

ప్రపంచ దేశాల్లోని సహజ వనరులపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దృష్టి ఇప్పుడు గ్రీన్‌ల్యాండ్‌పై పడింది. 'జాతీయ భద్రత రీత్యా మాకు గ్రీన్‌ల్యాండ్ కావాల్సిందే' అంటూ ఆయన చేస్తోన్న హెచ్చరికల్ని అంతే సమర్థంగా తిప్పికొట్టారు డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్. 'మీ బెదిరింపులు ఆపండి. ఆ ద్వీపాన్ని నియంత్రణలోకి తీసుకోవాలనుకోవడం అమెరికాకు కలే' అంటూ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా.. ఆమె నేపథ్యం, అసలు డెన్మార్క్‌కీ గ్రీన్‌లాండ్‌కీ సంబంధమేంటి... వంటి వివరాల్లోకి వెళ్తే...

డెన్మార్క్... ఉత్తర ఐరోపాలోని ఓ స్కాండినేవియన్ దేశం. జట్లాండ్ ద్వీపకల్పంతో సహా మరికొన్ని దీవుల సమూహం. డెన్మార్క్‌తోపాటు మరో రెండు స్వయం ప్రతిపత్తి ప్రాంతాలైన గ్రీన్‌లాండ్, ఫారోదీవుల్ని కలిపి 'డెన్మార్క్ లేదా డానిష్ కింగ్‌డమ్'గా పిలుస్తారు. పురాతన రాజరికాల్లో ఇదీ ఒకటి. ఈ రాజ్యానికి కింగ్ ఫ్రెడెరిక్ సార్వభౌమాధికారి. కానీ రాజ్యంలో పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే పాలన ఉంటుంది. ట్రంప్ గ్రీన్‌లాండ్‌పై చేసిన వ్యాఖ్యలపై డెన్మార్క్ ప్రధాని స్పందించడానికి కారణమిదే.

'ఐరోపాలో అతి చిన్న దేశాల్లో ఒకటి అయినప్పటికీ అత్యంత ధనిక దేశాల్లో ఒకటైన మా డెన్మార్క్ రాజ్యంలో గ్రీన్‌ల్యాండ్ ఎప్పటికీ భాగమే. అయితే దీనికి స్వయం ప్రతిపత్తి ఉంది. పైగా నాటో సభ్యదేశం. ఇప్పటికే రక్షణ ఒప్పందం ద్వారా అమెరికాకు ద్వీపంలో ప్రవేశం లభించింది. అయినా ట్రంప్ పదే పదే దాన్ని విలీనం చేసుకునేందుకు వ్యూహం పన్నుతున్నారు. గ్రీన్‌లాండ్ అమ్మకానికి లేదు. మీ బెదిరింపులు ఆపండి. ఒక మిత్రదేశం పట్ల ఇలాంటి చర్య ఆమోదయోగ్యం కాదు. అది నాటో కూటమి అంతానికి దారితీస్తుంది. డానిష్ రాజ్యంలోని మూడు దేశాల్లో దేన్నీ ఆక్రమించుకునే హక్కు అమెరికాకు లేదు' అంటూ ఘాటుగా బదులిచ్చి మరోసారి వార్తల్లో నిలిచారు ఫ్రెడెరిక్సన్. ఈమె డెన్మార్క్‌లో అతి పిన్నవయస్కురాలైన రెండో మహిళా ప్రధాని.

వర్ణవివక్షకి వ్యతిరేకంగా...

ఫ్రెడెరిక్సన్ ఉత్తర డెన్మార్క్ వాసి. తండ్రి టైపోగ్రాఫర్, తల్లి ఉపాధ్యాయురాలు. సామాజిక కార్యక్రమాల్లో చిన్నప్పటినుంచీ చురుకే. వర్షారణ్యాలు, తిమింగలాల సంరక్షణకీ వర్ణ వివక్షని రూపుమాపేందుకూ కృషిచేశారు. పన్నెండేళ్ల వయసులో నెల్సన్ మండేలాకి మద్దతు పలకడమే కాదు, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అంతర్జాతీయ యువ విభాగంలోనూ చేరారు. ట్రేడ్ యూనియన్‌లోనూ పనిచేశారు.

'24 ఏళ్ల వయసులో 2001లో సోషల్ డెమోక్రాట్ పార్టీ తరఫున తొలిగా సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసి గెలిచా. ఆ సమయంలో మా సీనియర్ నాయకురాలు 'డిగ్రీ పూర్తి చేయాలి' అని గట్టిగా చెప్పడంతో పార్టీలో కొనసాగుతూనే మాస్టర్స్ చేయడానికి యూనివర్శిటీకి తిరిగెళ్లా. అప్పటికే నాకో బిడ్డ. రెండోసారి గర్భవతిగా ఉన్నా. కష్టమైనా నాకిష్టమైన ఆఫ్రికన్ స్టడీస్‌లో మాస్టర్స్ పూర్తిచేశా' అంటారీమె.

2011లో ఉపాధి మంత్రి, తరవాత న్యాయ మంత్రిగా పనిచేశారు ఫ్రెడెరిక్సన్. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వామపక్ష, మధ్య-వామపక్ష పార్టీల కూటమి గెలవడంలో కీలకపాత్ర పోషించి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. 2022లో తమ పార్టీకి అధిక సీట్లు వచ్చేలా చేశారు. ఇతర పార్టీలతో ఒప్పందం చేసుకుని సంకీర్ణ ప్రభుత్వంలో ప్రధానిగా కొనసాగుతున్నారు. మొదటి పెళ్లి విఫలమవడంతో 2020లో చిత్ర దర్శకుడైన బో టెంగ్‌బర్గ్‌ను వివాహం చేసుకున్నారు.

సామాన్య జీవితమే!

'రాజకీయ జీవితంలో నేనూ లింగ వివక్షని ఎదుర్కొన్నా. కానీ నాది కార్మిక వర్గ నేపథ్యం. నాన్న, తాత, ముత్తాత... అందరూ ట్రేడ్ యూనియన్లలో చురుకైన పాత్ర పోషించారు. దాంతో ప్రజా సమస్యలపట్ల చిన్నప్పుడే అవగాహన ఏర్పడింది. ముఖ్యంగా ఆఫ్రికా అంటే ఆసక్తి. 18 ఏళ్ల వయసులో ఒంటరిగా కెన్యాకు వెళ్లినప్పుడు ఏడాదిపాటు ఓ గ్రామంలో నివసించాను. ఆ కుటుంబంతో నా స్నేహం ఇప్పటికీ కొనసాగుతోంది' అంటారీమె.

'ప్రకృతిలో గడపడం ఇష్టం. ఈమధ్యే మిత్రులతో కలిసి భూమినీ కొన్నాం. ట్రాక్టర్‌తో వ్యవసాయం చేయాలనేది నా కోరిక. ప్రధానిగా ఉన్నా నాది సామాన్య జీవితమే. జనం నడిచే చిన్న వీధిలోనే నా నివాసం. అందరిలానే షాపింగ్ చేస్తా. ఉదయం పబ్లిక్ జిమ్‌కే వెళతా' అనే ఈమె ట్రంప్‌ని ఎదిరించి ఎంత వరకూ నిలబడగలరో చూడాల్సిందే. అంతేకాదు, 'ఇది ఒక్క గ్రీన్‌లాండ్ సమస్యే కాదు, ఓ భారీ శక్తి ఇతర దేశాలను బెదిరించడాన్ని అంగీకరిస్తే అన్ని ప్రజాస్వామ్య దేశాల ఆట ముగిసినట్లే' అంటోన్న ఈమె ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండగలమా?!


వైరల్

జపాన్ మౌమి... రాజస్థానీ మధు!

ఆమె పేరు మౌమి. స్వదేశం జపాన్. కానీ అందరికీ ఎలా పరిచయమో తెలుసా? రాజస్థానీ మధు అనే! జపాన్ అమ్మాయికీ రాజస్థాన్‌కీ సంబంధమేంటి? మధుగా ఎందుకు మారింది... అంటే...

ఘూమర్... ఘూమర్ అంటూ సాగే పాట... అమ్మాయిలతో పాటుగా అంతే అందంగా నర్తించే దుస్తులు చూపు తిప్పుకోనివ్వవంటే అతిశయోక్తి కాదు కదూ! ఓరోజు టీవీలో ఆ నృత్యం చూస్తూ అలాగే మనసు పారేసుకున్నారు మౌమి. పదిహేనేళ్ల క్రితం ఓ సినిమాలో కాల్‌బెలియా నృత్యాన్ని చూసి ఆకర్షితురాలయ్యారామె. ఆ దుస్తులపైనా మనసు పడ్డారు. ఇంకేం నేర్చేసుకోవాలి అనుకున్నారు. అప్పట్నుంచీ ఏటా భారత్‌కి రావాలన్న నియమాన్నీ పెట్టుకున్నారు. అందులో భాగంగానే రాజస్థాన్ వచ్చారు. ఓ టీచర్‌ని ఏర్పాటుచేసుకుని కాల్‌బెలియాతోపాటు రాజస్థానీ సంప్రదాయ నృత్యం, జానపదాలు పాడటం వంటివీ నేర్చుకున్నారు. అక్కడి సంస్కృతినీ ఒంటబట్టించుకున్నారు. ఆ జీవనశైలి ఎంతగా నచ్చిందంటే తన పేరునీ 'మధు'గా మార్చుకున్నారామె. కాల్‌బెలియా, ఘూమర్ నృత్యాలకు సంబంధించి భారత్‌లోనే కాదు, జపాన్‌లోనూ ప్రదర్శనలిస్తున్నారామె. టీచర్‌గా మారి వాటిని నేర్పిస్తున్నారు కూడా. 'జానపద వాద్యాలనీ వాయించగలను. నిజానికి నేను ఉద్యోగం చేస్తూనే... విద్యార్థులకు నేర్పుతున్నా. రాజస్థానీ సంప్రదాయ వస్త్రాలను ధరించడానికి నా విద్యార్థినులు ఉత్సుకత చూపిస్తుంటారు. దాన్నీ నేర్పిస్తుంటా. భారతీయ మ్యూజిక్, సినిమాలకు మా దగ్గర ఆదరణ ఎక్కువ. కాబట్టే, నేను చేసి పెట్టే డ్యాన్స్ వీడియోలకీ పాపులారిటీ ఎక్కువ. భారతీయ సంప్రదాయ నృత్యాల్నీ నేర్చుకోవాలనుంది' అనే మౌమికి 'మధు'గానే పాపులారిటీ ఎక్కువ. అన్నట్టూ తను హిందీ చక్కగా మాట్లాడగలరు. జపాన్ వీధుల్లో రాజస్థాన్ సంప్రదాయ దుస్తుల్లో నడవడాన్ని ఇష్టపడే ఈమె... భారత్ తన రెండో ఇల్లు అంటారు.

అందాల అగ్గిపుల్ల చామంతి!


ఇంటి తోట

చలికాలం వచ్చిందంటే చాలు... ఎక్కడ చూసినా చామంతి పూలే కనిపిస్తాయి. వాటిల్లో ఎన్నెన్ని రకాలు! అవన్నీ మనసుకి ఎంత ఆహ్లాదాన్నిస్తాయో కదా! అయితే, వీటిల్లో కాస్త ప్రత్యేకంగా ఉండేది మ్యాచ్‌స్టిక్ క్రిసాన్తిమమే. చూడగానే ఆకట్టుకునే దీన్ని ఎలా పెంచుకోవాలో తెలుసా?

అగ్గిపుల్ల చామంతి... పేరుకు తగ్గట్లే ఈ పువ్వు రేకలు మ్యాచ్ స్టిక్‌ని తలపిస్తాయి. ఇది హైబ్రిడ్ రకం. పూల రేకలు సన్నని గొట్టాల్లా మెలి తిరిగి బంగారు పసుపు రంగు చివర ఎర్రటి వర్ణంతో కనువిందు చేస్తాయి. చలి పెరిగే కొద్దీ ఎరుపు వర్ణం ఎక్కువవుతుంది. ఈ రకం మొక్కల్ని విత్తనాల ద్వారా కాకుండా కొమ్మ కత్తిరింపులతో పెంచుతారు. దాదాపు రెండు అంగుళాల పొడవు వరకే కాదు... గుబురుగా, దృఢంగా పెరుగుతుంది. ఆకులు ఆకుపచ్చ రంగులో సువాసనతో ఉంటాయి. దీన్ని నేలలోనే కాదు కుండీల్లోనూ సులువుగా పెంచుకోవచ్చు.

ఎలా పెంచాలంటే...

అగ్గిపుల్ల చామంతిని పెంచడానికి కనీసం 6-8 గంటల ఎండ అవసరం. నీరు నిలవని సారవంతమైన నేలలో నాటుకోండి. మట్టి పైపొర ఎండిపోయినప్పుడు మాత్రం లోతుగా నీళ్లు పోయండి. ఆకులపై నీళ్లు చల్లొద్దు. ఫాస్ఫరస్ ఎక్కువగా ఉన్న ఎరువుని అందిస్తే బాగా ఎదుగుతుంది. దీనికి గాలి ధారాళంగా ప్రసరిస్తే ఆరోగ్యంగా ఉంటుంది. చీడపీడల్ని తగ్గించుకోవాలంటే సర్ఫ్‌నీళ్లను స్ప్రే చేయండి చాలు. ఇలా సరైన సంరక్షణ చేపడితే ప్రతి సంవత్సరం తిరిగి పూస్తుంది.




విశాలాక్షి

మహిళ చేతుల్లోనే కళకు జీవం!

సాంస్కృతిక వారసత్వం సంప్రదాయ హస్తకళల్లోనే కనిపిస్తుంది అంటారు విశాలాక్షీ రామస్వామి. అందుకే ఎమ్ఆర్ఎమ్ఆర్ఎమ్ కల్చర్ ఫౌండేషన్‌ను స్థాపించి ఆధునికతతో మాయమవుతున్న వారసత్వ నైపుణ్యాలకు తిరిగి జీవం పోస్తున్నారు. కనుమరుగవుతున్న హస్తకళలకు, వస్త్ర సంప్రదాయాలకు ప్రపంచ గుర్తింపునందిస్తున్నారు.



చెట్టినాడ్... ఈ పేరు వినగానే చరిత్రాత్మక చెట్టియార్ ఇళ్లు, దేవాలయాలు, ఆట్టంగుడి టైల్స్, చెట్టినాడ్ వంటకాలు, చేతి వృత్తులు ఇవే గుర్తొస్తాయి. వీటితోపాటు అంతే ప్రత్యేకత కలిగిందే కట్టాన్ కూడా. ఒకప్పుడు చెట్టినాడ్ ఇళ్లలో తప్పనిసరిగా ఈ కట్టాన్(తాటాకుల బుట్ట) ఉండేది. దీన్ని అక్కడ పెళ్లిళ్లు, శుభకార్యాల్లో శుభ సూచికంగా భావించేవారు. ఆధునికత, ప్లాస్టిక్ వాడకంతో ఈ సంప్రదాయ కళలు అంతరించిపోతున్నాయంటారు విశాలాక్షి. 'ఇప్పటి తరానికి అవేంటో కూడా తెలీదు. అందుకే వాటి ప్రత్యేకతని నేటి తరానికి తెలపాలనుకున్నా. ఇందుకు చెట్టినాడ్ పరిసర గ్రామాలకి వెళ్లి ఆ కళను నేనూ నేర్చుకున్నా. కళ బతకాలంటే కళాకారులు కూడా ఉండాలి. ఒకప్పుడు ఇంట్లో ఉండే మహిళలే వీటిని తయారుచేసేవారు. కాలక్రమంలో వాటికి సరైన గుర్తింపు, మార్కెటింగ్ లేక కనుమరుగవుతూ వచ్చాయి. అందుకే ఎమ్ఆర్ఎమ్ఆర్ఎమ్ కల్చర్ ఫౌండేషన్ స్థాపించా. మహిళలకు సహజ పదార్థాలు, సంప్రదాయ పద్ధతిలో కట్టాన్, మంజల్ వంటి చేతివృత్తులను నేర్పిస్తున్నా. ఈ ఫౌండేషన్‌తో యువతకీ, మహిళలకూ ఉపాధినీ కల్పిస్తున్నా. చేతిపనులు, వస్త్రాలు, వాస్తుశిల్పాల పునరుద్ధరణపై మా ఎన్‌జీఓ పనిచేస్తుంది. చెట్టినాడ్ కళలు ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నా. అందుకే 2008లో 'మంజల్' అనే క్రాఫ్ట్ స్టోర్‌ను ప్రారంభించా. దీని ద్వారా ఈ ఉత్పత్తులు దేశంలోని పలు పట్టణాలతోపాటు విదేశాలకూ ఎగుమతి చేస్తున్నా. దీంతో గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుంది. కరోనా సమయంలో అమ్మకాలు తగ్గాయి. కానీ, ఆన్‌లైన్ ఆర్డర్లు, డిజిటల్ అమ్మకాలతో మంజల్ నిలబడింది. పని ఆగలేదు. ఈ ఫౌండేషన్‌తో చెట్టినాడ్ చుట్టుపక్కల గ్రామాల్లో దాదాపు 125మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. మా ఫౌండేషన్‌లోని మహిళల కళలకు యునెస్కో సీల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నా'మంటారు విశాలాక్షి.

మీకు తెలుసా!

రెండేళ్లలోపు చిన్నారులు 250 నుంచి 300 పదాలు మాట్లాడగలరట. బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లిదండ్రులు చెప్పే కబుర్లన్నింటినీ శ్రద్ధగా వింటూ పెరగడంతో వారికి ఇవి తెలుస్తాయి. అప్పటికి వాళ్లు సరిగా మాట్లాడలేకపోయినా శబ్దాలను వేరు చేసి పలుకుతుంటారని అధ్యయనాలు చెబుతున్నాయి.


సంక్రాంతి ముచ్చట్లు

పండుగ కాదు... ప్రాణం!


కాలం మారినా పల్లెల్లో పుట్టిన పండుగ సంస్కృతి మారదు. దానికి చిరునామా మా పెదపాడు సంక్రాంతి. మట్టి ఇళ్లన్నీ పేడతో అలికి, సుద్దతో ముగ్గులు పెట్టి... దాన్ని గోడలకీ చిలికితే పండుగ కాంతితో మెరిసిపోయేవి. ఎండుకొబ్బరి చెక్కలు, పాత పంటల కర్రలతో వేసే భోగిలో పల్లె జీవనంలోని అలసటంతా కాగిపోతుంది. 'నా గాలి పటమే' అన్నింటికన్నా పైన అంటూ పోటీలు... ఈ క్రమంలో దారం తెగినా నవ్వులు మాత్రం ఆగేనా? సంక్రాంతి సమయంలో ఊరంతా అరిసెల వాసనే! నీ, నా ఇల్లు అన్న తేడా ఉండదు. ఎవరు ఏం చేసుకున్నా పంపకాలు తప్పనిసరే. ఎవరి ముగ్గు పెద్దదన్న చర్చలే. పల్లె ఐక్యతకు నిదర్శనాలే ఇవన్నీ. కనుమనాడు కొత్త తాళ్లు, గంటలు, అలంకారాలతో ఎడ్లను అలంకరించి ఊరంతా తిప్పుతోంటే ఆ కళే వేరు. గంగిరెద్దులు వస్తే... బియ్యం, నాణాలు పట్టుకుని పిల్లలు తీసే పరుగులు... ఆ జ్ఞాపకాలే వేరు. కాలం మారింది. మా జిల్లా పశ్చిమ గోదావరి నుంచి ఏలూరు అయ్యింది. అయితేనేం, పెదపాడు సంక్రాంతి ఆత్మ మారలేదు. పంట పొలాల మధ్య పుట్టిన పండుగ జ్ఞాపకాలు ఇప్పటికీ మనసులో పొగమంచులా కమ్ముకుని గాలిపటాల్లా ఎగురుతూనే ఉన్నాయి. అది పండుగ కాదు, మా పెదపాడు పల్లె ప్రాణం.


- శాంతి జలసూత్రం, పెదపాడు, ఏలూరు జిల్లా



మీకూ ఇలాంటి జ్ఞాపకాలున్నాయా... అయితే, మాతో పంచుకోండి.

రంగవల్లిక


17 చుక్కలు
9 వచ్చేవరకూ
మధ్య చుక్క
శ్రీరాంభట్ల దీప్తి పాటిల్, హ్యూస్టన్, యూఎస్ఏ


శివ సాయి శర్వణి
నర్సరావుపేట
13 చుక్కలు
7 వచ్చేవరకూ
మధ్య చుక్క


వై.కల్యాణి
కోళ్లమిట్ట,
సూళ్లూరుపేట
21 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిల్మ్‌సిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in


ఈనాడు సినిమా

మేము శబ్దం చేస్తే... ఈ ప్రపంచమే నిశ్శబ్దం


బాలకృష్ణ

"దేశం జోలికి వస్తే మీరు దండిస్తారు.. దైవం జోలికి వస్తే మేము ఖండిస్తాం.. మీ భాషలో చెప్పాలంటే సర్జికల్ స్ట్రైక్" అంటూ థియేటర్లలో అభిమానులను పూనకాలు తెప్పించారు అగ్రహీరో బాలకృష్ణ. ఆయన ప్రధాన పాత్రలో బోయపాటి శ్రీను తెరకెక్కించిన చిత్రం 'అఖండ2: తాండవం'. సంయుక్త మేనన్, ఆది పినిశెట్టి, హర్షాలీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. సనాతన ధర్మం, భారతీయుల నమ్మకాల లాంటి అంశాలతో రూపొంది ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా సినీప్రియుల్ని మెప్పించింది. ఇందులో అఘోర పాత్రలో కనిపిస్తూ.. "మేము ఒకసారి లేచి శబ్దం చేస్తే.. ఈ ప్రపంచమే నిశ్శబ్దం" అంటూ శక్తిమంతమైన సంభాషణలతో ప్రేక్షకుల్ని అలరించారు బాలకృష్ణ. ఇప్పుడీ ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ శుక్రవారం నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా అలరించడానికి సిద్ధమైంది.

'ధురంధర్' వసూళ్ల రికార్డ్


రణ్‌వీర్ సింగ్

"మీరంతా మీ బాణాసంచాతో ఆడుకోవడం ముగించినట్లయితే.. ఇక నేను టపాసుల మోత మొదలు పెడతా" అంటూ థియేటర్లలో అదరగొడుతోంది 'ధురంధర్' చిత్రం. రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన చిత్రమిది. ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ బాక్సాఫీస్ వద్ద వసూళ్లతో రికార్డులు సృష్టిస్తోన్న ఈ సినిమా ఇప్పుడు మరో మైలు రాయిని అందుకుంది. ఒకే భాషలో మాత్రమే విడుదలై దేశవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా నిలిచింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ జియో స్టూడియోస్ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. "చరిత్ర తిరగరాయబడింది. మంగళవారం నాటికి రూ.831.40(నెట్) కోట్లకు చేరువ వసూళ్లు. ఇవి భారతీయ సినిమాలో ఎప్పటికీ గుర్తుండిపోయే క్షణాలు. అత్యధిక వసూళ్లు సాధించిన సింగిల్ లాంగ్వేజ్ చిత్రంగా 'ధురంధర్' చరిత్ర సృష్టించింది. దర్శకుడు ఆదిత్యధర్‌తో పాటు చిత్రంలో భాగమైన వారందరికీ అభినందనలు. రానున్న ఎన్నో సినిమాలకు 'ధురంధర్' స్ఫూర్తినిస్తుంది"ని ఆ పోస్ట్‌లో పేర్కొంది.

అనిల్ కథ సిద్ధం చేస్తే వెంకీతో మరో సినిమా

- 'మన శంకరవరప్రసాద్‌గారు' వేడుకలో చిరంజీవి


అనిల్ రావిపూడి, చిరంజీవి, వెంకటేశ్, సుస్మిత కొణిదెల, సాహు గారపాటి

"చిత్ర పరిశ్రమలో నిర్మాతలు మొదలుకొని... బయ్యర్ల వరకూ అందరూ సుభిక్షంగా ఉండటమే నిజమైన సంక్రాంతి. 2026 సంక్రాంతి తెలుగు చిత్ర పరిశ్రమ మరిచిపోనంత ఘనంగా ఉండాలని కోరుకుంటున్నా" అన్నారు చిరంజీవి. ఈ సంక్రాంతి మా సినిమాది మాత్రమే కాదనీ, మన తెలుగు చిత్ర పరిశ్రమది కావాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మన శంకరవరప్రసాద్‌గారు' విడుదలకు ముందస్తు వేడుక బుధవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి, వెంకటేశ్ కలిసి నటించిన చిత్రమిది. నయనతార కథానాయిక. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. వేడుకకు చిరంజీవి, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిరంజీవి మాట్లాడుతూ "నాకు ఆప్తుడైన వెంకటేశ్‌తో కలిసి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ పక్కాగా పండగ సినిమాలే. అన్ని సినిమాల్నీ థియేటర్లలో చూసి ఆస్వాదించండి. చాలా రోజుల కిందట ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మీరు సినిమా చేస్తే బాగుంటుందని నాతో అన్నారు. ఆయన అన్నట్టుగానే గతేడాది ఆరంభంలో ఆయన చేతులమీదుగానే ఈ సినిమా ప్రారంభమైంది. ఆయన కెరీర్‌లో ఘన విజయం సాధించిన 'ఘరానా మొగుడు' తరహాలో మంచి కామెడీతో ఈ సినిమా కథ కుదిరింది. నేటి తరానికి మీరు గతంలో చేసిన సినిమాల్ని పరిచయం చేసినట్టుగా ఉండాలంటూ ఈ స్క్రిప్ట్‌ని చెప్పాడు అనిల్. అప్పట్లో నేను చేసిన సన్నివేశాల్ని చూపిస్తూ, ఇలాంటి టైమింగ్ కావాలంటూ నాతో ఈ సినిమా చేయించాడు. అనిల్‌తో ఈ సినిమా చేయడం నాకు మంచి అనుభవం. చిత్రీకరణ అయిపోయిన ఆఖరి రోజున ఎంతో భావోద్వేగానికి గురయ్యాను. అలాంటి అనుభవం ఈమధ్య నాకు ఎప్పుడూ కలగలేదు. రోజూ ఓ విహారానికి వెళ్లినట్టుగా ఉండేది. బడ్జెట్ పరంగా, పనిరోజులు పరిమితి దాటకుండా సినిమా చేయడమే దర్శకుడి తొలి విజయం. తను కథ సిద్ధం చేస్తే నేను, వెంకటేశ్ కలిసి పూర్తిస్థాయి సినిమా చేస్తాం. నా సోదరుడు వెంకటేశ్‌ని ఎప్పుడు కలిసినా సరే, మేం సరదాగా మాట్లాడుకుంటాం. సాహు గారపాటి గుంభనంగా ఉంటూ, తన పని తాను చేస్తుంటాడు. నా బిడ్డ సుస్మిత ఈ సినిమాకి మరో నిర్మాత. ఈ పరిశ్రమలోకి రావాలనుకున్నప్పుడు కష్టపడి పనిచేస్తే కచ్చితంగా ఆదరణ దక్కుతుందని చెప్పా. 'నువ్వు సాధించి చూపించావు, నిన్ను ఆదర్శంగా తీసుకుని నిరూపించుకోవాలి' అంటూ ఎంతో శ్రమించింది. తండ్రికి ఓ బహుమానంలా ఈ సినిమాని నాకు ఇస్తోంది" అన్నారు. వెంకటేశ్ మాట్లాడుతూ "చిరంజీవితో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభవం. ఇందులో మేమిద్దరం కలిసి రచ్చ చేశాం. నాదీ, దర్శకుడు అనిల్ రావిపూడి కలయిక ప్రత్యేకమైనది. సంక్రాంతి సందర్భంగా ఎప్పట్లాగే ఆదరించాలని కోరుకుంటున్నా. అన్ని సినిమాలూ ఆదరణ పొందాలి, అప్పుడే తెలుగు చిత్ర పరిశ్రమ బాగుంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.



అన్ని రకాల భావోద్వేగాలు 'రాజాసాబ్' సొంతం

తమన్, కృతిప్రసాద్, నిధి అగర్వాల్, టీజీ విశ్వప్రసాద్, రిద్ధికుమార్, మారుతి

"ప్రభాస్‌ని మీరంతా ఎలా చూడాలని కోరుకుంటున్నారో అలా 'రాజాసాబ్'లో కనిపిస్తార"న్నారు మారుతి. ప్రభాస్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన చిత్రమే 'ది రాజా సాబ్'. మాళవిక మోహన్, రిద్ధికుమార్, నిధి అగర్వాల్ కథానాయికలు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం రాత్రి నుంచే ప్రీమియర్లను వేయనున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. దర్శకుడు మారుతి మాట్లాడుతూ "దాదాపు ఏడాదిన్నర పాటు రాజాసాబ్ భవంతి సెట్ మాకు ఇల్లుగా మారిపోయింది. తమన్ తన సంగీతంతో ఈ సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లారు. మీరు ఎంత ఎనర్జీతో థియేటర్లోకి వెళతారో అంతకుమించి ఆనందంతో బయటికివస్తారు" అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ.."హారర్, కామెడీ, రొమాన్స్, ఎమోషన్స్...ఇలా అన్ని రకాల భావోద్వేగాలు ఉన్న చిత్రం 'రాజాసాబ్'. ఇప్పటివరకూ మన దేశంలో ఇంత పెద్ద స్థాయిలో హారర్ ఫాంటసీ చిత్రం రాలేదు. ఈ చిత్రాన్ని మీరు థియేటర్‌లో చూసి ఆస్వాదించండి"అన్నారు. ఈ కార్యక్రమంలో రిద్ధికుమార్, కృతిప్రసాద్, సంగీత దర్శకుడు తమన్, నిధి అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఈటీవీ విన్, సీబీఐటీ అవగాహన ఒప్పందం


సీబీఐటీ ప్రిన్సిపల్ సీవీ నరసింహులు, ఈటీవీ విన్ హెడ్ సాయి కృష్ణ తదితరులు

ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్, హైదరాబాద్ గండిపేటలోని సీబీఐటీ(చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కళాశాల ఛాయ ఫిల్మ్ క్లబ్ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు సామాజిక ఇతివృత్తంతో కూడిన సినిమాలు నిర్మించడంలో సీబీఐటీ కళాశాల విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించడం, సినిమా, మీడియా విభాగాలలో ఇండస్ట్రీకి సంబంధించి నైపుణ్యాలను మెరుగుపరచడం, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ కొయిని, సీబీఐటీ కళాశాల ప్రిన్సిపల్ సీవీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నార్సింగి

విజయ్ చిత్రం విడుదల వాయిదా


విజయ్

తమిళ కథానాయకుడు విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బుధవారం రాత్రి సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది. హెచ్.వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 9న విడుదల కావల్సి ఉంది. అయితే సెన్సార్ బోర్డ్ నుంచి ధ్రువీకరణ పత్రం అందలేదు. దాంతో చిత్ర బృందం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. జనవరి 9న న్యాయస్థానం నుంచి తుది ఉత్తర్వులు రానున్న దృష్ట్యా, సినిమా విడుదలని నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది చిత్రబృందం. తదుపరి తేదీని త్వరలోనే వెల్లడించనున్నట్టు తెలిపింది. ఈ చిత్రాన్ని తెలుగులో 'జన నాయకుడు' పేరుతో విడుదల చేయాలనుకున్న విషయం తెలిసిందే. ఇటీవల రాజకీయ ప్రవేశం చేసిన విజయ్ ఆఖరి చిత్రం ఇది.

ఆహా ఓహో... అందం నీదే!


ఐశ్వర్య అర్జున్

ఆల్‌రౌండర్ అనిపించుకున్న ప్రముఖ నటుడు అర్జున్ దర్శకత్వంలో... ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'సీతాపయనం'. నిరంజన్, సత్యరాజ్, ప్రకాశ్‌రాజ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 14న తెలుగుతోపాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. తాజాగా ఇందులోని అసలు సినిమా... అంటూ సాగే పాటని విడుదల చేశారు. 'ఆహా ఓహో అంటాడు.. అందం నీదే అంటాడు...' అనే పదాలతో మొదలయ్యే ఈ గీతానికి చంద్రబోస్ సాహిత్యం సమకూర్చగా, శ్రేయ ఘోషల్ ఆలపించారు. అనూప్ రూబెన్స్ స్వరపరిచారు. ఈ చిత్రానికి సంభాషణలు: బుర్రా సాయిమాధవ్.

సంక్రాంతికి సరదాగా గోల చేద్దాం!

- రవితేజ


కిశోర్, డింపుల్, రవితేజ, ఆషిక, సుధాకర్

'పండగ కదా, ముందుగా వినోదం, ఆ తర్వాతే మిగతావి...' అంటూ నవ్వుల సందడిని షురూ చేసింది 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' ట్రైలర్. రవితేజ కథానాయకుడిగా ఎస్.ఎల్.వి.సినిమాస్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా ఈ నెల 13న రానున్న విషయం తెలిసిందే. ఇందులో రవితేజ సరసన డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ నటించారు. కిశోర్ తిరుమల దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. బుధవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ వేడుక జరిగింది. పెళ్లి తర్వాత ప్రేమలో పడిన వ్యక్తిగా రవితేజ చేసే సందడే ప్రధానంగా ఈ చిత్రం రూపొందినట్టు ట్రైలర్ చాటుతోంది. వరుసగా మాస్, యాక్షన్ సినిమాల తర్వాత రవితేజ చేసిన సరదా సరదా చిత్రమిది. 'పండగ కదా, ముందు వినోదం...' అంటూ సత్య, 'మన షో మనమే బుక్ చేసుకోవడం అంటే ఇదే...' అంటూ సునీల్ తదితరులు చేసే సందడి ఈ ట్రైలర్‌కి ఆకర్షణగా నిలిచింది. ట్రైలర్ ఆవిష్కరణ అనంతరం కథానాయకుడు రవితేజ మాట్లాడుతూ "ఈ సంక్రాంతికి ఇదొక్కటే కాదు, అన్ని సినిమాలూ వినోద ప్రధానమైనవే. ఈసారి వినోదాల సంక్రాంతి అవుతుందని నా నమ్మకం. అంతా సరదా సరదాగా గోల చేసేద్దాం" అన్నారు. కథానాయిక ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ "స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చూడాల్సిన సినిమా ఇది. ఇప్పటికే పాటలు, టీజర్‌కి అద్భుతమైన స్పందన లభించింది" అన్నారు. డింపుల్ హయాతి మాట్లాడుతూ "రవితేజతో నాకు ఇది రెండో సినిమా. నా తొలి సంక్రాంతి సినిమా. అందరూ థియేటర్‌కి వచ్చి ఈ సినిమాని ఆస్వాదించాలని కోరుకుంటున్నా" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "మంచి వినోదం ఉన్న సినిమా ఇది. అందరూ చూసి ఆస్వాదించేలా ఉంటుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "నవ్వించడమే లక్ష్యంగా రూపొందించిన చిత్రమిది. సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాలూ ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ వేడుకలో కథానాయికలతో కలిసి డ్యాన్స్ చేశారు దర్శకుడు. ఈ కార్యక్రమంలో నటులు రోహన్, మురళీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అందరితో కలిసిపోయే బంగారం


సమంత

"మీరు చూస్తా ఉండండి... 'మా ఇంటి బంగారం' మీ అందరితో కలిసిపోతుంది" అంటోంది కథానాయిక సమంత. ఆ కథేమిటో తెలియాలంటే 'మా ఇంటి బంగారం' సినిమా విడుదల వరకూ ఎదురు చూడాల్సిందే. సమంత ప్రధాన పాత్రధారిగా... నందినిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు కలిసి నిర్మిస్తున్నారు. 'ఓ బేబీ' తర్వాత సమంత, నందినిరెడ్డి కలిసి చేస్తున్న చిత్రమిదే. ఈ నెల 9న టీజర్ ట్రైలర్‌ని విడుదల చేస్తున్నారు. విభిన్నమైన కథ, భావోద్వేగాలున్న ఈ సినిమా ఓ బలమైన ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుషా కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఓం ప్రకాశ్, సంగీతం: సంతోశ్ నారాయణన్, కథనం, సంభాషణలు: వసంత్ మారిగంటి, రాజ్ నిడిమోరు.


సంతోశ్ శోభన్, మానస వారణాసి

ప్రేమికుల రోజున...

సంతోశ్ శోభన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'కపుల్ ఫ్రెండ్లీ' ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. యు.వి.క్రియేషన్స్ సమర్పణలో... యు.వి.కాన్సెప్ట్స్ సంస్థ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తున్న చిత్రమిది. మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత ప్రధానమైన ప్రేమకథగా రూపొందుతున్న చిత్రమిది. బుధవారం ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించాయి సినీ వర్గాలు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆదిత్య రవీంద్రన్, ఛాయాగ్రహణం: దినేశ్ పురుషోత్తమన్, కూర్పు: గణేశ్ శివ, కళ: మైఖేల్ బీఎఫ్ఏ.

ఆ అభద్రతాభావం లేదు



సాక్షి వైద్య

ఆలస్యమైనా ఓ మంచి సినిమాతోనూ... గుర్తుండిపోయే పాత్రతోనూ ప్రేక్షకుల ముందుకొస్తున్నట్టు చెప్పారు సాక్షి వైద్య. 'ఏజెంట్' సినిమాతో తెరకు పరిచయమైన కథానాయిక ఈమె. రెండో చిత్రం 'గాండీవధారి అర్జున' తర్వాత కొన్ని విరామం తీసుకుని, 'నారీ నారీ నడుమ మురారి'లో ఓ కథానాయికగా నటించింది. శర్వానంద్ కథానాయకుడు. సంయుక్త మరో కథానాయిక. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం సంక్రాంతిని పురస్కరించుకుని ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు కథానాయిక సాక్షి వైద్య.

"తెలుగులో తొలి రెండు అవకాశాలు వెంటవెంటనే వచ్చాయి. 'ఏజెంట్' చిత్రీకరణలో ఉన్నప్పుడే 'గాండీవధారి అర్జున' కోసం నన్ను సంప్రదించారు. వెంటనే ఒప్పుకున్నా. అయితే ఆ రెండు సినిమాల తర్వాత మలయాళం నుంచి అవకాశం రాగా, అటువైపు వెళ్లాను కానీ.. తెలుగులో మాత్రం తొందరపడలేదు. ఏదో ఒకటి చేయాలని ఏది పడితే అది చేయకుండా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలనుకున్నా. అయితే 'ఏజెంట్' వేడుకలోనే నిర్మాత అనిల్ సుంకర నా దగ్గరకు వచ్చి తర్వాత 'మనం కలిసి మరో సినిమా చేద్దాం' అని చెప్పారు. ఆయన ఆ మాటని నిలబెట్టుకుంటూ నాకు 'నారీ నారీ నడుమ మురారి'లో అవకాశాన్ని ఇచ్చారు. సరైన అవకాశం కోసమే నేను చాలా రోజుల పాటు ఎదురు చూశా. అది ఈ సినిమాతోనే దక్కడం ఎంతో తృప్తినిచ్చింది".

- "ఇందులో నేను పోషిస్తోన్న నిత్య పాత్ర నా వ్యక్తిత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. కాకపోతే ప్రపంచానికి అవసరమైనదాని కంటే ఎక్కువ అమాయకత్వం నిత్యలో కనిపిస్తుంది. అదంతా తెరపై చూసి, కడుపుబ్బా నవ్వుకుంటారు. ఇందులో నాతోపాటు మరో కథానాయిక ఉందనే అభద్రతాభావం కానీ, తెరపైన ఎవరు ఎక్కువ సమయం కనిపిస్తారో అనే భయాలు కానీ నాలో ఏమాత్రం కలగలేదు. హీరో శర్వానంద్, నటులు నరేశ్, వెన్నెల కిశోర్, సంయుక్త తదితరులతో కలిసి నటించడం మంచి అనుభవం. దర్శకులపై రకరకాల ఒత్తిళ్లు ఉంటాయి. కానీ ఈ సినిమా సెట్‌లో మాత్రం రామ్ అబ్బరాజు ఎప్పుడూ నవ్వుతూనే కనిపించేవారు. దాంతో మా పని మరింత సులభమైపోయేది".
- "ఆరంభంలోనే నా కెరీర్ ఒడిదొడుకులకు గురైన మాట నిజమే. అయితే నా పనిని నేను చేసుకుంటూ వెళ్లడమే నా చేతుల్లో ఉందనే విషయం నాకు ఆ తర్వాత అర్థమైంది. అందుకే ఏమాత్రం నిరుత్సాహపడలేదు. హిందీలోనూ సరైన అవకాశం వస్తే చేద్దామనుకున్నా. కానీ ఏదీ తృప్తినివ్వలేదు. 'నారీ నారీ నడుమ మురారి'తో కథ మొత్తం మారిపోతుందని నమ్ముతున్నా. తెలుగులో ఇటీవలే ఒక ప్రాజెక్ట్ ఖరారైంది".

లాజిక్ తక్కువ... మ్యాజిక్ ఎక్కువ!


రాజేంద్రప్రసాద్

ఒక కొత్త రకమైన కథతో... కొత్త దర్శకుడు చేస్తున్న కుర్రకారు సినిమానే 'పాంచాలి పంచ భర్తృక' అన్నారు ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్. ఆయన ఓ కీలక పాత్రధారిగా... వెంకట్ దుగ్గిరెడ్డి, రాజ్‌పవన్, జెమినీ సురేశ్, ర్యాప్ సింగర్ రోల్ రిడా కథానాయకులుగా నటించిన చిత్రమిది. 'లెస్ లాజిక్... మోర్ మ్యాజిక్...' అనేది ఉపశీర్షిక. గంగ సప్తశిఖర దర్శకుడు. వెంకట్ దుగ్గిరెడ్డి నిర్మాత. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "సరదాగా సాగే చిత్రమిది. ఇందులో నా పాత్ర ఏమిటనేది తెరపైనే చూడాలి. చాలా కాలం తర్వాత ఒక మంచి హాస్య ప్రధానమైన సినిమాలో నటించిన అనుభూతి కలిగింది. ఇలాంటి చిత్రాల ఆదరణతోనే కొత్తతరానికి ప్రోత్సాహం దక్కుతుంది" అన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ "మనం విన్నదే అయినా, ఇలాంటి పేరు పెట్టడానికి ఎవ్వరూ ధైర్యం చేయలేదు. ఈ సినిమా ప్రేక్షకులకు మంచి వినోదం పంచాలని, విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు.

తారాసుకి గీతం


'ద్రౌపది 2'

రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసుదన్ హీరోహీరోయిన్లుగా మోహన్.జి తెరకెక్కించిన చిత్రం 'ద్రౌపది 2'. సోల చక్రవర్తి నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా నుంచి 'తారాసుకి' అనే పాటని విడుదల చేసింది. ఈ గీతానికి దర్శకుడు సాహిత్యమందించారు. జిబ్రాన్ స్వరాలు సమకూర్చడంతో పాటు.. గోల్డ్ దేవరాజ్, గురు హరిరాజ్‌తో కలిసి ఆలపించారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని చిత్రబృందం తెలిపింది.

మకరందం

■ makarandam@eenadu.in

గురువారం జనవరి 8, 2026

ఈనాడు

15 | మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

భోగభాగ్యాల భోగి

మకరసంక్రాంతి.. నాలుగు రోజుల పండుగ. ధాన్యరాశులు ఇల్లు చేరి.. రైతన్నల సంబరం అంబరాన్నంటే సమయం. ముగ్గుల ముంగిళ్లు, గొబ్బెమ్మల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలతో తెలుగు నేల కళకళలాడుతుంది. సంతోషాలు పంచుతుంది. ప్రకృతితో మమేకమయ్యే జీవనశైలిని అలవరుస్తుంది.

సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించే ఈ పుణ్యకాలం కాలమార్పు మాత్రమే కాదు, అది మన సంస్కృతికి చిహ్నం. సంక్రాంతి పండుగలో మొదటిదైన భోగి ఆత్మీయత విశిష్టమైనది. భోగి మంటలు, భోగిపండ్లు మనసును పరవశింపజేస్తాయి. భోగి అంటే అనుభవించడం అని అర్థం. ఈ రోజున ఇంద్రుడిని పూజిస్తారు. కాలానికి తగ్గట్టు వర్షాలు కురిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. గోదాదేవి శ్రీరంగనాథుని అందుకున్నది కూడా భోగినాడే.



సానుకూల దృక్పథం..

భోగి రోజు సాయంత్రం భోగిపండ్ల వేడుక ఆనవాయితీ. రేగుపండ్లు, చిల్లర నాణేలు, అక్షతలు, పూలరేకులు కలిపి పిల్లల తల మీద పోసే ఈ ఆచారం చిన్నారులకు రక్షణ కవచం. బంధుమిత్రులను పిలిచి.. పిల్లలకు హారతిచ్చి, దిష్టి తీసి, ఆశీస్సులనందిస్తారు. రేగుపండును బదరీ ఫలం అంటారు. ఇది విష్ణుమూర్తికి ప్రీతికరమైనది. ఈ పండ్లు తల మీద పోయడం వల్ల వారికి దృష్టి దోషాలు తొలగుతాయని, శ్రీమన్నారాయణుడి కృప కలుగుతుందని విశ్వసిస్తారు. ఈ ఆచారం బాల్యంలో అందరూ కలిసి మెలిసి ఉండాలనే ధోరణిని, సానుకూల దృక్పథాన్ని అలవరుస్తుంది. ప్రేమానురాగాలను పెంచుతుంది. శాస్త్రీయంగా చూస్తే.. రేగుపండ్లలో సి-విటమిన్ అధికంగా ఉంటుంది కాబట్టి.. ఈ వంకతో వీటిని తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

కోడి పందేల కోలాహలం

పల్లెల్లో హరిదాసులు తల మీద అక్షయపాత్ర ధరించి, శ్రీహరి నామస్మరణ చేస్తూ ఇంటింటికీ తిరుగుతుంటే.. గంగిరెద్దులవారు సన్నాయి మేళంతో సందడి చేస్తారు. రైతులు తాము పండించిన పంట చేతికి అందిన వేళ.. ఆ ఆనందాన్ని పదిమందితో పంచుకోవడమే ఈ పండుగ పరమార్థం. భోగి వంటకాల రుచి గురించి చెప్పాలంటే అది వర్ణనాతీతం. కొత్త బియ్యంతో చేసే అరిసెలు, పులగం, నువ్వుల పొడి చల్లిన కూరలు, సజ్జ రొట్టెలు శరీరానికి తగిన వేడిని, బలాన్ని ఇస్తాయి. ప్రకృతిని దైవంగా భావించి పూజించడం, పశుపక్ష్యాదుల పట్ల కరుణ చూపడం, అతిథి మర్యాదలు నిర్వహించడం వంటి ఉన్నత విలువలు సంక్రాంతి సంబరాల్లో కనిపిస్తాయి. ఈ పండుగ సందర్భంగా నిర్వహించే కోడి పందేలు, ఎడ్లబండ్ల పోటీలు వంటివి ఉత్సాహాన్ని నింపుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే సంక్రాంతి పండుగ.. పిల్లలూ పెద్దలూ అందరిలో నూతనోత్తేజాన్ని కలిగించి, ఉల్లాసభరితం చేస్తుంది.

గాలిపటాలు ఆకాశాన్ని రంగులమయం చేసి స్వేచ్ఛకు అర్థం చెబుతాయి. ఉత్సాహాలను పంచుతాయి. ఆవులను, ఎడ్లను పూజించే ఈ ఆచారం మనకు పశువుల మీద ఉన్న గౌరవాన్ని చాటుతుంది. రైతులకు ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ మరింత బలోపేతం చేస్తుంది. మంచు కురిసే చలిలో భోగి మంటల వేడి ప్రాణవాయువులా పనిచేస్తుంది. ప్రతి ఆచారాన్నీ ఆరోగ్యం, ఆధ్యాత్మికతలతో మేళవించడం మన పూర్వీకుల గొప్పదనానికి నిదర్శనం. పిల్లల కేరింతలు, పెద్దల దీవెనలు వెరసి భోగి ఒక మధురానుభూతిని అందిస్తుంది. పండుగలు మొక్కుబడి ఆచారాలు కాదు, సమాజాన్ని ఏకతాటిపై నడిపించే శక్తులు. అవి మన మూలాలను గుర్తు చేస్తాయి. సంప్రదాయ పరిమళాలను పంచి, తరతరాల వారసత్వాన్ని అందిస్తాయి. పిల్లల కేరింతలు, పెద్దల ఆశీస్సులు, కొత్త అల్లుళ్ల సందడితో తెలుగు ఇళ్లు శోభాయమానంగా ఉంటాయి. తోటివారితో ఆనందాన్ని పంచుకోవడం, నిస్సహాయులకు దానం చేయడం, జీవకోటిని ప్రేమించడం సంక్రాంతి మనకు నేర్పే పాఠం. పండుగ సందర్భంగా మనమంతా పాత వైషమ్యాలను వీడి, సరికొత్త ఆశయాలతో ముందుకు సాగుదాం.

– డా. చిట్యాల రవీందర్

వెలుగుల వైభవం..

భోగి నాడు తెల్లవారుజామున భోగి మంటలు వేయడం ఆచారం. చీకటిని చీలుస్తూ ఆకాశమంత ఎత్తుకు లేచే అగ్నిశిఖలు కొత్త ఆశలను చిగురింపజేస్తాయి. చలిని తరిమేస్తాయి. ఆవుపేడతో చేసిన పిడకలతో భోగిమంటలు వేస్తారు. వాటి నుంచి వచ్చే పొగ గాలిలోని సూక్ష్మజీవులను నశింపచేసి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. అలాగే ఇంట్లో విరిగిపోయిన చెక్కసామాను కూడా మంటల్లో వేస్తారు. ఇలా చేయడంలో.. మనలోని వెనకబడిన ఆలోచనలు, అభివృద్ధిని ఆటంకపరిచే అలవాట్లు, కోపం, ద్వేషం, స్వార్థం, కపటం వంటి మాలిన్యాలను దహింపచేయాలని, తద్వారా సర్వ శుభాలూ చేకూరతాయి- అన్నదే ఆంతర్యం. 'మనలో, మనచుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించి కొత్త వెలుగులకు స్వాగతం పలకడమే భోగి' అని పండితులు నిర్వచిస్తారు.

తెలుగు లోగిళ్ల సోయగం

పండుగ సందర్భంగా వాకిళ్లలో తీర్చిదిద్దే రంగవల్లులు కనువిందు చేస్తాయి. నిజానికి ముగ్గులు బియ్యప్పిండి కలిపి వేయాలి. అది చీమలకు ఆహారమై, భూతదయను చాటుతుంది. ముగ్గుల మధ్యలో కుంకుమ, పసుపు, సుమాలు అలంకరించిన గొబ్బెమ్మలను లక్ష్మీదేవి రూపాలుగా భావిస్తారు. ఆడపిల్లలు గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతుంటే వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. సరదాలు, సంతోషాలను పంచుతుంది.

దేవుడే దీవించినట్లు..



సంక్రాంతి అనగానే హరిదాసులు గుర్తొస్తారు. కాషాయ వస్త్రాలు, కాళ్లకు గజ్జెలు, నుదుట నామాలు, మెడలో పూల దండలు, రుద్రాక్షమాలలు, తలపై అక్షయపాత్రను ధరించి.. ఇల్లిల్లూ తిరుగుతారు. చిడతలు వాయిస్తూ శ్రావ్యంగా ఆలాపన చేస్తారు. హరినామ స్మరణ చేస్తూ వాగ్గేయకారుల కీర్తనలను గానం చేసే హరిదాసులను పరమాత్మ ప్రతినిధులుగా భావిస్తారు. హరిదాసుల గానామృతం ఆధ్యాత్మిక చింతన పెంచడమే గాక మనలో చైతన్యం కలిగించి, సామాజిక సంస్కరణకు దోహదం చేస్తుంది. వీరిది కృష్ణ భక్తులైన పురందరదాసు, కనకదాసుల సంప్రదాయంగా చెబుతారు.

హరిదాసులకు కాయగూరలు, పండ్లు, బియ్యం సమర్పిస్తే.. తెలిసీ తెలియక చేసిన పాపాలు ప్రక్షాళన అవుతాయని విశ్వసిస్తారు. వారు భిక్ష స్వీకరించి, సర్వశుభాలూ చేకూరాలని ఆశీర్వదిస్తే.. సాక్షాత్తూ దేవుడే దీవించిన అనుభూతి పొందుతారు.

హరిదాసులు ఈ ధనుర్మాసమంతా ఊరూరా సంచరించి జీవనానికి అవసరమైన గ్రాసాన్ని సంపాదించుకుంటారు. మిగిలిన సమయాల్లో తమకు చేతనైన వృత్తులను చేపడతారు. తమలో తాము ఊర్లను పంచుకుని.. ఒకరు వెళ్లిన ప్రాంతానికి మరొకరు వెళ్లని విధంగా ఏర్పాటు చేసుకుంటారు.

సాధారణంగా భిక్ష అడిగేవారిని విసుక్కోవడం లేదా ఇవ్వకుండా.. తర్వాత రమ్మనడం చూస్తుంటాం. కానీ హరిదాసుల విషయం అలా కాదు. వారిని దైవస్వరూపంగా భావిస్తారు. దూరంగా వారి ఆలాపన వినిపించగానే.. పదార్థాలను సిద్ధం చేసుకుని, వారి రాకకై నిరీక్షిస్తారు. అక్షయపాత్రలో భిక్ష సమర్పించి ఆశీస్సులు పొందుతారు.

హరిదాసులే గాక.. గంగిరెద్దులను ఆడించేవారు, పగటి వేషధారులు, గారడీవాళ్లు, ఎందరెందరో జానపద కళాకారులతో అలరారుతాయి సంక్రాంతి పర్వదినాలు. పండుగ సందర్భంగా ఇటువంటి ఆనందాలను ఆస్వాదిస్తూ, బంధుమిత్రులతో కలిసి చక్కటి పిండివంటలు ఆరగించడం ఆనవాయితీ. భక్తిచింతనతోపాటు సరదాలు పంచే పండుగ సంక్రాంతి.

– కె.వి.వి.సత్య ప్రసాద్

క్రీస్తు వాణి

బాధ.. వేదన..



లోకంలో అనేకమంది అనేక సందర్భాల్లో దుఃఖిస్తుంటారు. మనసులో వేదన చెందుతుంటారు. ఆయా విషయాలను ఇతరులతో పంచుకోలేక తమలో తామే కుమిలిపోతుంటారు.

తమ దుఃఖాన్ని ఎవరికి చెప్పాలో, దాని వల్ల ఫలితం ఉంటుందో లేదో అర్థంగాక అవస్థ పడుతుంటారు కొందరు. ఎవరికైనా చెబితే హేళన చేస్తారేమోనన్న సందేహంతో ఆ దిగులును దిగమింగుతారు. తమ కళ్ల ద్వారా తెలిసిపోతుందోనని వీలైనంత వరకూ నలుగురిలోకీ వెళ్లకుండా ఉండేందుకు ప్రయత్నిస్తారు. ఒంటరిగా ఉన్నప్పుడు తమలో తామే మధనపడుతూ ఏం చేయాలో పాలుపోని అయోమయ స్థితిలో ఉంటారు. దుఃఖంతో విలపిస్తున్నవాళ్లు ధన్యులని బైబిల్ చెబుతోంది. ఏసుప్రభువు తన శిష్యులకు, తన మాటలు వినేందుకు వచ్చిన ప్రజలకు అనేక విషయాలు ప్రబోధించేవాడు. 'బాధలు అనుభవించే వారు ధన్యులు. వారికి ఓదార్పు లభిస్తుంది' అన్నాడు ఏసుప్రభువు. దుఃఖితులను దేవుడే ఓదారుస్తాడని, ఎంత క్లిష్టమైన సమస్యలనైనా పరిష్కరించి ఉపశమనం కలిగిస్తాడని చెప్పాడు. బంధుమిత్రులు లేదా ఇరుగుపొరుగువారు ఒకటి రెండుసార్లయితే ఓదారుస్తారు. పదేపదే వ్యాకులపడుతుంటే స్పందించరు. చులకన చేయొచ్చు కూడా. కానీ దేవుడలా కాదు. ఎంతమందిని అయినా, ఎన్నిసార్లు అయినా ఓదారుస్తాడు- అని బైబిల్‌లోని మత్తయి సువార్త 5వ అధ్యాయం 4వ వచనం స్పష్టం చేసింది.

బుద్ధ భూమి

దురాలోచనలకు దూరంగా..

లోకరీతి చాలా విచిత్రంగా ఉంటుంది. ఒక్కోసారి మనకు ఎలాంటి సంబంధం లేని విషయంలో కూడా నింద మోయాల్సి వస్తుంది. బుద్ధ భగవానుడికీ ఇది తప్పలేదు. ఒకసారి జేతవనంలో కొందరు గౌతమబుద్ధుడి గురించి చెడుగా ప్రచారం చేయసాగారు. తమ కుట్రలో భాగంగా సుందరి అనే గణికను పురమాయించారు. ఆమె ప్రతిరోజూ అలంకరించుకుని సాయంత్రం వేళల్లో బుద్ధుడు ఉన్న జేతవనం దిశగా వెళ్లేది. మర్నాడు ఉదయం వాడిపోయిన ముఖంతో జేతవనం మీదుగా తిరిగివచ్చేది. ఈ రాకపోకలను గమనించిన ఎవరైనా 'ఎక్కడి నుంచి వస్తున్నావు?' అని పలకరిస్తే 'తథాగతుని చెంత నుంచి' అని సమాధానం చెప్పేది. ఇలా కొన్నాళ్లు గడిచాయి. సుందరి మాటల ప్రభావంతో క్రమంగా బుద్ధుడి మీద దుష్ప్రచారం మొదలైంది. కొన్నాళ్లకు కుట్రదారులు సుందరిని హత్య చేయించి జేతవనం వద్ద పడేశారు. ఆమె మరణం గురించి శ్రావస్తి న్యాయాధికారులు ఆరా తీశారు. సుందరిని హత్య చేసినవారిని, చేయించిన వారినీ చెరసాలలో బంధించారు. ఈ కుట్ర గురించి ప్రజలకు వివరించమని శిష్యులు కోరగా.. బుద్ధుడు ప్రశాంత వదనంతో 'సబ్బ పాపస్స అకరణం.. కుశలస్స ఉపసంపద.. సచిత్త పరియోదపనం.. ఏతం బుద్ధానుశాసనం' అన్నాడు. 'దురాలోచనలకు దూరంగా ఉండండి. తోటివారికి మంచే చేయండి. మనసును నిర్మలంగా ఉంచుకోండి. ఇదే నా మాట' అన్నది పాళీ భాషలోని ఆ మాటలకు అర్థం. అంతేకదా! ధనం ఇస్తున్నారు కదాని సుందరి తప్పు పనికి పూనుకుని మరణం పాలయ్యింది. చంపినవారు, చంపమన్న వారూ చెరసాల పాలయ్యారు. చెడు పనులు చేయడం వల్లనే కదా ఇలా జరిగింది. ఎక్కడైనా, ఎప్పుడైనా ధర్మానికే విజయం దక్కుతుంది.

– డాక్టర్ బండి సత్యనారాయణ




గురువును ఎందుకు ఆశ్రయించాలంటే...

ఒక సాధువు నది వద్ద ఆశ్రమం నిర్మించుకున్నాడు. ఆయనకు వేలాదిమంది శిష్యులున్నారు. ప్రతి నిత్యం సాధువు ప్రవచనాలు వినేందుకు ఎందరెందరో భక్తులు వస్తుంటారు. ఆయన ప్రబోధలు స్ఫూర్తి కలిగిస్తుంటాయి.

కొన్నాళ్లు ప్రశాంతంగా గడపాలని ఆశ్రమానికి వచ్చాడో జిజ్ఞాసి. పదిరోజులు అక్కడే ఉండి సాధువు అమూల్యమైన మాటలు విన్నాడు. మాజ శ్రేయస్సు కోసం సాధువు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి తెలుసుకుని ఎంతో సంతోషించాడు. కానీ ఒక సందేహం అతడిలో ఉండిపోయింది. సాధువుతో ఇలా చెప్పాడు. 'గురూజీ! నాదొక చిన్న సందేహం. చాలామంది పాదాభివందనం చేస్తుంటారు. నిజానికి చేతులెత్తి నమస్కరిస్తే సరిపోతుంది. పాదాలను తాకి నమస్కరించడం ఎందుకు? అది సరికాదు కదా! కాళ్లు శరీరంలో అధమస్థానంలో ఉంటాయి. మట్టి, మురికి అంటిన పాదాలకు పవిత్ర స్థానం ఇవ్వడమెందుకు? పెద్దల పట్ల గౌరవం చూపాలనుకోవడానికి అది సంకేతమని నాకు అర్థమైంది. కానీ అలా వినమ్రతను ప్రదర్శించాలనుకున్నప్పుడు.. అది ఉన్నత స్థాయిలో ఉన్న శిరస్సుకు నమస్కరిస్తే సరిపోతుంది. గురువు కాలి బొటనవేళ్ల నుంచి గంగా యమునలు ప్రవహిస్తూ ఉంటాయని, ఆ నీటిని శిష్యుడు తల మీద చల్లుకుంటే పవిత్రత చేకూరుతుందని చదివాను. కానీ అదంతా ఊహతో కూడిన కల్పన తప్ప అందులో నిజం ఎక్కడుంది?' అనడిగాడతడు. సాధువు తల పంకించి.. 'నది ఒడ్డున కొంతదూరం నడుద్దాం రా' అని అతణ్ని తీసుకుని వెళ్లాడు.

అక్కడ జాలర్లు చేపలు పడుతున్నారు. పడిన చేపలను బుట్టలో వేసుకుని మళ్లీ వలని దూరంగా విసురుతున్నారు. అది చూసి 'జాలర్ల వలలో ఏ చేపలు పడుతున్నాయి? వారి పాదాల వద్ద ఉన్నవా? దూరంగా ఉన్నవా?' ప్రశ్నించాడు సాధువు. 'దూరంగా ఉన్నవే' అని బదులిచ్చాడతను. 'భగవంతుడు జాలరి వంటివాడు. అతని చేతిలోని వల మాయ. దేవుడు విసిరే వలలో గురు పాదాలను ఆశ్రయించిన చేపలు.. అంటే భక్తులు మాయకి చిక్కరు. మోక్షం పొందుతారు. గురువుతో నిమిత్తం లేదని నిర్లక్ష్యధోరణి అవలంబించిన జీవులు మాయలో చిక్కుకుంటారు. వల అనే జనన మరణ చక్రంలో పడి కొట్టుమిట్టాడుతారు. హిందూ సంస్కృతిలో నమస్కరించడం ఆచారం. అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య, తల్లిదండ్రులు, గురువులు.. ఇలా పెద్దల పట్ల గౌరవాన్నీ, వినయాన్నీ చాటుకుంటూ పాదాలకు మొక్కి ఆశీర్వాదం తీసుకుంటారు. ఇలా చేయడం వల్ల వారి ఆశీస్సులు లభిస్తాయని, మాటలకు అందని అనుభూతితో పాటు మానసిక సుస్థిరత కలుగుతుందని మహాభారతం పేర్కొంది. పెద్దల పాదాలను తాకితే మలినం అంటదు, మనసు పావనమవుతుంది. ఆ వినమ్రతకు ముగ్ధులైన పెద్దలు తమ శక్తులను వీరికి ప్రాప్తింపచేస్తారు. పాద నమస్కారం చేయడం వల్ల బలం, బుద్ధి, జ్ఞానం, కీర్తి వికసిస్తాయని, ఆయురారోగ్యాలు కలుగుతాయని ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు. ముందుకు వంగి పాదాలను తాకడం, మోకాళ్లపై కూర్చుని పాదనమస్కారం, సాష్టాంగ ప్రణామం.. ఇలా పాద నమస్కారం మూడు విధాలు. శాస్త్రపరంగా చూస్తే.. ఇలా నమస్కరించడం వల్ల నడుము, వెన్నెముక సాగుతాయి. కీళ్లకు మంచిది. శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కాబట్టి పాద నమస్కారం ఎలా చూసినా మంచిదే.' అంటూ వివరించాడు సాధువు.

– తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి



ఇస్లాం సందేశం

కృతజ్ఞులే అల్లాహ్ ఆశీర్వాదానికి పాత్రులు!

అహంకార భావన, స్వార్థచింతన లేకుండా వినయంగా ఉండాలని, తోటివారికి సాయం చేసేందుకు తమ సంపదను వినియోగించాలని, అదే అసలైన కృతజ్ఞత అని ఇస్లాం ధర్మం పేర్కొంటుంది. కృతజ్ఞులు ఎలా ఉండాలో దైవప్రవక్త ముహమ్మద్ (స) వివరించిన కథ సహీహ్-అల్-బుఖారీలో ఉంది.

పూర్వం ఓ కుష్ఠురోగి, ఓ కురూపి, ఓ అంధుడు జీవన పోరాటంలో నానా బాధలూ పడేవారు. వీరిని అల్లాహ్ ఒక దేవదూత ద్వారా పరీక్షించ దలచాడు. తొలుత దేవదూత కుష్ఠురోగిని స్వస్థతపరిచి, బతుకుదెరువు కోసం గర్భంతో ఉన్న ఒంటెను అందజేశాడు. తర్వాత కురూపి రూపాన్ని చక్కదిద్ది గర్భంతో ఉన్న ఆవును ఇచ్చాడు. చివరిగా అంధుడికి చూపును ప్రసాదించి గర్భం దాల్చిన గొర్రెను అందజేశాడు.




కొంతకాలానికి దేవదూత మారువేషంలో నిరుపేదగా వచ్చాడు. ముందుగా కుష్ఠు వ్యాధితో బాధపడిన వ్యక్తి వద్దకు వెళ్లి ఒంటెను ఇవ్వమని అడిగాడు. అతడిప్పుడు పూర్తి ఆరోగ్యవంతుడు, ధనికుడు. గతంలో పడిన బాధలను, అందుకున్న సాయాన్ని మర్చిపోయాడు. సంపద తనకు వారసత్వంగా వచ్చిందని, సాయం చేసేందుకు నిరాకరించాడు. అక్కడి నుంచి రెండో వ్యక్తి వద్దకు వెళ్లి సాయం అడిగితే.. అతడు కూడా గతాన్ని మరచి, ఇవ్వలేనని చెప్పేశాడు. తర్వాత మూడో వ్యక్తి వద్దకు వెళ్లి గొర్రెను అడిగాడు. అతడు అల్లాహ్ ఆశీర్వాదాన్ని గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతమై 'నేను అంధుణ్ని. అల్లాహ్ నాకు చూపును ప్రసాదించాడు. ఇవన్నీ దైవకృపతోనే సమకూరాయి. నీకు ఏది కావాలంటే అది తీసుకో. నువ్వేం తీసుకున్నా దైవసాక్షిగా నిన్ను ఎంతమాత్రం ఇబ్బంది పెట్టను' అన్నాడు. ఆ మాటలకు సంతృప్తి చెందిన దేవదూత తన అసలు రూపాన్ని వెల్లడించి.. 'ఇది నీకొక పరీక్ష మాత్రమే. నీ కృతజ్ఞతాభావానికి అల్లాహ్ సంతోషించాడు. ఇవన్నీ ఎప్పటికీ నీ సొంతమే' అన్నాడు. మిగతా ఇద్దరి విషయంలో సృష్టికర్త అసంతృప్తితో ఉన్నట్టుగా వారికి విశదీకరించాడు. పర్యవసానంగా ఆ ఇద్దరూ తమకు అందిన ఆశీర్వాదాలను కోల్పోయి తిరిగి పూర్వపు స్థితిపొందారు.

'మీరు కృతజ్ఞులైతే.. నేను మీకు కచ్చితంగా ఎక్కువ ఇస్తాను. కానీ కృతఘ్నులైతే మాత్రం శిక్ష తీవ్రంగా ఉంటుంది' అని దివ్య ఖురాన్ ప్రవచనం పేర్కొంటోంది. కృతజ్ఞత చూపేవారికి అల్లాహ్ ఆశీర్వాదాలు మరింతగా పెరుగుతాయి. తద్వారా దైవం పట్ల విశ్వాసం అధికమవుతుంది. జీవితంలో శాంతి, సంతృప్తి పెంపొందుతాయి.

శ్లోకామృతం

పైశున్యం
సాహసం ద్రోహ
ఈర్ష్యాసూయార్థ
దూషణం
వాగ్దండనం చ పారుష్యమ్
క్రోధజోపి గణోష్టకః




చాడీలు చెప్పడం, దుస్సాహసం, ద్రోహం చేయాలనే ఆలోచన, ఈర్ష్య, అసూయ, ధనం కోసం ఇతరుల గురించి నీచంగా మాట్లాడటం, పరుష వాక్కులు, కఠినంగా శిక్షించడం- అనే ఈ ఎనిమిదీ కోపం వల్ల కలిగే దుర్గుణాలని, అవి ఆత్మనాశనానికి దారితీస్తాయని తెలియజేస్తుంది మనుస్మృతిలోని ఈ శ్లోకం.

పిల్లలు.. జీర్ణవస్త్రాలా?!



ఒక కళాశాల ఉపన్యాసకుడు తన రెండేళ్ల కొడుకు చనిపోవడంతో మనశ్శాంతి కోసం రమణ మహర్షి ఆశ్రమానికి వచ్చారు. ఆయన తన మనసులో చెలరేగుతున్న కల్లోలానికి సమాధానం రాబట్టేందుకు 'స్వామీ! భగవద్గీతలో శ్రీకృష్ణభగవానుడు దుస్తులు చిరిగితే కొత్తవి వేసుకున్న చందాన ఆత్మ కొత్త శరీరంలో ప్రవేశిస్తుంది- అన్నాడు. ఈ సూత్రం మరణించిన నవజాత శిశువులకు ఎలా వర్తిస్తుంది? పిల్లల శరీరాలు కొత్త వస్త్రాల్లా ఉంటాయి కదా! ఆ తాజా స్థితిలో అవెలా చిరిగిపోయినట్టు? వాళ్లకెలా వృద్ధాప్యం వచ్చింది?' అనడిగారు. దానికి రమణులు 'శిథిలమైతేనే మృత్యువు సంభవిస్తుంది. అది ప్రకృతి ధర్మం. ఈ ధర్మాన్ని దాటి చావు మనల్ని చేరలేదు. వాళ్ల శరీరం శిథిలం కాలేదని నీకెలా తెలుసు? శిథిలమైపోవటం అనేది కంటికి కనిపించని అంశం' అని బదులిచ్చారు. మళ్లీ ఆయనే 'మీరు అంగడిలో కొన్న వస్త్రం నిలవ సరుకు అయ్యుండొచ్చు, నేతలో దోషం దొర్లి ఉండొచ్చు. అలాంటిది కొద్ది రోజులకే చిరిగిపోతుంది. ఈ శిథిలతను గుర్తించలేం. అది పైకి కనిపించకపోవచ్చు. అలాగే శిశువుల దేహంలో కనిపించని శిథిలత ఉంటే.. వారు అర్ధాంతరంగా కాలంచేస్తారు. వ్యక్తుల గత జన్మల పాప కర్మల ఫలం చాలా తక్కువగా ఉంటే.. వాళ్లు కొద్ది సంవత్సరాలు, నెలలు.. ఒక్కోసారి రోజుల వ్యవధిలోనే మరణిస్తుంటారు. అందువల్ల అప్పుడే పుట్టిన శిశువులు కాబట్టి వారి శరీరం తాజాగా ఉంటుంది- అనుకోవడం సరికాదు. అంత చిన్న వయసులోనే ఎందుకు చనిపోతున్నారు అనే సందేహం అర్థరహితం. మనకు తెలియనంత మాత్రాన ప్రకృతి సహజమైన విషయాలను అధర్మం అనుకోరాదు. భగవంతుడి లీలలను తప్పుపట్టకూడదు. బ్రహ్మ రాసిన రాతను ఎవరూ మార్చలేరు. ఆయన ఇచ్చిన ఆయువును ఎవరూ పెంచలేరు, తగ్గించలేరు. కాబట్టి ప్రాణం పోకడ దైవ నిర్ణయమని గ్రహించాలి. నువ్వు ఇక్కడికి ఎందుకోసం వచ్చావో.. ఆ మానసిక శాంతి నీకు లభించింది. నువ్వడిగిన ఈ ప్రశ్న నీ ఒక్కనిదే కాదు.. ఇక్కడున్న చాలామంది మనసుల్లోనిది. మీ అందరి సందేహం తీరిందనుకుంటాను' అంటూ ఎంతో వివరంగా చెప్పారు రమణ మహర్షి.

కరెంట్ అఫైర్స్



◆ భారత్‌కు చెందిన ఏ ప్రముఖ చెఫ్, రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీతను వరల్డ్ ఫుడ్ ప్రైజ్ ఫౌండేషన్ (డబ్ల్యూఎఫ్‌పీఎఫ్) 2025 టాప్ అగ్రీ-ఫుడ్ మార్గదర్శకుల్లో ఒకరిగా గుర్తించింది? (డబ్ల్యూఎఫ్‌పీఎఫ్‌ను డాక్టర్ నార్మన్ బోర్లాగ్ 1986లో స్థాపించారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం అమెరికాలోని అయోవా రాష్ట్రంలోని డెస్ మోయిన్స్‌లో ఉంది.)
జ: సంజీవ్ కపూర్

మాదిరి ప్రశ్నలు

◆ భారత్, అమెరికాలు తమ రక్షణ బంధాలను బలోపేతం చేసుకునే దిశగా 2025, అక్టోబరు 31న ఎన్నేళ్లపాటు అమలులో ఉండే రక్షణ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై సంతకాలు చేశాయి?
జ: పదేళ్లు (భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ కార్యదర్శి పీటర్ హెగ్సేత్‌ల మధ్య కౌలాలంపూర్‌లో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.)

మరింత సమాచారం

◆ ప్రపంచ నగరాల దినోత్సవాన్ని (వరల్డ్ సిటీస్ డే) ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2014లో మొదటిసారిగా ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం ద్వారా నిర్వహించారు. 2025లో ఈ దినోత్సవాన్ని 'పీపుల్-సెంటర్డ్ స్మార్ట్ సిటీస్' అనే థీమ్‌తో నిర్వహించారు. 2025 దినోత్సవాన్ని అధికారికంగా కొలంబియా రాజధాని బొగోటాలో నిర్వహించారు.)
జ: అక్టోబరు 31

JUNIOR INTER Botany — MORPHOLOGY OF FLOWERING PLANTS

1. **Differentiate fibrous roots from adventitious roots.**

A. **Fibrous Roots:** Arise from base of the stem.
e.g.: Maize
Adventitious Roots: Arise from non radical parts.
e.g.: Ficus

2. **What is meant by pulvinus leaf base? In members of which angiospermic family do you find them?**

A. Swollen leaf base is called pulvinus.
e.g.: Leguminosae family

(2 Marks)

3. **How do dicots differ from monocots with respect to venation?**

A. **Dicots:** 1. Reticulate venation
2. Veinlets network or web like
e.g.: Hibiscus
Monocots: 1. Parallel venation
2.Veinlets parallel arranged **e.g.:** Musa

Final Exams-2026 IMPORTANT Q & A

4. **How is a pinnately compound leaf different from a palmately compound leaf? Explain with one example each.**

A. **Pinnately compound leaf:** 1. Leaflets arranged on either side of rachis. **e.g.:** Neem, Tamarind
Palmately compound leaf: 1. Leaflets arranged at the tip of petiole **e.g.:** Dolichos,Ceiba

5. **Differentiate between Racemose and Cymose inflorescence.**

A. **Racemose inflorescence:** 1. Peduncle grows indefinite period
2. Flowers arranged in acropetal manner
3. Flowers opens first at base of the peduncle
e.g.: Crotalaria, Dolichos
Cymose inflorescence: 1. Peduncle grows definite period
2. Flowers arranged in basipetal manner
3. Flowers opens first at tip of the peduncle
e.g.: Jasminum, Nerium

6. **What is meant by epipetalous condition? Give an example.**

A. Stamens attached to petals.
e.g.: Datura, Solanum

For more IMP Q & A



Writer: Chennakeshavulu

సమష్టి ప్రగతికి సమున్నత ప్రమాణాలు!

పేదరికం, ఆకలి, అసమానతలు, పర్యావరణ క్షీణత, అందరికీ విద్య, ఆరోగ్యం, సమాజంలో శాంతి మొదలైనవన్నీ ఏ ఒక్క దేశానికో లేదా ఖండానికో పరిమితమైన సమస్యలు కావు. వీటి ప్రభావం వివిధ రూపాల్లో ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై ఉంటుంది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ అంశాల మధ్య సమతౌల్యత లేకపోతే జరిగే అభివృద్ధి దీర్ఘకాలంలో అనర్థదాయకంగా మారుతుంది. అందుకే వర్తమాన అవసరాలను తీరుస్తూ రాబోయే తరాలకు కాలుష్యరహిత సహజ వనరులను, సురక్షిత ప్రపంచాన్ని అందించాలనే ఆశయంతో ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను రూపొందించింది. భద్రమైన భవిష్యత్తును నిర్మించాలని నిర్దేశించే ఆ లక్ష్యాలను ప్రపంచ దేశాలన్నీ అంగీకరించాయి. అవి ఏమిటి? వాటి సాధనలో ప్రపంచంతో సహా భారత్ ప్రస్తుతం ఏ స్థాయిలో ఉందో పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఒక్కో లక్ష్యాన్ని చేరడానికి సాయపడుతున్న కార్యక్రమాలనూ తెలుసుకోవాలి.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు

ఐక్యరాజ్య సమితి 2000 సంవత్సరంలో నిర్దేశించిన మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్ (ఎండీజీ) ద్వారా సాధించిన పాక్షిక విజయాలకు కొనసాగింపుగా 2015లో 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను (సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ -ఎస్‌డీజీ) నిర్ణయించారు.

ఎస్‌డీజీ-1 పేదరిక నిర్మూలన: సామాజిక, ఆర్థిక సమస్యలకు ప్రధాన మూలం పేదరికం. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో సాపేక్ష, నిరపేక్ష పేదరిక నిర్మూలనను తొలి ప్రాధాన్యంగా ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా రోజుకు 29 వేల మంది అయిదేళ్ల లోపు చిన్నారులు పేదరిక సంబంధిత కారణాలతో మరణిస్తున్నారు. డయేరియా, న్యుమోనియా, మలేరియా, హైపాక్సీయా ఇందుకు ప్రధాన కారణాలు. భారత జనాభాలో 27.5% పేదలు. మహిళల్లో ప్రతి నలుగురిలో ఒకరికి మాత్రమే ఉపాధి అవకాశాలు ఉన్నాయి.

ఎస్‌డీజీ-2 ఆహార భద్రత- ఆకలి నిర్మూలన: ఈ లక్ష్యం కోసం సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహించి ఆహార పదార్థాలను అందించాలి. ప్రపంచ వ్యాప్తంగా 26.4% ప్రజలకు సరైన ఆహార వసతులు లేవు. దేశంలో అయిదేళ్ల లోపు చిన్నారుల్లో 35.8% మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు.

జనరల్ స్టడీస్ — పర్యావరణ అంశాలు

ఎస్‌డీజీ-3 ఆరోగ్యం, సంక్షేమం: ప్రజలందరికీ సరైన ఆరోగ్య సేవలు అందాలనేది దీని ధ్యేయం. ప్రస్తుతం 80% ప్రసవాలు సురక్షితంగా జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రపంచ క్షయ రోగుల్లో ప్రతి నలుగురిలో ఒకరు భారతీయులే ఉండటం ఆందోళకరం. దేశంలో 21 లక్షల మంది హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్థులున్నారు. ఇందులో 42% మహిళలు.

ఎస్‌డీజీ-4 నాణ్యమైన విద్య: నైపుణ్య విద్యను అందించడం ఎస్‌డీజీ 4 ముఖ్య లక్ష్యం. ఘర్షణ వాతావరణ ప్రాంతాల్లో జీవించే 50% పైగా చిన్నారులు సరైన విద్య పొందట్లేదు. ప్రపంచవ్యాప్తంగా 103 మిలియన్‌ల చిన్నారులకు కనీస అక్షరాస్యత లేదు. వీరిలో 60% బాలికలే. దేశంలో ప్రతి 10 మంది చిన్నారుల్లో ఆరుగురికి కనీస గణిత సామర్థ్యాలు లేవు.

ఎస్‌డీజీ-6 రక్షిత నీరు, పారిశుద్ధ్యం: ప్రపంచ జనాభాలో 18% వాటా ఉన్న భారతదేశంలో నీటివనరులు 4 శాతమే ఉన్నాయి. అపరిశుభ్రతతో ప్రబలే డయేరియాతో ఏటా లక్ష మంది చిన్నారులు మరణిస్తున్నారు. దాదాపుగా 50 మిలియన్ల ప్రజలు నీటి కొరత ఎదుర్కొంటున్నారు. స్వచ్ఛభారత్ అభియాన్, జల్ జీవన్ మిషన్, నమామి గంగే పథకాలు ఈ లక్ష్య సాధనలో ఉపకరిస్తున్నాయి.



భారత్‌లో 15-49 సంవత్సరాల్లోపు మహిళల్లో 53% మంది ఎనీమియాతో బాధపడుతున్నారు. 80% పైగా పిల్లలకు కనీస పోషక స్థాయి లేదు. ఈ లోపాలను అధిగమించడానికి కేంద్రం మాతృత్వ వందన యోజన, పోషణ్ అభియాన్‌లను ప్రారంభించింది. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలనే లక్ష్యం కూడా ఎస్‌డీజీ-2 సాధించడానికి దోహదపడుతోంది.

ఎస్‌డీజీ-5 స్త్రీ, పురుష సమానత్వం: ఈ లక్ష్య సాధన కోసమే బేటీ బచావో - బేటీ పఢావో, సుకన్య సమృద్ధి యోజన, జననీ సురక్ష యోజన మొదలైన కార్యక్రమాలు అమలవుతున్నాయి. లోక్‌సభలో మహిళా ప్రాతినిధ్యం 14% మాత్రమే ఉండగా, పంచాయతీరాజ్ సంస్థల్లో 46% మేర మెరుగ్గా ఉంది.

ఎస్‌డీజీ-7 అటవీకరణ, స్వచ్ఛమైన శక్తి: ఈ లక్ష్య సాధన ద్వారా అధునాతన ఇంధన వనరులను ప్రజలకు అందించాలనేది ఉద్దేశం. దేశంలో 100% గ్రామాలకు విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. నేషనల్ సోలార్ మిషన్ ఏర్పాటు, ఎల్‌ఈడీ బల్బుల వినియోగం ఇందులో భాగమే.

ఎస్‌డీజీ-8 ఉపాధి, ఆర్థికాభివృద్ధి: దేశంలో బాలకార్మికుల సంఖ్య 510 మిలియన్లు. నిరుద్యోగిత సగటున 6.9%. 2030 నాటికి ఎస్‌డీజీ-8 సాధించాలంటే దేశ జీడీపీ కనీసం ఏటా 7% పెరగాలి. ఉపాధి కల్పనకు జాతీయ నైపుణ్య అభివృద్ధి మిషన్, 'వీబీ-జీ రామ్ జీ' పథకాలు ఉన్నాయి.

ఎస్‌డీజీ-9 పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు: 111 మిలియన్ల మంది సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్-అప్ ఇండియా మొదలైన కార్యక్రమాలతో 2030 నాటికి సుస్థిర పారిశ్రామికాభివృద్ధి సాధించాలని కేంద్రం నిర్ణయించింది.

ఎస్‌డీజీ-10 అసమానతలు తగ్గించడం: దేశంలో 27.5% ప్రజలు పేదరికంలో ఉన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు పెరిగాయి. 2030 నాటికి వాటిని తగ్గించడానికి అడుగున ఉన్న 50% జనాభాకు అన్ని అవకాశాలు ఇవ్వాలని ఎస్‌డీజీ-10 చెబుతోంది.

ఎస్‌డీజీ-11 సుస్థిర నగరాలు, సముదాయాలు: 2030కి 4.2 బిలియన్లు, 2050కి 416 మిలియన్ల మంది నగరాల్లో నివసించనున్నారు. దాని కోసం కేంద్రం స్మార్ట్ సిటీస్ మిషన్, అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్, తదితర పథకాలను అమలు చేస్తోంది.

ఎస్‌డీజీ-12 సుస్థిర వినియోగం, ఉత్పత్తి: 2050కి ప్రపంచ జనాభా 960 కోట్లకు చేరవచ్చు. ఆహార, నీటి వనరులపై ఒత్తిడి పెరుగుతోంది. పరిష్కారంగా సుస్థిర వినియోగం, ఉత్పత్తికి కేంద్రం పథకాలను అమలు చేస్తోంది.

ఎస్‌డీజీ-13 శీతోష్ణస్థితి చర్యలు: అడవుల విస్తీర్ణం తగ్గడం, వ్యవసాయ భూమి పెరగడం భూ వాతావరణ మార్పులకు ఒక ప్రధాన కారణం. ఆ సహజ విపత్తులను అరికట్టడం ఎస్‌డీజీ-13లో భాగం. ఇందుకోసం నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్, నేషనల్ మిషన్ ఫర్ గ్రీన్ ఇండియా తదితర పథకాలను అమలు చేస్తున్నారు.

ఎస్‌డీజీ-14 జలాంతర జీవం: జనాభాలో 13.36% సముద్ర తీరంలో నివసిస్తోంది. ఇందులో భాగంగానే దేశ 7,517 కి.మీ. తీరప్రాంత, సముద్ర జీవుల సంరక్షణ చర్యలను తీసుకుంటోంది.

ఎస్‌డీజీ-15 భూమి మీద జీవం: భూమిపై కనీసం 33% అడవులుండాలి. భారత్‌లో 24.1% ఉన్నాయి. 1401 జీవులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్‌డీజీ-16 శాంతి, న్యాయం, బలమైన వ్యవస్థలు: దేశంలో 35 మిలియన్ల పెండింగ్ కేసులున్నాయి. మహిళలపై దాడులకు సంబంధించిన కేసులు ఏడాదికి 3,38,000 ఉంటున్నాయి. ఎస్‌డీజీ-16 లక్ష్యసాధనకు కేంద్రం న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ, వసతులు పెంచుతోంది.

ఎస్‌డీజీ-17 ప్రపంచ భాగస్వామ్యం: భారత విదేశీ అప్పు 521 బిలియన్ డాలర్లు. పరిణిత విదేశాంగ విధానంలో భాగంగా బ్రిక్స్, న్యూడెవలప్‌మెంట్ బ్యాంక్, సార్క్ కూటముల్లో ముఖ్య దేశంగా ఉంది.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

శాసనాల రూపకల్పనలో సాయపడే సాధనాలు!



భారత పార్లమెంటు భవనం

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం విధులు సాంకేతికంగా సంక్లిష్టంగా ఉంటాయి. మరో వైపు ప్రజల అవసరాలను చర్చించి, చట్టాలను రూపొందించాల్సిన పార్లమెంటు పనిచేసే సమయం పరిమితంగా ఉంటుంది. దీంతో బడ్జెట్ ప్రతిపాదనలు, బిల్లుల పరిశీలన, ప్రభుత్వ శాఖల పనితీరుపై పర్యవేక్షణ, ఆర్థిక వ్యవహారాలపై సమీక్షలకు సభా సమయం సరిపోదు. ఈ ఇబ్బందిని తొలగించడానికి, చట్టాల తయారీ ప్రక్రియను సులభతరం చేయడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన కమిటీలు దోహదపడతాయి. శాసనవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తున్న ఈ కమిటీల్లో రకాలు, వాటి నిర్మాణం, నిర్వర్తించే విధులు, ప్రత్యేక అంశాలపై ఏర్పాటు చేసిన కమిటీల విశేషాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ప్రభుత్వంలో జవాబుదారీతనాన్ని పెంపొందించే ముఖ్యమైన కమిటీలు, అందులో లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నిష్పత్తి, కార్యనిర్వాహక వర్గానికి, చట్టసభల సమన్వయానికి అవి సాయపడే తీరును అర్థం చేసుకోవాలి.

పార్లమెంటరీ కమిటీలు

ఇండియన్ పాలిటీ

1. పార్లమెంటరీ కమిటీల ప్రత్యేకతను గుర్తించండి.
ఎ) ఆధునిక కాలంలో శాసనాల రూపకల్పనలో పార్లమెంటరీ కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయి.
బి) శాసనాల్లో సాంకేతికత, సంక్లిష్టత పెరగడంతో వీటి ప్రాధాన్యం మరింత పెరిగింది.
సి) నాణ్యమైన శాసనాల రూపకల్పనలో ఇవి తోడ్పడతాయి.
డి) శాసనాల సామర్థ్యం, విలువలు పార్లమెంటరీ కమిటీల పనితీరుపై ఆధారపడి ఉంటుంది.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

2. "ఆధునిక కాలంలో శాసన వ్యవస్థకు పార్లమెంటరీ కమిటీలు కళ్లు, చేతులు, చెవులుగా, కొన్నిసార్లు మెదడుగా కూడా పనిచేస్తున్నాయి" అని వ్యాఖ్యానించింది?
1) డా.బి.ఆర్.అంబేడ్కర్ 2) నానీ ఫాల్కీవాలా
3) థామస్ రీడ్ 4) మారిస్ జోన్స్

3. "ఆధునిక కాలంలో శాసన కమిటీలు మినీ శాసన వ్యవస్థలుగా అవతరించాయి" అని వ్యాఖ్యానించినవారు?
1) ఉడ్రోవిల్సన్ 2) జేమ్స్ మాడిసన్
3) జీన్ బోడిన్ 4) కె.టి.షా

4. పార్లమెంటరీ కమిటీలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) పార్లమెంటరీ కమిటీలను స్టాండింగ్ కమిటీలు, అడ్‌హాక్ కమిటీలు అని రెండు రకాలుగా పేర్కొంటారు.
బి) స్టాండింగ్ కమిటీలు శాశ్వతమైనవి. వీటిలోని సభ్యుల పదవీ కాలం ఒక సంవత్సరం.
సి) అడ్‌హాక్ కమిటీలు తాత్కాలికమైనవి. ఏదైనా ప్రత్యేక అంశంపై అధ్యయనం కోసం ఏర్పడతాయి.
డి) అడ్‌హాక్ కమిటీ తన విధిని నెరవేర్చాక రద్దు అవుతుంది. కమిటీతో పాటు సభ్యుల సభ్యత్వం కూడా రద్దు అవుతుంది.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

5. పార్లమెంటరీ కమిటీల లక్షణాన్ని గుర్తించండి.
ఎ) మంత్రులు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉండరాదు.
బి) సంయుక్త పార్లమెంటరీ కమిటీల్లోని సభ్యులను లోక్‌సభ, రాజ్యసభ నుంచి 2 :1 నిష్పత్తిలో నియమిస్తారు.
సి) సంయుక్త పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్‌లను లోక్‌సభ స్పీకర్ నియమిస్తారు.
డి) స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్‌లు ఏ కమిటీలో సభ్యులుగా ఉంటారో వారే ఆ కమిటీలకు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

6. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) పార్లమెంటరీ కమిటీలో గరిష్ఠ సభ్యుల సంఖ్య = 30 + 1.
బి) పార్లమెంటరీ కమిటీలు సమావేశం కావడానికి ఉండాల్సిన కోరం - 1/3వ వంతు.
సి) 1997లో రాజ్యసభ నుంచి నైతిక విలువల కమిటీ ఏర్పడింది.
డి) 2004లో లోక్‌సభ నుంచి నైతిక విలువల కమిటీ ఏర్పడింది.
1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

7. ప్రభుత్వ ఖాతాల సంఘానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఇది భారత్‌లో అతిపురాతనమైన పార్లమెంటరీ కమిటీ.
బి) 1921లో ఏర్పడింది.
సి) ఈ కమిటీకి ఛైర్మన్‌గా ప్రతిపక్షాలకు చెందిన వ్యక్తులను నియమించడం ఒక సాంప్రదాయం.
డి) ఈ కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

8. ప్రభుత్వ ఖాతాల సంఘంలో ఉండే సభ్యులను గుర్తించండి.
1) లోక్‌సభ - 15, రాజ్యసభ - 7
2) లోక్‌సభ - 7, రాజ్యసభ - 15
3) లోక్‌సభ - 15, రాజ్యసభ - 5
4) లోక్‌సభ - 12, రాజ్యసభ - 10

9. ఎవరి నివేదిక ప్రభుత్వ ఖాతాల సంఘానికి మిత్రుడిగా, మార్గదర్శిగా, తాత్వికుడిగా తోడ్పడుతుంది?
1) జాయింట్స్ అకౌంట్స్ కమిటీ
2) ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా
3) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)
4) నేషనల్ అడ్వైజరీ కమిటీ

10. అంచనాల సంఘానికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) దీన్ని జాన్ మథాయ్ సిఫార్సుల మేరకు 1950లో ఏర్పాటు చేశారు.



జాన్ మథాయ్

బి) ఈ కమిటీలోని మొత్తం సభ్యుల సంఖ్య - 30
సి) ఈ కమిటీలోని సభ్యులందరూ లోక్‌సభ సభ్యులే.
డి) ఈ కమిటీని మితవ్యయ కమిటీ, పొదుపు కమిటీగా పేర్కొంటారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

11. అంచనాల కమిటీకి ఛైర్మన్‌గా ఎవరు వ్యవహరిస్తారు?
1) లోక్‌సభ స్పీకర్ 2) రాజ్యసభ ఛైర్మన్
3) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
4) రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్

12. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీకి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) కృష్ణమీనన్ కమిటీ సిఫార్సుల మేరకు దీన్ని 1964లో ఏర్పాటు చేశారు.
బి) ఈ కమిటీ ప్రారంభంలో సభ్యుల సంఖ్య - 15
సి) ఈ కమిటీలో ప్రస్తుతం సభ్యుల సంఖ్య - 22
డి) ఈ కమిటీ కీలకమైన ఆర్థిక కమిటీ.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

13. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో సభ్యుల సంఖ్యను ఏ సంవత్సరంలో 22కు పెంచారు?
1) 1961 2) 1966 3) 1969 4) 1974

14. ప్రభుత్వరంగ సంస్థల కమిటీలో ఉండే పార్లమెంటు సభ్యులకు సంబంధించి సరైన జవాబు?
1) లోక్‌సభ - 12, రాజ్యసభ - 10
2) లోక్‌సభ - 15, రాజ్యసభ - 7
3) లోక్‌సభ - 11, రాజ్యసభ - 11
4) లోక్‌సభ - 14, రాజ్యసభ - 8

15. పార్లమెంటరీ కవలలుగా ఏ కమిటీలను పేర్కొంటారు?
1) ప్రభుత్వ ఖాతాల సంఘం, అంచనాల సంఘం
2) అంచనాల సంఘం, ప్రభుత్వరంగ సంస్థల కమిటీ
3) ప్రభుత్వ ఖాతాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ
4) ప్రభుత్వరంగ సంస్థల కమిటీ, సభా వ్యవహారాల కమిటీ

16. కింది పార్లమెంటరీ కమిటీల్లో ఆర్థిక కమిటీని గుర్తించండి.
ఎ) ప్రభుత్వ ఖాతాల సంఘం
బి) అంచనాల కమిటీ
సి) ప్రభుత్వరంగ సంస్థల కమిటీ
డి) సభా వ్యవహారాల కమిటీ
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి



లోక్‌సభ

17. సభా వ్యవహారాల కమిటీకి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) లోక్‌సభ, రాజ్యసభలకు విడివిడిగా ఈ కమిటీ ఉంటుంది.
బి) లోక్‌సభ వ్యవహారాల కమిటీలో ఉన్న సభ్యుల సంఖ్య - 15
సి) లోక్‌సభ వ్యవహారాల కమిటీకి ఛైర్మన్‌గా లోక్‌సభ స్పీకర్ వ్యవహరిస్తారు.
డి) లోక్‌సభ వ్యవహారాల కమిటీ తన నివేదికను కేంద్ర ఆర్థికమంత్రికి సమర్పిస్తుంది.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

18. రాజ్యసభ వ్యవహారాల కమిటీకి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఈ కమిటీలోని సభ్యుల సంఖ్య - 11
బి) కమిటీ ఛైర్మన్‌గా రాజ్యసభ ఛైర్మన్ వ్యవహరిస్తారు.
సి) ఈ కమిటీ సభావ్యవహారాల నిర్వహణకు సంబంధించిన అజెండాను రూపొందిస్తుంది.
డి) ఈ కమిటీ తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది.
1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

19. ప్రైవేటు అర్జీల బిల్లుల కమిటీ లోక్‌సభకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) లోక్‌సభ స్పీకర్ ఈ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.
బి) లోక్‌సభలో ప్రవేశపెట్టబోయే ప్రైవేటు బిల్లులకు సంబంధించిన అంశాలను పరిశీలించి తగిన సిఫార్సులు చేయడం ఈ కమిటీ కీలక విధి.
సి) ఈ కమిటీలో సభ్యుల సంఖ్య - 15.
1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

20. మహిళా సాధికార కమిటీకి సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) ఈ కమిటీలో మొత్తం సభ్యుల సంఖ్య - 30
బి) రాజ్యసభ నుంచి 10 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
సి) లోక్‌సభ నుంచి 20 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
డి) మహిళలకు రాజ్యాంగం ద్వారా, చట్టబద్ధంగా ప్రభుత్వాలు కల్పించిన సౌకర్యాల అమలుతీరును పర్యవేక్షించి నివేదికను రూపొందిస్తుంది.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

21. మహిళా సాధికార కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1989 2) 1992 3) 1997 4) 1999

22. షెడ్యూల్డు కులాలు (ఎస్సీ), షెడ్యూల్డు తెగల (ఎస్టీ) కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1959 2) 1968 3) 1971 4) 1989

23. ఎస్సీ, ఎస్టీ కమిటీకి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఈ కమిటీలో మొత్తం సభ్యుల సంఖ్య - 30
బి) లోక్‌సభ నుంచి 20 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
సి) రాజ్యసభ నుంచి 10 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
డి) ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల అమలు తీరును పర్యవేక్షించి నివేదిక రూపొందిస్తుంది.
1) ఎ, సి, డి 2) ఎ, బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

24. పార్లమెంటు సభ్యుల జీతభత్యాలపై అధ్యయనం చేసే 'జీతభత్యాల' కమిటీకి సంబంధించి సరైన జవాబు గుర్తించండి.
ఎ) ఈ కమిటీలో ఉన్న మొత్తంసభ్యుల సంఖ్య-15
బి) లోక్‌సభ నుంచి 10 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
సి) రాజ్యసభ నుంచి 5 మంది ప్రాతినిధ్యం వహిస్తారు.
డి) ఈ కమిటీ సమావేశాలకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖామంత్రి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా హాజరవుతారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1-4; 2-3; 3-1; 4-4; 5-4; 6-4; 7-1; 8-1; 9-3; 10-4; 11-3; 12-4; 13-4; 14-2; 15-1; 16-3; 17-1; 18-3; 19-4; 20-4; 21-3; 22-2; 23-4; 24-4.

ఆవలి అపాయాలకు అడ్డుగోడ 'ఆరావళి'!



ఆరావళి పర్వతాలు ప్రపంచంలోనే అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఒకటి. ఇవి సుమారు 250 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు అంచనా. భారతదేశంలోని వాయవ్య భాగంలో ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. ఇవి థార్ ఎడారి విస్తరణను అడ్డుకునే సహజ అవరోధంగా పనిచేస్తూ భారతదేశ వాతావరణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వర్షపాతం, ఖనిజ సంపద, జీవవైవిధ్యం, అరణ్యాలు, మానవ నివాసాలకు ఎంతో ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. మన దేశానికి భౌగోళికంగా, పర్యావరణపరంగా, సాంస్కృతికంగా అత్యంత ముఖ్యమైన పర్వత శ్రేణిగా ఆరావళికి పేరు. ఈ పర్వతాల్లో విలువైన ఖనిజాలెన్నో ఉన్నాయి. వీటి కోసం కొన్ని దశాబ్దాలుగా విపరీతంగా మైనింగ్ చేస్తున్నారు. దీంతో కొండలు కరిగి, పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పర్యావరణ పరిరక్షణలో ఆరావళి పర్వతాల పాత్ర, అక్కడ ఉన్న జీవవైవిధ్యం, ముఖ్యమైన రక్షిత ప్రాంతాలు, తవ్వకం ప్రభావం మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.

ఆరావళి పర్వతాలు: ప్రాముఖ్యత - సంరక్షణ

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

ప్రపంచంలోని పురాతన ముడత పర్వత వ్యవస్థల్లో ఆరావళి ఒకటి. ఇవి గుజరాత్‌లోని పాలంపూర్ సమీపం నుంచి ప్రారంభమై రాజస్థాన్, హరియాణా, దిల్లీ మీదుగా ప్రయాణించి దిల్లీ రిడ్జ్ వద్ద ముగుస్తాయి. వీటి పొడవు సుమారు 800 కిలోమీటర్లు. రాజస్థాన్‌లోని 'మౌంట్ అబూ' ఈ పర్వత శ్రేణిలో ముఖ్యమైన ప్రదేశం కాగా, గురు శిఖర్ అత్యున్నత శిఖరం.

పర్యావరణ పరిరక్షణ

ఆరావళి పర్వతాలు భారతదేశంలో పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో ముఖ్యభూమిక పోషిస్తున్నాయి. మన దేశ వాయవ్య ప్రాంతానికి సహజ రక్షణ గోడలా పనిచేస్తున్నాయి. ఆవరణ వ్యవస్థలో వీటి ప్రాముఖ్యాన్ని పరిశీలిస్తే..

ఎడారి విస్తరణను అడ్డుకోవడం: థార్ ఎడారి తూర్పు వైపునకు విస్తరించకుండా ఆరావళి పర్వతాలు నిరోధిస్తాయి. ఇవి లేకపోతే హరియాణా, దిల్లీ, పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్ వరకు ఎడారి ప్రాంతం విస్తరించే ప్రమాదం ఉంది.

వర్షపాతం: ఈ పర్వతాలు దక్షిణ పశ్చిమ మాన్సూన్ గాలులను అడ్డుకొని వర్షపాతం కురిసేలా చేస్తాయి. ఇది రాజస్థాన్, పరిసర ప్రాంతాలకు ఉపయోగం.

భూగర్భ జలాల పునరుద్ధరణ: ఆరావళి ప్రాంతంలోని రాళ్లు వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పునరుత్తేజం చేస్తాయి. ఇవి దిల్లీ, హరియాణా ప్రాంతాలకు ముఖ్యమైన నీటి వనరులుగా పనిచేస్తాయి.

జీవవైవిధ్య సంరక్షణ: ఇవి అనేక వృక్ష, జంతు జాతులకు నిలయంగా ఉన్నాయి. వన్యప్రాణులకు సహజ ఆశ్రయాన్ని కల్పించి, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడుతున్నాయి.

గాలి కాలుష్య నియంత్రణ: ఆరావళి పర్వతాలు సహజసిద్ధ అడవులతో కప్పి ఉంటాయి. వాతావరణంలో ధూళి, కాలుష్యాన్ని తగ్గించి దిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి.

నేల కోతను అరికట్టడం: పర్వతాలపై ఉన్న వృక్షాలు మట్టి కొట్టుకుపోకుండా వేర్లతో గట్టిగా పట్టుకుని ఉంచుతాయి.

ఉష్ణోగ్రతల నియంత్రణ: ఆరావళి పర్వతాలు స్థానికంగా ఉష్ణోగ్రతను నియంత్రించి, పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడతాయి.

జీవ వైవిధ్యం (Biodiversity)

ఆరావళి పర్వతాలు గొప్ప జీవ వైవిధ్యానికి నిలయంగా ఉన్నాయి. అనేక రకాల వృక్ష, జంతు జాతులు ఈ శ్రేణిలో నివసిస్తున్నాయి.

❖ ఆరావళి పర్వతాల్లో ముఖ్యంగా ఉష్ణమండల ఎండిపోయే ఆకుల అడవులు (Tropical dry deciduous forests), ముళ్ల అడవులు (Thorn forests), పొదల అడవులు (Scrub forests) ఉన్నాయి.

❖ ఈ శ్రేణిలో కనిపించే ముఖ్యమైన మొక్కలు/ చెట్లు - ధోక్ (Anogeissus pendula), వేప (Neem), మర్రి (Banyan), రావి (Peepal), బాబుల్/ అకేషియా (Babool), బేర్ (Ber), పలాశ్ (Palash), కాక్టస్, ముళ్ల పొదలు.

❖ ప్రధాన జంతువులు - చిరుత (Leopard), గీతల హైనా (Striped hyena), నక్క (Jackal), భారతీయ నక్క (Indian fox), నీల్‌గాయ్ (Nilgai), సాంబార్ జింక, చింకారా (Indian gazelle), అడవి పంది (Wild boar) మొదలైనవి.

❖ పక్షులు - నెమలి, పావురాలు, గద్దలు, గుడ్లగూబ, బుల్బుల్స్, కింగ్‌ఫిషర్లు లాంటివి.

❖ సర్పాలు, ఉభయచరాల్లో (Reptiles & Amphibians) ప్రధానంగా మానిటర్ లిజార్డ్, నాగుపాము, క్రైట్, పైథాన్, గెక్కోలు, స్కింక్ జాతులు, కప్పలు, బల్లి జాతులు కనిపిస్తాయి.

❖ కీటకాలు - సూక్ష్మజీవుల్లో ముఖ్యంగా సీతాకోకచిలుకలు, తేనెటీగలు, చీమలు, బీటిల్స్, టెర్మైట్స్ లాంటివి ఆరావళి పర్వతాల్లో నివసిస్తాయి.

ముఖ్యమైన రక్షిత ప్రాంతాలు

ఆరావళి పర్వతాల్లోని వన్యప్రాణులు, సహజ వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు అనేక రక్షిత ప్రాంతాలను ఏర్పాటు చేశారు. ఇవి ముఖ్యంగా రాజస్థాన్, హరియాణా, దిల్లీ - ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.



◆ సరిస్కా టైగర్ రిజర్వ్, మౌంట్ అబూ వైల్డ్‌లైఫ్ శాంక్చుయరీ, అసోలా - భట్టి వైల్డ్‌లైఫ్ శాంక్చుయరీ (దిల్లీ - హరియాణా), జై సమంద్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం లాంటి జంతు సంరక్షణ కేంద్రాలు ఆరావళి పర్వతాల పరిధిలో ఉన్నాయి.

ఆరావళి పరిరక్షణ ఎందుకు ముఖ్యం?

ఎడారీకరణ నిరోధం: థార్ ఎడారిలోని ఇసుక తుపానులు దిల్లీ, హరియాణా వైపు రానీయకుండా ఇవి సహజ గోడలా అడ్డుకుంటాయి.

భూగర్భ జలాలు: ఈ పర్వతాలు వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి, భూగర్భ జల మట్టాన్ని పెంచుతాయి.

కాలుష్య నివారణ: దిల్లీ లాంటి నగరాల్లో పెరిగే వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ అడవులు 'ఊపిరితిత్తులు'గా పనిచేస్తాయి.

పర్యావరణ పరిరక్షణ - సుస్థిరాభివృద్ధి: ఎడారీకరణను అడ్డుకోవడం, వాతావరణ సమతౌల్యాన్ని కాపాడటంలో ఆరావళి పర్వతాలు దేశానికి రక్షణ కవచంగా పనిచేస్తున్నాయి. అక్కడ జరిగే అక్రమ గనుల తవ్వకాలు భారతదేశ పర్యావరణ భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారాయి.

☛ వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆరావళి పర్వతాల సంరక్షణ కోసం ప్రభుత్వం చట్టపరమైన చర్యలు, న్యాయస్థాన ఆదేశాలు, అటవీ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోంది. అయితే, వీటి విజయానికి కఠిన అమలు, ప్రజా సహకారం, స్థిర అభివృద్ధి విధానాలు ఆవశ్యకం.



రచయిత
డాక్టర్ బిరుదు రవిబాబు
విషయ నిపుణులు

885 Word of the Day

Fractious

Telugu meaning: మొండిపడే, జగడమారి


English meaning: The word fractious (ఫ్రాక్షస్) is an adjective that describes a person who is irritable, unruly, or difficult to control, especially due to frequent complaints or impatience.

Synonyms: Irritable, Quarrelsome; *Antonyms:* Calm, Compliant

Usage: 1. The fractious crowd grew impatient as the train delay extended beyond two hours, leading to heated arguments.

2. Managing a fractious team requires patience, clear communication, and strong leadership skills.

Current Affairs



Education Minister Dharmendra Pradhan released 55 rare and valuable literary works, representing the country's five classical languages on 6 January 2026. These are Tamil, Telugu, Malayalam, Kannada, and Odia. The books have been published by the Central Institute of Indian Languages.

The Minister also released 13 books along with a Tirukkural Sign Language series by the Central Institute of Classical Tamil.

Indian Railways has become one of the most extensively electrified rail systems in the world. Nearly all of India's 70,000 route-kilometre broad-gauge network is now powered by electricity. Till 2025, November over 99 percent of its entire network was already electrified, marking a major milestone.

India's pharmaceutical exports reached $30.47 billion in FY 2024–25, registering a year-on-year growth of 9.4 percent, and are on track to surpass last year's performance in the current financial year, the Pharmaceuticals Export Promotion Council of India (PHARMEXCIL) informed Commerce Secretary Rajesh Agrawal on 5 January 2026.

WaveX, the startup accelerator initiative under the Ministry of Information and Broadcasting, has signed an agreement to strengthen innovation, incubation and entrepreneurship in media, entertainment, broadcasting and communication technologies. The agreement has been signed with the Foundation for Innovation and Technology Transfer (FITT), IIT Delhi, to accelerate media technology entrepreneurship.

Dubai will host the third international AYUSH conference and exhibition from February 15 to 17, 2026, at the Dubai World Trade Centre. This brings together practitioners, researchers, policymakers, industry representatives and students of traditional systems of medicine from more than 35 countries.

For more Current Affairs: Scan QR code

భూ భ్రమణ దినోత్సవం

జనవరి 8
చరిత్రలో ఈనాడు

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుందని మనందరికీ తెలిసిందే. సూర్యోదయం, సూర్యాస్తమయం; రాత్రి, పగళ్లు; రుతువుల్లో మార్పులు లాంటివి సంభవించడానికి భూ భ్రమణమే కారణం. భూమి ఆవిర్భావం నుంచి వీటిలో ఎలాంటి మార్పు లేదు. అయితే భూమి తన అక్షంపై తిరుగుతుందని మొదటగా నిరూపించిన శాస్త్రవేత్త లియోన్ ఫోకాల్ట్. ఒక పెండ్యులం సాయంతో ఆయన ఈ విషయాన్ని రుజువు చేశారు. భూ భ్రమణాన్ని నిరూపించినందుకు గుర్తుగా ఏటా **జనవరి 8న** ప్రపంచవ్యాప్తంగా **'భూ భ్రమణ దినోత్సవం'గా** (Earth's Rotation Day) నిర్వహిస్తున్నారు. భూమి చలనం, దాని ఆవశ్యకతలను ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.


భూ భ్రమణం అంటే?

భూమి తన అక్షాన్ని ఆధారం చేసుకుని తనచుట్టూ తాను చేసే చలనాన్ని భూభ్రమణం అంటారు. దీన్నే ఆత్మభ్రమణం అని కూడా పిలుస్తారు. భూ భ్రమణం గంటకు సగటున 1610 కి.మీ.ల వేగంతో ఉంటుంది. భూమి ఒక భ్రమణం చేయడానికి 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్ల కాలం పడుతుంది.

✦ భూమి తన చుట్టూ తాను పడమర నుంచి తూర్పునకు తిరుగుతుంది. కాబట్టి రోజూ సూర్యుడు తూర్పున ఉదయించి, పడమరన అస్తమించడం మనం గమనిస్తాం.

చారిత్రక నేపథ్యం

1851లో ఫ్రెంచ్ భౌతిక శాస్త్రవేత్త లియోన్ ఫోకాల్ట్ ఒక లోలకం (పెండ్యులం) సాయంతో మొదటిసారి భూమి భ్రమణాన్ని ప్రపంచానికి చూపించారు. ఆయన పారిస్‌లోని పాంథియోన్ గోపురం నుంచి నేల నుంచి 75 అడుగుల ఎత్తులో స్టెయిన్‌లెస్ స్టీల్ వైర్ ద్వారా ఒక లోలకాన్ని వేలాడదీశారు. అది 200 పౌండ్ల బంగారు పూతతో ఉన్న గోళం. భూ భ్రమణానికి తగ్గట్లు దాని లోలకం తలం




కాలక్రమేణా మారుతున్నట్లు ఆ ప్రయోగం రుజువు చేసింది. భూమి తన అక్షం చుట్టూ తిరుగుతుందని నిరూపించేందుకు ఆయన నిర్వహించిన ప్రయోగానికి గుర్తుగా ఏటా జనవరి 8న 'భూ భ్రమణ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు.

భూభ్రమణ సమయంలో భూమిపై సంభవించే మార్పులు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

ఆవరణ కారకంగా ఉష్ణోగ్రత

వేడి లేదా చల్లదనం స్థాయిని సూచించే ఒక భౌతిక పరిమాణమే ఉష్ణోగ్రత. దీన్ని వస్తువులోని అణువుల కదలిక శక్తి ఆధారంగా నిర్ణయిస్తారు. ఉష్ణోగ్రతను సెల్సియస్ (°C), ఫారెన్‌హీట్ (°F) లేదా కెల్విన్ (K) యూనిట్లలో కొలుస్తారు. ఇది జీవుల జీవక్రియ, పెరుగుదల, పునరుత్పత్తి, పంపిణీని నిర్ణయిస్తుంది.



జీవులపై ఉష్ణోగ్రత ప్రభావం

ప్రతి జీవికి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత పరిధి ఉంటుంది. దీన్నే సహన శీలత అంటారు.

మొక్కల జీవన ప్రక్రియలు - ఉష్ణోగ్రత ప్రాథమిక ప్రభావం

మొక్కల జీవన విధానంలో ఉష్ణోగ్రత కీలకమైన ఆవరణ కారకం. ఇది పెరుగుదల, జీవక్రియ, పునరుత్పత్తి, సహనశీలతను నిర్ణయిస్తుంది. మొక్కలు ఎక్టోథర్మ్ జీవులుగా ఉంటాయి. బాహ్య వాతావరణంపై ఆధారపడి ఇవి తమ శరీర ఉష్ణోగ్రతను నియంత్రిస్తాయి.

✦ ఉష్ణోగ్రత మొక్కల్లో జరిగే కిరణజన్య సంయోగక్రియ, శ్వాసక్రియ, బాష్పోత్సేకం లాంటి ప్రక్రియలను ప్రభావితం చేస్తుంది.

ఎక్టోథర్మ్‌లు, ఎండోథర్మ్‌లపై ఉష్ణోగ్రత ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Posts in TCIL

Telecommunications Consultants India Limited, Bihar (TCIL) is inviting applications for various positions, including Operation Lead, Engineer, and Helpdesk Engineer, on a contract basis in different departments. The total number of posts is 25. Eligible candidates can apply offline before 9 January 2026.

Research Nurse Jobs

The All India Institute of Medical Sciences (AIIMS) in Raipur is inviting applications for Research Nurse positions on a contractual basis. The total number of posts is 41. The last date for online applications is 19 January 2026.

Senior Resident posts at AIIMS Rajkot

The All India Institute of Medical Sciences, Rajkot (AIIMS Rajkot) is inviting applications for Senior Resident positions in various departments on a contractual basis. The total no. of posts is 41. The application fee is Rs.1,000. The last date for submitting online applications is January 12, 2026.

Did You Apply..?

Today (January 8) is the last date for the following Jobs

☛ 101 Non-Teaching posts in IIT Bhubaneswar.
Eligibility: ITI/ Diploma/ Degree/ BE/ BTech/ MTech/ PG.

☛ Assistant Professor posts at TISS.
Eligibility: A Degree and a PhD.

For more information and other notifications - scan QR code

Mathematical Operations

1. Select the correct combination of mathematical signs to replace the * signs and balance the given equation.
21 * 4 * 156 * 13 * 11 = 83
A) − ÷ × + B) × + ÷ − C) × − ÷ +
D) + ÷ − × E) ÷ × − +

2. Select the correct combination of mathematical signs to sequentially replace the * signs and to balance the given equation.
12 * 24 * 4 * 2 * 60
A) +, ×, ÷, = B) −, ×, +, =
C) +, ×, −, = D) +, ÷, ×, =
E) ÷, =, +, ×

3. Two sets of numbers are given below. In each set of numbers, certain mathematical operation(s) on the first number result(s) in the second number. Similarly, certain mathematical operation(s) on the second number result(s) in the third number and so on. This of the given options follows the same set of operations as in the given sets
7 – 14 – 28 – 38; 4 – 8 – 16 – 26
A) 25 – 15 – 60 + 36
B) 8 – 16 – 32 – 40
C) 6 – 12 – 24 – 36
D) 15 – 25 – 50 – 60
E) 13 – 26 – 52 – 62

4. Which two signs should be interchanged to make the given equation correct?
756 ÷ 252 + 89 × 180 − 63 = 384
A) + and × B) ÷ and − C) − and +
D) ÷ and + E) × and +

5. Select the correct combination of mathematical signs to replace the * signs and balance the given equation.
36 * 12 * 6 * 12 * 3 = 63
A) + × ÷ − B) × ÷ − + C) + ÷ − ×
D) + ÷ × − E) ÷ − + ×

6. Which two signs should be interchanged to make the given equation correct?
12 ÷ 5 − 8 × 2 + 14 = 70
A) − and + B) + and × C) ÷ and ×
D) ÷ and + E) − and ÷

7. Which two signs should be interchanged to make the following equation correct?
29 × 145 + 5 − 640 ÷ 15 = 216
A) ÷ and + B) ÷ and × C) − and +
D) − and × E) − and ÷

8. The second number in the given number-pairs is obtained by performing certain mathematical operation(s) on the first number. The same operation(s) is/are followed in all the number pairs, except one. Find that odd number pair.
A) 17 : 306 B) 25 : 650 C) 23 : 552
D) 13 : 182 E) 19 : 371

Bank Exams
Reasoning

9. Select the correct combination of mathematical signs to sequentially replace the * signs and balance the given equation.
268 * 4 * 8 * 5 * 14 = 41
A) + × − ÷ B) × ÷ + −
C) ÷ × + − D) ÷ − × +
E) × ÷ − +

10. Which two signs should be interchanged in the following equation to make it correct?
10 + 5 ÷ 10 × 8 − 10 = 16
A) + and ÷ B) − and +
C) ÷ and × D) × and +
E) ÷ and −

Directions (Qs. 11 - 14): In each of the following questions if the given interchanges are made in signs and numbers, which one of the four equations would be correct?

11. Given interchanges: Signs − and + and numbers 4 and 8.
A) 6 − 8 + 4 = −1 B) 8 − 6 + 4 = 1
C) 4 + 8 − 2 = 6 D) 4 − 8 + 6 = 2
E) 4 + 8 − 6 =3

12. Given interchanges: signs + and × and numbers 4 and 5.
A) 5 × 4 + 20 = 40
B) 5 × 4 + 20 = 85
C) 5 × 4 + 20 = 104
D) 5 × 4 + 20 = 95
E) 5 × 4 + 20 = 105

13. Given interchanges: signs + and − and numbers 4 and 8.
A) 4 + 8 − 12 = 16 B) 4 − 8 + 12 = 0
C) 8 + 4 − 12 = 24 D) 8 − 4 + 12 = 8
E) 8 − 4 +12 = 7

14. Given interchanges: signs − and × and numbers 3 and 6.
A) 6 − 3 × 2 = 9 B) 3 − 6 × 8 = 10
C) 6 × 3 − 4 = 15 D) 3 × 6 − 4 = 33
E) 6 − 3 × 2 = 11

15. Find out the two signs to be interchanged for making following equation correct:
5 + 3 × 8 − 12 ÷ 4 = 3
A) + and − B) − and ÷
C) + and ×
D) + and ÷
E) − and ×

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

2040 నాటికి చంద్రునిపైకి భారతీయుడు!

ఇస్రో మాజీ చీఫ్ కిరణ్ కుమార్

అహ్మదాబాద్: భారత వ్యోమగాములను 2040 నాటికి చంద్రునిపైకి పంపించాలనేది ప్రణాళిక అని ఇస్రో మాజీ అధిపతి ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (పీఆర్ఎల్) కార్యనిర్వాహక మండలికి ఛైర్మన్‌గా ఉన్న ఆయన.. బుధవారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. "2026 నుంచి 2040 వరకు ఇస్రో అనేక ప్రయోగాలు చేపట్టనుంది. 2040లో చంద్రునిపైకి మనుషులను పంపించి సురక్షితంగా వెనక్కి తీసుకురావాలనేది ప్రణాళిక. చంద్రుని దక్షిణ ధ్రువానికి సంబంధించిన వివరాలు లోతుగా తెలుసుకోవడానికి సమీప భవిష్యత్తులో చంద్రయాన్ ప్రయోగాలు ఉంటాయి" అని తెలిపారు. భారత్ మాత్రమే అంతరిక్ష సాంకేతికతను సైనికపరంగా కాకుండా సామాజిక అవసరాలకే వాడుతోందని పేర్కొన్నారు.

చేతులు నరికేస్తాం

ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ సైన్యాధిపతి వ్యాఖ్యలు

దుబాయ్: తమ దేశ అంతర్గత విషయాల్లో బాహ్య శక్తులు జోక్యం చేసుకుంటే సహించబోమని అమెరికాను ఇరాన్ సైన్యాధిపతి అమీర్ హతామీ హెచ్చరించారు. ఇటీవల ఇరాన్ వ్యాప్తంగా పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని ప్రాంతాల్లో ప్రజలపై భద్రతా దళాలు కాల్పులు కూడా జరిపాయి. కొంత మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఆందోళనకారులకు మద్దతుగా మాట్లాడారు. వారి పోరాటాన్ని సమర్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరాన్ ప్రజల కోసం అవసరమైతే అమెరికా రంగంలోకి దిగుతుందని హెచ్చరించారు. దీనిపై హతామీ స్పందించారు. బాహ్యశక్తులు రంగప్రవేశం చేస్తే చేతులు ముడుచుకొని కూర్చోబోమని చెప్పారు. ఎవరైనా జోక్యం చేసుకోవాలని ప్రయత్నిస్తే వారి చేతులు నరికేస్తామని హెచ్చరించారు.



జేఎఫ్‌- 17 థండర్ ఫైటర్ జెట్

పాక్, బంగ్లాదేశ్‌ల మధ్య రక్షణ సహకారం

యుద్ధ విమానాల కొనుగోలుపై చర్చలు

ఇస్లామాబాద్, లాహోర్: పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల మధ్య రక్షణ సంబంధాలు అంతకంతకూ విస్తృతం అవుతున్నాయి. తాజాగా పాకిస్థాన్ నుంచి జేఎఫ్‌- 17 థండర్ ఫైటర్ జెట్ విమానాలను కొనుగోలు చేసేందుకు బంగ్లాదేశ్ సంప్రదింపులు ప్రారంభించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే బంగ్లాదేశ్ వైమానిక దళ చీఫ్ మార్షల్ హసన్ మహమూద్ ఖాన్, పాక్ వాయుసేన చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ సిధూలు ఇస్లామాబాద్‌లో ఇటీవల భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జేఎఫ్‌-17 యుద్ధ విమానాల కొనుగోలుపై చర్చలు జరిగినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. ఈ చర్చలు సైనిక చర్యల్లో సహకారం, సంస్థాగత సమైక్యత సాధించే దిశగా సాగాయని అధికార వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్ ఏరోనాటికల్ కాంప్లెక్స్ (పీఏసీ), చైనాకు చెందిన చెంగ్డు ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ సమష్టిగా ఒకటే ఇంజిన్‌తో నడిచే తేలికపాటి యుద్ధ విమానమైన జేఎఫ్-17ను రూపొందించాయి. భారత్‌తో ఇటీవల జరిగిన ఘర్షణల సందర్భంగా ఈ విమానం తన సామర్థ్యాన్ని నిరూపించుకుందని పాక్ చాటుకున్నప్పటికీ దాని అసలు సామర్థ్యం ఏమిటన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సంవత్సరం మే 7 నుంచి 10 వరకు భారత్‌తో జరిగిన ఘర్షణలో చైనా అందించిన చెంగ్డు జే- 10 యుద్ధ విమానాలను పాకిస్థాన్ వినియోగించిందని సైనిక పరిశీలకులు చెబుతున్నారు.

మళ్లీ సిరియాలో పేలుతున్న తుపాకులు

కుర్దులకు సైన్యానికి మధ్య తీవ్ర ఘర్షణ

అలెప్పో: సిరియాలోని అలెప్పో నగరంలో కుర్దు జాతీయులకు చెందిన సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఎస్‌డీఎఫ్)కు, ప్రభుత్వ బలగాలకు మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ ఘర్షణల్లో మంగళవారం ఏడుగురు మరణించారు. దీంతో నగరంలోని కుర్దు ఆవాస ప్రాంతాలైన షేక్ మక్సూద్, అష్రాఫియే ప్రాంతాలను మూసివేసిన సైనిక జోన్‌గా సిరియా సైన్యం ప్రకటించింది. ఆ ప్రాంతాల నుంచి నిష్క్రమించాల్సిందిగా సైన్యం సాధారణ పౌరులను హెచ్చరించింది. దీంతో కుర్దు ఆవాస ప్రాంతాల నుంచి వందల మంది సామాన్యులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్నారు. కుర్దు జాతీయులకు చెందిన ఎస్‌డీఎఫ్ బలగాలు అలెప్పో నగరంలో ప్రభుత్వ అధీనంలోని ప్రాంతాలపై దాడికి పాల్పడిన కారణంగా ప్రస్తుత పరిస్థితి తలెత్తిందని సైన్యం చెబుతోంది. కుర్దు పరిపాలనా యంత్రాంగాన్ని, బలగాలను సిరియా ప్రభుత్వంలో విలీనం చేసేలా గత మార్చిలో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయడంలో ఇరు పక్షాలు విఫలం కావడంతో ఈ ఘర్షణలు తలెత్తాయి.

క్లబ్ యజమాని ఇంట్లో 60 డెర్బీ ట్రోఫీలు మాయం

పని మనిషిపై కేసు నమోదు

ముంబయి: ఓ క్లబ్ యజమాని ఇంట్లో సుమారు రూ.15.24 లక్షల విలువైన 60 బంగారు, వెండి డెర్బీ ట్రోఫీలు చోరీకి గురయ్యాయి. ముంబయి నగరంలోని గామ్‌దేవీ ప్రాంతంలో ఈ ఘటన వెలుగుచూసింది. ఇంటి పని మనిషే దొంగతనానికి పాల్పడి ఉంటాడని యజమాని ఆరోపించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రకటనల చిత్ర దర్శకుడు, రాయల్ వెస్టర్న్ ఇండియా టర్ఫ్ క్లబ్ లిమిటెడ్ యజమాని శివేన్ సురేంద్రనాథ్ నివాసంలో గతేడాది నవంబరులో ఈ చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. 2006 నుంచి పలు ప్రతిష్ఠాత్మకమైన డెర్బీల్లో విజయం సాధించిన ఆయనకు బంగారం, వెండి పూత గల అనేక ట్రోఫీలు లభించాయి. వీటన్నింటినీ తన ఇంట్లో పనిచేస్తున్న రాజేంద్ర జెనుసర్ జేనా చోరీ చేశాడని శివేన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నవంబరు 28న అత్యవసర పనిమీద కోల్‌కతా వెళ్తున్నానని చెప్పిన జేనా ఆ తరువాత నుంచి కనిపించడం లేదని శివేన్ తెలిపారు. అనుమానం వచ్చి ఇంట్లో పరిశీలించగా ట్రోఫీలు లేవని.. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

కుక్కలతోనే కాదు.. వీధి పశువులతోనూ ముప్పే

- ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు
- సుప్రీంకోర్టు వ్యాఖ్య.. నేడూ కొనసాగనున్న వాదనలు



దిల్లీ: వీధికుక్కలు కరవడంవల్ల మాత్రమే కాకుండా రోడ్లపై యథేచ్ఛగా తిరుగాడే పశువుల వల్ల కూడా ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధికుక్కలపై నవంబరు 7న ఇచ్చిన తీర్పును సవరించాలని జంతుప్రేమికులు, కచ్చితంగా అమలు చేయాలని మరికొందరు సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ వినతులపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. "మునుపటి ఉత్తర్వులు ఇచ్చేముందు తమ వాదనలు వినలేదని పలువురు న్యాయవాదులు, జంతుప్రేమికులు చెప్పడంతో ఇప్పుడు విచారణ నిర్వహిస్తున్నాం. రోడ్లపై కుక్కలు, ఎవరి ఆలనాపాలనా లేని పశువులు ఉండకూడదు. వాటి సంచారం అనేకమందికి ప్రమాదకరంగా మారుతోంది. ఉదయాన్నే ఏ కుక్క తీరు ఎలా ఉందో ఎవరికీ తెలియదు. నిబంధనలు, ఆదేశాలను స్థానిక సంస్థలు అమలు చేయాల్సిందే. రాజస్థాన్ హైకోర్టు జడ్జీలిద్దరు గత 20 రోజుల వ్యవధిలో ప్రమాదాలపాలయ్యారు. సమస్య తీవ్రమైనది" అని జస్టిస్ మెహతా చెప్పారు.

కోళ్లు, మేకల గురించి మాట్లాడరేం?

మునుపటి ఉత్తర్వుల్ని సవరించాలంటున్నవారి తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కుక్కలన్నింటినీ పట్టుకోవడం పరిష్కారం కాదని, జంతువులు-మనుషులకు మధ్య ఘర్షణను నివారించడానికి ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన శాస్త్రీయ నమూనాను ఆచరించడం మేలని ఆయన అభిప్రాయపడ్డారు. వీధికుక్కల్ని నియంత్రించి, వాటి బెడదను నివారించాలంటే 'సీఎస్‌వీఆర్' (క్యాప్చర్- బంధించు, స్టెరిలైజ్-సంతాన నిరోధ చికిత్స చేయు, వ్యాక్సినేట్- టీకా వేయు, రిలీజ్- విడుదలచేయు) అనే సూత్రాన్ని ఆచరించవచ్చని, ఇది లఖ్‌నవూలో అత్యంత విజయవంతమైందని చెప్పారు. ఒక పులి మనిషిని చంపితే పులులన్నింటినీ సంహరించం కదా అని అన్నారు. జంతు సంక్షేమ సంఘాల తరఫున హాజరైన న్యాయవాది కాలిన్ గొన్సాల్వెస్ వాదిస్తూ.. కుక్కకాట్ల సంఖ్యను ఐదురెట్ల కంటే ఎక్కువగా ప్రభుత్వ నివేదికలు చూపిస్తున్నాయని ఆరోపించారు. 2021 నుంచి 19 రాష్ట్రాల్లో రేబిస్ కేసులు లేవన్నారు. "అందరూ కుక్కల గురించే ఆలోచిస్తుంటే.. ఇతర జంతువుల సంగతేంటి? కోళ్లు, మేకల గురించి ఎందుకు మాట్లాడరు? వాటివి ప్రాణాలు కావా" అని ధర్మాసనం ఒకదశలో ప్రశ్నించింది. చికిత్స కంటే నివారణ మేలు అని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు. వ్యవహారంలో పెద్దగా వాదనలకు ఆస్కారం లేదన్నారు.

స్పందించని రాష్ట్రాలపై కఠినంగా వ్యవహరిస్తాం

నియమ నిబంధనలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను రాష్ట్రాలు, స్థానిక సంస్థలు కచ్చితంగా అమలు చేయాలనేదే చెబుతున్నామని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. తమ ఉత్తర్వుల అమలుపై కొన్ని రాష్ట్రాలు స్పందించలేదని, వాటిపై చాలా కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని ధర్మాసనం హెచ్చరించింది. నిబంధనలన్నింటినీ పాటించాల్సిందేనంది. పిల్లలు, పెద్దలు కూడా కుక్కకాట్ల వల్ల ప్రాణాలు కోల్పోతున్న విషయాన్ని తాము అర్థం చేసుకున్నామని తెలిపింది. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ మార్గాలకు కంచెలు వేస్తే కుక్కలు వాటిమీదకు రావని సూచించింది. అసంపూర్తిగా మిగిలిన వాదనలు గురువారం కొనసాగనున్నాయి.

నిద్రపై నిఘాతో రోగాల ముప్పుపై ఆరా

దిల్లీ: ఒక వ్యక్తి శారీరక, మానసిక సమాచారాన్ని నిద్రలో సేకరించి, పరిశీలించడం ద్వారా అనేక రోగాల ముప్పును ముందే పసిగట్టగల కృత్రిమ మేధ (ఏఐ) నమూనా- 'స్లీప్ ఎఫ్‌ఎం'ను అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం రూపొందించింది. 65,000 మంది వ్యక్తుల నుంచి ఆరు లక్షల గంటల నిద్రా సమాచారాన్ని సేకరించి జరిపిన ఈ అధ్యయన ఫలితం నేచర్ పత్రికలో ప్రచురితమైంది. మొత్తం 1,000 రకాల వ్యాధుల్లో 130 వ్యాధుల ప్రమాదాన్ని స్లీప్ ఎఫ్‌ఎం ముందే పసిగట్టగలదని తేలింది. ప్రయోగశాలలో 8 గంటలసేపు వ్యక్తులను ఉంచి అధ్యయనం చేయడం కష్టం. అదే వ్యక్తిని నిద్రలో 8 గంటలసేపు నిరాటంకంగా పరిశీలించవచ్చు. నిద్రలో సమాచారాన్ని సేకరించడాన్ని పాలీసోమ్నోగ్రఫీ అంటారు. మెదడు, గుండె పనితీరును, కండరాలలో విద్యుదావేశాన్నీ, నాడి, ఉచ్ఛ్వాసనిశ్వాసాలను ఈసీజీ, ఈఈజీ వంటి ప్రక్రియలతో గమనించి సమాచారం సేకరిస్తారు. ఈ సమాచారాన్ని స్లీప్ ఎఫ్‌ఎంతో విశ్లేషించి క్యాన్సర్, గర్భధారణ, హృదయం-రక్తనాళం, మూత్రపిండాలు, మానసిక సమస్యలను సమర్థంగా గుర్తించగలిగారు. పార్కిన్సన్ వ్యాధి ప్రమాదాన్నీ ఈ పద్ధతిలో తెలుసుకోవచ్చు.



వెనెజువెలా రాజధాని కారకాస్‌లో బుధవారం ప్రభుత్వ మద్దతుదారుల నిర్వహించిన భారీ ర్యాలీ

మహారాష్ట్రలో భాజపా, కాంగ్రెస్ పొత్తు

- నేతలపై సీఎం ఫడణవీస్ ఆగ్రహం
- 12 మంది కౌన్సిలర్లను సస్పెండ్ చేసిన కాంగ్రెస్

ముంబయి: మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది. ఉప్పు నిప్పులా ఉండే భాజపా-కాంగ్రెస్ కలిసిపోయాయి. అంబర్‌నాథ్ ప్రాంతానికి మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు ఈ రెండు పార్టీలు జట్టుకట్టాయి. ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనకు అధికారం దక్కకుండా ఉండేందుకు ఈ అరుదైన కూటమి ఏర్పాటయ్యింది. దీంతోపాటు అకోట్ మున్సిపల్ స్థానం కోసం మజ్లిస్‌తోనూ భాజపా పొత్తు పెట్టుకుంది. ఈ క్రమంలో అంబర్‌నాథ్ ప్రాంతంలోని పార్టీ నేతలపై కాంగ్రెస్ చర్యలు తీసుకుంది. హైకమాండ్‌కు తెలియకుండా భాజపాతో పొత్తుపెట్టుకున్నందుకు 12 మంది కౌన్సిలర్లను సస్పెండ్ చేసింది. అంబర్‌నాథ్‌లో 60 కౌన్సిలర్ స్థానాలకు పోటీ జరగ్గా.. శివసేన(శిందే) 27 స్థానాలను గెలుచుకుని, మ్యాజిక్ ఫిగర్‌కు కేవలం నాలుగు స్థానాల్లో ఆగిపోయింది. మరోవైపు భాజపా 14, కాంగ్రెస్ 12, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ 4 సీట్లను కైవసం చేసుకున్నాయి. ఈ మూడు పార్టీలు మరో ఇద్దరు స్వతంత్రులతో కలిసి జట్టుకట్టాయి. దీంతో భాజపాకు చెందిన తేజశ్రీ కరంజులే ఇక్కడ మేయర్ పదవిని చేజిక్కించుకున్నారు.

చర్యలు తప్పవన్న సీఎం

భాజపా-కాంగ్రెస్ పొత్తుపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి కారణమైన నేతలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 'భాజపా ఎప్పుడూ కాంగ్రెస్, ఏఐఎంఐఎంతో పొత్తు పెట్టుకోదు. ఇలాంటి కూటములు ఆమోదనీయం కాదు. పార్టీ కూడా దీనిని సహించదు. ఒకవేళ ఎవరైనా స్థానిక భాజపా నేతలు అధిష్ఠానం ఆమోదం లేకుండా ఈ పార్టీలతో పొత్తు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. స్థానిక నాయకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం పార్టీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. వీరిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు.

సోమనాథ్‌పై రాజకీయ రగడ



దిల్లీ: గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంపై భాజపా, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం ముదిరింది. మహమ్మద్ గజినీ, అల్లావుద్దీన్ ఖిల్జీలు సోమనాథ్ ఆలయాన్ని కూలగొట్టి, అందులోని సంపదను దోచుకోగా, స్వతంత్ర భారత ప్రథమ ప్రధాని నెహ్రూ సోమనాథుడిని అమితంగా ద్వేషించారని భాజపా జాతీయ ప్రతినిధి సుధాంశు త్రివేది బుధవారం 'ఎక్స్'లో ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. 1951లో అప్పటి పాకిస్థాన్ ప్రధాని లియాఖత్ అలీఖాన్‌కు రాసిన లేఖలో సోమనాథ్ ఆలయ విధ్వంసం జరిగిందనడం పట్ల బూటకమని నెహ్రూ వర్ణించారని త్రివేది ఆరోపించారు. ఇది మైనారిటీల బుజ్జగింపు రాజకీయాలకు పరాకాష్ఠ అని విమర్శించారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం విదేశాలలో భారత్ ప్రతిష్ఠను మంటగలిపిందంటూ నెహ్రూ ముఖ్యమంత్రులందరికీ రెండుసార్లు లేఖలు రాశారని ఆరోపించారు.

అయోధ్యకు కోవింద్‌ను, ముర్మును ఎందుకు పిలవలేదు?: కాంగ్రెస్

నెహ్రూ మీద భాజపా అసత్యాలు, అర్ధసత్యాలతో దుష్ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు పీయూష్ బాబెలే విరుచుకుపడ్డారు. సోమనాథ్ ఆలయ ప్రారంభోత్సవానికి అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్‌ను నెహ్రూ వెళ్లనివ్వలేదని ఆరోపించిన భాజపా.. మరి అయోధ్యలో రామాలయ శంకుస్థాపనకు నాటి దళిత రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌నూ, ఆ ఆలయ ప్రారంభోత్సవానికి ప్రస్తుత ఆదివాసీ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఎందుకు పిలవలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమనాథ్ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ ధనాన్ని వెచ్చించడం లౌకికవాద సూత్రాలకు విరుద్ధమని నెహ్రూ పేర్కొన్నట్లు చెప్పారు.

మూడు వ్యూహాలతో ప్రపంచ విమాన ఉద్గారాలను సగానికిపైగా తగ్గించొచ్చు

- అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: ప్రపంచంలోని విమానాల నుంచి వచ్చే ఉద్గారాలను సమర్థవంతమైన మూడు వ్యూహాలతో సగానికిపైగా తగ్గించవచ్చని ఓ అధ్యయనం పేర్కొంది. అత్యంత ఇంధన సామర్థ్యాలు కలిగిన విమానాలను మాత్రమే నడపడం, విమానాల్లో కేవలం ఎకానమీ క్లాసు సేవలను మాత్రమే అందించడం, ప్రయాణికుల సామర్థ్యాన్ని పెంచడం వంటి మూడు సమర్థమైన వ్యూహాల ద్వారా ఉద్గారాలను 50 శాతానికి పైగా తగ్గించవచ్చని అధ్యయనం తెలిపింది. "లార్జ్ కార్బన్ డై ఆక్సైడ్ ఎమిషన్స్ అవాయిడెన్స్ పొటెన్షియల్ ఇన్ ఇంప్రూవ్డ్ కమర్షియల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ ఎఫీషియన్సీ' పేరుతో కమ్యూనికేషన్స్ ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ జర్నల్‌లో ఈ అధ్యయనాన్ని ప్రచురించారు. దీని ప్రకారం... సుదీర్ఘ ప్రయాణాలకు బోయింగ్ 787-9 విమానాలను, తక్కువ- మధ్యస్త దూర ప్రయాణాల కోసం ఏ321 నియో విమానాలను ఉపయోగించడం ద్వారా 25-28 శాతం ఇంధన వినియోగాన్ని ఆదా చేయొచ్చు. ఎకానమీ క్లాసులతో పోలిస్తే బిజినెస్, ఫస్ట్ క్లాసులు అధిక కర్బన ఉద్గారాలను విడుదల చేస్తాయి. విమానాల్లో ప్రయాణికుల సీట్లను పెంచడం ద్వారా 22-57 శాతం ఉద్గారాలను తగ్గించవచ్చు. అంతేకాకుండా విమానయాన సంస్థలు తమ వద్ద ఉన్న అత్యంత సమర్థవంతమైన విమానాలను వారు ఇప్పటికే వెళ్లే మార్గాల్లోనే వ్యూహాత్మకంగా నడపడం ద్వారా 11 శాతం వరకు ఉద్గారాలను పరిహరించవచ్చు. 2023లో 27 మిలియన్లకు పైగా కమర్షియల్ విమానాల ప్రయాణాలపై పరిశోధన చేసిన అనంతరం ఈ అధ్యయనాన్ని రచించారు.

చమురు విక్రయానికి వీలుగా వెనెజువెలాపై కొన్ని ఆంక్షలు తొలగిస్తాం

అమెరికా అధికార వర్గాల వెల్లడి

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు సరఫరాలను మెరుగుపరిచేందుకు గాను ట్రంప్ ప్రభుత్వం వెనెజువెలా చమురు విక్రయాలపై కొన్ని ఆంక్షలను తొలగించనుందని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. దీనిలో భాగంగానే వెనెజువెలా నౌకలకూ సడలింపులిస్తామని తెలిపింది. బుధవారం వెలువరించిన అమెరికా ఇంధన శాఖ విధాన పత్రం ఈ విషయాలను పేర్కొంది. మరోవైపు అమెరికా బుధవారం వెనెజువెలాకు చెందిన రెండు నిషేధిత చమురు ట్యాంకర్లను ఉత్తర అట్లాంటిక్, కరీబియన్ ప్రాంతాల నుంచి జప్తు చేసింది.

బ్రిటన్‌లో భారత సంతతి ప్రజల ఆదాయంలో వృద్ధి

- తాజా అధ్యయనంలో వెల్లడి

లండన్: బ్రిటన్‌లో భారత సంతతి ప్రజల ఆదాయం గత దశాబ్దకాలంలో భారీగా వృద్ధి చెందిందని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్ఎస్ఈ) నివేదిక పేర్కొంది. బ్రిటన్‌లో నివసిస్తున్న మైనారిటీ సమూహాల్లో భారతీయులే ఎక్కువగా ఆర్జిస్తున్నారని తెలిపింది. 2012-14 నుంచి 2021-23 మధ్య బ్రిటన్‌లో వివిధ వర్గాల ఆదాయాలను ఈ నివేదిక పరిశీలించింది. దీని ప్రకారం.. ఓవైపు భారతీయుల ఆదాయం పెరుగుతుంటే, మరోవైపు పాకిస్థాన్, బంగ్లాదేశ్ సంతతి ప్రజల ఆదాయం తగ్గిందని తెలిపింది. భారతీయులు అత్యధికంగా సంపాదించడమే కాదు.. పొదుపులోనూ ముందున్నారు. ఈ విషయంలో కూడా పాక్, బంగ్లాదేశ్ మూలాలున్న ప్రజలు వెనుకంజలో ఉన్నారని నివేదిక తెలిపింది.

ఈ రుమాలు రూ. 7 లక్షలు



ఒక చేతి రుమాలు (హ్యాండ్ కర్చీఫ్) ధర రూ.7 లక్షలు. అవును.. ఇది వాస్తవం. దాని తయారీకి వినియోగించిన పలుచటి, సున్నితమైన కాటన్ వస్త్రం (మస్లిన్), దారం నుంచి మొదలుకుని దానిపై వేసిన డిజైన్‌దాకా అన్నీ స్పెషలే. ఇటీవలే సిమ్లాలో నిర్వహించిన 'హిమ్ ఎంఎస్ఎంఈ ఫెస్ట్'లో ఈ చేతి రుమాలు ధర విని అందరూ షాకయ్యారు. ఈ హ్యాండ్ కర్చీఫ్ 'చంబా రాజ్య' సాంస్కృతిక వారసత్వానికి చిహ్నం. అందుకే దీన్ని 'చంబా రుమాలు' అని పిలుస్తారు. 2007లోనే దీనికి జీఐ ట్యాగ్ లభించింది. చంబా కళాకారిణి అంజలి వకీల్ ఫెస్ట్‌లో తాను తయారు చేసిన ఈ చంబా రుమాలు ధర చర్చనీయాంశంగా మారింది. దీని తయారీకి కొన్ని నెలల సమయం పడుతుందని అంజలి తెలిపారు. చంబా రుమాలు ఎంబ్రాయిడరీ వర్క్‌లో ప్రావీణ్యానికిగానూ తన అత్తగారు లలితా వకీల్‌కు పద్మశ్రీ అవార్డు వచ్చిందని తెలిపారు. ఎంబ్రాయిడరీ వర్క్, డిజైన్, పరిమాణం, సంక్లిష్టతను బట్టి చంబా రుమాలు ధర రూ.1,500 నుంచి రూ.40 లక్షల దాకా ఉంటుందని వెల్లడించారు. రామాయణం, మహాభారతంలోని ఏదో ఒక గాథను ఈ కర్చీఫ్‌పై డిజైన్ కోసం వాడుతారు.

-ఈటీవీ భారత్

జస్టిస్ వర్మపై దర్యాప్తు కమిటీని లోక్‌సభ స్పీకర్ ఏర్పాటు చేయొచ్చు: సుప్రీం

దిల్లీ: అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలపై లోక్‌సభ స్పీకర్ దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయవచ్చని సుప్రీంకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. న్యాయమూర్తుల చట్టం-1968 ప్రకారం దీనిపై అభ్యంతరం ఏమీ లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం తెలిపింది. జస్టిస్ వర్మపై ప్రతిపాదించిన అభిశంసన తీర్మానాన్ని రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ తిరస్కరించినందున దర్యాప్తు కమిటీని లోక్‌సభ స్పీకర్ నియమించరాదన్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. జస్టిస్ వర్మ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేసినందున ఆ తీర్మానాన్ని తిరస్కరించే అధికారం డిప్యూటీ ఛైర్మన్‌కు లేదన్న రోహత్గీ వాదనతోనూ ధర్మాసనం విభేదించింది. లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ ఒకే సమయంలో అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదిస్తేనే ఉభయ సభలూ సంయుక్తంగా దర్యాప్తు కమిటీని ఏర్పాటు చేయాలని రోహత్గీ పేర్కొన్నారు. అయితే, న్యాయమూర్తుల విచారణ చట్టంలో అలాంటి నిబంధనేమీ లేదని ధర్మాసనం తెలిపింది. దర్యాప్తు కమిటీ ఏర్పాటుకు లోక్‌సభ స్పీకర్ అనుసరించిన తీరులో ఏదో లోపం ఉన్నట్లు అనిపిస్తోందని, అది ఆ ప్రక్రియను నిలువరించాల్సినంత తీవ్రతమైనదా కాదా అన్నది పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. గురువారం కూడా ఈ అంశంపై విచారణ కొనసాగనుంది. న్యాయమూర్తుల చట్టం-1968 ప్రకారం తనపై పార్లమెంటరీ కమిటీని నియమించటాన్ని సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు జరుగుతున్నాయి.

ఆ ఆడియో క్లిప్పును ఫోరెన్సిక్ పరీక్షకు పంపండి

మణిపుర్ అల్లర్ల పిటిషన్‌పై సుప్రీం ఆదేశం

దిల్లీ: మణిపుర్ అల్లర్ల వెనుక అప్పటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ హస్తం ఉన్నట్లు తెలిపే ఆడియో క్లిప్పుపై ఫోరెన్సిక్ పరీక్ష జరపాల్సిందిగా సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ఈ క్లిప్పు మొత్తాన్ని ఫోరెన్సిక్ పరీక్ష కోసం గుజరాత్‌లోని గాంధీనగర్ నేషనల్ ఫోరెన్సిక్ సైన్సు యూనివర్శిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ)కి పంపాలని జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "బీరేన్ సింగ్ గళాన్ని రికార్డు చేసిన మొత్తం 48 నిమిషాల ఆడియో క్లిప్పు అందుబాటులో ఉంది. ప్రతివాదులకు పిటిషనర్ తరఫు న్యాయవాది అందించిన వాయిస్ రికార్డింగ్‌లనూ ఫోరెన్సిక్ పరీక్షకు పంపాలి" అని ధర్మాసనం పేర్కొంది. ఫోరెన్సిక్ పరీక్ష ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి తుది నివేదికను సీల్డు కవరులో సమర్పించాలని ధర్మాసనం ఎన్ఎఫ్ఎస్‌యూను ఆదేశించింది. కుకి ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ సమర్పించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

సోషల్ మీడియాలో విమర్శలు చేసిన గాయకురాలికి అరెస్టు నుంచి సుప్రీం రక్షణ

దిల్లీ: ప్రముఖ జానపద గాయకురాలు, సామాజిక కార్యకర్త నేహా సింగ్ రాఠోడ్‌ను అరెస్టు చేయవద్దంటూ సుప్రీంకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, భాజపాలను విమర్శిస్తూ సోషల్ మీడియాలో చేసిన విమర్శ ఆమెపై కేసు నమోదుకు కారణమైంది. ఆమెపై ఎలాంటి బలవంతపు చర్యలకు పాల్పడవద్దని జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ అతుల్ ఎస్ చందూర్కర్‌ల ధర్మాసనం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణాధికారి సమక్షంలో హాజరై దర్యాప్తునకు సహకరించాల్సిందిగా ఆమెనూ ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌ను తొలుత అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దానిపై ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

మధ్యవర్తిత్వ తీర్పులు మళ్లీ మా దగ్గరకొస్తే ఏం ప్రయోజనం

సుప్రీంకోర్టు అసహనం

దిల్లీ: మధ్యవర్తిత్వ తీర్పులను కోర్టుల్లో సవాల్ చేస్తుండటంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తంచేసింది. దీని వల్ల మధ్యవర్తిత్వ ఉద్దేశమే దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తంచేసింది. ఆర్బిట్రేషన్, కన్సిలియేషన్ చట్టం-1996 ప్రకారం ఒప్పంద, వాణిజ్య వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం తెలిపింది. ఓ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ తీర్పును కొట్టివేస్తూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పక్కన పెడుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

నాడు ఇందిరమ్మ ధైర్యం- నేడు మోదీకి భయం

ట్రంప్ వ్యాఖ్యలకు స్పందిస్తూ.. రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు

దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ తనను కలవడానికి 'సార్, ప్లీజ్ నేను మిమ్మల్ని చూడొచ్చా?' అని బతిమాలినట్లుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'తేడా గమనించండి సార్ జీ' అంటూ మోదీని ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ట్రంప్ ఏమన్నారంటే?

మంగళవారం ట్రంప్ మాట్లాడుతూ... రష్యా చమురు కొనుగోలు కారణంగా భారత్‌పై సుంకాలు పెంచినందుకే మోదీ తన విషయంలో సంతోషంగా లేరని అన్నారు. అంతటితో ఆగకుండా మోదీ నన్ను చూడటానికి 'సార్, నేను మిమ్మల్ని కలవొచ్చా ప్లీజ్' అని అడిగారని ట్రంప్ చెప్పుకొచ్చారు. దీంతో రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ 1971 నాటి పరిస్థితులను గుర్తుచేశారు. గతంలో తాను మాట్లాడిన ఒక వీడియోను ఆయన పోస్ట్ చేశారు. ఒకప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ అమెరికా ఒత్తిడికి తలొగ్గలేదని, కానీ ఇప్పుడు ట్రంప్ ఒక్క మాట అనగానే మోదీ వణికిపోయి లొంగిపోయారన్నారు. ఇందిరమ్మ ధైర్యానికి, ఇప్పటి మోదీ భయానికి ఉన్న తేడా ఇదే అని రాహుల్ ఆ వీడియోలో పేర్కొన్నారు.

వన నిర్వహణ ప్రైవేటీకరణకు మార్గం సుగమం

అటవీ సంరక్షణ చట్ట సవరణలపై కాంగ్రెస్ వ్యాఖ్యలు

దిల్లీ: అటవీ సంరక్షణ చట్టానికి మోదీ ప్రభుత్వం చేసిన సవరణలతో వన నిర్వహణలో ప్రైవేటీకరణకు మార్గం సుగమమైందని కాంగ్రెస్ ఆరోపించింది. అటవీ భూముల లీజుకు సంబంధించి కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అటవీ సంరక్షణ చట్టం(1980)లో మోదీ ప్రభుత్వం చేసిన సవరణలు దేశ అటవీ నిర్వహణలోని చట్టపరమైన పాలనలో తీవ్ర పరిణామాలకు దారి తీస్తాయని ఆయన పేర్కొన్నారు.

'ముసుగుతో వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించం'



ఈటీవీ భారత్: బిహార్‌లోని ఆభరణాల వర్తక సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. మాస్కులు, హిజాబ్, హెల్మెట్ వంటి వాటితో ముఖాలను కప్పుకొని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించడం, విక్రయించడం చేయకూడదని నిర్ణయించింది. దీనిని వెంటనే అమల్లోకి తెస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యూయలర్స్ అండ్ గోల్డ్‌స్మిత్ ఫెడరేషన్ (ఏఐజేజీఎఫ్) ప్రకటించింది. 'ముఖాలను కప్పుకొని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు విక్రయించవద్దని నిర్ణయించాం. హిజాబ్, మాస్కులు, హెల్మెట్ తదితర వాటితో ముఖం కనిపించకుండా దుకాణాల్లోకి వచ్చే వారికి విలువైన ఆభరణాలు చూపించబోం. వినియోగదారులు, దుకాణాల యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఏఐజేజీఎఫ్ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు.

ఉజ్వలమైన కెరియర్ అన్వేషణలో ఉన్నప్పుడు వికసించే రంగాన్ని గుర్తించడం మొదటి మెట్టు. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. ఎంచుకున్న రంగంలో చోటు పొందేందుకు కావల్సిన మెట్లు ఎక్కడున్నాయో గుర్తించాలి. అపై ఒక్కో మెట్టు ఎక్కుతూ కలల కెరియర్‌ను చేరుకోవాలి.



కోరిన కొలువుకు.. కోర్సే సిఫారసు!

శరవేగంగా ఎదుగుతోన్న సైబర్ సెక్యూరిటీ రంగం తగిన నిపుణుల కోసం నిరీక్షిస్తోంది. సైబర్ దాడులు, సైబర్ చౌర్యాలు రోజురోజుకీ పెరుగుతున్న తరుణంలో చొరబాటు దారులు మూసేందుకు వృత్తి నిపుణుల అవసరం మరింతగా పెరుగుతోంది. అంటే ఇప్పటికిప్పుడు సైబర్ సెక్యూరిటీ రంగంలోకి ప్రవేశించాలన్న లక్ష్యంతో ప్లస్ టూ తర్వాత డిగ్రీ, పీజీ చేసేందుకు ఆరేళ్ల పడుతుంది. కాబట్టి ఈ రంగం అప్పటికే నిపుణులతో నిండిపోతుంది, మనకు చోటు దక్కదేమోనని బెంగ అవసరం లేదు. సైబర్ నేరగాళ్ల స్వైర విహారం చేస్తూ వేయి బాహువులతో కొత్త కొత్త వర్చువల్ ప్రాంతాలకు విస్తరిస్తున్నారు. అందువల్ల అప్పటికీ ప్రొఫెషనల్స్ అవసరం ఇంకా పెరుగుతుందే తప్ప తరగదు.

దారులెన్ని?

సైబర్ జగత్తులో విపత్తులను నిరోధించేందుకు నిర్ణయించుకున్న యువత వివిధ అస్త్ర శస్త్రాలు (కోర్సులు) సిద్ధం చేసుకోవాలి. అందుకు అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల నుంచి స్వల్పకాలిక డిప్లొమా కోర్సుల వరకూ అందుబాటులో ఉన్నాయి. సావకాశంగా సైబర్ సెక్యూరిటీ కెరియర్‌ను మలచుకునే అవకాశం ఉన్న వారికి డిగ్రీ కోర్సులు సౌకర్యవంతంగా ఉంటాయి. ఇప్పటికే డిగ్రీ పూర్తి చేసుకున్నవారు తక్కువ సమయంలో కనీస అవగాహన, పరిమిత నైపుణ్యాలు అలవర్చుకునేలా డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులూ అక్కరకు వస్తున్నాయి.

● **బీటెక్ సైబర్ సెక్యూరిటీ లేదా కంప్యూటర్ సైన్స్ (సైబర్ సెక్యూరిటీ):** కంప్యూటర్ సైన్స్‌లో శాస్త్ర విజ్ఞాన సామర్థ్యాలను నేర్పించడంతో పాటు సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టును ఒక ప్రత్యేక అంశంగా చూపిస్తారు. దీనివల్ల కంప్యూటర్ సైన్స్ క్షేత్రంలో సైబర్ సెక్యూరిటీ ఆయుధ బలంతో సైబర్ శత్రువులను ఎదుర్కొనే శక్తి సంపాదిస్తారు.

ఇంజినీరింగ్ స్ట్రీమ్ వైపు వెళ్లని వాళ్లూ సాధారణ డిగ్రీ కోర్సుతోనూ సైబర్ సెక్యూరిటీ ప్రత్యేక సబ్జెక్టుగా నేర్చుకొనే అవకాశం ఉంది.

● **బీఎస్సీ సైబర్ సెక్యూరిటీ / డిజిటల్ సెక్యూరిటీ / ఫోరెన్సిక్:** ఈ కోర్సుల్లో ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, సైబర్ దాడుల ముప్పు అవకాశాలు, ఒకవేళ దాడులు జరిగితే డిజిటల్ పరిశోధన అంశాలపై దృష్టి పెడతారు.



● **సైబర్ సెక్యూరిటీతో బీసీఏ:** పటిష్ఠమైన సైబర్ సెక్యూరిటీ పునాదులతో కంప్యూటర్ అప్లికేషన్స్‌ను ఈ కోర్సు ద్వారా నేర్చుకోగలుగుతారు.

● **సైబర్ నేరాలు - చట్టాలు, ఫోరెన్సిక్ అకౌంటింగ్‌తో బీకామ్:** సైబర్ నేరగాళ్ల సంస్థల భద్రతా వలయాలను ఛేదించుకుని, చొరబడి ఆర్థికంగా దెబ్బతీస్తారు. సైబర్ నేరాల్లో సాంకేతిక అంశం ఒకటైతే, దాడుల వల్ల జరిగే నష్టాల ఆడిటింగ్, అకౌంటింగ్‌పై ఆసక్తి ఉన్న వారికి ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుంది.

ఇప్పటికే డిగ్రీలు, పీజీలు దాటి వచ్చేసిన విద్యార్థులు ఈ రంగంలో రాణించాలనుకుంటే వారి కోసమూ స్వల్పకాలిక వ్యవధితో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులున్నాయి.

● **డిప్లొమా ఇన్ సైబర్ సెక్యూరిటీ:** వివిధ ప్రైవేట్ శిక్షణ సంస్థలు ఉపాధి ప్రధాన (జాబ్ ఓరియంటెడ్) లక్ష్యంగా డిప్లొమా కోర్సులు అందిస్తున్నాయి. సైబర్ సెక్యూరిటీ ప్రాథమికాంశాలు నేర్పించే ఈ తరహా డిప్లొమాలతో ఈ రంగంలో ప్రవేశ స్థాయి (ఎంట్రీ లెవల్) ఉద్యోగాలు పొందవచ్చు.

● **సర్టిఫికెట్ కోర్సులు:** సైబర్ సెక్యూరిటీ సబ్జెక్టుపై ఆసక్తి ఉన్నవారు చేసేందుకు స్వల్పకాలిక ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ కోర్సులను టెక్ దిగ్గజ సంస్థలు గూగుల్, ఐబీఎంలు అందిస్తున్నాయి. ప్రస్తుత సైబర్ ప్రపంచంలో ఎదుర్కొంటున్న ముప్పులు, పరిష్కార సామర్థ్యాలపై ఈ కోర్సులు దృష్టి పెడుతున్నాయి. అందుకే ఇవి జాబ్ రెడీ కోర్సులుగా గుర్తింపు పొందాయి.

కనీస విద్యార్హతలు

బీటెక్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్ మార్కులు, ఉమ్మడి ప్రవేశ పరీక్షలైన ఈఏపీసెట్, ఐఐటీ-జేఈఈ ఆధారంగా సీట్లు ఇస్తారు. ఇతర కోర్సుల్లో ప్లస్ టూ స్థాయిలో 50 శాతం మార్కులతో ప్రవేశ అర్హత లభిస్తుంది.

ఏం నేర్పుతారు?

ప్రస్తుతం సైబర్ దాడులు జరుగుతున్న తీరుతెన్నులు, సాధారణంగా డేటా భద్రతకు ఉండే రక్షణ వలయాలు, సాంకేతికంగా చొరబాట్లు జరగకుండా ఏ విధంగా అడ్డుకట్ట వేయాలి? అన్న విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సిలబస్ రూపకల్పన చేస్తారు. నెట్‌వర్క్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్, రిస్క్ మేనేజ్‌మెంట్, ఎథికల్ హ్యాకింగ్, క్రిప్టోగ్రఫీల్లో మౌలిక అంశాలను ఈ కోర్సుల్లో భాగంగా బోధిస్తారు.

ఈ నైపుణ్యాలు నేర్చుకుంటే పరిగణనలోకి తీసుకునే పొజిషన్లు:

- సైబర్ సెక్యూరిటీ, అనలిస్ట్
- ఎథికల్ హ్యాకర్
- డిజిటల్ ఫోరెన్సిక్ స్పెషలిస్ట్
- నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇంజినీర్
- సెక్యూరిటీ కన్సల్టెంట్
- మాల్వేర్ అనలిస్ట్



తాజా అభ్యర్థులకు రాజమార్గం

భారత్‌లో సైబర్ సెక్యూరిటీ రంగంలో భవిష్యత్తులో రానున్న 8 లక్షల ఉద్యోగాల్లో చోటు పొందాలంటే కొన్ని మౌలిక సామర్థ్యాలను సొంతం చేసుకోవాలి.

- విండోస్, లినక్స్ లాంటి ఆపరేటింగ్ సిస్టమ్స్, నెట్‌వర్కింగ్‌పై పట్టు
- ఫైర్‌వాల్స్, యాంటీ వైరస్, చొరబాటు గుర్తింపు సామర్థ్యం
- సైబర్ దాడుల ముప్పును తప్పించే స్కానర్స్‌పై అవగాహన ఉంటే అది అదనపు అర్హత అవుతుంది.



యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

సూపర్‌వైజర్లు

సీఎస్‌సీ ఈ-గవర్నెన్స్ సర్వీస్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఆధార్ సూపర్‌వైజర్/ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ఆధార్ సూపర్‌వైజర్/ ఆపరేటర్: 282 పోస్టులు

అర్హత: ఇంటర్మీడియట్ లేదా రెండేళ్ల ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లొమా ఉండాలి.
వయసు: 18 ఏళ్ల పైన ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31.
వెబ్‌సైట్: https://cscspv.in/

బీఎస్సీ (ఎంపీసీ) చదువుతున్నాను. ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్ ట్రేడ్ స్పెషలైజేషన్‌తో ఎలాంటి అవకాశాలు ఉంటాయి. మేటి సంస్థలు, ప్రవేశ వివరాలు తెలపండి. - చంద్ర శేఖర్



ఫారిన్ ట్రేడ్‌తో ఎలాంటి అవకాశాలు?

■ బీఎస్సీ (ఎంపీసీ) చదువుతున్న మీరు ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్ ట్రేడ్‌ను కెరియర్ మార్గంగా ఎంచుకోవడం మంచి నిర్ణయం. మ్యాథ్స్, ఫిజిక్స్ నేపథ్యం ఉన్న విద్యార్థులకు ఉండే తార్కిక ఆలోచన, సంఖ్యలపై పట్టు, విశ్లేషణాత్మక సామర్థ్యం వ్యాపార రంగంలో చాలా అవసరం. అందుకే ఇటీవల కాలంలో ఇంజినీరింగ్, మ్యాథ్స్, ఫిజిక్స్ చదువుతున్న చాలా మంది విద్యార్థులు ఎంబీఏను కెరియర్‌గా ఎంచుకుంటున్నారు.

“ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ వివిధ దేశాల మధ్య జరిగే వాణిజ్యం, ఎగుమతులు, దిగుమతులు, అంతర్జాతీయ మార్కెటింగ్, విదేశీ కరెన్సీ లావాదేవీలు, గ్లోబల్ సరఫరా వ్యవస్థలు లాంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తుంది. ఈ కోర్సులో అంతర్జాతీయ ఆర్థిక విధానాలు, వాణిజ్య ఒప్పందాలు, కస్టమ్స్ నిబంధనలు, షిప్పింగ్ విధానాలు అధ్యయనం చేస్తారు. దీని ద్వారా విద్యార్థికి ప్రపంచవ్యాప్తంగా వ్యాపార సంస్థలు ఎలా పనిచేస్తాయి అన్న విషయాలపై సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.”

✦ కోర్సు పూర్తిచేసుకున్నవారికి ఎగుమతులు, దిగుమతులు చేసే సంస్థల్లో ఎక్స్‌పోర్ట్స్ మేనేజర్, ఇంపోర్ట్ మేనేజర్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆఫీసర్, ఫారిన్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లాంటి ఉద్యోగాలు ఉంటాయి. బహుళ జాతి సంస్థల్లో గ్లోబల్ సోర్సింగ్, అంతర్జాతీయ కొనుగోళ్లు, సరఫరా నిర్వహణ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. బ్యాంకింగ్ రంగంలో ట్రేడ్ ఫైనాన్స్, విదేశీ కరెన్సీ లావాదేవీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ నిర్వహణ లాంటి విభాగాల్లోనూ ఉపాధి అవకాశాలు ఉంటాయి. లాజిస్టిక్స్, షిప్పింగ్, కస్టమ్స్ క్లియరెన్స్ రంగాల్లో కూడా ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది.

✦ ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సులో ప్రవేశానికి ముందుగా ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ యాభై శాతం మార్కులతో పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరంలో ఉన్నవారికీ అవకాశం ఉంది. ప్రవేశం ప్రధానంగా జాతీయ స్థాయి పరీక్షలతో ఉంటుంది. దేశంలోని మేటి విద్యా సంస్థలు కామన్ అడ్మిషన్ టెస్టు (క్యాట్) స్కోరు ప్రతిభతో ఇంటర్వ్యూ నిర్వహించి, సీట్లు కేటాయిస్తున్నాయి. కొన్ని సంస్థలు సొంత పరీక్షలు, జాట్, మ్యాట్‌తోనూ అవకాశమిస్తున్నాయి.

✦ క్యాట్‌లో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగాలు ఉంటాయి. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థి కమ్యూనికేషన్ నైపుణ్యం, ఆలోచనా సామర్థ్యం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులపై అవగాహన, అంతర్జాతీయ వాణిజ్యంపై ఆసక్తి లాంటి అంశాలను పరిశీలిస్తారు. కాబట్టి వీటిపై ముందుగానే అవగాహన ఉండటం శ్రేయస్కరం.

✦ దేశంలో ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్‌కు పేరున్న సంస్థల్లో దిల్లీ, కోల్‌కతా, కాకినాడలలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, సింబయాసిస్ ఇంటర్నేషనల్ బిజినెస్ ఇన్‌స్టిట్యూట్-పుణె, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్-గురుగ్రామ్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ-గ్రేటర్ నోయిడా ముఖ్యమైనవి. పాండిచ్చేరి యూనివర్సిటీ, జామియా మిలియా లాంటి కొన్ని సెంట్రల్ యూనివర్సిటీలు, మరి కొన్ని స్టేట్ యూనివర్సిటీలూ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో ఎంబీఏ కోర్సులను అందిస్తున్నాయి.

సరైన ప్రవేశ పరీక్షను ఎంపిక చేసుకుని, అర్హత ప్రమాణాలను గమనిస్తూ, సమగ్రంగా సన్నద్ధమైతే ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్/ ఫారిన్‌ట్రేడ్‌లో ప్రవేశం పొందడం కష్టం కాదు.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

ఆర్కిటెక్చర్
సంస్థ: ట్రకార్ట్ సర్వీసెస్ **నైపుణ్యాలు:** అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, గూగుల్ స్కెచప్
స్టైపెండ్: రూ.18,000-45,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://hosturl.link/KVbnCe

పీసీబీ సిమ్యులేషన్ ఇంజినీర్
సంస్థ: బోల్ట్‌మేన్ ల్యాబ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఏఎన్ఎస్‌వైఎస్, కెడెన్స్, కొలాబరేషన్, పీసీబీ డిజైన్, ఫిజిక్స్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్, సిమ్యులేషన్ అండ్ మోడలింగ్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 18
☛ https://hosturl.link/oGF6CW

కాపీ ఎడిటింగ్
సంస్థ: గ్రేటర్ దేన్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-పవర్‌పాయింట్, ఎంఎస్-వర్డ్, ప్రూఫ్‌రీడింగ్ **స్టైపెండ్:** రూ.15,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://hosturl.link/dayNEI

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్
సంస్థ: షాదీ స్టోర్
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జనరేటివ్ ఏఐ టూల్స్, వైబ్ కోడింగ్
స్టైపెండ్: రూ.8,000-14,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://tinyurl.com/mt9rnk3h

ఫ్లట్టర్ డెవలప్‌మెంట్
సంస్థ: హెల్తోకేర్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, క్లౌడ్ ఫైర్‌స్టోర్, డార్ట్, ఫైర్‌బేస్, ఫ్లట్టర్, ఐఓఎస్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.11,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/mvp2jpwa

మెడికల్ సిమ్యులేషన్
సంస్థ: స్మార్ట్‌విన్నర్ **నైపుణ్యాలు:** అటెన్షన్ టు డిటెయిల్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఎక్సెల్, ఫార్మకాలజీ, సెల్ఫ్-లెర్నింగ్
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/5xwsee7c

హైదరాబాద్, విజయవాడల్లో

మార్కెటింగ్
సంస్థ: ఈవీలర్స్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రై.లి. **నైపుణ్యాలు:** డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/2umbancz

ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలో

నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), దిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

● సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ - 05

అర్హత: లా డిగ్రీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.1,25,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో
చిరునామా: ఎస్పీ (అడ్మిన్), ఎన్ఐఏ, సీజీఓ కాంప్లెక్స్, లోధి రోడ్, దిల్లీ-110003.
దరఖాస్తుకు చివరి తేదీ: 13.01.2026
వెబ్‌సైట్: https://nia.gov.in/recruitment-notices

ఎయిమ్స్‌లో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), రాయ్‌పుర్ ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

● రిసెర్చ్ ఆఫీసర్ - 03
● రిసెర్చ్ నర్స్ - 37
● ఫీల్డ్ వర్కర్ - 01

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/ డిగ్రీ/ ఎంబీబీఎస్/ బీడీఎస్ /ఎంసీహెచ్‌తో పాటు పని అనుభవం.
వయసు: 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రిసెర్చ్ ఆఫీసర్‌కు రూ.65,000. రిసెర్చ్ నర్స్‌కు రూ.30,600. ఫీల్డ్ వర్కర్‌కు రూ.25,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 19.01.2026
ఎంపిక: ఇంటర్వ్యూతో
వెబ్‌సైట్: https://www.aiimsraipur.edu.in/user/vacancies-faculty.php?pst=intraextra

టీచింగ్ పోస్టులు

శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ, ములుగు.. బోధన సిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● అసోసియేట్ ప్రొఫెసర్: 44 పోస్టులు
● ప్రొఫెసర్: 17 పోస్టులు
● అసిస్టెంట్ ప్రొఫెసర్: 79 పోస్టులు

అర్హతలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు బోధనలో అనుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400-2,17,100; ప్రొఫెసర్‌కు రూ.1,44,200-2,18,200. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700-1,82,400.
ఎంపిక: షార్ట్ లిస్ట్, ఏపీఐ అండ్ పీబీఏఎస్ స్కోరు, ఉద్యోగానుభవం, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు: అధికారిక వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారమ్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. అవసరమైన ధ్రువపత్రాలకు డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) జతచేసి, రిజిస్ట్రార్ కార్యాలయానికి పోస్టు ద్వారా పంపాలి.
దరఖాస్తు ఫీజు: పోస్టు ప్రకారం ఓసీ/బీసీలకు రూ.4000 లేదా 3000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు రూ.2,500 లేదా 2000.
దరఖాస్తుల స్వీకరణకు తేదీ: 31.01.2026.
వెబ్‌సైట్: https:///skltghu.ac.in/

ప్రొఫెసర్లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గువాహటి ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు కోరుతోంది.

● అసోసియేట్ ప్రొఫెసర్: 13 పోస్టులు
● ప్రొఫెసర్: 13 పోస్టులు

విభాగాలు: బయోసైన్సెస్, కెమికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, డిజైన్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్.. మొదలైనవి.
అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.01.2026..
వెబ్‌సైట్: https://iitg.ac.in/iitg_page_details?page=61/fac_rec

ఎన్‌టీపీసీలో అసిస్టెంట్ లా ఆఫీసర్‌లు

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) 6 అసిస్టెంట్ లా ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

ఎంపిక: క్లాట్-2026 స్కోరుతో దరఖాస్తులు షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఆ తర్వాత రాత పరీక్ష/ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ లేదా అన్నీ నిర్వహించే అవకాశం ఉంది.

ఎంపికైనవారిని ఎన్‌టీపీసీ యూనిట్లు/ ప్రాజెక్టులు/ జాయింట్ వెంచర్లు/ అనుబంధ సంస్థల్లో ఎక్కడైనా నియమించే అవకాశం ఉంటుంది.


గమనించాల్సినవి: ఆన్‌లైన్ దరఖాస్తు నింపే సమయంలో క్లాట్-2026 అడ్మిట్ కార్డ్ నంబర్‌ను తప్పనిసరిగా రాయాలి. అలాగే క్లాట్-2026 స్కోరు కార్డ్‌ను స్కాన్ చేయాలి.

◆ ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను మాత్రమే దరఖాస్తులో రాయాలి.



వివరాలు

అర్హత: ప్రథమ శ్రేణితో ఎల్ఎల్‌బీలో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 55 శాతం సరిపోతుంది. క్లాట్-2026 స్కోరుతో దరఖాస్తు చేయాలి.
వయసు: 16.01.2026 నాటికి 30 సంవత్సరాలు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ-నాన్ క్రీమీ లేయర్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, మహిళలకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: నెలకు రూ.30,000-1,20,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 16.01.2026
వెబ్‌సైట్: careers.ntpc.co.in



దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీలో...

దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ, ఖచ్(గుజరాత్) ఒప్పంద ప్రాతిపదికన 10 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను భర్తీచేయనుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

డ్రెజర్/టగ్స్, ఫ్లోటింగ్ క్రాఫ్ట్స్, లైబ్రరీ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ (డ్రెజర్/టగ్స్)
ఖాళీలు: 3
అర్హత: ఇంజినీర్స్ సర్టిఫికెట్స్ ఆఫ్ కాంపిటెన్సీ/ మెరైన్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్‌లో నాలుగేళ్ల అప్రెంటిస్‌షిప్ లేదా ఇంజినీర్ రూమ్ ఆర్టిఫిషర్‌గా నాలుగేళ్ల అనుభవం/ ఇండియన్ నేవీలో వాచ్ కీపింగ్ ఇంజినీర్ ఆన్ ఓషన్ గోయింగ్ వెసల్స్‌గా రెండేళ్ల అనుభవం ఉండాలి.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ (ఫ్లోటింగ్ క్రాఫ్ట్స్)
ఖాళీలు: 6
అర్హత: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిగ్రీ. మెరైన్ ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్‌లో మూడేళ్ల అనుభవం/ ఇండియన్ నేవీలో చీఫ్ ఎలక్ట్రికల్ ఆర్టిఫిషర్‌గా పనిచేయాలి.

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్ (లైబ్రరీ)
ఖాళీలు: 1
అర్హత: లైబ్రరీ సైన్స్/ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ డిగ్రీ, మూడు నెలల వ్యవధి ఉండే కంప్యూటర్ అప్లికేషన్ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి. లైబ్రేరియన్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.

గమనించాల్సినవి

విద్యార్హతలు, ఉద్యోగానుభవంతో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి రాత పరీక్ష/ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు.

✦ రాత పరీక్ష/ ఇంటర్వ్యూ తేదీ, నిర్వహణ విధానం.. మొదలైన వివరాలను షార్ట్‌లిస్ట్ చేసినవారికి తెలియజేస్తారు.

✦ రాత పరీక్ష/ ఇంటర్వ్యూల్లో అర్హత సాధించినవారిని.. వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.

✦ ప్రస్తుతం వాడుకలో ఉన్న ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను మాత్రమే దరఖాస్తులో రాయాలి.

✦ పూర్తిచేసిన అప్లికేషన్ ప్రింట్‌అవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి స్పీడ్/ రిజిస్టర్డ్ పోస్టులో పంపాలి.

ముఖ్యాంశాలు

వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.40,000-1,40,000. మూలవేతనానికి అదనంగా వీడీఏ, హెచ్‌ఆర్ఏ, గ్రాట్యుటీ, ఎన్‌పీఎస్, గ్రూప్ ఇన్స్యూరెన్స్, ఉద్యోగి కుటుంబానికి వైద్య సదుపాయాలు ఉంటాయి.
చిరునామా: ద సెక్రటరీ, దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీ, పోస్ట్ బ్యాగ్ నం.50, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ బిల్డింగ్, టాగోర్ రోడ్, గాంధీధామ్ (ఖచ్), గుజరాత్ - 370 201.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.01.2026
పోస్టు ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 27.01.2026
వెబ్‌సైట్: www.deendayalport.gov.in

ఏపీపీఎఫ్‌సీఎల్ తీసుకునే రుణానికి ప్రభుత్వ హామీ

ఈనాడు, అమరావతి: ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీపీఎఫ్‌సీఎల్) తీసుకునే రూ.900 కోట్ల రుణానికి హామీ ఇచ్చేందుకు అంగీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యుత్తు సంస్థల నిర్వహణ, బొగ్గు, విద్యుత్తు కొనుగోలు, ఇతర ఖర్చులకు ఆ మొత్తాన్ని వినియోగించాలని పేర్కొంది.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు సీఎంకు వినతి

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. 2017లో ప్రభుత్వం ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు జీఓ ఇచ్చింది. అనంతరం ఆగిపోయిన ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విన్నవించారు. 12వ వేతన సవరణ అమలు చేయాలని, ఈలోపు 30% మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలని విన్నవించారు. జూన్ నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ క్లెయిమ్‌లు పూర్తిగా చెల్లించాలని, 90% నగదును ఇంకా చెల్లించని సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాలని కోరారు.

ఏపీఆర్‌ఏపీఎల్ బోర్డు పునర్నిర్మాణం

ఛైర్మన్‌గా విజయానంద్

ఈనాడు, అమరావతి: ఏపీ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్(ఏపీఆర్‌ఏపీఎల్) బోర్డు పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు ఛైర్మన్‌గా ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్ శివశంకర్, డైరెక్టర్లుగా జెన్‌కో ఎండీ నాగలక్ష్మి, డైరెక్టర్‌గా ట్రాన్స్‌కో జేఎండీ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, డైరెక్టర్‌గా ఇంధనశాఖ జాయింట్ సెక్రటరీ కేవీ కిశోర్‌కుమార్, డైరెక్టర్/ఫైనాన్స్‌గా ట్రాన్స్‌కో డైరెక్టర్(ఫైనాన్స్) ఎస్‌వీ రమణమూర్తి వ్యవహరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

మంత్రి అచ్చెన్నాయుడు సూచన

ఈనాడు, అమరావతి: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ఆప్మాస్ పాలకవర్గం పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఆప్మాస్ ఛైర్మన్‌గా ఎన్నికైన రాంప్రసాద్, వైస్ ఛైర్మన్ రంగారావుతోపాటు జిల్లాల అధ్యక్షులు పోలిశెట్టి నాగరాజు, శ్రీనివాస్, పాపారావు, నగేశ్, గురునాధం, పేరయ్య, జీవీరత్నం తదితరులు బుధవారం వ్యవసాయ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అర్హులైన మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని చెప్పారు.

ఫార్మర్ చాట్ యాప్‌తో ఉద్యాన రైతులకు సలహాలు

ఈనాడు, అమరావతి: ఫార్మర్ చాట్ యాప్ ద్వారా రాష్ట్రంలోని ఉద్యాన రైతులకు వాతావరణ ఆధారిత సలహాలు అందించనున్నట్లు ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. డిజిటల్ గ్రీన్, సిస్కో ఆధ్వర్యంలో వాతావరణ అనుకూల సలహాలు అందించే కార్యక్రమాన్ని బుధవారం గుంటూరులోని ఉద్యానశాఖ కార్యాలయంలో ప్రారంభించారు. 'ఇది ఏఐ ఆధారిత మల్టీ మోడల్ మొబైల్ అప్లికేషన్. డిజిటల్ గ్రీన్ ద్వారా రైతులకు స్థానిక వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయ సలహాలు అందిస్తుంది' అని తెలిపారు. ఏపీలోని గుంటూరు, పల్నాడు, కర్నూలు, అనంతపురం, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాల్లో దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సిస్కో ఇండియా ఆగ్నేయాసియా ఎండీ హరీశ్ కృష్ణన్, డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సీఈఓ నిధి భాసిన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో మౌలిక వసతులకు రూ.22.45 కోట్లు

ఈనాడు, అమరావతి: గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు, మినీ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.22.45 కోట్లు విడుదలకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈ నిధులతో భవన నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. తరగతి గదుల నిర్మాణం, రక్షిత మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు.

సమగ్ర ఓచర్ బిల్లులతోనే కేంద్ర పథకాల నిధులు

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రాయోజిత పథకాల్లో స్పర్శ్ సింగిల్ నోడల్ ఖాతా ద్వారా బిల్లుల చెల్లింపు ప్రక్రియను సులభతరం చేసేందుకు మార్గదర్శకాలను రాష్ట్ర ఆర్థికశాఖ విడుదల చేసింది. పనుల బిల్లులు చెల్లించాలంటే సమగ్ర ఓచర్ బిల్లులు సమర్పిస్తేనే కన్సాలిడేటెడ్ నిధి నుంచి బిల్లులు చెల్లిస్తారు. ఆర్థికశాఖ కార్యదర్శి రొనాల్డ్ రాస్ ఉత్తర్వులిచ్చారు. ఇంజినీరింగ్ డిపార్టుమెంట్లు సమగ్ర ఓచర్ బిల్లులు సమర్పించాలని, కార్పొరేషన్లు, పబ్లిక్‌రంగ సంస్థలు ఇతర మార్గదర్శకాలు అనుసరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్‌ను కలిసిన బొమ్మనహాల్ వైకాపా ఎంపీటీసీ సభ్యులు

ఈనాడు, అమరావతి: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండల వైకాపా ఎంపీటీసీ సభ్యులు బుధవారం జగన్‌ను తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఇటీవల బొమ్మనహాల్ ఎంపీపీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో తెదేపా నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారని, ఎంపీపీ స్థానాన్ని తెదేపా ఎలా కైవసం చేసుకుందో అంశాలను వివరించారు. ఈ వ్యవహారాన్ని న్యాయపరంగా ఎదుర్కోవాలని జగన్ వారికి చెప్పారు.

◆ వైఎస్సార్‌టీయూసీ 2026 క్యాలెండర్‌ను వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి, ఆ విభాగం నేతలు పాల్గొన్నారు.

దుగ్గిరాల ప్రభాకర్ కిడ్నాప్..?

- గుడివాడలో ఉదయం నుంచి హైడ్రామా
- పెడన సమీపంలోని పొలాల్లో నిర్బంధం
- సాయంత్రం వదిలేసిన దుండగులు
- కొడాలి నాని, వాసుదేవరెడ్డి తదితరులపై కేసే కారణమా?

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం- న్యూస్‌టుడే గుడివాడ : కృష్ణా జిల్లా గుడివాడలో తెదేపా సానుభూతి పరుడు దుగ్గిరాల ప్రభాకర్‌ను కొందరు దుండగులు బుధవారం ఉదయం ఎత్తుకెళ్లిపోయి పెడన సమీపంలోని పొలాల్లో నిర్బంధించారు. ఉదయం 9 గంటలకు గుడివాడలోని ఇంటి నుంచి రైతు బజార్‌కు వెళ్తానంటూ ప్రభాకర్ బయటకు వచ్చారు. ద్విచక్ర వాహనంపై పెడన వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కొందరు కారులో వచ్చి అతడ్ని అడ్డగించారు. ఐదుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై నుంచి అతడ్ని లాగేసి తలకు సంచి తగిలించి కాళ్లు చేతులు కట్టేసి.. పొలాల్లో బంధించారు. బయటకు వెళ్లిన తండ్రి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటం.. మధ్యాహ్నం అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుమార్తె, కుటుంబీకులు ఆందోళన చెందారు. దీంతో కుమార్తె సహస్ర, బంధువులు గుడివాడలోని 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినా సాయంత్రం వరకు ఆచూకీ తెలియలేదు.



గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు ప్రభాకర్ ◆ ప్రభాకర్ వీపుపై కమిలిన గాయాలు

వదిలేసి.. వెంబడించి దాడి చేసి

సాయంత్రం 5.30గంటల సమయంలో దుండగులు ప్రభాకర్‌ను వదిలేశారు. ఫోన్ ఇచ్చి ఇప్పుడే ఆన్ చేయవద్దని.. కిడ్నాప్ విషయం ఎవరికైనా చెబితే ఇంటికొచ్చి మరీ చంపుతామని బెదిరించారు. పెడన సమీపంలోని నందమూరు నుంచి ద్విచక్ర వాహనంపై ప్రభాకర్ గుడివాడ వైపు వస్తుండగా వెనుకే దుండగులు అనుసరించారు. భయపడిన ప్రభాకర్ వాహనం వేగం పెంచారు. గుడివాడ మండలం బొమ్ములూరు అడ్డరోడ్డు వద్ద అతడ్ని దుండగులు అడ్డుకొని రెండోసారి మళ్లీ దాడి చేశారు. అతడి వాహనాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్ చూసి పారిపోయారు. అటుగా వచ్చిన స్థానికుల నుంచి ప్రభాకర్ ఫోన్ తీసుకుని ఇంటికి ఫోన్ చేసి తనను చంపేందుకు కొందరు ప్రయత్నించారని తెలిపారు. తప్పించుకొని ఫలానా చోట ఉన్నానని కుమార్తెకు ప్రభాకర్ తెలిపారు.

◆ కుమార్తె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అప్రమత్తమయ్యారు. కుమార్తె కూడా కారు తీసుకొని తండ్రి వద్దకు వెళ్లి గుడివాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాధితుడు ఉదయం నుంచి తనను చిత్రహింసలకు గురి చేసిన తీరును వివరించారు. ఉదయం నుంచి తనకు అల్పాహారం, కొబ్బరి నీరు ఇచ్చి.. సాయంత్రం వదిలేసినట్టు చేసి వెంటాడి మరోసారి దాడి చేశారని పోలీసులు, కుటుంబ సభ్యులకు తెలిపాడు. గతంలో తన మద్యం గోదామును అక్రమంగా ఖాళీ చేయించారని కేసు పెట్టినందుకే వైకాపా నేతలు తనను చంపేందుకు ప్రయత్నించారని బాధితుడు వెల్లడించారు.

ఆ కేసు వల్లేనా..?

తెదేపా సానుభూతిపరుడైన ప్రభాకర్ గతంలో గుడివాడ ఆటోనగర్లోని తన గోదామును మద్యం నిల్వలు ఉంచేందుకు ప్రభుత్వానికి అద్దెకు ఇచ్చారు. వైకాపా హయాంలో కొడాలి నాని, అబ్కారీ కార్పొరేషన్ అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, అప్పటి జేసీ మాధవీలత సహా పలువురు కలిసి బలవంతంగా ఖాళీ చేయించారు. ప్రభాకర్ లీజును రద్దు చేసి తమ వాళ్ల గోదామును లీజుకు ఇప్పించారు. దీంతో ప్రభాకర్ కొడాలి నాని, వాసుదేవరెడ్డి, తదితరులపై కేసు పెట్టారు. ఈ కేసు కోర్టులో ఉండటంతో త్వరలో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌ను బెదిరించి కేసును వెనక్కి తీసుకునేందుకు ఈ కిడ్నాప్ చేసినట్టు తెలుస్తోంది. బాధితుడు కూడా కొడాలి నాని, వాసుదేవరెడ్డి అనుచరులే తనను నిర్బంధించారని ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

1,454 ప్రభుత్వాసుపత్రులకు ఎన్‌క్వాస్ ధ్రువీకరణ పత్రాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రం నుంచి ప్రాథమిక, సెకండరీ వైద్య సేవలందించే 1,454 ఆసుపత్రులు నేషనల్ క్వాలిటీ అసెస్‌మెంట్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్) సంస్థ జారీ చేసే ధ్రువపత్రాలు పొందినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వైద్య సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తే ఎన్‌క్వాస్ ధ్రువీకరిస్తుందన్నారు. 1,454 ఆసుపత్రుల్లో 1,236 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 72 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 139 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 7 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు లభించే ఈ గుర్తింపు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు లభించడం హర్షణీయమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కనులవిందుగా కబడ్డీ... కబడ్డీ

తెలంగాణలో జాతీయ స్థాయి పోటీలు ప్రారంభం



తలపడుతున్న చండీగఢ్, మధ్యప్రదేశ్ జట్లు

పినపాక, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాలుర జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడూళ్లబయ్యారం జడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దేశవ్యాప్తంగా 33 జట్లు నమోదు చేసుకోగా దమన్-దీవ్ మినహా 32 జట్లు హాజరయ్యాయి. క్రీడాకరులకు ఎల్చిరెడ్డిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో వసతి కల్పించారు. పోటీల ప్రారంభోత్సవానికి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మహిళా, శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క, పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. క్రీడల నిర్వహణకు ఆర్థిక చేయూత అందించేందుకు ముందుకొచ్చిన కంది చారిటబుల్ ట్రస్టు, మౌరిటెక్ సంస్థ బాధ్యులను... చక్కటి ఏర్పాట్లు చేశారంటూ అధికారులు, నిర్వాహకులను మంత్రులు అభినందించారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డీఈఓ నాగలక్ష్మి, పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయ పరిశీలకులు నిర్మల్ జాంగ్డే పాల్గొన్నారు. ఈ కబడ్డీ పోటీలను 'లీగ్ కమ్ నాకౌట్' పద్ధతిలో నిర్వహిస్తున్నారు. మొత్తం 32 జట్లకుగాను తొలిరోజైన బుధవారం 28 జట్లు తలపడ్డాయి.

ఈపీఎఫ్ నమోదులో యాజమాన్యాలకు ప్రయోజనాలు

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల నమోదు ప్రచార(ఈఈసీ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు ఈపీఎఫ్‌కు సంబంధించి పలు ప్రయోజనాలు, జరిమానాల మినహాయింపు కల్పించింది. దీని కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించింది. 2017 జులై 1 నుంచి 2025 అక్టోబరు 31 మధ్య ఈపీఎఫ్ పరిధిలోకి రాని అర్హులైన ఉద్యోగులను స్వచ్ఛందంగా నమోదు చేయడానికి, వారి గత కాలపు నిబంధనలను క్రమబద్ధీకరించడానికి ప్రత్యేక అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఉన్న కవరేజ్ స్థితితో సంబంధం లేకుండా అన్ని సంస్థలకు ఈ పథకం వర్తిస్తుంది. గతంలో ఈపీఎఫ్ పరిధిలోకి రాని యాజమాన్యాలు ఇప్పుడు కవరేజ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. తక్కువ జరిమానాతో గతంలో జరిగిన లోపాలను సరిచేసుకునేలా యాజమాన్యాలకు అవకాశం కల్పించింది.

◆ 2017 జులై నుంచి 2025 అక్టోబరు 31 మధ్య ఉద్యోగంలో చేరి, ఈపీఎఫ్‌కు అర్హులైన వారు ప్రస్తుతం కొనసాగుతూ ఉంటే ఇప్పుడు నమోదు చేసుకోవచ్చు.

◆ ఒకవేళ యజమాని గతంలో ఉద్యోగి జీతం నుంచి పీఎఫ్ వాటాను మినహాయించకపోతే ఉద్యోగి వాటా చెల్లించాల్సిన అవసరం లేదు.

◆ యజమాని కేవలం తన వాటాను, సెక్షన్ 7క్యూ కింద వడ్డీ, అడ్మినిస్ట్రేటివ్ ఛార్జీలు, నామమాత్రపు జరిమానా రూ.100 జమ చేయాల్సి ఉంటుంది.

◆ సెక్షన్ 7ఏ లేదా ఇతర నిబంధనల కింద విచారణ ఎదుర్కొంటున్న సంస్థలు సైతం ఈ పథకంలో చేరొచ్చు. విచారణ కాలానికి సంబంధించి రూ.100 జరిమానా చెల్లిస్తే చాలు. ◆ యజమానులు ప్రతి ఉద్యోగికి ఉమాంగ్ యాప్ ద్వారా 'ఫేస్ ఆథెంటికేషన్' ఆధారిత యూఏఎన్‌ను రూపొందించాలి.

◆ ఈఎస్‌ఐ వాటా చెల్లింపుల్లోనూ యాజమాన్యాలకు కొన్ని ప్రయోజనాలు కల్పించింది. పది మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు ఈఎస్‌ఐ ప్రత్యేక రిజిస్ట్రేషన్‌కు గతంలో ఇచ్చిన గడువును జనవరి 31వరకు పొడిగించింది.

◆ ఈ ప్రత్యేక రిజిస్ట్రేషన్‌లో ఈఎస్‌ఐలో చేరితే గతంలో అర్హత ఉన్నా ఈఎస్‌ఐ చెల్లించని దానికి జరిమానాలు కట్టాల్సిన అవసరం లేదు.

ఇవేం నియామకాలు?

- సార్వత్రిక విద్యా పీఠంలో నిబంధనలకు చెల్లుచీటీ
- సమన్వయకర్తల నియామకాలపై టీచర్ల ఆగ్రహం


ఈనాడు, అమరావతి: అర్హతలేని ఉపాధ్యాయులను రాష్ట్ర సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్ సొసైటీ) జిల్లా సమన్వయకర్తలుగా నియమించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పోస్టులకు 2019 డిసెంబరు 11న ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా పరిషత్తు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసేవారే అర్హులు. ఐదేళ్లు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసిన అనుభవం ఉండాలి. నియమించే సమయానికి 50 ఏళ్లలోపు వయసు ఉండాలి. కానీ, పాఠశాల విద్యాశాఖ ఈ నిబంధనలకు మినహాయింపులిచ్చి మరీ కొందర్నీ నియమించడంపై ఉపాధ్యాయ వర్గాలు ఆగ్రహంగా ఉన్నాయి. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం గుండలకట్టమంచి పాఠశాలకు చెందిన పీజీటీని జిల్లా సమన్వయకర్తగా ఇటీవల నియమించారు. ఆయనకు 58 ఏళ్లు ఉండగా. . పాఠశాల విద్యాశాఖ ఈ నిబంధనకు మినహాయింపు నిచ్చి సమన్వయకర్తగా నియమించింది. గుంటూరులోని పురపాలక పాఠశాలకు చెందిన బి.హైమారావును పల్నాడు జిల్లా సమన్వకర్తగా నియమించారు. ఆయనకు సైతం నిబంధనకు మినహాయింపునిచ్చి నియమించారు. సార్వత్రిక విద్యా పీఠంలో సహాయ సమన్వయ అధికారి పోస్టులు లేకపోయినా కొన్ని పేర్లను ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయులకు జిల్లా సమన్వయ అధికారులుగా నియమితులయ్యేందుకు అర్హత లేదు. కానీ, నిబంధనలను సడలించి, నియమించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 5న 'చలో దిల్లీ'

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఫిబ్రవరి 5న నిర్వహిస్తున్న 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య కార్యాచరణ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐ జాక్టో) స్టీరింగ్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి, యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సాయిశ్రీనివాస్, అప్టా ప్రధాన కార్యదర్శి మెహది కోరారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. "జాతీయస్థాయిలో ఏడు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ఏఐ జాక్టోగా ఏర్పడ్డాయి. దీని ఆధ్వర్యంలో చలో దిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. 2010 కంటే ముందు నియామకం పొందిన దేశంలోని 30 లక్షల మంది ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం చొరవచూపి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. లేదంటే పార్లమెంటులో చట్టం చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలి. జాతీయ విద్యా విధానంలోని లోపాలను సవరించాలి. రాష్ట్రంలో ఎస్‌సీఈఆర్టీ సిలబస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలల విలీనం ప్రతిపాదనలను విరమించుకోవాలి. దేశంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. కేజీబీవీలు, ఇతర విద్యాశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి" అని కోరారు.

హైవే నిర్మాణంలో రెండు గిన్నిస్ రికార్డులు దేశానికి గర్వకారణం

సీఎం చంద్రబాబు అభినందనలు



ఈనాడు, అమరావతి: ఏపీలో జాతీయరహదారి (ఎన్‌హెచ్-544జీ) నిర్మాణంలో రెండు గిన్నిస్ రికార్డులు సాధించడం దేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ... బెంగళూరు-కడప-విజయవాడ హైవేలో 24 గంటల్లో 10,675 టన్నుల బిటుమినస్ కాంక్రీట్ (బీసీ) నిరంతరాయంగా వేసినట్టు తెలిపారు. అలాగే, 24 గంటల్లో 28.95 లేన్ కిలోమీటర్ల రహదారి నిర్మాణమైందని వివరించారు. "భారత ప్రభుత్వ దూరదృష్టి, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో జాతీయ రహదారుల నిర్మాణం కొనసాగుతోంది. ఇంజినీర్లు, కార్మికులు, క్షేత్రస్థాయి సిబ్బంది అసాధారణ అంకితభావంతో పనిచేస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కారిడార్‌లో 2, 3 ప్యాకేజీల్ని జనవరి 11 నాటికి పూర్తిచేసి మరో రెండు గిన్నిస్ రికార్డులు నెలకొల్పేందుకు చేస్తున్న ప్రయత్నాలకు అభినందనలు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

సచివాలయంలో సంక్రాంతి సంబరాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్కు సమీపంలోని వాహనాల పార్కింగ్ ప్రాంతంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సచివాలయం, అసెంబ్లీ, లోక్‌భవన్‌లకు చెందిన 300 మహిళా అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని, పోటాపోటీగా ముగ్గులు వేశారు. పురుష ఉద్యోగులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గురువారం సైతం వాలీబాల్ పోటీలు కొనసాగనున్నాయి. బుధవారం జరిగిన ముగ్గుల పోటీలను మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు తిలకించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలకు సిఫార్సు

ఈనాడు, అమరావతి: పట్టాదారు పుస్తకాలు, అడంగల్ సవరణలకు వసూళ్లకు పాల్పడిన పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరదాయపాళెం మండల తహసీల్దారు కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు, మ్యుటేషన్లు, ఆన్‌లైన్‌లో నమోదు, భూముల సర్వేతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీకి వసూళ్లు చేస్తున్నట్లు 2022 సెప్టెంబరు 25న ఏసీబీ నిర్వహించిన దాడుల్లో వెల్లడైంది. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఒప్పంద ప్రాతిపదికపై కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అధికారులతోపాటు కొందరు వీఆర్వోల వద్ద అదనపు నగదు గుర్తించారు. పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చినా వాటిని పంపిణీ చేయలేదు. ఈ మేరకు అప్పట్లో తహసీల్దారుగా పనిచేసిన గౌరీశంకరరావుతోపాటు డీటీ, జూనియర్ అసిస్టెంట్, ఐదుగురు వీఆర్వోలపై చర్యలకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

◆ పల్నాడు జిల్లా మాచవరం మండల ఇన్‌ఛార్జి తహసీల్దారు లెవి (పదవీ విరమణ చేశారు) 2020 ఫిబ్రవరిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే జానీకి తన బయోమెట్రిక్ ధ్రువీకరణ ఇచ్చేశారు. వీఆర్వో విచారణ నిర్వహించక ముందే ఓ మహిళకు చెందిన పత్రాలకు ఆమోదం ఇచ్చేశారు. దీనిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. మరో కేసులో 1.75 ఎకరాలకు సంబంధించి ఆన్‌లైన్ అడంగల్, 1బి రిజిస్టర్‌లో సవరణలకు సంబంధించి తహసీల్దారుకు నివేదిక ఇచ్చేందుకు రూ.5 వేలు లంచం తీసుకున్న వీఆర్వోపైనా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులో ఆదేశించారు.

'జనతా వారధి'తో ప్రజల సమస్యలు పరిష్కరించండి

భాజపా నేతలకు పీవీఎన్ మాధవ్ సూచన

ఈనాడు, అమరావతి : జనతా వారధి(వినతుల స్వీకరణ) కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల్ని పరిష్కరించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో 'జనతా వారధి' కార్యక్రమంపై బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మండల, గ్రామ స్థాయి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైతే అధికారులను కలవాలని పేర్కొన్నారు. సమావేశంలో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసన్న, నాగోతు రమేశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

నరెడ్కో సెంట్రల్ జోన్ డైరీ-2026ని ఆవిష్కరించిన మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(నరెడ్కో) సెంట్రల్ జోన్ డైరీ-2026ని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ బుధవారం విజయవాడలో ఆవిష్కరించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా సంస్కరణలు తీసుకొచ్చినందుకుగాను మంత్రిని ఈ సందర్భంగా నరెడ్కో సన్మానించింది. ఛాంపియన్ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ రిఫార్మర్‌గా పేర్కొంటూ నరెడ్కో ప్రతినిధులు మంత్రిని సత్కరించారు. రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

గోదావరి జలాల సద్వినియోగానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నం: లంకా దినకర్

ఈనాడు, అమరావతి: సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాల సద్వినియోగానికి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. గోదావరి, కృష్ణాలోని వరద, మిగులుజలాలు వాడుకునేందుకు ఏపీకి సహజసిద్ధమైన హక్కు ఉందని పేర్కొన్నారు. లంకా దినకర్ బుధవారం సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గోదావరి- నల్లమలసాగర్ (వెలిగొండ) అనుసంధానంతో 60లక్షల మందికి తాగునీటిని, 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించొచ్చని పేర్కొన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జగన్ పాలనలోనే ఆగిపోయాయని లంకా దినకర్ తెలిపారు. ఎన్జీటీ వద్ద జగన్ ప్రభుత్వం సమర్థంగా వాదనలు వినిపించకపోవడంతో అప్పుడే పనులు ఆపేశారని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు విడుదల చేయాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1,200 కోట్ల రాయితీలను విడుదల చేయాలని మంత్రి టీజీ భరత్‌ను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాల్యాద్రి కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం మంత్రిని కలిసి, వినతిపత్రం సమర్పించారు.

ఇంజినీరింగ్ కళాశాలలకు ఫీజుల బకాయిలు విడుదల చేయాలి: అపెక్మా

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని ఏపీ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం(అపెక్మా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోయి సుబ్బారావు, గ్రంథి సత్యనారాయణ కోరారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన ఆ సంఘ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. "ఇంజినీరింగ్ కళాశాలల ఆర్థిక పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. అధ్యాపకులకు, సిబ్బందికి జీతాలూ చెల్లించలేకపోతున్నాయి. గత విద్యా సంవత్సర ఫీజు బకాయిలను విడుదల చేయాలి. గత ఆరేళ్లుగా సరైన ఫీజు నిర్మాణం ఖరారు కాకపోవడంతో కళాశాలలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా 2026-29 కాలానికి ఫీజులను నిర్ధారించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి" అని పేర్కొన్నారు.

పెండింగ్ ఫీజులు ఇవ్వకపోవడంతో జీతాలకు ఇబ్బందులు: ఏపీపీడీసీఎంఏ

ఈనాడు, అమరావతి: ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని, 2025-26 సంవత్సరానికి సంబంధించి ఫీజుల విడుదలకు క్యాలెండర్ ప్రకటించాలని ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాల అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రమణాజీ, జి.రాజకుమార్ చౌదరి ఒక ప్రకటనలో కోరారు. "ఫీజుల డబ్బులు రాక కళాశాలలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేని స్థితికి చేరాయి. సెప్టెంబరులో ప్రభుత్వం ప్రకటించినట్లు ప్రతి నెలా విడతల వారీగా పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రెండు సెమిస్టర్ల ఫీజులను ఇవ్వాలి" అని పేర్కొన్నారు.

రాయలసీమ ద్రోహి జగన్

సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: గత వైకాపా ప్రభుత్వంలో 102 రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు రద్దు చేసిన ద్రోహి జగన్ అని సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి మండిపడ్డారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై 2020లోనే స్టే తెచ్చామని తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావు చెబుతుంటే.. నాలుగేళ్లు ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు. ఇది రాయలసీమకు ద్రోహం చేయడం కాదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేఆర్ఎంబీ, కేంద్రం, జాతీయ హరిత ట్రైబ్యునల్ అనుమతులు లేవు. కానీ ఎందుకు ప్రారంభించారు? రూ.వందల కోట్ల ప్రజాధనం ఎలా దుబారా చేస్తారు? ఇదంతా దోపిడీ కాదా?" అని దీపక్‌రెడ్డి ప్రశ్నించారు. అప్పర్ తుంగ, అప్పర్ భద్ర ప్రాజెక్టుల్ని కర్ణాటక ప్రభుత్వం కడుతున్నా జగన్ రెడ్డి అడ్డుకోలేదని, కనీసం అభ్యంతరం కూడా చెప్పలేదన్నారు. "అలగనూరు ప్రాజెక్టు కుంగింది. రూ.36 కోట్లు కేటాయిస్తే సరిపోయేది, కానీ, ఇవ్వలేదు. హంద్రీనీవాను ఆధునికీకరించలేదు" అని దీపక్‌రెడ్డి దుయ్యబట్టారు.

ట్రైబ్యునల్లో తేలాలి.. ప్రాజెక్టులు అప్పగించాలి

- అప్పటి వరకు టెలిమెట్రీల ఏర్పాటు కుదరదు
- రెండు రాష్ట్రాలకు స్పష్టం చేసిన కృష్ణా బోర్డు

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ (కేడబ్ల్యూడీటీ-2) విచారణ పూర్తయి నీటి కేటాయింపులు తేలి.. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించిన తర్వాత గానీ పరీవాహకంలో ప్రవాహాలను లెక్కించేందుకు టెలిమెట్రీ పరికరాల ఏర్పాటు కుదరదని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. కీలకమైన ఈ రెండు అంశాలపై న్యాయ విచారణ కొనసాగుతున్నందున నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. ఈ మేరకు తాజాగా తెలంగాణ, ఏపీలకు బోర్డు వేర్వేరుగా లేఖలు రాసింది. గతేడాది జనవరిలో జరిగిన బోర్డు 19వ సమావేశంలో టెలిమెట్రీల ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. బోర్డు నిర్వహణకు నిధులు కేటాయించడానికి కూడా ఏపీ, తెలంగాణ అంగీకరించాయి. టెలిమెట్రీల ఏర్పాటును ఏపీ వ్యతిరేకించగా.. ఏపీ వాటాను కూడా కలిపి ఇస్తామంటూ తెలంగాణ రూ.4.18 కోట్లను విడుదల చేసింది.

500 ఎకరాల అటవీభూముల్ని ఆక్రమించిన శిల్పాచక్రపాణిరెడ్డి అనుచరులు

- తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి : తెలుగుగంగ ప్రధాన కాలువ పరిధిలోని మహానంది, బుక్కాపురం, కడమల, తిమ్మాపురం గ్రామాల మధ్య ఉన్న దాదాపు 500 ఎకరాల అటవీ భూముల్ని వైకాపా మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అనుచరులు ఆక్రమించారని నంద్యాలకు చెందిన చెన్నమ్మ అనే మహిళ ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, అటవీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. విచారణ జరిపి అటవీ ఆస్తిని సంరక్షించాలని కోరుతూ బుధవారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబులకు వినతిపత్రం సమర్పించారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి వారు వినతులు స్వీకరించారు. 30 ఏళ్లుగా తన అనుభవంలో ఉన్న 75 సెంట్ల మెట్ట పొలాన్ని జగన్ ప్రభుత్వంలో అధికారుల సహకారంతో వైకాపా నాయకులు కబ్జా చేశారని సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలానికి చెందిన నారాయణస్వామి ఫిర్యాదు చేశారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం భూముల్లో వైకాపా ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని..వీటిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన సురేంద్రబాబు కోరారు.